08772

C

అభిప్రాయాలు - అనుభవాలు

2358
5E



2358
5E

గొర్రెపాటి వెంకట సుబ్బయ్య
డా॥ కవితా పురస్కార
గుంటూరు (పుష్కర్లు)

894.827
V.41

లింగం వీరభద్రయ్య చౌదరి

C1

అభిప్రాయాలు -

అనుభవాలు



లింగం వీరభద్రయ్య చౌదరి

ప్రథమ ముద్రణ : డిసెంబరు 1972

స్వామ్యములు గ్రంథకర్తవి

ముద్రణ : త్రివేణి ప్రెస్, మచిలీపట్నం-1

మూల్యము : 5 రూపాయలు

Sole Distributors :

త్రివేణి పబ్లిషర్సు

మచిలీపట్టణము & మదరాసు-1

C




శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి

(గ్రంథకర్త)

6

PLANK PAGE

C



కీ. శే. శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు

(కృతి భర్త)

BLANK PAGE

I

విషయ సూచిక

	పుటలు
తొలిపలుకు	iii—iv
అవలోకన	v—xvi
మొదటి ప్రకరణము	
1. ఆస్తికుడు - నాస్తికుడు	1— 6
2. హేతువాదం	6— 9
3. ఏది వ్యభిచారం ?	9—13
4. పుణ్యం - పాపం	13—16
5. మోహం, కామం, ప్రేమ	17—18
6. ఋతుధర్మం	19—20
7. శ్రాద్ధకర్మ	21—25
రెండవ ప్రకరణము	
8. రంకు - బొంకు	26—31
9. రసం - నీరసం	31—35
10. క్షేత్రయ్య 307-వ జయంత్యుత్సవం	35—37
11. పండితులు, కవులు, కళాకారులు	37—44
12. విద్యార్థులు - భావి పౌరులు	44—51
13. పరాన్నభుక్కు-లు	51—55
మూడవ ప్రకరణము	
14. చిత్రం, విచిత్రం	56—59
15. వింత - విడ్డూరం	59—63
16. దాయాది - బంధువు	63—66
17. హాసం - పరిహాసం	66—68
18. సరసం - విరసం	68—69

నాల్గవ ప్రకరణము

19. నా తలిదండ్రులు 70—86
20. అధ్యాయం ముగిసింది 87—95

ఐదవ ప్రకరణము

21. అతని చిన్ననాటి పల్లెటూరు 96—103
22. పల్లెటూరు పసందు 103—110
23. పల్లెటూరు బ్రదుకు 110—115
24. పల్లెటూరు బుద్ధులు 115—120
25. పల్లెటూరు పద్ధతులు 120—122
26. ఇదేనా సంక్రాంతి పర్వదినం? 123—126
27. ఇది సాంఘిక న్యాయమా? 126—131
28. మెఱుపు తలపులు 131—144

III

తొలిపలుకు

ఈ పుస్తకంలోని రచనలు, ఈ మధ్య అనగా 1971 నుండి అప్పుడప్పుడు వ్రాసినవి. కొన్ని విశ్రాంతిగా కూర్చున్నప్పుడో, పచారుచేస్తు న్నప్పుడో, నిద్రించుటకు పడకకు చేరి నప్పుడో తోచినవి. కొన్ని ఏ గ్రంథమో చదివియో, ఏ భావోద్రేకమో కలిగియో, ఏ ఆలోచనో వచ్చియో, కాగితం మీద ఎక్కించినవి. మరికొన్ని రేడియో ప్రసారాలు విన్నప్పుడు తట్టినవి.

వీనిలో వ్యాసాలు (ఎస్సేస్), ఆకార నిరూపణాలు (స్కెచెస్), అపహాస్యపూర్వకాలు (స్కిట్సు), పద చిత్రీకరణాలు (పెన్ పిక్చర్సు), స్వగతాలు (మొనోలాగ్సు) ఉన్నవి.

ఈ గ్రంథంలోని రచనలను నేను ఐదు ప్రకరణములుగా విభజించుకొన్నాను. మొదటి ప్రకరణములోని "ఆస్తికుడు-నాస్తికుడు" ఆదిగా గలవి ఒక విధముగా దైవ, మత, సంబంధమైన ఆలోచనా ప్రేరకమైనవి. వీనిని వ్యాసా లనవచ్చును. రెండవ ప్రకరణములోని "రంకు-బొంకు" ఇత్యాది, ఆకార నిరూపణాల క్రిందకు రావచ్చును. మూడవప్రకరణములోని "చిత్రం-విచిత్రం" మొదలైనవి అపహాస్యపూర్వకాలు. నాల్గవప్రకరణములోని నా తలిదండ్రులు, భార్యను గురించి వ్రాసినవి, వ్యాసాలే. ఐదవ ప్రకరణములోని మొదటి అయిదురచనలు పదచిత్రీకరణా లనుకొన వచ్చును. ఆరు, ఏడు మొనోగ్రాఫ్సు (ఒకే విషయాన్ని గురించి వ్రాసినవి) గాను, చివరిది "మెఱుపు తలపులు" స్వగతంక్రింద వ స్తు వని చెప్పవచ్చును. పైరచనలలోని సార నిస్సారాలను, ఉచితానుచితాలను పాఠకుల నిర్ణయానికి వదలివేస్తున్నాను. వారు చదివి సంతోషిస్తే నేను తృప్తిపడతాను. చదువకపోయినా, చదివి నిరసించినా దిగులుపడను. నాకు తోచిన అభిప్రాయా లను, కల్గిన అనుభవాలను వ్యక్తపరచాను. అంతటితో నా యంతట నేను కల్గించుకొన్న బాధ్యత తీరిందిగా తలుస్తాను.

మనకు చ, జ లున్నవి. మాట్లాడే పద్ధతిని, "తాటాకు", "వెళ్లాడు", "తెలిపాడు" వంటి మాటలను వ్రాసేటప్పుడు, "తాళేకు", "వెళ్లేడు", "తెలిపేడు" అని వ్రాస్తున్నారు. అట్లుగాక, మాట పైభాగాన ఒ గుర్తు ఉపయోగించి, "తాటాకు", "వెళ్లాడు", "తెలిపాడు" అని వ్రాస్తే సమంజసంగా ఉండునని, ఆ పద్ధతిని అవలంబించాను. పాఠకులు, దయచేసి, గ్రహింతురుగాక.

మేధావియు, తాత్వికదృక్పథం కలవారును, భాషల నెరిగిన వారును, ఆంధ్రాంగ్లములలో గద్య పద్య రచనాదక్షులును, మార్దవం, లాలిత్యం, సున్నితం ప్రస్ఫుట మయ్యే రమణీయ ప్రకృతి చిత్రాలను సృజించే నిపుణులును, సాహిత్య చిత్రకళా విమర్శకులును, సరసులును, స్నేహశీలియు శ్రీ సంజీవదేవ్ గారి "అవలోకన" ఈ గ్రంథానికి పరిమళం ప్రసాదించింది. వారికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు.

పెడసనగల్లు
కృష్ణాజిల్లా
25-12-1972

లింగం వీరభద్రయ్య చౌదరి

V

అవలోకన

జీవించటం, భావించటం- ఈ రెండూ మానవుడి అస్తిత్వానికి సజీవ చిహ్నాలు. ఈ రెంటిలో దేని ప్రభావం దేనిమీద ఎక్కువ చూపుతుంది? భావం, ప్రభావం జీవంమీద ఎక్కువ చూపుతుందా లేక జీవం, ప్రభావం భావంమీదనా అనే ప్రముఖ సమస్య ప్రాచీన కాలంనుంచి కూడ మేధావుల మేధకు పదును పెడుతూనే వుంది. భావించటం అనేదే జీవించటాన్ని రుజువు చేస్తుందని డికార్టేలాంటి దార్శనికులు పలికితే, జీవించటం అనేదే భావించటాన్ని రుజువు చేస్తుందని ఎగ్జిస్టెన్షలిస్టులు పలికారు. మొత్తంమీద ఎవరు ఏమి పలికినా మానవుడి అస్తిత్వానికి జీవించటం, భావించటం రెండూ అవసరమే.

మేధావులు మాత్రమే భావించరు. మేధావులు కానివారు కూడ భాపిస్తారు. భావించేవారిని భావుకులు అంటాం. కొందరు భావుకులభావన కేవలం భావనమాత్రంగానే నిలచిపోక రచన లోకి రూపొందుతుంది. భావించేవారి భావన లన్నీ రచనలో రసవంతంగా రూపొందనట్లే రచనచేసేవారందరి రచనలూ రుచిగల రచనలుగా ఆకారం తాల్చవు. రుచిగల రచనచేసేవారు ఎప్పుడూ తక్కువమందే వుంటారు. లింగం వీరభద్రయ్య చౌదరిగారు రుచిగల రచనలు చేయగలరు. అందుకు ఈ గ్రంథమే నిదర్శనం.

కొన్ని రచనలు ఆలోచనను రేకెత్తించేవిగావుంటే కొన్ని అనుభూతిని సృష్టించేవిగా వుంటాయి. వీరభద్రయ్యచౌదరిగారి "అభిప్రాయాలు - అనుభవాలు" అనే ఈ గ్రంథంలో ఈ రెండూ కూడ గోచరిస్తాయి. హేతువాదం అనేది రసానుభూతికి వ్యతిరేకం కాదు. రెండూ సుఖంగా సహజీవనం చేయగలవు ప్రతిభగల రచయితల రచనల్లో. ఈ గ్రంథంలోని రచనల్నిపట్టి కొలిస్తే చౌదరిగారు ఒక విధంగా ప్రతిభగల రచయితయే అని తెలుస్తుంది.

కొందరి రచనలు లేక కొందరి కొన్ని రచనలు రచయిత జీవితంనుంచి దూరంగా వుంటాయి. ఆ రచనల్ని చదివి రచయిత

జీవితాన్ని నిర్ణయించటానికి వీలుండదు. కాని చౌదరిగారి రచనలు ఇందులోవి చదివితే వారి జీవితాన్నుంచి ఇవి దూరంగా వుండలేదని తేలుతుంది. ఇటువంటి రచనలు రచయితల జీవితాల్ని ప్రతిబింబిస్తాయి. కనుక ఇటువంటి రచనల్ని చదవటానికి ఆ రచయితల్ని గురించికొంతయినా తెలుసుకోటంసమయాన్ని వ్యర్థంచేయటంకాదు.

చౌదరిగారి భావాలూ, స్వభావాలూ కూడ ఉన్నతస్థాయికి చెంది వుంటాయి. ఏడు సంవత్సరాలు ఇంగ్లాండులో విద్యాభ్యాసం చేసి బారిస్టర్ అయివచ్చిన ప్రభావాలు వారి భావాల్లో, స్వభావాల్లో కూడ కనుపిస్తూంటాయి. చౌదరిగారికి దేవుని అస్తిత్వంలో విశ్వాసం వున్నప్పటికీ మతమౌఢ్యంమీద, అంధ విశ్వాసాలమీద, సాంఘికాచారాలమీద, సంప్రదాయం పేరుతో జరిగే దుశ్చర్యలమీద ద్వేషం వుంది. జీవితానికి సంబంధించిన చాలావాటిలో వారు చాలావరకు కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరిగారి సంస్కార దృష్టిని అనుసరిస్తారు. వారికి సాహిత్యాభిలాషతోపాటు చిత్రకళమీద కూడ ప్రీతి ఎక్కువ. అయితే సాహిత్యవిషయంలో వారు ఇతరులు రచించిన గ్రంథాల్ని చదవటమేకాక తాము స్వయంగా కూడ గ్రంథరచన చేయగలరు. చిత్రకళావిషయంలో వారు ఇతర్లు చిత్రించిన చిత్రాల్ని చూచి ఆనందించగలరే కాని స్వయంగా చిత్రణ చేయజాలరు. వారి నివాసంలో వారు సేకరించిన ఎందరో చిత్రకారుల ఎన్నో ఎన్నో చిత్రాలున్నాయి. చౌదరిగారు తెలుగులోనేకాక ఆంగ్లంలో కూడ కొన్ని రచనలుచేశారు. ఆ వ్యాస సంపుటి కూడ బయటికి వచ్చింది. చౌదరిగారి రచనల్లో చౌదరిగారి తత్వం అంతా మనకు వెల్లడి అవుతుంటుంది.

"అభిప్రాయాలు – అనుభవాలు" అనే పుస్తకంలో ఐదు అధ్యాయాలున్నాయి. తిరిగి ఒక్కొక్క అధ్యాయంలో కొన్ని కొన్ని విషయాలకు చెందిన ప్రత్యేక శీర్షిక లున్నాయి. మొదటి అధ్యాయంలో "ఆస్తికుడు-నాస్తికుడు", "హేతువాదం", "ఏది వ్యభిచారం", "పుణ్యం-పాపం", "మోహం, కామం, ప్రేమ" "ఋతుధర్మం", "శ్రాద్ధకర్మ" అనే శీర్షిక లున్నాయి. ఇదే విధంగా మిగతా నాలుగు అధ్యాయాల్లో కూడ వివిధాలైన

విషయాలకు చెందిన శీర్షిక లున్నాయి. ఈ పుస్తకంలోని విషయాలు ఎక్కువ లౌకిక వివరణలు. లౌకిక విషయాలను తీసుకొని వాటిలోని ఎండుదనం కనపడకుండా సరసంగా రచించటం కొంత కష్టమైన పనే. గులాబీపూవును గురించి కవితారచనచేసి రక్తి కట్టించటం సులభమేకాని పగిలిపోయిన కుండపెంకును గురించి కవితారచన చేసి రక్తికట్టించటం అంత సులభంకాదు. కొన్ని వస్తువులు, ముఖాలు ఫోటోలో బాగుండేవీ, బాగుండనివీ వుంటాయి సహజంగా. ఫోటోలో బాగావచ్చేవాటిని Photogenic అంటారు. అదే విధంగా సాహిత్యరచనకు అనుకూలించే విషయాలనీ, అనుకూలం కాని విషయాలు కూడ వుంటుంటాయి సాంప్రదాయికంగా. కాని నిపుణ సాహితీశిల్పి చేతుల్లో ఎటువంటి విషయమైనా సాహితీ రచనకు అనుకూలమైందిగా మారుతుంది. అది ఉదాత్త విషయమా, అనుదాత్త విషయమా అనే సమస్యయే లేదు.

ఈ పుస్తకంలో ఎన్నెన్నో అతి సామాన్యవిషయాల్ని ఆలోచనతో, హాస్యంతో, అలంకారాలతో మేళవించి చౌదరిగారు వాటిని రసవంతంగా అభివ్యక్తపరచారు. చెప్పబడే విషయంలో కాక చెప్పే విధానంలో ఇమిడివుంటుంది రచనలోని శోభ. ఎంత గొప్ప విషయమైనా అది అభివ్యక్తమైన రీతి సక్రమంగా లేనప్పుడు సాహిత్యరూపాన్ని అందుకోలేదు.ఎంత స్వల్ప విషయమైనా అదికౌశలంతో అభివ్యక్తమైనప్పుడు సాహిత్యరూపాన్ని అందుకొంటుంది.

చౌదరిగారు ఆస్తికులైనప్పటికీ వారి జీవనదృక్పథం హేతువాదంతోకూడి వుంటుంది. నాస్తికవాదాన్నిగురించి వారు ఈ పుస్తకంలో అంటారు, "నాస్తికవాదానికి పర్యాయపదం భౌతికవాదం. దీనినే లోకాయత అంటారు. లోకాయత అనగా ప్రజలలో వ్యాపించిన ధర్మం. మానవుడు తన పరిసరాలు, అనగా ప్రకృతి అందించు భోగ భాగ్యములను పొంది, సౌఖ్యప్రదమైన జీవనాన్ని అనుభవించాలి. సంతోషకరమైన జీవితాన్ని గొనసాగించుకోవాలి. తన చేతి కందిన సదుపాయాలను విడిచిపెట్టి, మరణానంతరం పరలోకంలో స్వర్గసౌఖ్యాలను పొందుతా ననుకొనటం నేలవిడిచి సాముచేసి నట్లే అనునది. భౌతికవాదం మానవతావాదం కాని నాస్తికవాదం కాదు."

అవును. ఇది సక్రమ దృక్పథమే. భౌతికవాదమూ, నాస్తిక వాదమూ ఒకటి కాదు. నాస్తికు లంతా భౌతికవాదులు కారు. దేవుని ఉనికిని నమ్మని వా రంతా నాస్తికవాదులే కాని భౌతిక వాదులు కాదు. నాస్తికులలో భౌతికవాదులు లేరని కాదు. అయితే నాస్తికులలో చైతన్యవాదులు కూడ వున్నారు. దేవుని ఉనికిని స్వీకరించక చైతన్య అస్తిత్వాన్ని స్వీకరించేవారున్నారు. భౌతికవాదులంటే చైతన్య అస్తిత్వాన్ని స్వీకరించనివారు. అందువల్ల భౌతికవాదమూ, నాస్తికవాదమూ ఒకటికావు. నాస్తికు లందరూ భౌతికవాదులు కాకపోయినా, భౌతికవాదు లంతా మాత్రం నాస్తికులే. ప్రతి నాస్తికుడూ భౌతికవాదాన్ని అనుస రించడుకాని ప్రతి భౌతికవాదీ నాస్తికవాదాన్ని అనుసరిస్తాడు.

అయితే చౌదరిగారు నాస్తికులమీద సహనం చూపలేక పోయారు. నాస్తికులమీద ఒక విసురు విసిరారు. ఈ విసరటం కొంత అన్యాయంగానే గోచరిస్తుంది. చాలామంది యోగులూ, రవీంద్రుడూ, గాంధీ మొదలైనవారుమాత్రమేకాక "కోట్లమంది నానా జాతులవారు, నానా వర్ణములవారు, కోటీశ్వరులు, భోగ పరాయణులు, బీదలు, పతితులు భగవంతు డున్నాడని చాటుచూ ఆయన రక్షణను కోరుచుండగా ఎవరో కొలదిమంది మేధావుల మని, శాస్త్రజ్ఞుల మని విర్రవీగి భగవంతుడే లే డనుట తమ పాదములక్రింద భూమిని లే దనుటే, త్రవ్వుకొనుటే."

పై మాటలతో చౌదరిగారు తమ తీవ్రమైన అయిష్టతను నాస్తికులయందు వ్యక్తపరచారు. ఇది యుక్తమైన వైఖరి కాదు. ఎందరో గొప్ప గొప్ప వా రంతా విశ్వసించారు కనుక ఆ సత్యాన్ని మనంకూడ విశ్వసించాలనటం ఒకవిధంగా భావ దాస్యమే అవుతుంది. అధికసంఖ్యాకులు నమ్మింది మాత్రమే సత్యం, గొప్ప వారు నమ్మింది మాత్రమే సత్యం అని నమ్మటం సత్యానికిదూరం కాకూడ దని ఎక్కడా లేదు. ఎవరి విశ్వాసస్వేచ్ఛ వారిది.

కవులనుగురించి చౌదరిగారు అభివ్యక్తపరచిన భావాలు సముచితంగా వున్నాయికాని కావ్యవస్తువుని గురించి వారు వ్యక్తపరచినవాటిలో మాత్రం కొన్నిహద్దులను పాటించటం జరిగింది. కవి అంటే పద్యాలల్లేవాడు మాత్రమే కాదని, ఛందో

బద్ధ నియమాన్ని పాటించేవాడు మాత్రమేకాదని, హృదయంలో అనుభూతి చెందే భావావేశాన్ని తగిన భాషలో, మానవ స్వభావావగాహనతో సుందరంగా అభివ్యక్తపరచేవాడే కవి అని చౌదరిగారు వెల్లడించిన భావాలు ఎంతో సమంజసంగా వున్నాయి. అంటే వారు నిబద్ధ కవితకు ఇచ్చే గౌరవాన్ని అనిబద్ధ కవితకు కూడ ఇచ్చినట్లు వారు వ్యక్తపరచిన ఈ వైఖరి మెచ్చుకో తగిందే. అయితే వారు ఇంతటితో ఆగక ఇంకొన్ని మాటలు పలికారు, "వినూత్నభావ ప్రపంచాన్ని సృజించి సురుచిరానుభూతికి, మనోల్లాసమునకు, మేధావికాసమునకు జీవితం పరిమళ సంవృతమగునట్లు తీర్చి దిద్దినవాడే సిసలైన కవి. అల్లాకు మీదనో, పుల్లాకు మీదనో, బల్లి మీదనో, గేదె మీదనో, గాడిద మీదనో, కోతి మీదనో, కొమ్మచ్చి మీదనో, ఎలుక మీదనో అతుకులు బొతుకులుగా వ్యర్థపదాలతో పంక్తులుగా పద్యము పూర్తిచేసి కవిత్వముప్రవాహాన్ని సంతోషించేవాడు ఎంతమాత్రముకవిగాడు."

నిజమైన కవిత్వానికి వస్తు భేదం అవసరంలేదనీ, బల్లి కాని, ఎలుక కాని, తెల్లాకు కాని, పుల్లాకు కాని, కోతి కాని, గాడిద కాని కవితావస్తువుకు అయోగ్యంకావనే నేటి దృక్పథాన్ని చౌదరి గారు చిన్న దృష్టితోచూడటం జరిగింది. ఈదృష్టి నేటి కవితా దృష్టికి వ్యతిరేకం. ఇటువంటి నవీన ధోరణిని వ్యతిరేకించిన చౌదరిగారు తిరిగి నీతి, అవినీతుల స్థానం సాహిత్యంలో అప్రధానం అనే అభిప్రాయాన్ని ఆమోదించటం వారిలోని ప్రాచీన,అర్వాచీన భావాల ఐక్యతను రుజువుచేస్తుంది. వారు వ్రాస్తారు, "ధర్మ బోధ, నీతి బోధ కావ్యమునకు ప్రధానములు కావు. అసలు అట్టి బోధలు కావ్యోద్దేశ్యాన్ని మరుగుపరచు నని కొందరి వాదం. ధర్మబోధ, నీతిబోధ, ధర్మశాస్త్రము నీతిశాస్త్రములవికాని కవితవికా దని వారి అభిప్రాయం. కావ్య మొక రసాత్మకము మాత్రమే అను వాదన నటుంచి కథావస్తువు కథానాయకుల, నాయికల ఇతివృత్తము వర్తమానకాలములో ఉదాత్తమైనది కాక పోవచ్చును. ఏ భిక్షుకుడైనా, ఏ కటికి దరిద్రుడైనా, ఏ బక్కచిక్కిన మానవుడైనా కథానాయకుడు కాగలడు. ఏ జీర్ణవస్తువైనా కథాపాత్ర మగుచున్నది. వాని కడగండ్లు కథావస్తువు

అగుచున్నది. ఇది అనుచితము కాదు. అయితే రచన రసభూయిష్టముగా నుండాలి.''

ఈ విధంగా కావ్యవస్తు విషయంలోకూడ చౌదరిగారు ఉదారభావాన్ని వెలిబుచ్చటం జరిగింది. ప్రాచీన సంప్రదాయానికి కాని, అర్వాచీన సంస్కారానికి కాని వారు వ్యతిరేకులు కారు. రెంటిలో వున్న చెడును వదలటం, రెంటిలోని మంచిని స్వీకరించటం వారి సమన్వయ దృష్టిలోని అంశం.

ఏది వ్యభిచారం? అంటూ కొంత ప్రారంభించారు ఈ పుస్తకంలో. ''ఇష్టములేని భార్యతో భర్త తన హక్కు అని బలవంత సంయోగము చేసిన అది వ్యభిచరించినట్లే. విముఖుడైన భర్తను మాయ చేత సంగమమునకు ప్రేరేపించుట బలవంతముగా చెరుపుట వంటిదే. ప్రకృతి స్వభావమువలన పురుషుడు స్త్రీని మానభంగం చేయగలడుగాని, స్త్రీ పురుషుని ఎట్లు చేయగలదు? అని సందేహము రావచ్చును. మద్యపానము చేయించియో, మత్తు పదార్థము నిచ్చియో, చీకటిలో తా నని భ్రమింపజేసియో స్త్రీ పురుషుని బలవంతభ్రాహ్మణార్థము చేయించుట కవకాశము లేకపోలేదు. సంభోగాచరణ జరుగకపోయినను, ప్రయత్నము వ్యభిచారభావమునే సూచించును.''

ఈ గ్రంథములో గ్రంథకర్త ఇటువంటి విచిత్రభావాలనెన్నో వ్యక్తపరుస్తారు ప్రతివిషయములోను. గ్రంథకర్త పుట్టింది పల్లెటూరులో. ఉన్నత విద్యాభ్యాసం లండన్‌లోనూ, ఆక్స్‌ఫర్డ్‌లోనూ. ఉద్యోగాలు చేసింది దక్షిణ ప్రాంతపు నగరాల్లో, ఆంధ్ర నగరాల్లోకూడ. ఉద్యోగాలనుంచి విరమించుకొన్న తరువాత తిరిగి పల్లెటూరి నివాసం, తిరిగి రైతుగా జీవించటం. చౌదరిగారిలో ఇందుమూలంగా రెండు విధాలైన సభ్యతలూ, సంస్కృతులూ సహజీవనంచేస్తుంటాయి. పాశ్చాత్యసభ్యతాసంస్కృతులు మాత్రమేకాక ప్రాచ్య సభ్యతా సంస్కృతులు; నగర సభ్యతా సంస్కృతులు మాత్రమేకాక గ్రామ్య సభ్యతా సంస్కృతులు వారిలో సమైక్యత చెందినాయి. ప్రాచ్యమైన ధార్మిక సంస్కృతీ, పాశ్చాత్యమైన సామాజిక సభ్యతా వారి కిష్టం. అదే విధంగా నగర సంబంధమైన మేధావి సభ్యతా, గ్రామ సంబంధమైన సరళమైన హృదయ సంస్కృతీ వారికి అత్యంత ప్రియాలు. ప్రత్యే

కించి గ్రామీణజీవితంమీద వారికి అభిమానం మెండు. ఈ గ్రంథములో పల్లెజీవితానికి సంబంధించిన వర్ణనలు చమత్కారాలతో నిండినవి ఎన్నోవున్నాయి. బయటికి వచ్చినప్పుడు చౌదరిగారు నిండు సూట్‌తోను, తలమీద హేట్‌తోను వస్తారు. అయితే యేం, తాము రైతు నని చెప్పుకోటానికి వారు నిరంతరమూ గర్విస్తుంటారు!

నాటి గ్రామాలకూ నేటి గ్రామాలకూ వున్న భేదాన్ని చిన్న కథలు కల్పించి వాటిలోని సంభాషణలద్వారా తెలుపుతుంటారు. పల్లెలలో వచ్చిన ఈ మార్పుల్లో పూర్వానికంటే మంచి కొంతవుంటే పూర్వానికంటే చెడు కొంతవుంది. పల్లెల్లోని ఒక చిన్న దృశ్యాన్ని గ్రంథకర్త చిత్రిస్తారు, "ఇంతలో వీధిలో కుక్కల అరుపులు, దీర్ఘ ఆక్రోశాలు, కొట్లాటలు. ఎవరూ వినిపించుకొని అదలించినట్లులేదు. ఇక నిద్ర ఎట్లు పడుతుంది? కొంత ప్రయత్నించిన తరువాత మగతనిద్ర మొదలుపెట్టింది. ఎలుకల కిచకిచలు, అటు ఇటు పరిగెత్తినట్లు, మంచంచుట్టూ తిరుగుచున్నట్లు అలికిడి. ఎక్కడ మంచ మెక్కి ఒంటిమీద ప్రాకుతవో, కాళ్లు, వేళ్లు కొరుకుతవో అనే భయం. ఇస్సూ ఇస్సూ అని అదిలించి అటు తిరిగి పడుకొంటే చురుక్కు చురుక్కు మని దోమకాటులు. కాటేసేముందు ఝుంకారాలు. ఝుంకారాలు నిద్రాభంగంచేయకపోతే కాటు చురుకు అంతగా తట్టక పోవచ్చును. ఈ సందర్భంలో ఒక సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఒక గ్రాగుబోతును 'మీకు దోమకాటు బాధ లేదా' అని అడిగారట. 'ఎబ్బే లేదు. నేను మత్తుగా గ్రాగి మైమరచినప్పుడు కుట్టినట్లే తెలియదు. నా మత్తు దిగిపోయినప్పటికి దోమలు మస్తుగా నా రక్తం పీల్చి నిపాలోపడిపోతవి. ఇక అవి కుట్ట' వన్నాడట."

పల్లెటూళ్లలోని సౌకర్యాలను గురించీ, అసౌకర్యాలను గురించీ ఈ గ్రంథంలో చమత్కారమైన కథలున్నాయి. నగర జీవితానికి అలవడ్డవారికి పల్లెల్లో సౌకర్యాలకంటె అసౌకర్యాలే ఎక్కువగా తడుతుంటాయి; పరిశుభ్రతకంటె అపరిశుభ్రతే ఎక్కువగావున్నట్లు తెలుస్తూంటుంది. గ్రామజీవితానికి అలవడ్డవారికికూడ ఇంతే గోచరిస్తుంది నగరాల్లో. రెంటి జీవితాలతోనూ అనుభవం వున్న చౌదరిగారికి గ్రామ జీవిత మంటేనే ఎక్కువ ఇష్టం. పల్లెటూరి పెద్దమనిషిగా వుండటానికే వారు ఎక్కువ ఇష్టపడతారు.

అయినా పల్లెల్లోని చెడును ఈ గ్రంథంలో చాలాచోట్ల వారు నిర్మొగమాటంగా వ్యక్తపరచటానికి వెనుకాడలేదు!

చౌదరిగారు ప్రధానంగా వ్యాస రచయిత. కవిత్వాసి రక్తి కట్టించటం, కథ వ్రాసి, నాటకం వ్రాసి, నవల వ్రాసి రక్తి కట్టించటం సులభంకాని, వ్యాసం వ్రాసి రక్తి కట్టించటం కష్టం. సహజంగా మిగతా కల్పనాసాహిత్యానికంటే వ్యాసం కొంత ఎండుగా వుంటుంది. కారణం మిగతా సాహిత్యశాఖలన్నీ సృజనాత్మకమైనవి. వ్యాసరచన సమీక్షాత్మకమైనట్టిది. మిగతా వాటిలో కల్పనకు అవకాశమున్నంతగా వ్యాసరచనలో వుండదు. ఇందులో కల్పనకంటే వాస్తవికత ఎక్కువ ప్రత్యక్షమవుతుంది. వేదికమీద ఉపన్యాసంలాంటిది కాయితంమీది వ్యాసం. ఉపన్యాసం శ్రోతలకు నచ్చాలంటే వేదికమీద వేగంగా మాట్లాడటం మాత్రమే చాలదు. మంచి పదాలు, ఉన్నత భావాలు, ఉపమలు, రూపకాలు, చమత్కారాలు మొదలైన సాహిత్య సామగ్రి అంతా వున్నప్పుడుకాని శ్రోతలు ఆనందించరు. అదే మాదిరి సాహిత్య సామగ్రితో గర్భితమై వుంటేనేకాని వ్యాసం పాఠకుల్ని ఆనందపరచదు. సమీక్షాత్మక వ్యాసం సృజనాత్మక సుగంధాన్ని సేకరించుకొన్నప్పుడే అది ఆలోచనకు తోడు ఆనందాన్నికూడ అందించేది. అందులో వ్యాసాల్లోని విషయాలు నిత్య జీవితానికి సంబంధించిన అతి సామాన్య విషయాలుగా వుండటం సంభవించినప్పుడు వ్యాసరచనచేసి రక్తి కట్టించటం ఇంకా ఎక్కువ కఠినం అవుతుంది. అందువల్ల ఇటువంటి కాఠిన్యాలను అధిగమించాలంటే కొన్ని విధాలైన సాహిత్య ప్రక్రియలను ప్రయోగించాలి. సరస భావాలు, శ్రావ్యమైన పదాలు, చమత్కారం, దార్శనిక చింతన మొదలైనవి ఎంతో అవసరం. ఈ గ్రంథంలో ఆ విధానమే కనుపిస్తుంది.

అద్దంలో అంతా ప్రతిబింబిస్తుంది. అంటే కనుపించేది ప్రతిబింబిస్తుంది. కనుపించక చీకటిలో మరుగుపడినదాన్ని చూపిస్తుంది దీపం. సాహిత్యంలో అద్దానికి సంబంధించింది కొంత, దీపానికి సంబంధించినది కొంత. అద్దానిది వాస్తవ వాదం, దీపానిది ఆదర్శ వాదం. అద్దానికి రూపం ప్రధాన, దీపానికి భావం ప్రధానం. పాశ్చాత్యసాహిత్యంలో అద్దానికి సంబంధించిన

దాన్ని క్లాసిసిజం అనీ, దీపానికి సంబంధించిన దాన్ని రొమాంటిసిజం అనీ అనటం జరిగింది. ప్రాచ్యసాహిత్యంలో శుద్ధమైన క్లాసిసిజంలోకూడ రొమాంటిసిజం ఛాయలు గోచరిస్తాయి. కేవలం రూప పరిపూర్ణత ప్రాచ్యసాహిత్య లక్షణంకాదు. రూపంతోకూడ భావం సంలగ్నమై వుంటేనే అది ఉత్తమ సాహిత్యంగా ప్రాచ్యసంప్రదాయం తలంచుతూ వచ్చింది. కనుపించేదానికి అనుకరణకాక, కనుపించనిదాన్ని అన్వేషించి పట్టుకోటం. అందుకే ప్రాచ్య సాహిత్యానికి అద్దానికంటే దీపం ప్రధానమైంది. అద్దంలోకి బయటినుంచి వస్తువులు ప్రవేశిస్తాయి. కనుక అది వస్తుగతం (objective). దీపపుకాంతి వెళ్ళి వస్తువుల మీద పడుతుంది ; కనుక అది వ్యక్తిగతం (subjective).

ఉత్తమ సాహిత్యంలో అద్దం, దీపం—ఈ రెంటి సంశ్లేషణ. దానిలో బాహ్య రూపమూ, ఆంతరిక భావమూ రెండూ తగినంతగా వుండాలి. సాహిత్యం అంటే కేవలం భావం మాత్రమే కాదు, మనిషి అంటే కేవలం మనస్సు మాత్రమే కానట్లు. సాహిత్యం అంటే కేవలం భాషమాత్రమే కాదు, మనిషి అంటే కేవలం శరీరం మాత్రమే కానట్లు. మనిషి అంటే శరీరమూ, మనసూ కూడ అయినట్లు, సాహిత్యం అంటే భాషా, భావం కూడ. క్లాసిసిజంలో కొంత లేదు, కొంత వున్నది. అదే విధంగా రొమాంటిసిజంలో కొంత లేదు, కొంతవున్నది. ఈ రెంటి సమన్వయంవల్ల దానిలో లేనిదాన్ని ఇది తీరుస్తుంది, దీనిలో లేనిదాన్ని అది తీరుస్తుంది. దీపానికి అద్దం రూపాన్ని ప్రసాదిస్తే, అద్దానికి దీపం కాంతిని ప్రసాదిస్తుంది. రూపం, కాంతి రెండూ కలసినప్పుడే రమణీయత ప్రత్యక్షమయేది.

" అభిప్రాయాలు-అనుభవాలు " లోని వ్యాసాల్లో అద్దం మొదటిదీ, దీపం రెండోది. ఇందులోని వ్యాసాలు ఎక్కువ భాగం సమాజంలోని నిత్యజీవితానికి ప్రతిబింబాలు. అయితే ఇవి అద్దం మాత్రంగానే నిలచిపోయినట్లయితే వార్తాపత్రికల వార్తలుగానే వుండిపోయేవి. ఆ విధంగా జరగక సమీక్షాత్మక, సృజనాత్మక సాహిత్యంగానే వుండిపోయింది. ఇందుకు కారణం ఈ వ్యాసాల్లోని అద్దం మీద దీపపుకాంతి కూడ ప్రసరించింది! ఇందులో కేవలం వాస్తవానికి అనుకరణకాక ఆదర్శవాదం

ఏంతైనా వుంది. ఒక విషయాన్ని విశదీకరించటంలో ఆ విషయం ఎట్లావున్నదిమాత్రమే కాక ఎట్లావుంటే బాగుంటుందనేది కూడ వున్నది. ఇందులోని రూపాలు కేవలం నగ్నరూపాలు మాత్రమే కావు. అలంకరణతోకూడుకున్న రూపాలుకూడ. నగ్నరూపాలన్నీ సుందరంగా గోచరించవు. కొన్నిమాత్రం సుందరంగానే గోచరిస్తాయి. మిగతావాటికి ఆచ్ఛాద నవసరం.

చౌదరిగారికి ఈ సంవత్సరమే (1972) భార్యా వియోగం సంభవించింది. "అధ్యాయం ముగిసింది" అనే శీర్షికక్రింద ఆమె గారిని గురించి విపులంగా, వివరంగా వ్రాశారు. ఇందులో ఆమె గారిని గురించిన చౌదరిగారి సంస్మృతులు, అభిప్రాయాలు, అనుభూతులు మొదలైన వెన్నో సంతప్తహృదయంతోవ్రాశారు. రచయితగా వుండటం జరిగితే జీవితంలో ఏ సంఘటనజరిగినా రచనారూపం తాల్చడం జరుగుతుంది. జననాలు, జీవితాలు, మరణాలు ఇవన్నీకూడ అక్షరరూపంతాలుస్తాయి రచయిత రచనలో. అందరు రచయితల జీవితాల్లో ఇటువంటి రచనలు జరగకపోవచ్చు. సంవేదనగల రచయితలలో ఇది జరుగుతుంది. చౌదరిగారిలోని ప్రధానలక్షణం సంవేదన. తమ పత్నిని గురించి వ్రాస్తూ వారు అంటారు, "నా భార్య అన్నపూర్ణమ్మ తలిదండ్రుల చాటుపిల్ల. ఆ రోజుల్లో కమ్మవా రింట్లలో తలుపు చాటునుండి చూచుకోవటం తప్ప పగలు కలసి మెలసి వుండటం వుండేవికాదు. పైగా నా భార్య సహజంగా మిక్కిలి సిగ్గరి. నేనూ అంతే. మరిన్ని సరసాని కని ఆమె అక్క హేళన చేస్తూవుండేది. అందువల్ల రాత్రి తప్ప పగలు కలుసుకోవటంకాని, అచ్చట్లు ముచ్చట్లు చెప్పుకోవటంకాని మే మెరుగం. ఆమె తలిదండ్రులవద్ద, నేను బందరు నోబుల్ హైస్కూల్లో చదువుట. ఏ ఆదివారమో, ఏ సెలవుల్లోనో అత్తవారింటికి వస్తే పగలు పలకరింతలు లేవు, రాత్రి కలయిక తప్ప. ఇంతలో ముంచుకపోయినట్లు ఆమె గర్భం ధరించింది. ఆ రోజుల్లో ఏ-వ మాసం దాటినతర్వాత భార్యా భర్తలు సంగమించగూడదనే అభిప్రాయం గట్టిగా వుండేది."

ఈ విధంగా దాంపత్య జీవనరహస్యాలను వెల్లడించగల సాహసీ రచయితలు చౌదరిగారు కాక కొద్దిమంది మాత్రమే వుంటారేమో! చౌదరిగారి భావాల్లోకాని, స్వభావాల్లోకాని

దాచటం అనేది లేదు. తనకు తట్టింది వెల్లడించాలసిందే. వెల్లడించకపోతే వారికి బాధ, వెల్లడిస్తే ఇతర్లకు కొందరికి బాధ! వెల్లడించటం అంటే అభివ్యక్తపరచటం. సాహిత్యంలో అభివ్యక్తిది ప్రధాన స్థానం. ఒకరకంగా చూస్తే సాహిత్యం ఏమిటి, ప్రతి కళలో కూడ అభివ్యక్తి ప్రధానమైందే. అసలు అభివ్యక్తి అనేది కళకు ఒక విధంగా పర్యాయపదమే. మనోగత ముద్రలను అభివ్యక్తిలోకి రూపాంతర పరచటమే కళ. అందుకే సంజీవదేవ్ కళకు ఈ విధంగా నిర్వచనం కల్పించాడు, "Art is the transformation of impression into expression" అని. కనుక చౌదరిగారిలోని దాచలేనితనం లేక అభివ్యక్తి శక్తి వారిని సాహిత్యానికి సన్నిహితుని చేసింది. అయితే దీనిమూలంగా సాహిత్యంలో కీడుకు బదులు మేలే జరుగుతుంది కాని, జీవితంలో మాత్రం మేలుకంటే కీడు ఎక్కువగా జరుగుతుంటుంది కొన్ని విషయాల్లో! సాహిత్యంలో ఆత్మాభివ్యక్తి(Self-expression)కి అమితమైన విలువ. నిజానికి ఏ రచయితయినా, ఏ ఇతర కళాకారుడైనా ఇతర విషయాన్ని అభివ్యక్తపరిచే నెపంతో తన్ను తానే అభివ్యక్తపరచుకొంటాడు. చెట్టునో, పుట్టనో, కొండనో, కోననో, పూవునో, పూబోడినో తన రచనల్లో అభివ్యక్త పరుస్తున్నాననే నెపంతో తన్ను తానే అభివ్యక్త పరచుకొని వ్యక్తమైన ఆ యా రూపాల్లో తన స్వీయరూపాన్నే సందర్శించి సంతుష్టుడవుతాడు.

ఈ పుస్తకం చివరిలో "మెఱపు తలపులు" అని కొన్ని విడి విడి భావాలను వ్రాశారు. అవి కొన్ని లోతుగాను, కొన్ని వెడల్పుగాను, కొన్ని లోతూ వెడల్పూ రెండూ కలిగివున్నాయి. ఇంగ్లీషులో స్ట్రేథాట్స్ అనబడే లాంటివి ఇవి.

"'భార్యా రూపవతీ శత్రుః' నిజమేనా? కురూపి శత్రువు కాగూడదా? గయ్యాళి, ఎదురించేది, నిర్లక్ష్యం చేసేది, అనురక్త, దుబారాచేసేది, సంసారాభివృద్ధిని పట్టించుకొనకపోవుటయే గాక అయుక్తపద్ధతులచే స్తంభింపజేసేది శత్రువుకాదా? అనుకూలవతి, సంసారి, కష్ట సుఖాల్లో భాగస్వామిని, ఇంగితజ్ఞతగల భార్య రూపవతియైన అంతకంటె వేరే స్వర్గం వుండునా?"

పై వ్యాఖ్య తార్కికంగా, సహేతుకంగా నూతన దృక్కోణంతో బాగుంది. జనవాడుకకు వ్యతిరేక వ్యాఖ్య. మరొక మెఱుపు తలపు : "స్వర్గం. నరకం వున్న వందురు. నా బుద్ధికి సుఖశాంతి ప్రదమైన స్వగృహం స్వర్గం. పిల్లల ఏడ్పులతో గందరగోళంగావున్న ఇల్లు నరకం. మృదుభాషిణి, సహచారిణి, అనుకూలవతి యగు భార్య స్వర్గం. అరిచేది, అడ్డువచ్చేది, వితండవాది యగు పెండ్లం నరకం."

ఈ విధంగా లోకతీరును తెలిపే అనేక విషయాలమీద వివిధ రీతులలో అభివ్యక్తపరచిన మెఱుపు తలపులు ఒక విశిష్ట పంథాకు చెందివున్నాయి.

రచయిత ఎవరి నిమిత్తం ఈ రచనలు చేశారు? పాఠకుల నిమిత్తమా లేక తమ స్వీయానందం నిమిత్తమా? నిజానికి ఏ రచయితకూడ కేవలం తన ఆనందం నిమిత్తంకాని, కేవలం పాఠకుల నిమిత్తంకాని రచన చేయడు. పాఠకులను దృష్టిలో వుంచుకోకుండా తన ఆనందం నిమిత్తమే రచిస్తే తన ఆనందం మాదిరి ఆనందమే పాఠకులది కూడ అయితే పరవాలేదు కాని ఆ విధంగా కానప్పుడు తన రచనను చదివే పాఠకుడు తాను మాత్రమే అవుతాడు. అంటే రచయితయే పాఠకుడు. తన రచనను తాను చదువుకోవలసిందే! ఆ విధంగా కాక పాఠకులను మాత్రమే దృష్టిలోవుంచుకొని రచనచేస్తే ఆ రచన బలవంతంగా చేసినట్లు అవుతుంది. ఆ రచనచేయటంలో రచయితకు స్వీయమైన సృజనాత్మక ప్రేరణ వుండదు కనుక ఆ రచన రసవంతంగా వుండటం జరగదు. ఇతర్ల నిమిత్తం వ్రాయటంలో రచయితలోని సృజనాత్మక స్వేచ్ఛ కుంటుబడి రచన పేలవం అవుతుంది. కనుక రచన చేయటంలో రచయిత స్వీయానందాన్ని పొందాలి, పాఠకులకూ ఆనందం ఇవ్వాలి. చౌదరిగారి "అభిప్రాయాలు—అనుభవాలు"లో ఈ రెండు తరహాలూ వున్న వని తెలుస్తుంది.

ఒకే రచయితలో సృజనాత్మక, సమీక్షాత్మక ప్రతిభలు సహజీవనం చేస్తూంటే ఆ రచయిత రచించే రచనలు ఏ విధంగా వుంటాయో చౌదరిగారి "అభిప్రాయాలు—అనుభవాలు" తెలుపుతుంది.

—సంజీవదేవ్

ఆస్తికుడు - నాస్తికుడు

ఆస్తికుడనగా దేవుడనే పరబ్రహ్మ ఉన్నాడని, ఆయన సర్వ భూతజాలమును, చేతనా చేతనములను, భూమ్యాకాశములను, నక్షత్రమండలాలను, సూర్య చంద్రాదులను, మరిన్నీ మన కండ్లకగపడని బ్రహ్మాండాలను సృజించి, పోషించు చున్నాడనీ, ఆయన ఆజ్ఞ లేనిదే, చలిచీమైనా కుట్టదని నమ్మువాడు. ఆదిమానవుడు పెనుగాలి, ఉరుములు, మెరుములు, కుంభవర్షం, అంధకారం వంటి ప్రకృతి శక్తుల భయంనుండి బైటబడిన తర్వాత జలాల నిచ్చేవాడు వరుణుడని, పశువుల ఆహారం పచ్చగడ్డి వగైరా, మనుజుల ఆహారం పండ్లు, దుంపలు, ధాన్యాలు వగైరా, సస్యాలు పెరిగి అభివృద్ధిచెందటానికి అవసరమైన వర్షా న్నిచ్చేవాడు ఇంద్రుడని, పచనాదుల కుపయోగపడేవాడు అగ్ని అని, వీరు దేవుళ్ళని పూజించిన తర్వాత కలరా, మశూచి, మహామారి వంటి వ్యాధులను కలిగించేవారు గంగానమ్మ, పోలేరమ్మ, మారి మొదలైన దేవత లున్నారని, వారిని సేవించితే తప్ప, తమకు బ్రతుకు తెరు వుండదను నమ్మకాన్ని పారద్రోలిన తర్వాత, అన్నిటికి మూలమైన సర్వేశ్వరుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రూపాన సృష్టి స్థితి లయ కారకులైనారని, త్రిమూర్తుల కండ దండగా విద్యాధిదేవత సరస్వతి, సైశ్వర్యప్రదాయిని లక్ష్మి, సర్వమంగళసంభూత గౌరి వెలిసారని, శివకేశవుల అంశాన గణపతి, సుబ్రహ్మణ్యం, రామ, కృష్ణులు లోకోపకారార్థం అవతరించారని విశ్వసించుచున్నాడు, పూజించుచున్నాడు.

ఇది మానవ పరిణామం. బుద్ధివికాసాన్ని బట్టి, అనుభవాన్ని బట్టి, మానవు డారాధించే దైవము మారినాడు. ఒకప్పుడు రాయి, రప్ప, చెట్టు, చేమ, కొండ, నది వగైరా, మరొకప్పుడు వరుణుడు, ఇంద్రుడు, అగ్ని, ఇంకొకప్పుడు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, వారి ననుసరించి శ్రీరామ, శ్రీకృష్ణ, గణపతి, సుబ్రహ్మణ్యం వాని అధిదేవతలు. వర్తమానకాలమున అల్ప సంఖ్యాకుల అధిదేవత, ఆరాధ్యదైవం మారింది. వారి దేవుళ్ళు హేతువాదం, మానవతావాదం, సంఘ న్యాయవాదం. హేతువాదికి కారణ-కార్యం, మానవతావాదికి సర్వమానవ సౌభాగ్యం, సంఘ న్యాయవాదికి సర్వమానవసమానత్వం ధ్యేయము, పట్టుగొమ్మ, పరమావధి. ఈ ధ్యేయాలు, పట్టు గొమ్మ, పరమావధి వారి దేవుడు.

నాస్తికత అనగా భగవంతుడు లేడనుటేకాదు. ఒక లక్ష్యం, ఒక ఆధారం, ఒక అనుసరించవలసిన ధర్మం, ఒక సాధించవలసిన న్యాయం లేదనుట. మానవు డేదో ఒక పట్టు గొమ్మను పట్టుకొనకపోతే నిలద్రొక్కుకొనలేడు. జీవితయాత్రను గడుపుకొనలేడు. అందువలన మానవు డెప్పుడు నాస్తికుడు కాలేడు.

బుద్ధుడు నాస్తికు డని కొంద రంటారు. అయితే బుద్ధునకు ధర్మపథమున్నది. ఆ ధర్మమే ఆయన భగవంతుడు. వేదాలను నమ్మనివానిని, వైదికకర్మలను చేయనివానిని పాషండు డనుటయేగాక నాస్తికుడని నిందించేవారు. జాబాలి శ్రీరాముని తో "ప్రజలు నీ రాజరికమును కోరుచున్నారు. నీ పరిపాలన వారిని సుఖప్రదులనుగా చేస్తుందని నమ్ముచున్నారు. ప్రజాక్షేమం కొరకు నీవు రాజ్యం చేయాలి. మతిచెడిన ముసలితండ్రిమాట చెల్లాలని నీవు నీ రాజధర్మమును విడువవద్దు" అన్నాడట. దానికి రఘురాముడు కోపించి "నీవు నాస్తికుడ" వన్నాడట. పరలోక మున్నదని, తాను సత్యసంధుడనని, పితృవాక్యపరిపాలకుడనని ప్రవేలుపెట్టి చూపించుటయే గాక, తాను వైదిక నిష్ఠాపరుడనని, పూర్వులు చెప్పిపోయిన ధర్మాలను ఆచరించువాడనని,

పరలోకం, పునర్జన్మ, వగైరా గతులున్నవని నమ్మువాడనని, పరలోకప్రాప్తికంటె ఇహలోకధర్మాన్ని హెచ్చుపలకటం నాస్తికత అని మండిపడ్డాడట. జాబాలి తాను నాస్తికుడనుకానని చెప్పుకొన్నాడు. వైదికకర్మ మూర్తీభవించినవాడు, మహా తంత్రజ్ఞుడు వసిష్ఠుడు, జాబాలి నాస్తికుడు కాదని సిఫారసు చేశాడు. జాబాలి తన సలహాను బలపరచుకొనటానికి పరలోక ప్రస్తావన తెచ్చినా ప్రజాసౌఖ్యాన్ని నీవు పరమావధిగా ఎంచుకోవాల నటంలో నాస్తికత లేదు.

నాస్తిక వాదానికి పర్యాయపదం భౌతికవాదం. దీనినే లోకాయత అంటారు. లోకాయత అనగా ప్రజలలో వ్యాపించిన ధర్మం. మానవుడు తన పరిసరాలు అనగా ప్రకృతి అందించు భోగ భాగ్యములను పొంది, సౌఖ్యప్రదమైన జీవనాన్ని అనుభవించాలి. సంతోషకరమైన జీవితాన్ని కొనసాగించుకోవాలి. తన చేతి కందిన సదుపాయాలను విడిచిపెట్టి, మరణానంతరం పరలోకములో స్వర్గసౌఖ్యాలను పొందుతా ననుకొనటం నేల విడచి సాముజేసినట్లే అనునది. భౌతికవాదం మానవతావాదం కాని నాస్తికవాదం కాదు. మానవతావాదం "మానవ సేవయే మాధవసేవ" అని చెప్పునది కదా!

చార్వాకుని విషయంలో అతడు విషయ లోలత్వ (తక్కువస్తాయి భౌతిక) వాది అయి యుండవచ్చును. కాని భారతంలోని ఒక సంఘటన అతనిని పూర్తిగా ప్రోసిపుచ్చుటకు వీలు లేనట్టిదిగా కన్పడుచున్నది. కురుక్షేత్రయుద్ధంలో జయంపొంది తిరిగి హస్తిపురికి చేరుకొన్న ధర్మజుని బ్రాహ్మణ సంఘం జయ జయ ధ్వానాలతో ఆహ్వానమిచ్చి ఆశీస్సులను కురిపించినదట. ఆ సమూహంలో చార్వాకుడున్నాడట. అతడు ధర్మజుని నిరసించాడట. "నీవు నీ స్వజనాన్ని, పెద్దలను నిర్మూలించావు. నీవు పొందిన లాభం ఏమి? నీవు చచ్చుటయే మేలు" అన్నాడట. చార్వాకుడు రాక్షసుడనియు, బ్రాహ్మణవేషంతో వచ్చిన దుర్యోధనమిత్రుడనియు అచ్చటి బ్రాహ్మణులు నిందించి అతనిని చంపివేశారట. తమ వైదికమతానికి వ్యతిరేకులను దుష్టులనటం, రాక్షసులనటం

వైదిక కర్మిష్ఠులకు పరిపాటి. ఏ ఉద్దేశంతో చెప్పినా చార్వాకుని నింద పూర్తిగా నిజంకదా. అధర్మయుద్ధంచేసి పితామహుని, గురువును, జ్ఞాతుల నందరిని, ఇతర బంధుజనాన్ని పూర్తిగా నాశనంచేయించిన యుధిష్ఠిరుడు చార్వాకుని నిందకు అర్హుడే.

కవిరాజు రామస్వామిగారు నాస్తికుడని కొంద రంటారు. ఆయన "పరతత్వ మహత్వం" అటుంచి ఆయన హేతువాదం, మానవతావాదం, సంఘ న్యాయవాదం ఆయన అధిదేవతలు. మన మధ్యనున్న సజ్జనుడు శ్రీ గోపరాజు రామచంద్రరావు తాను నాస్తికుడనని చెప్పుకొనవచ్చును. ఆయన చిల్లర మల్లర దేవుళ్ళను నమ్మనంతమాత్రాన, మనము పూజించే శివకేశవులను, రామ కృష్ణులను పూజించనంతమాత్రాన ఆయన నాస్తికుడని నే ననుకొనను. ఆయనకు సలక్షమైన హేతువాదం, మానవతావాదం, ఇత్యాది ధ్యేయాలున్నవి. కుల మత భేదాలను, హెచ్చు తగ్గులను ఆయన పాటించడు. సర్వమానవ సమానత్వం, భ్రాతృత్వం "సర్వేజనాః సుఖినోభవంతు" ఆయన ధ్యేయాలు. వానికొరకు ఆయన తన జీవిత సర్వస్వం ధారపోయుచున్నారు. అవి ఫలించాలని పరితపించుచున్నారు, తపస్సు చేయుచున్నారు. తన తపస్సుకు మూలాధారమైన ధర్మాలే ఆయన భగవంతుడు, సర్వేశ్వరుడు.

ఆస్తికత్వం పరబ్రహ్మోపాసన మాత్రమే కాదు. బ్రహ్మజ్ఞానులకు మాత్రమే పరిమితమై ఉండదు. మూఢనమ్మకంతో చిల్లర మల్లర గ్రామదేవతలను కొల్చే వారిప్పటికీ ఉన్నారు. తాంత్రికులు నరబలు లిచ్చేవారు, మారణహోమాలు చేసేవారు కూడా ఉన్నారు. అయితే, వారుకూడా తమశక్తికి మించిన పరాశక్తి, తమకు వరములిచ్చే దేవుళ్ళున్నారని నమ్ముదురు. తన 'కృష్ణావతారం' 4-వ భాగంలో కులపతి మున్షీగారు ఒక గాథ చెప్పారు. అఘోరుడనే మహాతాంత్రికు డుండేవాడట. అతడు నరబలి ఇచ్చి మారణహోమం చేసేవాడట. తన్నాశ్రయించిన వారి శత్రువులను తుదముట్టించేవాడట. పాండవులు ద్రౌపదిని వివాహమాడి హస్తినాపురానికి తిరిగివచ్చినప్పుడు, భీష్ముడు యుధిష్ఠిరుని యువరాజుని చేయాలని సంకల్పించాడట.

దుర్యోధను డీ ఆపదను తప్పించుకొనటానికి సర్వాధికారియైన భీష్మాని, పాండవ రక్షకుడైన శ్రీకృష్ణుని, తన కెదురైన భీముని చావులను సంకల్పించాడట. అతని ప్రేరేపణవలన దుశ్శాసనుడు, శకుని అఘోరుని ఆశ్రయించారట. అతడు జరుపవలసిన మంత్ర తంత్రాలు, నరబలి జరిపి చావుబ్రతుకులు తన చేతుల్లో లేవని, శక్తిస్వరూపిణి మహంకాళి పార్వతిని ప్రసన్నంచేసుకోవాలని, ఆమె పురుషుడు మహేశ్వరుని అనుమతి పొందాలని సలహా యిచ్చాడట. అఘోరునివంటి మంత్ర తంత్ర ప్రవీణుడు, విష మాలికా సమన్వితుడు, మారణహోమదక్షుడు కూడా దేవుళ్ళ మీద ఆధారపడినాడు. గంగానమ్మ, పోలేరమ్మ వంటి క్షుద్ర దేవతల మాటటుంచి కాళి, శక్తి, చండి వంటి ఉగ్రరూపాల ఉపాసన, కొలువు లేక మాంత్రికులు, తాంత్రికులు, మధు మాంస మైథున ప్రియులు నిలువలేరు. కాబట్టి పెద్దలకైనా, క్షుద్రులకైనా ఏదోరూపాన పట్టుగొమ్మ ఉండాలి.

ఈ జగత్తులో కోటానుకోట్ల మానవులున్నారు. కోటి కే కొలదిమందోతప్ప తతిమ్మా జనులందరు భగవంతుని ఆధార ముగా చేసుకొనేవారే. పూర్వకాలంలో మునులు, ఋషులు బ్రహ్మర్షులు, ముముక్షువులు పరబ్రహ్మను గుర్తించి కీర్తించారు. తర్వాతికాలంలో క్రీస్తు, మహమ్మదు ప్రవక్తలు భగవంతుని చాటినారు. మధ్యకాలంలో శంకరుడు, రామానుజుడు, మధ్వుడు, చైతన్యుడు ఈశ్వరుని పొగడినారు. కబీరు, రామదాసు, పురందరదాసు, వీకనాథుడు, జ్ఞానేశ్వరుడు మొదలైన భక్తు లెందరో దేవుని మహత్వాన్ని సంకీర్తనం చేశారు. ఆధునికకాలంలో రామకృష్ణపరమహంస, వివేకానంద పరివ్రాజకుడు, అరవిందయోగి, రమణమహర్షి, షిరిడీ సాయి బాబా, సత్య సాయిబాబా, పండ్రిమలై స్వామిగళ్ వంటి జ్ఞానులు, సిద్ధులు, విశ్వరూపదర్శనభాగ్యం లభించిన విశ్వకవి రవీంద్రుడు, మానవతాస్వరూపం మహాత్మాగాంధి భగవంతుడున్నాడు, ఆయన కటాక్షంవల్లనే మనము నిలబడియున్నామని ఉద్ఘోషించారు, ఉద్ఘోచించుచున్నారు. ఇన్ని కోట్లమంది నానాజాతులవారు, నానా

వర్ణములవారు, కోటీశ్వరులు, భోగపరాయణులు, బీదలు, పతితులు, భగవంతు డున్నాడని చాటుచు ఆయన రక్షణను కోరుచుండగా, ఎవరో కొలదిమంది మేధావులమని, శాస్త్రజ్ఞులమని విర్రవీగి భగవంతుడే లేడనుట తమ పాదములక్రింద భూమిని లేదనుటే, త్రవ్వుకొనుటే.

హేతువాదం

హేతువు అనగా కారణం. కారణంలేనిదే కార్యం జరుగదు. ఏదైన జరుగవలెనంటే, సంభవించవలెనంటే కారణ మవసరం. అందువలన కారణ-కార్యము ప్రకృతి సహజధర్మం. దీనినే ఇంగ్లీషులో కాజ్ అన్డ్ యాక్షన్ అంటారు. ఈ కారణ-కార్యములు, మనకు ప్రత్యక్షములు. అనగా కాగితమునకు నిప్పంటించిన అది దగ్ధమగును, కత్తితో పొడిచిన గాయమగును. ఆహారము తినిన ఆకలి మానును. యుక్తవయస్సు వచ్చిన స్త్రీ పురుషులు కలసిన బిడ్డలు పుట్టుదురు. ఇవి ప్రత్యక్షములు, బుజువుచేయుట కవకాశము కల్గినవి. ఫలానా కారణమువలన, ఫలానా కార్యము జరిగిన దని స్పష్టముచేయునవి. అయితే ఇంత మాత్రాన హేతువాదస్వరూపాన్ని పూర్తిగా వెలిబుచ్చినట్లు కాదు. హేతువాదం నిజస్వరూపం. "ఇదేమి? ఎందు కిట్లున్నది? ఎక్కడనుండి వచ్చింది? ఎక్కడకు పోవుచున్నది? ఈ కారణం వలన ఈ ఫలితం సంభవించునా? ఇట్లు సంభవించుట కవకాశ మున్నదా లేదా? దీనిని రుజువుచేయవచ్చునా?" అను సందేహ ములే హేతువాద మని మనము తలంచుచున్నాము. మనము ప్రత్యక్షముగా చూచునది, మన అనుభవములోనికి వచ్చునది, మన తార్కికమునకు లోనౌనది, మన సామాన్యబుద్ధికి తోచునది హేతువాదమునకు మూలము.

కాని హేతువాదమునకు అందనివి అనగా మనము చూడ నివి, మనము ఇదమిద్ధమని నిశ్చయించలేనివి, మనము వేయు ప్రశ్నలకు సూటిగా జవాబులు రానివి, మనము ప్రత్యక్షముగా

సాక్ష్యరూపముగా నిరూపించలేనివి ఉద్భవించుచునేయుండును, జరుగుచునేయుండును. ఉదాహరణకు, షిరిడీ సాయిబాబా తన ఉత్త ఎడమ అరచేతినుండి కుడిచేతి బొటనవ్రేలు, చూపుడు వ్రేళ్లతో భస్మము తీసి భక్తులకు పంచిపెట్టే వాడట. తీసినకొలది భస్మము ఉద్భవించుచునే ఉండేదట. మనమధ్య సజీవముగా నుండిన పుట్టపర్తి సత్య సాయిబాబా చేయి పైకెత్తి శూన్యము నుండి వస్త్రాభరణములను, పుష్పాదికములను గ్రహించి భక్తులకు పంచిపెట్టునట. పండ్రిమలై స్వామిగళ్ అనే ఒక మహనీయుడు తను కూర్చున్న స్థానమునుండి భక్తులు కోరినవెంటనే నైపు కొట్టిన సందేశమును శూన్యము నుండి తెప్పించి యిస్తున్నాడట.

కులపతి కె. ఎమ్. మున్షీగారు ఇట్టి అనుభవములను భారతీయ భవన్ జర్నల్లో వేరొక్కన్నారు. ఒక సిద్ధుడు భక్తుని కోరికమీద వట్టి పళ్ళెరమును తెప్పించి దానిని గుడ్డతో మూసి కొన్నిక్షణముల కా గుడ్డను పైకెత్తి పుష్పములను, కుంకుమను, అరటిపండ్లను వెలికితీసి యిచ్చినాడట. కుంకుమ ఒక చోటు నుండి, పుష్పములు ఇంకొక చోటునుండి. అరటిపండ్లు మరొక చోటునుండి వచ్చినవట. తిరిగి గుడ్డను కప్పి వానిని వచ్చిన చోట్లకు పంపివేశాడట. ఖైదులో బంధింపబడిన కబీరు, తాళము వేసి కాపలాయుండినను బయట తిరుగుచుండేవాడట.

ఇంకొకటి, హేతువాదం పునర్జన్మను నమ్మదు. కాని చిన్నపిల్లలు తాము క్రిందటి జన్మలో ఫలానాచోటున పుట్టినామని, ఫలానావారు తలిదండ్రులు, బంధువులని, దూరప్రదేశములోనున్న ఇంటిని, జననీ జనకుల, అన్నదమ్ముల, అక్కచెల్లెండ్ర పేర్లు చెప్పి రుజువుచేసిన వార్తల నప్పుడప్పుడు పత్రికలలో చదువు చున్నాము. ఈ మధ్య అమెరికాలోని వర్జీనియా యూనివర్సిటీ ప్రొఫెసరు డా. అయాన్ స్టీవెన్సన్ గారు తన పరిశోధనలలో పునర్జన్మ ఉన్నట్లు తేలిందని ప్రకటించారు. తాను పరిశీలించిన 1200 వందల కేసుల్లో ఒక్క కేసులోమాత్రం దాఖలాలు కుదర లేదట. 1933 లో మరణించిన ఆ వ్యక్తి 1952 లో మనుమ రాలుగా ఢిల్లీలో జన్మించిందని తెలియపరిచాడు. ఇవన్నీ

సామాన్య హేతువునకు కట్టుబడవు. ఈ సంభవములను సామాన్య కార్య-కారణములతో నిరూపించ లేము. కనుకట్టు విద్య మొద లైన మాంత్రికములు వీనికి వర్తించవు. హేతువాదము సామాన్యజీవితానుభవముమీద, కారణ-కార్య సిద్ధాంతముమీద ఆధారపడియున్నది. సామాన్య మానవుని జీవితానుభవాలకు అతీతమైన శక్తులవల్లనే పై జెప్పినవి సంభవించును. ఇట్టివానికి, ఎందుకు జరిగినవి? ఎట్లు జరిగినవి? దేనివలన జరిగినవి? అను ప్రశ్నలు వర్తించవు. హేతువాదము భౌతికవాదము, అవయవ ములకు, ఇంద్రియములకు సంబంధించినది. తమ శారీరకసంబంధ మైన ఇంద్రియములకు, అనుభవములకు అతీతమైనవానిని లేవనుకొనుటగాని, త్రోసిపుచ్చుటగాని దురహంకారమగును. భౌతికముగాకూడా ఇప్పుడు సాధ్యమని తెలిసినవి ఇదివరలో తెలిసి యుండ లేదు. పురాణములలోచెప్పిన పుష్పకవిమానము అతి ప్రాచీనకాలానికి చెందిన ఊహ. భారతయుద్ధం క్రీస్తు పుట్టుకకు వేయి సంవత్సరాలకు తక్కువకాని కాలంలో జరిగింది. అప్పుడు కూడా ఆకాశంలో ఎగిరే యంత్రాలున్నట్లు చెప్పబడ లేదు. ఘటోత్కచుడు మొదలైన రాక్షసవీరులు మంత్రబలంచేత ఆకాశ పథంనుండి రణమొనర్చినట్లు భారతం చెప్పుచున్నది కాని విమానముల నెక్కి యుద్ధముచేసినట్లు చెప్పలేదు. దేవతలు విమానములనుండి యుద్ధదృశ్యములను చూచియుండవచ్చునుగాని అట్టివి మానవ సంబంధమైనవి కావు. అందువల్ల ఇటీవలవరకు మనము ఆకాశయాన ముండునని తలంచియుండ లేదు. విద్యుత్ దీపాలకు, పంకాలకు, యంత్రాలు నడుపుట కుపయోగపడునని మన మనుకొని యుండ లేదు. కాని అవి యథార్థమై మన అనుభవములోనికి వచ్చినవి. భౌతికవిషయములనే మన మూహించనవి సంభవించినప్పుడు, అలౌకిక విషయాలను మన మెరుగనంతమాత్రాన అవి ఉండుటకు వీలులేదు, ఈ కారణము వలన ఇ దిట్లు సంభవించునని రుజువున కాస్కారములేదు కాబట్టి ఇట్టివి లేవు అని చెప్పుట మన అహంభావానికి తార్కాణం. మనమే స్వయంభువులం. మనమే సర్వాధికారులం, మన

అవయవాలు, ఇంద్రియాలు, మేధస్సుయే పరమావధి అని ఎంచుకొనునంతటి అవివేక మింకొకటి లేదు.

మరొకటి. పైనచెప్పిన అసామాన్య సంఘటనలకు కూడ హేతువున్నదని చెప్పవచ్చును. సిద్ధులు, దైవాంశను ప్రజ్ఞ లింపజేసుకొన్నవారు, భగవత్కటాక్షాన్ని పొందినవారు సామాన్య మానవాతీత శక్తులను కలిగియుందురు. ఈ శక్తులే వా రొనరించు అద్భుతములకు కారణము, హేతువు. కాబట్టి సామాన్యార్థమున హేతువాదుల మనుకొనువారు దిగులు చెంద వలసిన అవసరం లేదు.

చివరిమాట. హేతువాదులు తాము నిరీశ్వరులమని భ్రమపడుచున్నారు. నిజానికి సహేతుకమైన కారణ-కార్యసిద్ధికి, నాస్తికత్వమునకు సంబంధము లేదు. సామాన్యానుభవపరిమితిలో మానవజన్మతో వచ్చిన అవయవముల, ఇంద్రియముల వలన చేయ గలుగునది, చూడ గలుగునది, విన గలుగునది, ఊహించ గలుగునది హేతువునకు కట్టుబడి యుండును. ఈ సామాన్య ధర్మములకు మించినవి ఈశ్వరసంబంధమైనవి. పరిపక్వ భగవద్ జ్ఞానపరమైనవి. అందువలన హేతువాదులు నిరాశ చెంద నక్కర లేదని ఇంకొకసారి మనవిచేయుచున్నాను.

ఏది వ్యభిచారం

సామాన్యార్థమున పెండ్లియైన స్త్రీ, పురుషునితో సంయోగ మైన వ్యభిచార మందుము. పురుషుడు తన భార్య కాని స్త్రీతో సంభోగించిన దానిని కూడా వ్యభిచార మందుము. పెండ్లికాని స్త్రీ మగవానితో కలసినగాని, పెండ్లికాని యువకుడు కన్యతో రమించినగాని దానిని వ్యభిచార మనము. కాబట్టి వ్యభిచారం వివాహమునకు సంబంధించినది. వివాహమనిన స్త్రీ పురుషల శరీరములు రెండైనను, ఒకరి వ్యక్తిత్వము మరొకరియందు లీనమగుట, అనగా ఇద్దరు ఏకీకృత మగుట.

భావమునందు, నడవడియందు, ఆచరణయందు ఏకోన్ముఖులై, రెండు పాయలు సమ్మిళితమై ఒక వాహినిగా ప్రవహించు నదివలె కలసి మెలసి పోవుట. ఈ స్థితి సంభవించినప్పుడు 'నాతి చరామి' అను ప్రమాణము సార్థకమగును. 'అర్ధాంగి', 'అర్ధనారీశ్వరుడు' అను భావము పుష్కలత నొందును. అప్పుడే పాతివ్రత్యము, ఏకపత్నీత్వము అర్థసహితమగును. ఈ ఐక్యత లేనినాడు వివాహబంధ మనునది యుండినను, స్త్రీ పురుషులు సిజ్గమైన భార్యాభర్తలు కారు. మన సివ్వని భార్య, భార్యయందు మనస్సు లగ్నముకాని భర్త ఒకరి కొకరు పరాయివారు. ఇష్టము లేని భార్యతో భర్త తన హక్కు అని బలవంత సంయోగము చేసిన అది వ్యభిచరించినట్లే. విముఖుడైన భర్తను మాయచేత సంగమమునకు ప్రేరేపించుట బలవంతముగా చెరుపుట వంటిదే. ప్రకృతి స్వభావము వలన, స్త్రీని పురుషుడు మానభంగముచేయ గలడు గాని, స్త్రీ పురుషుని ఎట్లు చేయగలదు? అని సందేహము రావచ్చును. మద్యపానము చేయించియో, మత్తు పదార్థము నిచ్చియో, చీకటిలో తానని భ్రమింపజేసియో స్త్రీ పురుషుని బలవంతబ్రాహ్మణార్థము చేయించుట కవకాశము లేకపోలేదు. సంభోగాచరణ జరుగకపోయినను, ప్రయత్నము వ్యభిచార భావమునే సూచించును. కాబట్టి భార్యా భర్తల సంబంధమునకు ముఖ్యము పెళ్ళి తంతుకాదు, తాళీబొట్టు కట్టుటకాదు, హృదయ కలయిక, భావైక్యత, సాహచర్యం, ఏకోన్ముఖాచరణ. ఇవి లేనినాడు వారు భార్యా భర్తలుకారు. ఒక పురుషుడు, ఒక స్త్రీ మాత్రమే. ఈ స్థితి సంభవించినప్పుడు ఇంకొక పురుషునితో స్త్రీ కలియుట, ఇంకొక స్త్రీతో పురుషుడు రమించుట వ్యభిచారము క్రిందకురాదు. అది మానవ సహజ ప్రవృత్తి.

ఆదికాలములో మానవుడు పురుషుడు, స్త్రీ యను భేదము మాత్రమే కలిగియుండినాడు. ఇప్పుడున్న తల్లి కొడుకు, తండ్రి కూతురు, అన్నా చెల్లెలు అను భేదములేక కోర్కెనుబట్టి ఏ పురుషుడైనను, ఏ స్త్రీనైనను సంభోగభాగస్వామినిగా చేసుకొనుచుండేవాడు. ఆవిధముగనే స్త్రీ కూడా. నిజమున కా పూర్వపు రోజులలో స్త్రీ గాని, పురుషుడు గాని సంతానము

గాని ఏ ఒక్క వ్యక్తికి చెందినవారుకాదు. ఒకే ప్రదేశమున నివసించుచుండిన గుంపునకు చెందినవారు. ఒక భూభాగంలో తెగలు తెగలుగా మనుష్యులు నివసించుచుండినప్పుడు అవసరాన్నిబట్టి, వీలునుబట్టి, ఏ తెగకు ఆ తెగలో సాముదాయక జీవనముతోబాటు, స్త్రీ పురుషుల సంభోగ కార్యాచరణను జరుపుకొనుచుండేవారు. కాలము గడచి, గుంపులు గణములుగా ఏర్పడి, కొన్ని కట్టుదిట్టములు ప్రవేశించి, ఒక పురుషుడు ఒక స్త్రీ భార్యా భర్తలుగా వ్యవహరించి, సంతానమును కని, ఆ సంతానము తమదని భావించినను, శ్వేతకేతువుకాలమువరకు స్త్రీ గణమునకంతయు చెందినదనియు, గణములోని ఏ పురుషుడైనను, ఏ స్త్రీనైనను సంతానముకొరకు తాత్కాలికముగా తనదానిని చేసికొనవచ్చునని యు ఆచారము ప్రబలియుండినది. వివాహసంస్థ ఏర్పడిన తర్వాత కూడ, ప్రాచీన ఈజిప్టులోవలె చెల్లెలిని వివాహమాడుట ఉండేది. పురాణములలో యమధర్మరాజు చెల్లెలిని వివాహ మాడెనని, బ్రహ్మ తన కూతురు సరస్వతిని తన భార్యగాచేసుకున్నాడని చెప్పబడుచున్నది. ఈజిప్టు సమ్రాట్లలో అధికోన్నతుడును, చిరకాల జీవియునగు రెండవ రామ్‌సెస్ తన కూతురునేగాక ఆ కూతురువలన తనకుపుట్టిన మనుమరాలిని కూడా వివాహమాడెనట. మన హిందువులలో పెదతండ్రి, పినతండ్రి కూతురును వివాహ మాడుట తప్పు. కాని మహమ్మదీయులలో, క్రైస్తవులలో ఇది తప్పుకాదు. ఇప్పటికిని కొందరు కన్నడిగలు ఆస్తిని కాపాడుకొనుటకు తన తల్లి సోదరి కూతురును చేసుకొనెదరట. వాలి సుగ్రీవుల మాటటుంచి ఈకాలమున కూడా అన్న చనిపోయినప్పుడు వాని భార్యను తమ్ముడు చేసుకొను ఆచారము మనదేశములో ఉన్నది. ఒక స్త్రీకి ఒకరికంటె ఎక్కువ-డు భర్తలుండుటయు ఈకాలములోకూడ నున్నది.

మానవస్వభావమునకు పునాది స్త్రీ పురుష భేదమే మాత్రమే. వివాహమనుపేర ఒక పురుషుని, ఒక స్త్రీని జంట జేసి జీవితయాత్రను కలసిమెలసి గడుపుకొనుడని శాసించుట

సంఘ నియమము. మానవుడు పది విషయములు తెలుసుకొని, పది మార్గములు చేపట్టి, పలువిధ వర్తనకులోనై, వ్యక్తిత్వమును పెంచుకొని, ఇది నాకు కావలెను దీనికి నేనొక్కడనే యజమానిని కావలెను నే నొక్కడనే అనుభవించవలెను అను భావమును పెంచుకొన్నప్పుడు పది మందితో కలసి ఒక స్త్రీని అనుభవించుటకు సమ్మతించలేడు. ఆ స్త్రీసాంగత్యము తన కొక్కనికే యుండునని అభిలషించును. తనకు పుట్టిన సంతానము తన రక్తమును పంచుకొన్నది కాబట్టి తనదే యను మమకారము పెరిగినది. ఇదిగాక నాగరికతను పెంపొందించుకొన్న మానవుడు క్రమేణ పెరుగుచుండిన ప్రజాసమూహముల బిడ్డలు ఉమ్మడి వారైన, వారి పోషణకు, వారి విద్యాబుద్ధులకు, వారి జీవనోపాధికి తగిన శ్రద్ధ, బాధ్యత ఉండదని గ్రహించినాడు. ఈ కారణముల వల్ల వివాహసంస్థ స్థిరత్వము పొందినది.

తండాలుగా, చిన్న చిన్న సంఘాలుగా, గణాలుగా ఒకచోట స్థిరనివాసం ఏర్పరచుకొనక, పశువులను మేపుకొనుచు, ఎక్కడ పచ్చిక బయళ్ళుండునో లేక ఎక్కడ ఏ యవధాన్యములు పండించుట కనువగునో ఆ యా ప్రదేశములకు తిరుగాడుచుండిన మనుజులు, ఒకచోట స్థావరము నేర్పరచుకొని పల్లెలు జనపదములు రూపొందించుకొన్నప్పుడు ఈ వ్యక్తిగత జీవనము ప్రారంభమై, ఇది నాది, ఈ స్త్రీ నాది, ఈ సంతానం నాది అను భావం, కాంక్ష ప్రబలి స్త్రీ పురుష సంబంధము వివాహ విధిగా మారినది. వివాహసంస్థ మానవానీకము కుటుంబములుగా, వంశములుగా, కులములుగా, జాతులుగా రూపొందించుటకు దారితీసినది. ఈ పరిణామము మానవ సౌభాగ్యమునకు, సంవర్ధనకు కారకమైనది. అంతవరకు మేలే. కాని వివాహసంస్థపేర ఒక స్త్రీని, ఒక పురుషుని వారి కిష్టము లేనప్పుడుకూడ బంధించి యుండుట మానవ సహజ ప్రవృత్తికి విరోధము. ఎప్పుడు స్త్రీ, పురుషుడు ఎడ ముఖము, పెడ ముఖము అగుదురో, ఎప్పుడు వారి అన్యోన్యానురాగములు నశించునో, ప్రేమపాశము తెగిపోవునో అప్పుడే వారి వివాహబంధము తునా తునకలైపోవును. అప్పుడు వారు ఒక పురుషుడు ఒక స్త్రీ మాత్రమే. అట్టి స్థితిలో వారు

మరొక వ్యక్తివలన సంభోగసౌఖ్యమును పొందుట వ్యభిచారము కాదు, జీవరాసుల కన్నిటికి ఆహారం, నిద్ర, మైథునం అవసరం. నిస్సంగులైన యోగులు, ఋషులు తప్ప మైథున వాంఛలేని మానవుడు లేడు. ఋషులుకూడ అప్పుడప్పుడు కాలు జారినట్లు మనము చదివి యున్నాము.

ఇక సామాన్యమానవుని సంగతి చెప్పనక్కరలేదు. మైథునం మానవప్రకృతిలో ఒక భాగం. సంతానము కొరకే మైథునం కాదు. ఆధునికశాస్త్రజ్ఞులు చెప్పుచున్నట్లు మైథునం శరీరారోగ్యానికేగాక, మానస వికాసానికి, ఆత్మతృప్తికి తోడు పడుతుంది. అయితే అది ఇష్టాపూర్వకంగాను, స్వేచ్ఛా వర్తనముగాను, అన్యోన్యానురాగముతోను కూడి యుండవలెను. అట్లైన స్త్రీ పురుష సంయోగం దోషముకాదు. అది వ్యభిచార మెంతమాత్రం కాదు.

పుణ్యం - పాపం

పుణ్యం చేసినవారు, పాప మొనర్చినవారు పరలోకాలకు పోతారని, పరలోకాలనగా స్వర్గం, నరకం అని, పుణ్యులు స్వర్గలోకానికి వెళ్ళగా, పాపులు నరకానికి పోతారని మనవాళ్ళ నమ్మకం. స్వర్గంలో అప్సరసలు గాన నృత్యాలుచేస్తూ అంద చందాలు విరజిమ్ముతారని, సుగంధపుష్ప నందనవనంలో హాయిని గొల్పే మందమలయానిలంలో విచ్చలవిడి వాహ్యాళి చేయ వచ్చని, పైగా దేవతాస్త్రీ రంభతో సంభోగప్రాప్తి కల్గుతుందని అంటారు. నరకలోకంలో ఇనుపముక్కు కాకులతో పొడిపించటం, సలసలకాగే సీసంలో ముంచటం, భగభగమండే అగ్నిగుండంలో పడద్రోయటం వంటి బాధలు పెడతారని నమ్ముతారు. అయితే మనవారి ప్రకారం సర్వసామాన్యంగా స్వర్గానికి వెళ్ళేవారు యజ్ఞ యాగాదులు చేసినవారు, యుద్ధంలో చనిపోయినవారు. వీరి కితర సౌభాగ్యాలెట్లున్నా రంభాసంభోగం తప్పక కల్గుతుందని వారి విశ్వాసం. నరకలోక విషయమెట్లున్నా

నాకు స్వర్గలోక విషయంలో కొంత సందేహమున్నది. ఈ రోజుల్లో యజ్ఞయాగాదులు చేసేవారు మితంగావున్నారు. కాని యుద్ధంలో చనిపోయేవారి సంఖ్య అపరిమితం. మొన్న జరిగిన భారత-పాకిస్తాన్ యుద్ధంలో, తూర్పు పశ్చిమ రంగాల్లో అనేకవేలమంది చనిపోయారుకదా! వీరందరిని రంభ సంబాళించుకోగలదా? కరువు కాలంలో బియ్యంకొట్టువద్ద, మద్యనిషేధం తొలగించిన తర్వాత కల్లుంగడివద్ద బారులు తీర్చి నిలుచుండినట్లు వీరు కాచుకొనివుంటే ఆ అమ్మ ఎంత దేవతా స్త్రీ అయినా, ప్రౌఢ అయినా, వీళ్ళందరికి సమానావకాశ మివ్వకలదా, సంతోషపెట్టకలదా? పైగా మృతుని శరీరంనుండి బైలుదేగిన సూక్ష్మశరీరం (రూపం) చనిపోయినప్పుడున్న ఆకారం కలిగివుంటుందట. మరి యుద్ధంలో కాలు తెగో, చేయి పోయో, కన్ను లొట్టయ్యో వికృతాకారం సంభవిస్తే ఆమె చూచి ఛీ, ఈ వికలాంగునితోనా నా సరసం అని చీదరించుకొని తిరస్కరించదా? అయితే సోమయాజికి అంగవైకల్యముండదు. కాని శుద్ధ ఛాందసవైదికుని సరస శృంగారకళాకోవిద, అనిర్వచనీయ సౌందర్యవతి సహించకలదా! పోసి ఇవన్నీ నిజమనుకొన్నా మనం పుణ్యపురుషు లనుకొనేవారు దానధర్మాలు చేసేవారు, చెరువులు త్రవ్వించేవారు, సత్రాలు చలివేంద్రలు నడిపేవారు, బాటలవెంట చెట్లు నాటించేవారు, బీదబిక్కని ఆదరించేవారు, తోటిమానవులను కనికరించి "మానవసేవయే మాధవసేవ" యని మానవాభ్యుదయం కొరకు పాటుపడేవారు, రంభవంటి భోగస్త్రీల సాంగత్య నీచకానికి ఒడబడుతారా? వారు కోరేది, కవిరాజు రామస్వామి చౌదరిగారు తమ సూత పురాణం ప్రథమాశ్వాసంలో చిత్రించినట్లు కల్లు సారాయిలతో మతి చెడి, విచ్చలవిడిగా మొండిమొలతో గంతులు వేసే లంజలతోను, తత్సమ పురుషులతోను నిండియుండే భోగభూమి నివాసమా? కాదు, ముమ్మాటికీకాదు. స్వర్గలోకం ఊర్ధ్వలోకాల్లో ఒకటైనా, పుణ్యభూమి మాత్రంకాదు. ఈ లోకంలో పుణ్యంచేసినవారు పుణ్యలోకాలకు పోతారు.

మన శాస్త్రాల్లో ఏడు, ఏడు పదునాల్లు లోకాలున్నవి. ఊర్ధ్వ లోకాలు ఏడు, అధో లోకాలు ఏడు. ఆశ్చర్యమేమిటంటే

ఊర్ధ్వలోకాల్లో స్వర్గంతోబాటు భూలోకంకూడా ఉన్నది. భరతఖండం కర్మభూమి అనుకొన్నా మొత్తంమీద భూలోకం భోగభూమి. స్వర్గం పరాకాష్ఠనందుకొన్న భోగభూమి. కాబట్టి భూలోకంతోపాటు స్వర్గలోకంకూడా పుణ్యభూమి కాదని స్పష్టమౌచున్నది. పుణ్యలోకంలో భౌతిక సంబంధం, భోగ సంబంధం, కష్ట నష్టాలు, విలాస, చిద్విలాసా లుండవు. ఈ పదునాలుగు లోకాల్లో నరకం ఇదమిద్ధమని చెప్పక పోయినా దాని స్వభావాన్నిబట్టి అది అధోలోకాలకు చెందినదని మన మనుకొంటాము. కాని నరకాన్నిపాలించే యమధర్మరాజు ఆకాశాన్నుండి ఊడిపడతాడని మనం సమ్మ్రుచున్నాం. ఇది ఎంత వరకు నిజమో! ఈ మధ్య చంద్రగ్రహంమీద దిగినవారికి చంద్రునిపైన భూమి ఉన్నట్లు కనపడిందట. భూమినుండిచూస్తే చంద్రుడు ఆకాశంలో పైన కనపడుతాడు. ఏది ఊర్ధ్వలోకం, ఏది అధోలోకం?

అధోలోకాల్లో చివరిది పాతాళలోకం. ఈ లోకాన్ని చేరుకోవాలంటే భూమి సొరంగాలగుండా వెళ్ళాలట. అనగా ఈ పాతాళలోకం భూమి అట్టడుగున ఉన్నదని, దీనిని చేరుకొనటానికి భూమిలో ప్రత్యేక సొరంగాలున్నాయని భావం. కారణం మనవాళ్ళు భూమి చదరం అని నమ్మ్రారు. అందుకనే హిరణ్యాక్షుడు భూమిని చాపచుట్టగా చుట్టి చంకనుబెట్టుకొని వెళ్ళుచుండగా, విష్ణువు అడ్డుపడి భూమిని కాపాడినాడట. ఇప్పుడు మనకు భూమి గుండ్రమైన ఖగోళమని తెలియును. అందువలన మన వాళ్ళనుకొనియుండినట్లు సొరంగాల గుండా పోకుండానే మనకు క్రిందిభాగంలోవున్న పాతాళదేశాలకు మనము పోవచ్చును. మనకు అమెరికా పాతాళలోకమవగా, అమెరికావారికి భరత ఖండం పాతాళలోకం.

అధోలోకాల సంగతేమిటోగాని, ఊర్ధ్వలోకాలున్నవని అనుకొనటాని కవకాశమున్నది. ఇవే పుణ్యలోకాలు—బ్రహ్మ లోకం, శివలోకం, విష్ణులోకం, రాధాలోకం, గోలోకం. వీనినే భువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక, సత్యలోకా

లంటారు. ఈ లోకాలకు వారి వారి అంతస్థును బట్టి అనగా చేసుకున్న పుణ్యకార్యాలనుబట్టి పుణ్యాత్మలు చేరుకుంటారు. సౌఖ్యాన్ని, శాంతిని, నిశ్చింతను, నిర్వికల్పాన్ని డిగ్రీలవారీగా అనుభవిస్తారు. ఈ విధముగా మనము సరిపెట్టుకొనవచ్చును.

కొంతమంది పుణ్యం అంటే ఆరోగ్యం, పాపం అంటే అనారోగ్యం అంటారు. బందిపోటు దొంగలు, హంతకులు ఆరోగ్యంగా ఉండరా? మంచిపనులుచేసేవారు వ్యాధిగ్రస్తులు కాకూడదా? ధర్మకార్యాలు చేయాలంటే శరీర ముండాలి. నిజమే. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం". ఇక్కడ చెప్పబడిన శరీరం ఆరోగ్య శరీరమే. కాని మన అనుభవంలో కుచ్చితాలు, కుతంత్రాలతో పరుల కొంపలు తీసి మానవాళికి, దేశానికి ఎన్నో ద్రోహాలుచేసేవారు కూడా ఆరోగ్యంతోనే ఉంటారు. కాబట్టి సామాన్యంగా ఆరోగ్యాన్నిబట్టి పాప, పుణ్యాలు నిర్ణయించలేము. ఇక మనస్సును బట్టి, హృదయాన్నిబట్టి, బుద్ధిని బట్టి కర్మస్వరూపం పరిణమిస్తుంది. కర్మ స్వభావాన్నిబట్టి పుణ్యం, పాపం సిద్ధిస్తుంది. ఏది మనస్సును రంజింపజేస్తుందో, ఏది మేధస్సును వికసింపజేసి ఊహను ఉజ్జ్వలింపజేస్తుందో, ఏది సంతోష ఉల్లాసాలకు కారక మౌతుందో అదే పుణ్యం. పుణ్యలోకా లుండవచ్చును. వానిలో శాంతి భద్రతలు, సుఖ సౌఖ్యాలు లభించవచ్చును. కాని పైనజెప్పిన జీవనజ్యోతి ఆనందమయంగా, సుఖశాంతులతో వెలిగితే అదే పుణ్యం. అప్పుడు ఈ భౌతికలోకంకూడా పుణ్యలోక మౌతుంది. మన జన్మ సార్థకమౌతుంది. వేరే నరక లోకమున్నా లేకపోయినా ఏది మనస్సుకు వ్యథ కలిగిస్తుందో, ఏది అసౌఖ్యానికి కారకమౌతుందో, ఏది చేతికి, నాలుకకు, బుద్ధికి అందని బాధ కాలవాలమౌతుందో అదే నరకం. అదే నరక యాతన. ఇట్టి నరకయాతన ననుభవించే జీవి నిజముగా పాపి కాకపోయినా నికృష్టజీవి.

మోహం, కామం, ప్రేమ

మోహం చెడ్డదని, కామం అంతకంటె చెడ్డదని, ప్రేమనేదే మంచిదని మనవాళ్ళు సర్వసామాన్యంగా తలుస్తారు. కాని గట్టిగా ఆలోచిస్తే మోహం లేనిదే కామం కల్గదని, కామం లేనిదే ప్రేమ జనించదని తోస్తున్నది. అందువల్ల ప్రేమను సాధించటానికి మోహం, కామం అవసరమని నా అభిప్రాయం. మోహం అంటే ఆకర్షణ. కామం అంటే కోరిక. ప్రేమ అంటే దాని ఫలితం.

మోజు బలిస్తే మోహ మవుతుంది. కోర్కె ప్రజ్వలిస్తే కామం అవుతుంది. కామం శిఖరా న్నందుకొంటే ప్రేమ అవుతుంది. మోజు పురుషునకు స్త్రీ మీదకు, స్త్రీకి పురుషుని మీదకు మాత్రమే పరిమితమై ఉండనక్కర లేదు. బట్టలమీద నుండవచ్చును. చేతికర్రమీద నుండవచ్చును. పెంచే కుక్క మీదో, దొడ్లో తిరిగే గిత్తమీదో ఉండవచ్చును. బొమ్మను జూచి పిల్లవాడు, పరికిణీని జూచి పిల్ల, కారును జూచి యువకుడు, ఓణీని జూచి యువతి మోజుపడ్తారు. చిర్రెక్కిన మోజువల్ల జగన్మోహినిని జూచి రాక్షసులే కాదు, ఈశ్వరుడుకూడా మోహ పడ్డాడు. శ్రీరాముని జూచి శూర్పణఖ మోహించింది. సామాన్యాకర్షణ మోజు. మైమరపించేది మోహం. మోజు ఇబ్బందులను కలుగజేయకపోవచ్చును. మోహం అపాయాలకు దారితీయవచ్చును. కాని వాని స్వభావం హెచ్చు తగ్గుల భేదంతో ఒకటే.

కోర్కె లేనిదే ఏ పనినీ చేయలేము. మన సంపద పెరగాలనో, మన సంపాదన వృద్ధిచెందాలనో, మనము పేరు ప్రతిష్ఠలను పొందాలనో, జీవిత జ్ఞానాన్ని సాధించాలనో కోరిక లేనిదే ప్రయత్నించము. కోర్కె బలిస్తే కామ మవుతుంది. కామమంటే స్త్రీ పురుషుల వ్యామోహం మాత్రమేకాదు. కార్యాలను సాధించుటకు కామం సాధనమౌతుంది. చివరకు

"కామి గాక మోక్షగామి కాడు" అన్నంతవరకు కాముకత్వం పోతుంది. కాబట్టి మోహం, కామం ఒక భావానికి, ఉద్రేకానికి, ఒక పరిమాణానికి సంబంధించినవి. ఒక సూత్రాధారముచే కట్టబడినవి.

ప్రేమ కామాని కంతిమ దశ. ఆకర్షణ కోరికగా మారి సిద్ధిపొందినది ప్రేమ. త్రిమూర్తులను చూడండి. సరస్వతిలేని బ్రహ్మను, లక్ష్మిలేని విష్ణువును, పార్వతిలేని శివుని మన మూహించలేము. సరస్వతిని సృజించిన బ్రహ్మ ఆమె అంద చందాలకు మోజుపడి, మోహావేశుడై కామించి వాణిని తన దానినిగా చేసుకొన్నాడు. అమృతభాండంతో బాటు సముద్రం నుండి జనించిన లక్ష్మినిజూచి విష్ణువు ఆశించి (మోహించి) కామించి ఆ సిరిని ప్రేమతో తన అంకాన చేర్చుకొన్నాడు. రేకెత్తిన కోర్కెతో తనకొరకు ఉగ్రతపస్సు చేయు పార్వతిచేత ఆకర్షింపబడి (మోహితుడై) వాంఛించి (కామించి) పరమేశ్వరుడు తన అర్ధాంగినిగా చేసుకొన్నాడు. బ్రహ్మ తన ముఖములో (నోటిలో) సరస్వతిని, విష్ణువు తన హృదయములో లక్ష్మిని చేర్చుకొని లాలించగా, శివుడు పార్వతిని తన శరీరంలో అర్ధ భాగంగా చేసుకొన్నాడు. అర్ధశరీర మిచ్చి అర్ధనారీశ్వరుడైన పరమేశ్వరుడు త్రిమూర్తులలో "వాగర్థా వివసంపృక్తౌ, వాగర్థ ప్రతిపత్తయే" అను కాళిదాసుని కీర్తనకు మూలమైనాడు. ఆ ఆదిదంపతుల ప్రేమ పరిణతిజెంది ఏకత్వమును పొందినది. పురాణ దంపతుల మాటటుంచి రాధాకృష్ణుల విషయం తీసుకొందాం. దేవకీనందనుడు, యశోదానందనుడుగా రేపల్లెలో పశువులను మేపుచున్నప్పుడు, రాధ అను బాలిక అతని ఆటపాటలకు మోజుపడి అతనితోబాటు ఆట పాటలలో పాల్గొన్నది. ఈ మోజు ముదిరి స్నేహమై, కామమై, ప్రేమగా పరిణమించింది. ఇప్పుడు మన కందరకు రాధాకృష్ణుల ప్రేమ ఆదర్శం. వారు మనకు ప్రేమస్వరూపులు.

ఋతుధర్మం

ఎక్కడదీ బ్యాండు వాయిద్యం? ఈ కోలాహల మెక్కడ నుండి? వీధిలోకివెళ్ళి చూచాను. ఆడపిల్లలు, చిన్నా పెద్దా, లేత ముదురు, వెడల్పాటి జరీ అంచుల రకరకాల పరికిణీలతో, చిత్ర విచిత్ర ఓణీలతో, రంగు రంగుల పట్టు నేత చీరలతో, పూల పూల జాకెట్లుతో, మెడనిండా తగిలించుకొన్న హారాలతో, జుట్టుకు జడకు వెలిగించుకొన్న కుప్పీలు, రిబ్బన్లు, పిన్నులు, పూలతో, చిలిపిగా ఉల్లాసంతో, వయ్యారంగా, ఉత్సాహంగా, హుందాగా నడుస్తూ ఇంటింటివద్ద ఆగి, ఇంటి స్త్రీలకు బొట్టుపెట్టుచున్నారు. ఆహ్వానిస్తున్నారు. వీళ్ళలో కొందరెంత అందంగా, ఆకర్షణీయంగా వున్నారు! యీవన స్త్రీ అందం ఎంత మనోహరం! అందమైన స్త్రీ కంటె పురుషున కానందంకలిగించేది మరొక టీ ప్రపంచంలో ఉన్నాదా? అందుకనే భర్తృహరి "తొయ్యలుల కంటె రమ్య వస్తువులు లేవు, నిఖిల జగములం దిది నిక్కువంబు" అని ఎలుగెత్తి చాటినాడు. అయితే యీవనముండాలికదా అనుభవించాలంటే! ముసలి నోరు చప్పరించినంతమాత్రాన, ఉవ్విళ్ళూరినంత మాత్రాన ఒరిగేదేమిటి? కాని వృద్ధునకుకూడ సౌందర్యము కంటి కానందము కలిగించునుకదా! అనుభవించలేక పోయినా చూచి ముచ్చట పడగలడుకదా! ఆ ఆనందం వానికి హుషారు నిచ్చి, క్రొత్త శక్తినిచ్చి జీవితాశను పెంచదా? స్త్రీ కులుకు, వయ్యారం, లావణ్యం, చమత్కృతి, కొట్టవచ్చే పిలుపు, మనోజ్ఞతను, ఉజ్వలతను, యువకులకేగాక, నడివయస్సువారికేగాక, వయస్సు మళ్ళినవారికి కూడా ఉత్సాహవంతంకాదా? అందువల్ల ముదుసలులు కూడ స్త్రీ లందరు అందంగా, చందంగా, హుషారుగా వికవికలు, పకపకలతో వర్ధిల్లాలని కోరుకొనటం మంచిదే. యువతులు, ప్రౌఢలేగాక కొంత వయస్సు మళ్ళిన వారైనా, చివరకు వృద్ధులైనా కంటి కింపుగా పండుగల్లో, పెళ్ళిళ్ళల్లో, ఇతర శుభ సమయాల్లో ఉల్లాసంతో, సరస సల్లాపాలతో, పందిళ్ళలోనో, ఊరేగింపుల్లోనో తమ అందచందాలను వెద

జల్లటం, తమ చమత్కృతిని పంచిపెట్టటం సంతోషించవలసిన విషయమే.

అయితే ఈ బ్యాండు వాయిద్యం ఇంటింటికి తిరగటం దేనికి? అప్పుడు తెలిసింది. ఒకరింట్లో పడుచుపిల్ల రజస్వలైనదట, ఈ బొట్టుపెట్టటం ఇంటి స్త్రీలను పేరంటానికి ఆహ్వానించట మట. పైగా ఊరి మగవాళ్ళ కందరికీ భోజనాలట.

ఆడపిల్లకు 13-వ సంవత్సరములోనో 14-వ సంవత్సరము లోనో యుక్తవయస్సు ప్రారంభిస్తుంది. ఇది సృష్టివైచిత్ర్యం, ప్రకృతి స్వభావం. మనం వద్దనుకొన్నా దానంత టదే జరుగు తుంది. అయితే ఈ స్వభావపూర్వకమైన సంఘటనను చాటట మెందుకు? ఊరేగింపెందుకు? ఊరివారికి భోజనాలెందుకు? ఊళ్లో ఎవరింట్లో ఏ పిల్ల రజస్వలకాదు? సర్వసామాన్యంగా జరిగే ఈ ప్రకృతి సంభవానికి, ఋతుధర్మానికి ఈ తంతెందుకు? వేడుకకొరకంటారు. తల్లిదండ్రులకా, తాత ముత్తవలకా, బంధువులకా, ఊరివారికా? పెండ్లి అయియుంటే భార్య పెద్ద దైనదని పరిష్వంగ, రతి సౌఖ్యాల ననుభవించవచ్చుని భర్త సంతోషించవచ్చును, ఉవ్విళ్ళూరవచ్చును. ఈ రోజుల్లో బాగుగా యుక్తవయస్సు వచ్చినవారికిగాని పెళ్ళిళ్ళు చేయటం లేదుకదా! మగపిల్లల విషయంలో తంతులుచేయటం లేదుకదా! ఇక యిదెందుకు? మరిన్నీ పక్షపాతంకాదా?

ఆడపిల్లల విషయంలో సంతోషించవలసింది, ఊరేగవలసింది వాళ్ళకు తగిన వరులు దొరికి సుఖ సంసారం చేయుచున్నప్పుడే. ఇల్లలికినంతమాత్రాన పండుగకాసట్లు, పిల్లలకు కొంతవయస్సువచ్చి ప్రకృతి సహజం కన్పడినప్పుడు ఎగిరి గంతులు వేయటం అవివేకం కదా! డబ్బున్నదని ఆడంబరాలు దేనికి? అంతగా డబ్బుంటే, ఖర్చుపెట్టాలని బుద్ధిపుడితే సత్కార్యాలే లేవా? ఈవిధంగా అట్టహాసంచేస్తే తమను గొప్పవా రనుకుంటారని స్వాతిశయంకాదా? వ్యర్థ స్వాతిశయం అభినంద నానికి దారితీయదు.

శ్రాద్ధకర్మ

మానవుడు లేక మానవి చనిపోయినప్పుడు మృతదేహాన్ని దహించటమో, ఖననంచేయటమో లేక పార్సీలవలె రాబందులకు విడచిపెట్టటమో జరిపేవి అంత్యక్రియలు. చనిపోయిన వ్యక్తి ఆత్మ ఊర్ధ్వలోకానికి పోవుటకు మంత్ర తంత్రాలతో జరిపేవి ఉత్తరక్రియలు. ఆకాశంలో పుణ్య లోకాలున్నవని, ఆ పుణ్య లోకాల్లో దేవతలు దేవుళ్ళుంటారని, అంతస్తులనుబట్టి ఉత్తమ, అత్యుత్తమ, విశిష్ట, విశిష్టోత్తమ లోకాలు ఏడు ఒకదానిపైన మరొకటుంటాయని, మృతుల ఆత్మలు (సూక్ష్మరూపాలు) వారి వారి పుణ్య సంచయాన్నిబట్టి, ఈ ఏడు లోకాల్లో ప్రవేశిస్తారని, ఆ లోకాల్లో హెచ్చుతగ్గులతో శాంతి సౌఖ్యా లుంటాయని మనవారి నమ్మకం. ఆ విధముగానే మనవారు నరకలోక మనేదున్నదని, ఇక్కడ పాపాలు చేసినవారు ఆ నరకలోకానికి వెళ్ళి యముడనేవాడు విధించే నానావిధ బాధలు అనుభవిస్తారని నమ్ముతారు. ఈ యముడు దుష్టుడని, మృతుల ఆత్మలను హింసించటమే తన పరమ ధర్మంగా ఎంచుకొంటాడని, అతని బారినుండి మృతుని ఆత్మను సంరక్షించటమే చనిపోయినవాని సంతానం ధర్మమని, మంత్ర తంత్రాలతో, దాన ధర్మాలతో, బ్రహ్మణా శీస్సులతో నరకలోకాన్ని తప్పించుకోవచ్చునని మన విశ్వాసం. ఈ నమ్మకాలలో ప్రధానం బ్రాహ్మణునకు గోదానం. గోవు తోకనుపట్టుకొని ఈది వైతరణి అనే నదిని దాటవచ్చని, ఈ వైతరణి నది నరకలోకంప్రక్కన ప్రవహించే నిప్పుల ఏరని, దీనిని దాటినగాని నరకలోకాన్ని తప్పించుకొని స్వర్గలోకంలో పడటానికి వీలుండదని చెప్పుతారు. నిప్పుల గుండం లేక కందకం ఉండవచ్చును గాని ప్రవహించే నిప్పుల ఏరుండునా? ప్రవహించంది ఈదట మెట్లా? పోనీ నడచి దాటటానికి ఆవుతోక పట్టుకొన్నంత మాత్రాన గిట్టలున్న ఆవుకాళ్ళకు నిప్పు తగులకపోయినా పట్టుకొన్నవాని కాళ్లు కాలవా? పైగా సూక్ష్మరూపంతోవున్న ఆత్మకు భౌతికరూపంలోవున్న గోవు ఏవిధంగా తోడుపడుతుంది? ఒకవేళ గోవును చంపి దాని సూక్ష్మరూపాన్ని ఆత్మకు తోడుగా

పంపి నట్లయిన బ్రతికిన ఆవును కోరుకొనే పురోహితుని కే విధముగా పనికివచ్చును? పూర్వకాలంలో బ్రాహ్మణులు కూడా గోమాంసాన్ని చక్కగా పచనం చేసుకొని, లొట్టలువేసుకొంటూ ఆరగించేవారు. ఈ కాలంలో మాదిగ లని పిలువవలసిందేకదా. ఇంకొక సందేహం. మృతదేహంనుండి వేరుపడిన ప్రేతాత్మ దేహాన్ని విడచిపెట్టిన మూడురోజులవరకు చనిపోయిన స్థలములో గాఢ నిద్రావస్థలో పడియుండునని ఒక సిద్ధాంతం. చిన్నకర్మ యని చనిపోయిన రెండోనాడు చేయుదుము. ఆ కర్మకాండలోనే గోదానం చేయవలసింది. ప్రేతాత్మ భూలోకంలో ఉండగా ఆవు రెండవ రోజున వైతరణి నది నెట్లు దాటించ గలదు?

గోదానంతోపాటు పురోహితుడు భూదానం, హిరణ్య దానం కోరుతాడు. పూర్వకాలంలో దాస దాసీల దానంకూడా వుండేది. కర్మకాండను జరిపేవాని, అతని తోటివారి దురదృష్టాన మానవదానం మాసిపోయింది. ఈ దానాలన్ని ఎవరి కొరకు? నిజముగా మృతుల ఆత్మశాంతి సౌఖ్యాల కొరకా, కుటుంబాన్ని అంటకాగియున్న పురోహితునికొరకా? కర్మకాండజరిపే పురోహితుడు తన ఉదరపోషణార్థం కాక, ప్రేతాత్మను పుణ్యలోకానికి చేర్చటాని కే తంతు నడుపుచున్నాడని చెప్పగలమా? ఈనాటి పురోహితులకు చదువు సంధ్య లటుంచి సంస్కారమైన వున్నదా? వీరిలో కొంతమందికైన ఇతర దురలవాట్లతోబాటు పొగత్రాగు అలవాటున్నది. చివరకు నోరు కడుగుకొని వస్తారా? స్నాన సంధ్యాదుల నటుపెట్టి, కాళ్ళు చేతులను కడుగుకొను టటుంచి, ఉదకిన బట్టలనైనా కట్టుకొని వస్తారా? నిజానికి మృతి సంబంధమైన కర్మకాండలోనే ఇంటి పురోహితుడు ఎక్కువ శ్రద్ధ వహించాలి. దీనిలోనే అతనికి చాల ఎక్కువ ముట్టుతుంది. శ్రద్ధ వహించు టటుంచి, ఎక్కువ ముట్టుతుంది కనుక పెండ్లికంటె చావునే పురోహితుడు కోరుకొంటాడని కొందరి ముసలివాళ్ళ అభిప్రాయం. నా కొక సంఘటన గుర్తుకు వస్తున్నది. ఒక ఇంటిలో ఒక యువకుడు చనిపోయాడు. కర్మకాండ పూర్తయినతర్వాత పురోహితుడు వెళ్ళిపోవుచుండగా ఆ ఇంటి ముసలమ్మ ఆయనను తిట్టట మారంభించింది. నా కాశ్చర్యంవేసి, ఎందు కట్లు తిడు

తున్నదని ప్రక్కవారి నడిగాను. డబ్బుకాశపడి ముసలితనంలో వున్న తన చావునేగాక ఇంట్లోని పడుచువారి చావునుకూడా కోరుకొంటాడేమోనని అతనిని నిరుత్సాహపరచటానికి ముసలమ్మ తిట్టుతున్నదన్నారు.

ఇక కర్మచేసేవారు ప్రేతాత్మ ముక్తినిపొంది, పుణ్యలోకానికి చేరేటట్లు నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో శ్రాద్ధకర్మను చేయటంగాక ఆచారప్రకారం చేయాలని లాంఛన జరిపినట్లుగా చేయటం జరుగుచున్నది. వీరి శ్రద్ధాభక్తులు, పెద్ద పెద్ద పందిళ్ళు వేయటంలోను, బంధువులను ఊరివారినేగాక తెలిసినవారిని, తెలిసియున్నా రనుకొన్నవారిని ఆహ్వానించటంలోను, సుగంధ ద్రవ్యాలతోనిండిన భోజనపదార్థాలను, పిండివంటలను తయారు చేయించటంలోను నిమగ్నమౌచున్నవి. గొప్పగా చేశారని వారు వీరు అనుకోవాలని వీరి తహ తహ. తా మెంతో ఖర్చుపెట్టి ఎంతమందికో భోజనాల నమర్చామని వీరి దాంభికం, దిలాస. అంతే. మృతునిఆత్మ పుణ్యలోకానికి వెళ్ళాలనే విషయం వాళ్ళకు గుర్తుండదు, పట్టదు.

మృతునిఆత్మ తానువెళ్ళిన లోకంలో ఎంతకాలం ఉంటుందో చెప్పలేము. మన హిందువుల నమ్మకం ప్రకారం గిట్టినది తిరిగి పుట్టుటకొరకే. "ప్రాణిలోకంబు సంసారపతిత మగుట, వసుధలో గిట్టి పుట్టనివాడు కలడె" అని భర్తృహరి వచించాడు. కాబట్టి ఏళ్ళతరబడి తద్దినాలు పెట్టటం అవసరమా? తండ్రో తల్లో లేక రక్తం పంచుకొన్న సోదరుడో, సోదరియో మరి ఏ యితరబంధువో, మన ఆప్యాయతకు, భక్తికి, పూజ్యతకు గురియైన వారి నెల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనుట దానంతటదే జరుగుతుంది. అట్లు జ్ఞాపకముంచుకొనుట ధర్మం కూడా. కాబట్టి తద్దినాలు పెట్టకపోయినా వారి మృతదినాన్ని గుర్తుంచుకొని మన ఆత్మీయభావాన్ని ఏదో ఒక రూపాన వెలిబుచ్చుట చాలును. శుష్కవ్రయం తప్పిపోతుంది.

చనిపోయినప్పుడు పిండాలు వేయుదుము. కర్మలందు, తద్దినాలందు, పిండివంటలు పాయసాలు సమర్పించుకొందుము మృతుని కిష్టమైన పదార్థాలను వండి ఆరగింపజేయుదుము. ఇట్టివి

అవసరమా, సూక్ష్మరూపం వీని నారగించగలదా? అను సందేహం కల్గవచ్చును. దీనికి (శ్రీ షిరిడీ సాయిబాబాగారి ఉదంతం ఒకటి జ్ఞప్తికి వచ్చుచున్నది. ఒక భక్తునితో ఒకనాడు తన కానాడు లడ్డు మిఠాయి కావాలని (శ్రీ సాయిబాబా చెప్పారట. ఆ భక్తుడు సంభ్రమ, సంతోషాలతో కావలసిన వస్తువులను సేకరించుకొని, దగ్గరనుండి అతిశ్రద్ధతో మిఠాయిని తయారుచేయించి ఒక పళ్ళెంలో బాబావద్దకు తీసుకొని వెళ్ళినాడట. బాబా ఆ పళ్ళెరాన్ని ఆ ప్రక్క నుంచమని చూపించాడట. ఆ ప్రక్కపెట్టి, బాబా ఎప్పుడు వానిని ఆరగిస్తారో అని కాచుకొని కూర్చున్నాడట. ఎంత సేపటికీ బాబా ఆ పళ్ళెరంవంకనైనను చూడలేదట. భక్తుడాందోళనపడి స్వామీ, మీరు కోరారని ఎంతో భయభక్తులతో దగ్గరుండి చేయించి తీసుకొనివచ్చాను. మీరు వానివంక చూడటంకూడా లేదాయె. స్వామీ, ఇదే మిటని వాపోయాడట. (శ్రీ సాయిబాబా నవ్వి అటువెళ్ళి చూడమన్నారట. వెళ్ళి చూడగా లడ్డులనిండా చీమలు, ఈగలు మూగుకొని ఉన్నవట. బాబా 'ఇంకేమి నేనారగించుట లేదనుచున్నావేమి? ఆ చీమలు, ఈగలు నేనేకదా' అన్నారట. మృతులఆత్మలు లేక సూక్ష్మ రూపాలు, పదార్థాలను భౌతికశరీరులు తినినట్లు తినవుగాని, పదార్థాల సుగంధాన్ని, సౌరభాన్ని ఆఘ్రాణిస్తవి. ఆ ఆఘ్రాణమే వాని భోజనమని తెలిసినవారు చెప్తారు. పితృలోకమున్నదని, పితగు లందు నివసించుచు మన నైవేద్యాలను కోరుకుంటారని నమ్మేవారికిది వింతగా తోచదు. సిసలైన భక్తుడు రాతివిగ్రహం చేత వట్టి సువాసననేగాక సాక్షాత్తు ఘనపదార్థాన్ని స్వీకరింప జేశాడని కాళహస్తీశ్వరుడు-బోయ భక్తుని కథ చెప్పుచున్నది. కాబట్టి ఇట్టివానిలో నిజంలేదని చెప్పలేము.

కాని ధర్మసందేహాలుండుచునే ఉండును. పుణ్యలోకాలకు పోయినవారికి ఆకలి దప్పులుగాని, భౌతికవాంఛలుగాని వుండునా? కర్మానుభవమునకు అనుభవించవలసిన లోకానికి పోయినప్పుడు ఆ కష్టాల ననుభవించాలికదా! లేక పోతే, కర్మ విమోచనంకల్గదుకదా! అటువంటప్పుడు ఈ లోకంలోనివారము

చేసే కర్మకాండలు, సమర్పించే తిలోదకాలు వారి కర్మాను భవాన్ని తప్పించగలవా, ఉపశమనం చేయగలవా ?

మన శ్రాద్ధకర్మలలోని సత్యాసత్యాలటుంచి, నేను ముఖ్యంగా చెప్పేది - మృతులయందు నిజమైన పూజ్యభావమో, శ్రద్ధా భక్తులో, ఆప్యాయతో ఉండాలిగాని తమకు డబ్బున్నదని డాంబికానికిపోయి. ఊరబంతులుపెట్టి విందుభోజనాలు సమర్పించటం కాదని, గొప్పకు గోదానాలు, భూదానాలు వగైరా చేయటం అనవసరమని, పేద బిక్కికి సాయపడుట మంచిదికాని దుబారా ఖర్చులు కూడవని, డబ్బున్నవారు సత్కార్యాలు చేయటాని కనేక మార్గాలున్నవని, సత్కార్యాలవల్ల ప్రజా క్షేమం, దేశసౌభాగ్యం వర్ధిల్లుతవిగాని అవసరంలేనివారికి షడ్రసోపేత భోజనాలవల్ల డబ్బు దుబారా అవడంతప్ప ఏ మేలు కల్గదని విన్నవించటమే.

౨

రంకు - బొంకు

రామాయణమంతా రంకు, భారతమంతా బొంకు అంటారు. కాని నా బుద్ధికి రామాయణమంతా బొంకు, భారతమంతా రంకు అని తోస్తున్నది. ఇక్ష్వాకు తెగలో రఘువంశమందు దశరథుడనే రాజుండవచ్చును. అతనికి పది రథా లుండవచ్చును. కాని అతడు చక్రవర్తిగాని, మహారాజుగాని కాడు. కోసలదేశమనే చిన్న రాజ్యానికి భర్త. అయోధ్య అనే కొద్ది పట్టణానికి కర్త. ఆయనకు రాముడనే కుమారు డుండవచ్చును. అతడు బలశాలియై, విలువిద్యలో ప్రవీణుడై యుండవచ్చును. కాని ఆ కాలపు రాజకుమారులలో ఆయ నొకడు. వాల్మీకి పొగడినంత, చిత్రించి నంత గొప్పవాడై భగవ దవతార మైతే వేదాలలో పేర్కొన బడేవాడు, పొగడబడేవాడు. కాని ఆయన పేరైనా వేదాల్లో కన్పడదట. అందువల్ల వాల్మీకి శ్రీరాముడు బొంకు అనుకోవాలి.

కైకేయి దుష్టురాలని, అన్యాయంగా వరాల నెపంతో దశరథుని మోసంచేసి భర్తను భరతుని యువరాజును చేయండని బలవంత పెట్టిందని వాల్మీకి చెప్పుతాడు. కౌసల్యకు, సుమిత్రకు సంతానం కల్గకపోతే వృద్ధాప్యం సమీపించుతున్న దశరథునకు కైకేయికి పుట్టిన వానికి రాజ్యమిచ్చే షరతుమీదనే కేకయ రాజు తన కూతురుని దశరథునకు భార్యగా నిచ్చాడు. ఇది వాల్మీకియే రామునిచేత ఒక సందర్భంలో అనిపించాడు. కాబట్టి బలవంతం మీద దశరథుడు భరతునకు రాజ్య మివ్వటానికి ఒప్పుకొన్నాడనటం ఇంకొక పెద్ద బొంకు.

సీత నాగలి చాలులో జన్మించిందని, శివుని విల్లును అనేక వేలమంది మోసుకు రావలసివచ్చినంత బరువు కలదని చెప్పటం మరొక బొంకు.

రాముడు ఏకపత్నీవ్రతుడని చాటటం పండిత కొత్త సత్య నారాయణచౌదరిగారి కథనం ప్రకారం పెద్ద బొంకు. ఆయనకు సీత గాక నూరుకు పైబడ్డ భార్యలు, ఉపభార్య లుండినారట. జటాయువు పక్షి, శూర్పణఖవికృతస్వరూపం గల రాక్షసి అనటం బొంకే. ఒక తెగ మనుష్యులు పక్షిముకుటాలను ముఖమునకు, శిరస్సుకు తగిలించుకొని పక్షివలె నరచుచు గారుడులమని చెప్పు కొనేవారని, ప్రస్తుత గోవాప్రాంతంలో నివసిస్తూ ఉండేవారని కులపతి మున్షీ గారు తమ "కృష్ణావతారం" లో చెప్పారు. జటాయువు ఆ తెగకో అటువంటి మరొక తెగకో చెందిన మర్త్యుడు గాని పక్షికాడు. శూర్పణఖ రావణుని చెల్లెలు. రావణుడు పౌలస్త్యుడు, రావణబ్రహ్మ యని పేరొందినవాడు. రూపవంతుడు. శూర్పణఖ వికృతాకారి అనటం అసంబద్ధం.

రాముని పాదం తగిలినంతనే రాయిగా పడియుండిన అహల్య తిరిగి మానవరూపం ధరించినదనటం, ఏ పుష్పకవిమానం లేకనే రావణుడు ఆకాశమార్గాన సీత నెత్తుకొని పోయాడనటం, హనుమంతుడు లంఘించి సముద్రాన్ని దాటినా డనటం పెద్ద బొంకుల క్రిందకే వస్తవి.

రావణుని పొట్టలో అమృతభాండ ముండినదని, నరికిన తలలు వెంటనే మొలుచుకు వచ్చినవని, కుంభకర్ణుని చెవిలో సలసల కాగిన సీసాన్ని పోస్తేగాని అతడు నిద్రనుండి లేవలేదని, భగభగ మండే మహాగ్నిలో సీత దూకిందని చెప్పటం అతిశయ రూపాన బొంకులే. రావణునకు పదితల లుండలేదు. పదితలలుగా చూపెట్టే శిరస్త్రాణాన్ని ధరించియుంటాడు. శిరస్త్రాణం పడిపోతే తిరిగి ధరించ టమో, పగిలిపోతే క్రొత్తదాన్ని పెట్టుకోవటమో చేసి యుంటాడు. శత్రుభయంకరానికి భ్రమను కలిగించి, అసలు తలకు కొంత సంరక్షణ కల్పించటానికి వికృతము, భయానకము నైన శిరస్త్రా ణాన్ని ధరించియుంటాడు. ఇప్పటికిని కొన్ని ఆటవిక తెగలు

అడవిదున్నకొమ్ములు వగైరా తలకుపెట్టుకొని, ముఖానికి వికృతంగా రంగులు వేసుకొని, భీషణరూపం తాల్చుతారని మనకు తెలియుచున్నది. రావణు డనగా భయంకరముగా నరచువాడని కవిరాజుగారి ఉవాచ. దశగ్రీవుడు, దశకంఠుడు అను పదాలకు పలువిధములుగా మాట్లాడువాడనియు, పదిభాషలు తెలిసిన వాడనియు నర్థము చెప్పువారున్నారు. అతనికి పదితలలు ఉండిన వనటం తప్పక బొంకు.

ఇన్ని బొంకులతో కూడినది రామయణం. దీనిలో రంకు లున్నట్లు చెప్పలేము. రంకు వలన రాముడు పుట్టలేదు. రాముడు ఏ మునిపత్నితోను, ఆటవిక స్త్రీలతోను రంకు చేయలేదు. శూర్పణఖ రంకును కోరలేదు. పెండ్లిని, ప్రేమను కోరింది. సీత విషయంలో ఏ రంకుకు తావులేదు. వాలి సుగ్రీవుల విషయంలో వాళ్ళ ఆచారం ప్రకారం సోదరునిభార్యను వాని మృత్యానంతరం బ్రతికియున్న సోదరుడు భార్యనుగా స్వీకరించవచ్చును. సుగ్రీవునిభార్య రుమ విషయంలో వాలి అధర్మ మాచరించాడని రాముడనినా, ఆర్యధర్మాలు అనార్యుడగు వాలికి వర్తించినట్లు లేవు. తనకు ద్రోహము తలపెట్టి, తన చావు నిర్ధారణకాకనే బిలద్వారం మూసి, తన భార్య తార నపహరించిన సుగ్రీవునికి ప్రతీకారం కావచ్చును. యుద్ధంలో విజితుడై పారిపోయిన వాని నితరసొత్తును గ్రహించినట్లే రుమను గ్రహించి యుండవచ్చును. వనాలలో నివసించేవారి ఆచార ధర్మాలను, నగరాలలో నివసించేవారి ఆచార ధర్మాలతో పోల్చలేము. సోదరునిభార్యను వివాహమాడుట ఇప్పటికిని కొన్ని తెగలకున్నది. అందువలన వాలి సుగ్రీవుల నడవడి రంకు క్రిందకు రాదు. ఇక రావణుని విషయంలో రావణుడు సీత నెత్తుకొని పోయినది రంకు కొరకు కాదు. తన చెల్లెలు శూర్పణఖకు రాముడు చేసిన, చేయించిన క్రూరాపమానానికి తన దక్షిణాపథరాజ్యాన్ని ఆక్రమించుకొను ప్రయత్నం, తత్ప్రయత్నంలో భాగంగా తన తమ్ములైన ఖరదూషణాదులను సంహరించటం ఆదిగాగలవాని కెదురుదెబ్బగా, యుద్ధానికి సవాలుగా రావణుడు సీత నపహరించాడు. నిజముగా సీతకు మానభంగం చేయదలచుకొంటే మహాబలసంపన్నుడు,

ఆంతరంగిక సంపత్తుకలవాడు. ఇంద్రాది దేవతలచేత ఊడిగం చేయించుకొనేవాడు చేయలేని పనిలేదు. ఆ ఉద్దేశమే ఉంటే తన శుద్ధాంతంలోనే సీతనుంచేవాడు. దూరముగానున్న రమ్యోద్యాన వనంలో అన్ని సౌకర్యాల నమర్చి, తన సోదరుడైన విభీషణుని పుత్రిక త్రిజటను ఆమె సేవకొర కుపయోగించేవాడుకాడు. రావణునకప్పు డించుమించు వృద్ధాప్యం సమీపించి యున్నది. సీతవంటి సుందరాంగు లెంతమందో అతనిని వలచి వచ్చి ఆయన శుద్ధాంత మహాసౌధములో నుండినట్లు సీతాన్వేషణకొరకు లంక జొచ్చిన హనుమంతుడు కనుగొని దిగ్భ్రమచెందినాడు. అందు వలన రావణుడు రంకు కొరకు సీత నెత్తుకొనిపోయినా డనటం వెర్రితనం. పై కారణాలవల్ల రామాయణమంతా బొంకే కాని రంకుకాదు.

ఇక భారతమంతా రంకే. పారాశర్యుడు (వ్యాసుడు) రంకుకు పుట్టినవాడు. ధృతరాష్ట్రుడు, పాండుడు రంకుకు పుట్టినవారు. పంచపాండవులు, కర్ణుడు రంకుకు పుట్టినవారు. రంకుకు పుట్టక పోయినా బోగం దాని (అప్సరస) యందు సమ్మోహితులై విడువబడిన రేతస్సునుండి పుట్టినవారు ద్రుపదుడు, ద్రోణుడు, కృపుడు. ఇక శ్రీకృష్ణుని రంకులనుగురించి ప్రత్యేకముగా చెప్ప నవసరంలేదు. అర్జునుడు ఉలూపి, చిత్రాంగదలతో రంకు సాగించాడు. భీముడు హిడింబకు రంకు మొగుడే. ద్రౌపది అసలు మౌద్గల్యుడనే కుష్ఠురోగి ముని భార్య అని, ఇంద్రసేననే పేరును కల్గియుండినదని పెండ్యాల వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు తన మహాభారత చరిత్రలో వ్రాశారు. భీష్ముడు గంగకు పుట్టిన వాడట. గంగాతీరమున నివసించు పల్లెవనితను శంతనుడు మోహించగా భీష్ముడు జనించాడు. రాజులకు గాంధర్వవివాహ పద్ధతున్నది. అందువలన సిసలైన రంకు కాకపోవచ్చును. అయినా భీష్ముడు, ద్రోణుడు, కృపుడు, ద్రుపదుడు అన్యజాతి స్త్రీలకు పుట్టిన సంకీర్ణులే. భీష్ముని మా టటుంచి ద్రుపద, ద్రోణ, కృపులు ఎట్టి వివాహపద్ధతి ననుసరించకయే తాత్కాలిక మనో వికార మోహావేశ సంభూతులు.

శంతనుడు భారత కురు సంఘానికి మూలపురుషుడు. భీష్ముడు మూల స్తంభం. భారతవంశంవాడనని, సుక్షత్రియుడనని చెప్పుకొనిన శంతనుడు పల్లెపడుచుతో రమించాడు. ఆ సంపర్కం వల్లనే భీష్ముడు కలిగాడు. శంతనుడు అంతటితో ఆగక మరొక పల్లెపడుచును, అందులో వివాహం లేకనే కన్యాత్వం పోగొట్టుకొని బిడ్డను కనియుండిన ఆమెను చేపట్టినాడు. అంతటితో చంద్రవంశ క్షత్రియుల మని చెప్పుకొనే రాజవంశం సంకరమైంది. ఆ సంకరం అంతటితో ఆగలేదు. శంతనునకు పల్లెస్త్రీవల్ల కల్గిన విచిత్రవీర్యుని భార్యలు సంకరుడైన వ్యాసునితో రంకు చేసి ధృతరాష్ట్ర, పాండులను కన్నారు. ఈ రంకుతనం, సంకరం పాండుని పత్నులమూలంగా కొనసాగింది. ఆదిలోనే సూర్యుడనే వానితో రంకుజేసి, చాటుగా కర్ణునికని, ఏటిలో పారవేసిన కుంతి తిరిగి యముడు, వాయువు, ఇంద్రులతో రంకుజేసి యుధిష్ఠిర, భీమార్జునులను కన్నది. తనను దెప్పునని కాబోలు తన సవతి మాద్రిని అశ్వినులతో రంకు చేయించి నకుల సహదేవులను కనిపించింది. ఈ రంకు సంతానమే కురుక్షేత్రయుద్ధానికి కారకులు.

ధృతరాష్ట్రుడు రంకుకు పుట్టినా, సంకీర్ణుడైనా దుర్యోధనాదులు సుక్షత్రియరాజ పుత్రియు, మహాపతివ్రతయు నగు గాంధారికి జన్మించినవారు. అయినా రంకువంటి మోహావేశానికి కల్గిన ద్రోణ కృపుల, అచ్చంగా రంకువల్ల పుట్టిన కర్ణుని భుజబలంమీద, అస్త్ర శస్త్ర పావీణ్యంమీద ఆధారపడినారు. పాండవులు రంకులరాజగు కృష్ణుని కపటోపాయాలమీద ఎక్కడనుండో, ఏ జాతివాడో బైటపడిన ధృష్టద్యుమ్నుని ఊహా చతురతమీద ఆధారపడి యుద్ధానికి దిగినాను.

ఈ పైవిగాక భారతం రంకు కథలతో నిండియున్నది. గాలవుడు మాధవికథ, నిగమశర్మ కథలవంటి కథలెన్నో ఉన్నవి. మూలకథ సాగిపోయినా చిలవలు, పలవలతో రంకు సంకరాలు భారత గ్రంథంలో నిండుకొని యున్నవి.

అయితే కావ్యోద్దేశాన్ని నెరవేర్చుట కుపయోగించిన అతిశయోక్తులు బొంకులగునా, స్త్రీ పురుష సంయోగం రంకు అగునా అను సందేహం పాఠకులకు కల్గవచ్చును. ఆదర్శ దంపతులను సృజించి ప్రజలకు నీతిబోధ చేయాలని వాల్మీకి సీతారాములను కల్పనచేసి యుండవచ్చును. ఆ దృష్టిప్రకారం రామాయణం మహా కావ్యమేగాక ధర్మశాస్త్రం కూడా. ఆ విషయమెట్లున్నా అది రంకు పురాణం కాదని నా వాదన. ఆలాగే అప్పటి కాలం ఆచారాలను, ధర్మాలను, రాజుల మనస్తత్వాలను, ప్రజా జీవిత పద్ధతులను, సాంఘిక పోకడలను వివరించేది మహాభారతం కావచ్చును. అది బొంకులతో కూడినది మాత్రం కాదు.

రసం - నీరసం

రసం అనగా మద్రాసు చారు, నీరసం అనగా బలహీనత మనకు ముందుగా తట్టేవి. కాని రసానికి అనేక అర్థాలున్నవి. పాదరసం మొదలుకొని ఇంగిలీకం వరకు, నీరు మొదలుకొని పాలు నేయి వరకు, అమృతం మొదలుకొని పసరు విషం వరకు, బంగారం మొదలుకొని స్వరం, వావిలిచెట్టు వరకు, వీర్యం మొదలుకొని బోళం వరకు అర్థము లున్నవి. అయితే ఈ అర్థాలన్ని మనకు తోచవు. సామాన్యులకు మద్రాసు చారు చప్పున తోస్తుంది. భాషాజ్ఞాన మున్నవారికి, కావ్యపరిచయ మున్నవారికి శృంగారాది రసాలు అందం, చందం, అనురాగం, ప్రేమ వగైరా హృదయరంజకమైనవి స్ఫురిస్తవి. రసం అనగా రుచి అని అర్థ మున్నదికదా. శృంగార రసానుభూతి హృదయాహ్లాదకరమేగాక నాయికసౌందర్యాలోచన మెదడుకుకూడా రుచి కలిగిస్తుంది.

నీరసం అనగా బలము లేనిదియేగాక సారము, సరసము లేనిదని, శృంగారాది కావ్యరసము లేనిదని అర్థము. అయితే ఈ పదానికి దానిమ్మ అని అర్థమున్నదని నిఘంటువు చెప్పుచున్నది. దానిమ్మపండు రసం అనగా రుచిలేదా? పుల్లదానిమ్మలో

పులుపు, తీయదానిమ్మలో తీపి రుచి ఉన్నదికదా, రసానికి వ్యతిరేకంగా నీరసమైతే, రసం అంటే పసరు లేక విషంకూడా అయినప్పుడు తీపి దానిమ్మ అమృతంగాను, పులుపు దానిమ్మ నీరు లేక పాలు ఎందుకు కాగూడదు ?

రసం అనగా వీర్యం అని అర్థమున్నది. నీరసానికి బలహీనత కదా సామాన్యార్థం. బలహీనునకు వీర్యశక్తి ఉండదుకదా. బలవంతునకు వీర్యశక్తి లేకపోవచ్చును. కాని దేహదార్ఢ్యము లేకపోతే నరములు కృశించియుండునుకదా. నరాల నిస్సత్తువ నిర్వీర్య మూలకముకదా. కాబట్టి నీరసం అంటే శరీర దుర్బలత్వమే అనుకోవాలి.

రస మనగా అందచందాలు. నాయకీ నాయకులకు అందచందా లుండాలి. వారి కనురాగముండాలి. ప్రేమ భాసిల్లాలి. ఒక ప్రక్క వీర్యము, రెండోప్రక్క లాలిత్యం శృంగార ముండాలి. వారి మనస్సులు అమృతమయంగా ఉండాలి. వారిని ప్రతిఘటించే వారిలో పసరు, విషం ఉండాలి. అప్పుడుగాని కావ్యం బంగారు మెరుగులతో భాసించదు. పాలు, నేయి, కర్పూరం, కుంకుమపువ్వు వగైరా సమ్మిళిత షడ్రసోపేత భోజనం రుచి ఉండదు.

రసానికి ఉత్తమస్థానం కావ్యం. అందుకనే "రసాత్మకం కావ్యం" అన్నారు. ఉత్తమకావ్యాన్ని రచించిన కవి రస సిద్ధుడు. "రస సిద్ధాః కవీశ్వరాః". రసానుభూతిలేనిది కవికాడు. రసమయంకానిది కావ్యంకాదు. కాబట్టి కవి కావాలన్నా, మంచికావ్యాన్ని వ్రాయాలన్నా రసము ప్రధాన మవ్వాలి. 'రస గంగాధరం' రమణీయాత్మక ప్రతిపాదకము (శబ్దము) కావ్యం అంటుంది. రసం లేనిదే రమణీయత ఉండదు. కాబట్టి కావ్యం, "కవి విరచితం కావ్యం". రస విహీనమైతే రమణీయాత్మకం కాదు. దానిని రచించినవాడు కవికాదు. కావ్యం లేనిదే కవికాడు. కవిలేనిదే కావ్యంలేదు.

రస మనగా శృంగార రసమేకాదు. భీభత్సం, రౌద్రం కూడా రసాలే. అయితే హృదయాహ్లాదకరమైనది శృంగార

రసమే. స్త్రీ పురుషుల అన్యోన్యానురాగమును చెప్పినదే (తెల్పినదే) శృంగారం. స్త్రీ పురుషుల సంయోగము ప్రకృతి మూల సిద్ధాంతం. పరస్పరాకర్షణలేనిదే సంయోగము సంభవించదు. ఆకర్షణను కల్గించునది అన్యోన్యానురాగం. నాయికానాయకుల శృంగారచేష్టలవలన అన్యోన్యానురాగం సంభవించును. కాబట్టి శృంగారానికి రసాల్లో ప్రథమస్థానం వచ్చింది.

శృంగారరసం తర్వాత ఉన్నతస్థాయి నాక్రమించుకొన్నది కరుణరసం. శృంగారరసంవలె హృదయరంజకత్వము నివ్వదు. కాని హృదయాన్ని ఆర్ద్రముచేసి తోటిమానవులందుగాని జంతు జాలమునందుగాని జీవముగల పురుగునందుకూడ దయ, దాక్షిణ్యం, సాయంచేయాలనే కాంక్ష, కష్టనష్టాలలో ఆదుకోవాలనే కోర్కె, ప్రమాదమునుండి రక్షించాలనే ఆతురత, వాళ్ళ దుస్థితికి జాలి, జాలినుండి ఉద్భవించు ఆప్యాయతకు కరుణరస ప్రధానం. పురాణపురుషుల విషయమెట్లున్నా చారిత్రికకాలంలో గౌతమ బుద్ధుడు, ఏసుక్రీస్తు కరుణస్వరూపులు. ఆధునికులలో రామకృష్ణ పరమహంస, వివేకానంద, షిరిడి సాయిబాబా వంటి మహాత్ములు కరుణామయులు. కావ్యాలను తీసుకొంటే భవభూతి ఉత్తర రామాయణం కరుణరసపూరితం. రావణ బంధిత సీత, అడవిలో విడచిపెట్టబడిన నిండుగర్భవతి సీత ఎవరి కరుణను ఉద్వేగింప చేయదు?

రసాలు తొమ్మిదని పెద్దలన్నారు. శృంగార, కరుణరసముల వలె హాస్యరసం మిక్కిలి ఇంపైనది. సున్నితమైన హాస్యం, సరసమైన హాస్యం హృదయాన్ని రంజింపచేస్తుంది. వికటమైన హాస్యం మోపైనదేగాక హృదయాన్ని బాధిస్తుంది. ప్రియుల నర్మగర్భములు, మిత్రుల భావోక్తులు, చెలికాండ్ర వేళాకోళాలు, సరసములుగా, సున్నితములుగా, సంతోషాన్ని రేకెత్తించేవిగా ఉంటవి. బావమరదుల సరసాలని ఈ రోజుల్లో చెలామణి అయ్యేవి మోటుగా, విరసంగా వుంటవి. నిజాని కవి దెప్పుల ఎదురు దెబ్బలు. లోపల ఏదో విధమైన క్రోధము మోటు మాటలతో, సరసమను నెపముతో బైటబడుతుంది. ఇట్టి విరసమైన హాస్యాన్ని ఉపయోగించేవారు సూటిగా తిట్టలేక

ఈ నెపంతో ఈర్ష్య, విరోధభావం సాధించుకొంటారు. ఇట్టివారు నీచాతి నీచులక్రింద జమ. సున్నితహాస్యం ఏ గ్రంథంలో మిళితమై యున్నదో నాకు గుర్తుకు రావటంలేదు. జగ్గకవి 'చంద్రరేఖా విలాపం' మోటు హాస్యానికి, వికట హాస్యానికి తారాకాణ మంటారు.

శాంతంకూడా నవరసాల్లో ఒకటి. ధర్మజుడు శాంతమూర్తి అంటారు. ఆయనది కపటశాంతం. బుద్ధుడు కరుణకేగాక, శాంతానికి కూడా నిలయం. ధ్యాననిమగ్నుడైన బుద్ధదేవుడు చూపరులకు శాంతస్వరూపుడు. అయితే పురాణ పురుషులైన విష్ణువు, మహేశ్వరుడు కూడా శాంతస్వరూపులుగానే చెప్పబడ్డారు. "శాంతాకారం భుజగశయనం" అని విష్ణువును, "శాంతం పద్మాసనస్థం శశిధర మకుటం" అని శివుని స్తోత్రించుచున్నాము. దీనిలో విశేషం యోగనిద్రలో (ధ్యాననిమగ్నతలో) వున్న మహాత్ములందరు శాంతమూర్తులే. నాయకుడో నాయికో శాంతస్వరూపుడు, స్వరూపి కల్గిన కావ్యంకంటె, కావ్యకథ శాంతమయంగా వుంటుందనుకోవాలి.

పై నాల్గేగాక వీర, అద్భుత, రౌద్ర, భయానక, బీభత్సాలనే కావ్యరసాలున్నవి. వీరానికి అభిమన్యుని, అద్భుతానికి ఘటోత్కచుణ్ణి, రౌద్రానికి వీరభద్రుణ్ణి, భయానకకు, బీభత్సానికి భీముణ్ణి చెప్పవచ్చు ననుకొంటాను.

రసం అంటే పొగరని అర్థముండవచ్చును. "చూడు నీ రసం పిండుతాను" అని విరోధితో అంటాము. అనగా నీ పొగ రణగ ద్రొక్కుతా నని అర్థము. రసం అంటే సారం అని అర్థం కావచ్చును. ఇటుతే, ఆ మామిడిపండును దాని రసం గిన్నెలో పిండి నీకిస్తాను లేక ఈ పండు మిక్కిలి రసంగల పండు లేక దీని రసం పీల్చు అని అనటం మామూలు. కాబట్టి రసం నానార్థ ప్రదం. రసం జవసత్వ సమేతం. కావ్యాల్లోనే గాక మామూలు ప్రవృత్తులలోకూడ మనము కోరవలసినది, అపేక్షించవలసినది రసమే. నీరసం ఎప్పుడూ విసర్జించవలసినదే. ఎందువల్ల దానిమ్మను నీరసమన్నారో తెలియదు. నిజానికి దానిమ్మకు

నీరసానికి చుక్కెదురు. శ్రేష్ఠమైన తీపిదానిమ్మ రసం రక్తాన్ని శుద్ధిచేసి, వృద్ధిచేసి బలవర్ధకమౌతుంది. పుల్లదానిమ్మకూడా ఆరోగ్యకారకం. కొన్ని మందుల్లో విడువరానిది. పండు కాదు, వట్టి చెట్టే అంటారా, చెట్టునుబట్టేకదా పండు స్వభావం? పైగా దానిమ్మచిగురు వగరు వైద్యాని కుపయోగిస్తుంది. కాబట్టి నిఘంటు వేమిచెప్పినా నీరసం, నీరసమే. అది ముమ్మాటికి వద్దు.

క్షేత్రయ్య 307-వ జయంత్యుత్సవం

క్షేత్రయ్య సంగీత నృత్య కళాశాల తృతీయ వార్షికోత్సవం

మొవ్వ, కృష్ణాజిల్లా

క్షేత్రయ్య కృష్ణాజిల్లా, దివితాలుకా మొవ్వ గ్రామంలో 307 ఏండ్లనాడు జన్మించాడని మనవారి నమ్మకం. ఆయన దక్షిణ దేశ యాత్ర చేయుచూ తంజావూరువంటి సుప్రసిద్ధ సంగీతకళా శిక్షణ కేంద్రాలలో తన సంగీతాన్ని వృద్ధిపరచుకొన్నాడని, పద సంగీతాన్ని చేపట్టి తారాపథం అందుకొన్నాడని, తన సంగీతాన్ని మొవ్వ శ్రీ వేణుగోపాలస్వామిపరంగా జావళీ రూపంగా వెల్లివిరియజేశాడని మనం నమ్ముచున్నాము. ఆంధ్ర ప్రజానీకాన్నేగాక దక్షిణాపథమునంతను తన పద సంగీతం చేత త్యాగరాజు, అన్నమాచార్యులవలె ఉత్తేజితం చేశాడని, తన ధోరణిలో ధ్రువతారగా వెలిగాడని మనము విశ్వసించుచున్నాము. ఆయన పదసంగీతం ప్రజాదరణ పొందిందని, సామాన్య జనులకు త్యాగరాజు సంకీర్తనలు, అన్నమాచార్యుని భక్తి ధోరణులు అర్థంకావు గాని క్షేత్రయ్య జావళీలు, శృంగార పోకడలు అందరికి అర్థమౌతవని మనము కొనియాడుచున్నాము.

అయితే సామాన్య ప్రజలనటుంచి విద్యాగంధంగలవారు కూడ క్షేత్రయ్య శృంగారజావళీలు భగవత్ప్రేరితములని, అవి తన ఇష్టదైవమైన మొవ్వ శ్రీ వేణుగోపాలస్వామి స్తోత్రములే అని తలంచుచున్నారు. అట్టి అభిప్రాయం సరికాదని నా నమ్మకం. మకుటం మొవ్వ వేణుగోపాలస్వామియే అయినా విషయం స్త్రీ

పురుష లైంగిక సంబంధమైనది. సర్వ జీవరాసులను ఆకర్షించేది. వానికి గాఢ తృప్తినిచ్చేది మైథునం. మృగాలుకూడ మైథునానికి దారితీసే శృంగారచేష్టలను అవలంబిస్తవి. మానవుని సంగతి వేరే చెప్పనక్కరలేదు. క్షేత్రయ్య తన (శృంగార) జావళీలద్వారా మానవ స్వభావాన్ని చిత్రించాడు.

సామాన్య మానవజీవితం నిస్సారమైనది. వ్యథలతో, నిరుత్సాహంతోనో మందకొడిగా నడచునది. అది ఉత్తేజమవ్వాలంటే "రసము" జీవితానుభవంలో ప్రవేశించాలి. రసములలో ప్రధానము, ఉత్తమము అయినది శృంగారం. శృంగారం స్త్రీ పురుషుల అన్యోన్యానురాగమునకు, జీవిత మాధురికి మూలము. శృంగారం దంపతులను పునీతులను చేయుటయేగాక సంతోషప్రద గృహజీవనమునకు, జీవితమునకు, తృప్తికి కారకమౌతుంది. ఉల్లాసంతో, తృప్తితో కుటుంబంసాగిన ఆ సుఖమయవాతావరణంలో పిల్లలు ఆడుచూ, పాడుచూ వర్ధిల్లుదురు. ఇట్టి వికాసమునకు పునాదివేయుటయేగాక ఉన్నత సౌధమును నిర్మించినవాడు క్షేత్రయ్య.

సంగీతం అన్నికళల్లోను శ్రేష్ఠం. కవిత్వం, చిత్రలేఖనం, నటన, నాటకం, నృత్యంకంటె సంగీతం ప్రజాసామాన్యానికి సులువుగా అర్థమౌతుంది. వారి నాకర్షించి అనురక్తిని కల్గించి భావోద్రేకాన్ని, ఉత్తేజాన్ని సంఘటితం చేస్తుంది. గొడ్లకాడ బుడ్డాడు కూనిరాగాలు తీయగా, పనిచేసే కూలీలు బూతుతో కూడిన పాటలు పాడగా, వ్యవసాయకులు జానపదగేయాలు చాటగా, సంస్కారంవున్నవాళ్లే మనుకొనేవారు ఏ పద్యాలో, అభివృద్ధికాలనేపేరుతో ఏ గేయాలో వల్లించగా, సంగీతజ్ఞానమున్నవారు ఏ కృతులనో పాడుదురు. అనగా అన్ని వ్యవస్థల మానవులు ఏదో యొక రూపమున, ఏదో యొక పంథాను సంగీతలోలురు. సంగీతంలో సులువుగా అర్థమయ్యేది పదసంగీతం. కాబట్టి ప్రజానీకాన్ని పదసంగీతం ఆకర్షించినట్లు, ఉల్లాసాన్ని కలుగజేయునట్లు ఏ లక్షణబద్ధ సంగీతం, శాస్త్రీయ సంగీతం

చేయలేవు. అందులో శృంగారపూరిత జావళీలు ప్రజా సామాన్యాన్ని ఉత్తేజితం చేయునట్లు ఇతరములు చేయలేవు.

పైన చెప్పినట్లు సామాన్య మానవజీవితంలో కాంతిని దాంతిని ప్రవేశపెట్టి, ఎంత దరిద్రునకైనను కొంతకు గొంతయైన జీవితతృప్తిని ప్రసాదించిన మహానుభావుడు క్షేత్రయ్య. ఆ శృంగార రసమూర్తికి నా హృదయపూర్వక జోతలు.

పండితులు, కవులు, కళాకారులు

పండితులు వివిధ ప్రవృత్తులు కలవారు. ఏదైనా ఒక కార్యాచరణలో సిద్ధహస్తుడైనవాడు ఆ కార్యములో పండితుడు. నే నొకప్పుడొక వంటవానిని నీవేమి పదార్థాలు చేయగలవని అడిగితే, నేను స్వీట్ మాస్టర్ నన్నాడు. అనగా అతడు తీపి ఉపాహారాలు చేయుటలో నిధి అట. అదేవిధముగా చేతిపనుల్లో అనగా వస్త్రాలు నేయుటలో, మృత్తు, దారు, లోహాదికములతో రూపములు మలచుటలో, భవనాలు కట్టుటలో నేర్పరి అయిన వారు ఆయా పనుల్లో పండితులు. అదేవిధముగా చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, మృదంగం, నృత్యం, నటన వంటి లలితకళల్లో ఆరితేరినవాడు ఆ యా కళల్లో పండితుడు. కాని సర్వసామాన్యంగా పండితుడంటే అతడు భాషలో పండితుడని మన భావం. సంస్కృతమునుగాని, తెలుగునుగాని, ఇంకొక భాషనుగాని పూర్తిగా చదువుకొని ఆ భాషలోని మెళకులు, మలుపులు, లోతులు గట్టిగా తెలిసినవానిని మనం పండితు డంటాము. సంస్కృతపండితుడు, తెలుగుపండితుడు, హిందీపండితుడు ఇత్యాది. మరిన్ని ఏదో యొక శాస్త్రములో నిష్ణాతుడైనవానిని ఆ శాస్త్ర పండితునిగా చెప్పుతాము. ఆయనను జ్యోతిషపండితుడు, తర్కశాస్త్రపండితుడు, వ్యాకరణ పండితుడు వగైరా అంటాము. వేదపండితులు, వేదాంతపండితులు, ఆగమపండితులు, ఆయుర్వేద పండితులున్నారు. సామగాన, ధనుర్వేద వగైరా పండితులున్నారు. ధర్మశాస్త్రాదిశాస్త్రాల్లో, పురాణ, కావ్య, నాటక

అలంకారాల్లో పండితులున్నారు. రకరకాల విద్యల్లో, భిన్న భిన్న వృత్తుల్లో, వివిధ కళల్లో ఆరితేరిన వారున్నారు. వీరందరు పండితుల క్రిందలెక్కే. కాని వీరందరు నిజమైన పండితులా అని సందేహం. పండితుడైనవాడు పూర్ణప్రజ్ఞ కలవాడు. అనగా పరిపూర్ణ వ్యక్తిత్వం కలవాడు. సగం మనిషికాదు. నిండు మనిషి. పండితుడైనవాడు భాషాజ్ఞానంతోపాటు, విషయజ్ఞానమేకాకుండా ప్రపంచజ్ఞానము కలిగి యుండాలి. పూర్వకాలంనాటి విషయములనే గాక వర్తమాన విషయములను, మారుచున్న పరిస్థితులను గుర్తించి తదనుగుణంగా నడచుకోవాలి. ప్రాత ధర్మములనేగాక ఆధునిక ధర్మాలను గ్రహించాలి. తదనుగుణముగా ప్రవర్తించాలి. అట్లు చేయనివాడు పండితంమన్యుడౌతాడు. ఛాందసుడౌతాడు. వాని చదువు నిరర్థకమవుతుంది. వాని పాండిత్యము వ్యర్థమౌతుంది. శుష్కవాదాలు చేసేవాడు, తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళు అనేవాడు, తాను చెప్పిందే వేదమని మొండికేసేవాడు, ఇతరులకేమి తెలుసునని ధిక్కరించేవాడు ఎంత భాషాజ్ఞానమున్నా, శాస్త్రాలలో నిష్ణాతుడైనా నిజాని కత డపండితుడే. అట్టివాడు వ్యక్తులకు, సంఘానికి చెరుపుచేయునే కాని మేలు చేయడు.

కవియనగా పద్యాలల్లేవాడుకాదు. గణ యతిప్రాసలు కుదుర్చుకొని పదాలను కూర్చేవాడుకాదు. పొంగివచ్చే భావోద్రేకముతో, ఉరకలువేసే ఆవేశముతో, భాషాపాండిత్యంతో బాటు విషయజ్ఞానంతో, అనుభవపూర్వకప్రజ్ఞతో, ఉచితానుచిత విచక్షణతో, మానవస్వభావావగాహనతో, పరిసరకాల పరిస్థితుల గమనికతో, కథావస్తువును, నాయికానాయకులను పద్యరూపమున సృజించినవాడే కవి. అంతేగాదు అంతరాంతరములలోనుండి వెలికిరోసుకువచ్చే భావనను మేధస్సుతో మేళవించి, రూపకల్పనచేసి, దివ్యానుభూతులను తాను పొందుటయే గాక ఇతరులకు పంచిపెట్టువాడు నిజమైనకవి. "రవి గాంచనిచో కవిగాంచునేకదా" అను సూక్తిని నిజముచేయునట్లు వినూత్న భావప్రపంచాన్ని సృజించి, సురుచిరానుభూతికి, మనోల్లాసమునకు, హృదయానందమునకు, మేధా వికాసమునకు జీవితం పరిమళ

సంవృతమగునట్లు తీర్చిదిద్దినవాడే సిసలైన కవి. అల్లాకు మీదనో, పుల్లాకు మీదనో, బల్లి మీదనో, ఎలుక మీదనో, కోతి మీదనో, కొమ్మచ్చి మీదనో, గేదెమీదనో, గాడిద మీదనో అతుకులు బొతుకులుగా వ్యర్థపదాలతో పంక్తులుగా పద్యము పూర్తిచేసి కవిత్వము వ్రాశానని సంతోషించేవాడు ఎంతమాత్రము కవిగాదు. యతి ప్రాసలు కుదిరినంత మాత్రాన, గణము తప్పనంతమాత్రాన పద్యము కవిత్వముకాదు. చదివినప్పుడు హృదయము రంజిల్లి కరుణరసపూరితమో, శృంగారరసవిలాసమో, శౌర్య, వీర, రౌద్రాదిరసోద్రేకాన్ని ఉజ్వలింపజేయునదియో యగునదియే యథార్థమైన కవిత్వము.

"రససిద్ధాః కవీశ్వరాః". కవులు రసపూరిత హృదయులు. "రసమయం కావ్యం". వారి రచన రసాత్మకముగా నుండును. రసమనగానేమి? హృదయము నార్ద్రమొనరించి, మనస్సు నుత్తేజపరచి, బుద్ధిని ప్రజ్వలింప జేయునది రసము. రసము కావ్యమునకు అనగా కవితకు గుండెవంటిదనిన కొందరొప్పుకొనక పోవచ్చును. పురాణాలలో, ఇతిహాసాలలో కథ ప్రధానము. స్థితిగతులు ముఖ్యము. చెప్పుపద్ధతి ఉద్దీపకముగా నుండవలెను. కాబట్టి రస మప్రధానమని చెప్పువానున్నారు. కాని రసంలేనిదే ఏ కవితకైనా, రచనకైనా జీవకళ యుండదు. కథనం ఉదాత్తముగా, ఉత్తమపురుషనాయకముగా వుండాలని మన పూర్వుల అభిప్రాయము. కథానాయకుడు లేక నాయిక విశిష్టవ్యక్తి అయి వుండవలెననియు, కథ తదనుగుణముగా ఏ ధర్మమునో, ఏ ధర్మ సూత్రమునో చాటవలెననియు వారు తలచియుండిరి. ఆ దృక్పథము ప్రస్తుతకాలమునకు సరిపడదు. కవి హృదయమునుండి ప్రవించు ఆవేశధారావాహిని, మేధాసంపత్తినుండి ప్రజ్వలించు ఉజ్వల తేజస్సు, ఏ అంశమును, వ్యక్తిని గురించియైనను కావచ్చును. ధర్మబోధ, నీతిబోధ కావ్యమునకు ప్రధానములుకావు. అసలు అట్టి బోధలు కావ్యోద్దేశాన్ని మరుగుపరచునని కొందరి వాదం. ధర్మబోధ, నీతిబోధ, ధర్మశాస్త్రము నీతిశాస్త్రములవికాని, కవితవి కాదని వారి అభిప్రాయం. కావ్య మొక రసాత్మకము మాత్రమే. అనువాదన నటుంచి, కథావస్తువు కథానాయకుల నాయికల ఇతి

వృత్తము వర్తమానకాలములో ఉదాత్తమైనది కాకపోవచ్చును. ఏ భిక్షుకుడైనా, ఏ కటిక దరిద్రుడైనా, ఏ బక్కచిక్కిన మానవుడైనా కథాధార్యమగుచున్నాడు. ఏ జీర్ణవస్తువైనా కథాపాత్రమగుచున్నది. వాని కడగండ్లు కథావస్తువు అగుచున్నది. ఇది అనుచితముకాదు. అయితే రచన రసభూయిష్టముగానుండాలి. కరుణ రసమో, సంతాప రసమో ఉద్భవిల్లాలి. పాఠకుడు వాని దుర్భరజీవితములో పాల్గొనుచున్నట్లు అనుభవమునకు లోను కావాలి. వాని ఆవేదనలో భాగము పంచుకోవాలి. అప్పుడే కవి ఉద్దేశం నెరవేరుతుంది. కావ్యము రక్తికట్టుతుంది.

కళాకారులు : చిత్రలేఖకుడు, శిల్పి, సంగీత, నృత్య, నటనసాధకుడు— వీరిని కళాకారులని సామాన్యముగా అంటాము. కాని వస్త్ర, రత్నకంబళి నేతగాడు, సౌధ నిర్మాత, వడ్రంగి, కంసాలి, కంచరి, ముచ్చు, కుమ్మరి, తోలుబొమ్మలు తయారుచేయువాడు, కలంకారిపని చేయువాడు, మట్టిబొమ్మలు చేయువాడు, కంచు, ఇత్తడి, రాగితో వస్తువులను, బొమ్మలను తయారుచేయువాడు కూడ కళాకారుడేయని నా యభిప్రాయము. చేతిపనులని పిలువబడే కర్ర, ఉన్ని, ప్రత్తి, ఖనిజ, తోలు మొదలైన ముడిసరకులతో తయారుచేయబడిన రూపములు, వస్తువులు లలిత కళాఖండములు కాకపోవచ్చును. కలంకారి నగిషిపని కాకపోవచ్చును. కాని వీనిలోకూడ కళయున్నది. కాబట్టి వీనిని రచించేవారు, సృష్టించేవారు కళాకారులేయని నా అభిప్రాయము.

చిత్రకళ అనగా నానా వర్ణ శిల్పము లేక లావణ్యముతో కూడిన నేర్పు అని స్థూలముగా చెప్పవచ్చును. చిత్ర శబ్దానికి అర్థము నానా వర్ణములు కలది, ఆశ్చర్యకరమైనదని. కళకు లావణ్యము, శిల్పము అని నిఘంటువులు తెల్పుచున్నవి. శబ్ద రత్నాకరము ప్రకారము చిత్ర అను పదమునకు చిత్తరువు అని, చిత్తరువుకు పటమునందు వ్రాసిన రూపమని, చిత్తరు బొమ్మ అని అర్థము లున్నవి. ఆ నిఘంటువు ప్రకారము శిల్ప మనగా చిత్రము వ్రాయుట లోనగు శిల్పుల పని. వృత్త గీత వాద్యాది చతుష్షష్టి

బాహ్య క్రియలు. చిత్తరువులు వ్రాయుట రాతి విగ్రహములు చెక్కుటలో పనితనము, నేర్పు, ఆకారము, సృష్టి అని శిల్పమున కర్థము శబ్దార్థదీపిక తెలియజేయుచున్నది.

చిత్రకళకు పర్యాయపదముగా లలితకళలని వాడుచున్నాము. ఈ లలితకళలనే ఇంగ్లీషులో "ఫైనార్ట్స్" అంటారు. ఫైనార్ట్సకు అర్థము సంగీతాది శృంగార విద్యలు, చిత్రకళ, శిల్పవిద్య అని శంకరనారాయణ అర్థము చెప్పినారు. వారే ఆర్ట్స అను ఇంగ్లీషు పదమునకు కళతోబాటు నేర్పు, చమత్కారము, విద్య అనికూడ చెప్పినారు. ఇంకొకచోట ఆర్ట్ అనగా "ది ప్రొడక్షన్ ఆర్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ వాటీజ్ బ్యూటిఫుల్ ఆర్ అప్పీలింగ్" అని, "దోజ్ ఆర్ట్స వుచ్ సీక్ ఎక్స్‌ప్రెషన్ థ్రూ బ్యూటిఫుల్ ఆర్ సిగ్నిఫికెంట్ మోడ్సు" అని చెప్పబడియున్నది.

ఇవన్నియు చూడగా చిత్రకళ అనేది కంటికి అందముగా కనపడాలి. మనస్సును రంజింపజేసి ఉల్లాసాన్ని రేకెత్తించాలి. బుద్ధిని చమత్కరించాలి. హృదయాన్ని ఉప్పొంగించాలి. మేధను జ్వలింపజేయాలి. చూచీచూడటంతోనే, ఆహా! ఎంత బాగున్నది! అనిపించాలి. ఇంత సుందరరూపము, ఇంతటి చక్కని ఆకృతి, ఇంత పటిష్ఠ సౌష్ఠవము, ఇంతటి రంగుల మనోజ్ఞత, ఇంత దీప్తసౌభాగ్యము, ఇంత లాలిత్య సంపద అనుభవములోనికి తెచ్చుకొనిన సృజనకారుడు (స్రష్ట) ఎంత రసానుభూతి పొందిన ధన్యుడో! నేను అతని అంతర్భాగమైయుండిన యెడల ఎంత అదృష్టవంతుడ నయ్యేడివాడనో అను భావము చూచినవారికి కలుగవలెను. ఓహో! ఎంత చక్కని అవయవ పొందిక, ఎంత చక్కని లావణ్య సంపద, ఎంత ఆహ్లాదకరమైన శరీరవర్ణము, ఎంత చక్కని స్త్రీ! ఎంత అందమైన మగవాడు! ఈ ఆబోతు బలసిన కండరములతో నవనవలాడు యవ్వనముతో బుసలుకొట్టుచు ఉద్వేగముతో నున్నది. ఈ గుర్రము ఎంత తేజోవంతమైనది! ఆకాశమునకు ఎగిరిపోవుచున్నట్లున్నదే! ఏమీ

ఈ చురుకుదనము, అంగసౌష్ఠవము! ఈ ఏనుగును చూడుము, ఎంత గంభీరముగా చిన్న కొండలాగా పొడుగుపాటి దంతాల ధావళ్యముతో, దీర్ఘమగు తొండముతో, చేటలంత చెవులతో, ఘీంకారము పెట్టుచున్నది! ఈ ఆవును చూదామా, సాక్షాత్తు కామధేనువును స్ఫురింపజేయుచున్నది. ఎంత పొదుగు, ఎంత శారీరక సౌష్ఠవము, ఎంత మిల మిల! ఆ తేజోవంతమైన కళ్ళు సాధుత్వమును ఆప్యాయతను సూచించే ఆ చూపులు ఎంత బాగున్నవి! అటుచూడండి, ఆ ప్రకృతి రామణీయకము. ఆ కొండలు, వానిమీద వృక్ష సంతతులు, వానిమధ్య భవంతులు, కొండ సానువులు, వానిమధ్య ప్రవహించు సెలయేరు ఎంత ఆహ్లాద కరముగా నున్నవి! అవిగో లేళ్ళు, బెదురు బెదురు చూపులతో, వడిగల పరుగులతో వెనుదిరిగి చూచుచు ఉరుకుచున్నవి. పోనీ, ఇటు చూడండి. ఈ వృక్షసంతతులు, రంగు రంగుల పిట్టలు, రక రకాల కూజితములు ఎట్లు ఎగురుచున్నవో! ఎట్లు కొమ్మల మీద కూర్చొనుచున్నవో! ఈ వినీలాకాశమును చూడండి. ఈ సంధ్యారాగమును చూడండి. ఈ ఉషస్సును చూడండి. ఈ అరుణోదయమును గమనించండి. ఎంత ఆహ్లాదకరము! శరీరమును పులకరింప జేయుచున్నవి. నేత్రములకు విందు లొసగు చున్నవి. మనస్సును ఉత్తేజపరచుచున్నవి. ఊహాలోకమునకు తీసుకొనిపోవుచున్నవి. సుగంధ పరిమళమును పరిభ్రమణము జేయించుచు ఆనంద పరవశత్వము స్వర్గలోక సౌఖ్యము నాపాదించు చున్నవి! చిత్ర లేఖనము లనగా, శిల్పము లనగా ఇట్లుండవలెను. దర్శి కిట్టి అనుభూతులను కలిగించునవే నిజమైన శిల్పము, కళ, చిత్ర లేఖనము.

దర్శి లావణ్యవతిని, సౌందర్యవంతుని, చూడముచ్చట గొలుపు జంతుజాలమును, కన్నులకు విందొనర్చు పక్షిసమూహ ములను, హృదయము నుప్పొంగింపజేయు ప్రకృతి రామణీయ కతను అర్థముజేసికొనుటకు, మెచ్చుకొనుటకు, రసానుభూతిని పొందుటకు పురుషుడు పురుషుడుగాను, స్త్రీ స్త్రీగాను, జంతు వులు, పక్షులు ఆ యా రూపములతోను ప్రకృతి సహజముగా నుండవలెను. అట్లుగాక ఆధునికులమను పేరుతో, వాస్తవ చిత్ర

కారుల మను నెపముతో, భావ బల సంభూత రూప సృజనకారుల మను అపోహలతో, ఊహాలోక సౌందర్య పిపాసుల మను డాబుతో, మేధాజనిత లీలోపాసకులమను ధీమాతో, చిల్లరమల్లర దేవుళ్లను కొలుచువారముకాము ఏకైక నిరూప సర్వేశ్వరుని ఆరాధకుల మను అహంభావముతో అసంగతములను, అర్థముకాని రూపము లను, ఆకారములను సృజించుచున్నారు. ఆ రూపమేదో, ఆ అంగమేదో, పరిసరములేవో సామాన్యమానవునికే కాదు చదువుకున్నవానికి కూడ, చిత్రకళాభిమానికి కూడ అర్థముకావు. నిజానికి ఈ చిత్రాన్ని రచించినవానికికూడ అర్థముకాదేమో యని నా అనుమానము. అర్థముకాని చిత్రమేమిటి? అవగాహన కాని బొమ్మేమిటి? చూచి ఆనందించలేని కళేమిటి? రంగులు పూసినంతమాత్రాన కళకాదు. గీతలు గీచినంతమాత్రాన చిత్రముకాదు. రొమ్ములు నడుముకు పెట్టినా, కళ్ళు చెవుల్లో పెట్టినా, నోరు ఎదుటొమ్ములమీదకు జార్చినా, కాలు చేతులను పరిసరములతో కలిపివేసినా అవి చిత్రములుగాక విచిత్రాలు అవుతాయి.

చిత్రకళకంటె, లలితకళ విస్తృతమైనది. లలితకళ అనగా చిత్రలేఖనము, శిల్పము ఇతరరూప కల్పనముగాక, సంగీత, నాట్య, నాటకకళలు కూడ. నిజానికి సంగీతము, నృత్యము, వాద్యము, నటన (కూడ) అనునవియే నిజమైన లలితకళలు. అదృష్టవశాత్తు వీనిలోని సంప్రదాయ పద్ధతులేగాక ఆధునిక పద్ధతులు, అవలంబనములు ఆహ్లాదకరములుగా నున్నవి. సినిమాపాటలు, బ్యాండువాయిద్యములు వగైరా మన సంప్ర దాయ సంగీతమునకు అనుబంధములుగా నుండి మనోల్లాసమును కలుగజేయుచున్నవి. మన జోలపాటలు, నలుగుపాటలు, వ్రత సంబంధమైన పాటలు, దేవతాస్తుతి పూర్వకమైన పాటలకు తోడు జానపద గేయాలతో బాటు క్రొత్తరీతుల, పంథాలో గానము చేయు ఈల పాటలు, ఓల పాటలు, చిత్ర విచిత్ర తరంగములు మనకు సంబరమునే కలిగించుచున్నవి. కాని రోత పుట్టించుట లేదు. వివిధ రూపములతోనున్న నృత్యముకూడ క్రొత్త రూపు

రేఖలను సంతరించుకొని సమ్మిళిత రూపములతో బయలుదేరి ఆనందమిచ్చుచున్న దేగాని వికారమును కలుగజేయుట లేదు. నటన విషయములోకూడ పురోభివృద్ధియే కనపడుచున్నది. మొత్తంమీద లలితకళలు, లాలిత్యమును, వైదగ్ధ్యమును పెంచుకొన్నవి.

కాని చిత్రకళ లనబడు చిత్రలేఖనము శిల్పములోమాత్రము అనాకారములు, అర్థరహితములు, అసంభవములు పొడగట్టినవి. ఈ వికారము ఎంత త్వరలో నశించిన చిత్రకళకు అంత మేలు.

విద్యార్థులు - భావిపౌరులు

విద్యార్థులు భావిపౌరులు. పౌరులనగా జనాభాపెంచేవారు కారు. చదువు సంధ్యలు, సంస్కారంలేని యువకులు, యువతులు జనసంఖ్య పెంచేవారేకాని పౌరులు కాజాలరు. పౌరులనగా విజ్ఞానవంతులై, దేశసౌభాగ్యానికి తోడ్పడేవారు, క్రమబద్ధమైన సంస్కారం కలవాగు, ప్రజల సుఖ సౌఖ్యాలకు తోడుపడేవారు, సంఘజీవనాన్ని అభివృద్ధి పరచేవారు, అవసరంవచ్చినప్పుడు దేశంకొరకు ప్రాణాన్నైనా అర్పించటానికి వెనుకాడనివారు, సంసిద్ధులైనవారు. ఇట్టివారే నిజమైన పౌరులు.

విద్యార్థులిట్టి పౌరులు కావాలంటే అధ్యాపకుల సాయంతో, తలిదండ్రుల తోడుతో వారు కొన్ని పద్ధతులను, కొన్ని అలవాట్లను, కొన్ని ధర్మాలను పాటించాలి. వారవలంబించవలసిన మొదటిపద్ధతి తలిదండ్రులను గౌరవించి వారి హితవులను, సలహాలను పాటించుట. తలిదండ్రుల సంప్రదాయ పద్ధతులు, వారు జీవించేతీరు, వారుచేసే, నడచే రీతులు, వర్తమానకాలంలో పడుచువాండ్రకు వింతగా, ఛాందసంగా, అనవసరంగా తోచవచ్చును. కాలం మార్పునుబట్టి పెద్దవాళ్ళ పద్ధతులు ప్రాతవిగా తోచినా అనేకతరాల అనుభవాన్ని చేకూర్చుకొన్నవి. వారి స్వానుభవంవల్ల నేర్చుకొన్నవి. ప్రపంచజ్ఞానం, స్వంతానుభవం, సంఘానుభవాలులేని పిన్న వయస్కులు పెద్దవారి అనుభవాలను త్రోసిపుచ్చరాదు. తమకు

భిన్నాభిప్రాయముంటే వారినడిగి, వారి అభిప్రాయాన్ని, అనుభవాన్ని తెలుసుకోవాలి, తమకు నచ్చకపోతే ఎదురుతిరిగి తిరస్కరించకూడదు. ఇవ్వాళకాకపోతే రేపైన తమ జీవితాన్ని తమకు నచ్చిన పంథాన్ని గడుపుకోవచ్చునుకదా! తలిదండ్రులు బిడ్డల యోగక్షేమములు కోరేవారు. బిడ్డలు తమకంటే తెలివితేటలు కలవారై, తమ జీవితంకంటె హెచ్చుస్థాయిలో జీవనం గడపటం నేర్చుకొంటే, మంచిపేరు తెచ్చుకొంటే, తమ పద్ధతులకు భిన్నమైన పద్ధతులతో వర్తించుచున్నారని బాధపడరు, తగాదాపెట్టరు.

సామాన్య కుటుంబాల్లో విద్యార్థిదశలోకూడ తలిదండ్రులకు సాయంకావలసివస్తుంది. ఎవరినైన పిలుచుకురమ్మనో, ఏ సంచినో కదలించటానికి తోడుపట్టుమనో, దొడ్లోకివెళ్ళి గేదెకు మేతవేసిరమ్మనో, ఈవేళ ఆదివారంకదా పొలంనుంచి ఇంటికి రావటానికి తీరుబడివుండదు అన్నం పట్టుకురమ్మనో, కోమటింటికి వెళ్ళి ఫలానా వస్తువులు తెమ్మనో, బాబూ, ఒక్క బిందె నీరు నూతిలోనుండి తోడిఇవ్వరాఅనో తండ్రి, తల్లి కోరవచ్చును. ఇట్టి విషయాల్లో బుద్ధిమంతుడైన యువకుడు తానెంత విద్యార్థియైనా సాయపడాలి. భగవంతుడిచ్చిన 24 గంటల్లో ఏ అరగంటో, గంటో నిను కన్న తల్లిదండ్రుల కుపయోగించుటకు వెనుకాడగూడదు. నిజానికి అన్నీ సవ్యంగా జరిగితేనేకదా తనకు చదువుకొనే యోగ్యత కల్గటం.

తలిదండ్రులకువలెనే చదువుచెప్పే అధ్యాపకులను గౌరవించాలి. ఒకవిధముగా గురువులే ఎక్కువంటారు. తలిదండ్రులు అశాశ్వతమైన భౌతికశరీరాన్నిస్తారు కాని గురుదేవులు ఉత్తమమైన విజ్ఞానాన్ని ప్రసాదిస్తారు. మన హిందువుల నమ్మకం ప్రకారం ఈ జన్మలో సంతరించుకొన్న విజ్ఞాన జ్ఞానసంచయం వచ్చే జన్మలోకూడ ఉపయోగపడుతుందట. అందుకనే ఆచార్యుడు, అనగా అధ్యాపకుడు, దేవుడువంటి వాడంటారు. "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ" అంటారు. గురువుగురించి "గురుఃబ్రహ్మా, గురుర్విష్ణుఃగురు ర్దేవో మహేశ్వరః, గురు స్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై

శ్రీగురవే నమః'' అని పూజ్యభావం మనవారు వెల్లడిస్తారు. ఇక్కడ గురువనగా జ్ఞానోపదేశంచేసే ఏ రామకృష్ణపరమహంసనో, ఏ రమణమహర్షినో, ఏ అరవిందయోగినో మనస్సులోబెట్టుకొని గురువు సాక్షాత్ పరబ్రహ్మ అన్నా, చదువుచెప్పే గురువు అధమం దేవునివంటివాడని మనవారు తలంచారు. అట్టి విద్యాగురువు లను వారివద్ద విజ్ఞానాన్ని పొందే శిష్యులు తలిదండ్రులకువలె గౌరవించి వారియందు శ్రద్ధాభక్తులను కలిగియుండాలి. పూర్వ కాలంలో ఋషులు అనగా విద్యావేత్తలు, విజ్ఞానవంతులు, గురుకులాలనుపేర శిష్యబృందానికి విద్యాబుద్ధులను కరపేవారు. పిన్నవయస్సులోనే తమ బిడ్డలను తలిదండ్రులు ఈ గురుకులాలకు పంపేవారు. ఆచార్యుడు ఈ పిన్నవాళ్ళను తన ఇంట్లో పెట్టు కొని, భోజనాదులిచ్చి, కన్నబిడ్డలనువలె పోషించి విద్యలు నేర్పేవారు. మన పురాణాల్లో ఇట్టి ప్రస్తావనలు చాలావున్నవి. ఉదాహరణకు, సాందీపునివద్ద బలరామకృష్ణులు విద్య నేర్చు కొనుట. జ్ఞానగురువు సాక్షాత్తు పరబ్రహ్మమే. ఉదాహరణకు రామకృష్ణపరమహంస, వివేకానందుల విషయం మనకు తెలిసినదే. గురుకులాశ్రమాలుపోయినా, బ్రహ్మజ్ఞానం, లోక విజ్ఞానం ఇంట్లోపెట్టుకొని బోధించే పద్ధతులు నశించినా, చదువుచెప్పే గురువులున్నారుకదా! వారు ''ఆచార్యదేవోభవ'' కదా! వారియందు భక్తి, పూజ్యభావం లేకపోతే చదువె ట్లబ్బుతుంది? గురిలేనిదే గురుత్వంలేదు. గురుత్వంలేనిదే చదువురాదు. ఈసంగతిని విద్యార్థులు తమ మనస్సులలో ఇముడ్చుకోవాలి. తమ జీవనాడులో జీర్ణించుకోవాలి.

తలిదండ్రులను, గురువులనేగాక పెద్దలను గౌరవించాలి. ఇరుగుపొరుగువారి నాదరించాలి. ఎవరైనా పలకరించినప్పుడు మర్యాదగా మాట్లాడాలి. దారినపోయేవారు త్రోవ ఎట్లని అడిగినా, ఇంకేమైనా సమాచారమడిగినా సరియైన సమాధానం చెప్పాలి. తమకు పట్టనట్లు ఎవరోలే, మనకెందుకన్నట్లు నిర్లక్ష్యం చూపకూడదు. తాము పట్టణంలో చదువుకొను చుండగా ముదుసలి రోడ్డుదాటటానికి భయపడి తచ్చాడ్లాడుతుంటే సాయపడాలి. ఎవరైనా కష్టంలో చిక్కుకొంటే తమకుచేత

నైనంత, అవకాశమున్నంత మేరకు మాటలతోను, చేతలతోను తోడుపడాలి. భూతదయ, కారుణ్యం, దైవభక్తి వగైరా ధర్మాచరణ క్రిందకు వస్తవి. పనిగట్టుకొని చదువు చెడగొట్టుకొని ఎవరెక్కడే ఇబ్బందిలో వున్నారా, ఎప్పుడు వెళ్ళి సాయపడదామా అని ఎదురుచూడ నవసరంలేదు. పై చెప్పిన సద్గుణాలు సాటు అనే స్వచ్ఛంద సేవానిరతు లాచరించునవే. ఈ సాటు గుణాలను, పద్ధతులను యువకులు విద్యార్థి దశలోనే అలవరచుకోవాలి.

ఇక చదువు, దాని సంబంధమైన అలవాట్లను గురించి. శ్రద్ధగా చదువనిదే చదివింది ఒంటపట్టదు. గ్రుడ్డిగా వల్లిస్తే చిలుకపలుకు లౌతవి. చదివింది మననంచేసుకోవాలి. ఆలోచనలోనికిపోనివ్వాలి. మరిన్ని చదువుప్రశాంత వాతావరణంలో బాగా అబ్బుతుంది. అందువల్ల విద్యార్థులు తెల్లవారుజామున మేల్కొని పఠనం మొదలుపెట్టాలి. తెల్లవారుజాము 4 గంటల నుండి గం. 5-30 ల వరకు బ్రహ్మముహూర్త మంటారు. ఇది పగటి అలసటను పోగొట్టి మనస్సును, బుద్ధిని నిర్మలం, నిశ్చలం చేస్తుంది. చుట్టుప్రక్కల వాతావరణం నిశ్శబ్దంగా శాంతంగా వుంటుంది. ఈ కాలంలో చదివినది చప్పున బుర్రకెక్కి మనస్సునకు పట్టుతుంది. కాబట్టి బాగుగా చదువు రావాలనుకొనే విద్యార్థులు 4 గంటలకు లేచి 5-30 గంటల వరకు చదువుకొని తర్వాత కాలకృత్యాలు, స్నానం ముగించవచ్చును. పళ్ళు, ఒళ్ళు, శుభ్రంగా తోముకుంటే, కడుగుకొంటే కల్గే తృప్తి, ప్రశాంతి నిత్యం ఆచరించువారికి అనుభవైకవేద్యం. ఏ ఏడు గంటలకో లేచి, ఏ బీడో సిగరెట్లో పీల్చుటం నేర్చుకొంటే శరీరబద్ధకం పోదు. చదువు మీద ధ్యాస పోదు. ఈరోజుల్లో పాఠశాలలోని చదువు అంత మాత్రం. మరిన్ని బడి ఉదయం 10 గంటలనుండి ఏ 4-30, 5-00 గంటల వరకు మాత్రమే. ఇందులో విశ్రాంతి, అటు ఇటు తిరగటం పోను చదువు కుపయోగించే కాలం స్వల్పం. పైగా శ్రద్ధగా వినటం ఉండదు. అందువల్ల సాయంత్రం ఇంటికి వచ్చివేసిన తర్వాత పెందలకడనే భోజనంచేసి ఒక గంటైనా

చదువుకోవాలి. అప్పుడుగాని పాఠశాలలో అధ్యాపకులు చెప్పిన పాఠాలను నెమరువేసుకొనటానికి అవకాశం కల్గదు.

అయితే ఎప్పుడూ బండచదువేనా అంటారేమో. బుద్ధి మాంద్యాన్ని పోగొట్టటానికి, శరీరానికి జవసత్వాలిచ్చి హుషారు కలిగించటానికి శరీరవ్యాయామముండాలి. అప్పుడుగాని మెదడుకు చురుకెక్కదు. రోజంతా క్షీణించిన జీవశక్తిని పుంజుకోవాలంటే శరీరాన్ని పునరుజ్జీవింప జేయాలి. దీనికి వ్యాయామం అనగా ఆటలు, కసరత్తు వంటివి అవసరం. కాబట్టి ప్రతి విద్యార్థి బాలుడైనా, యువకుడైనా ప్రతి సాయంత్రం స్కూలు ఆటల్లో పాల్గొనాలి. అదేవిధముగ బాలికలునూ. ఇంకొకటి. ఒక్క శరీరాన్నిమాత్రం శ్రమపెట్టటం చాలదు. బుద్ధివికాసానికి, మనోరంజకత్వానికి పాఠశాలలో వినోదాలను ఏర్పరచుకొని వానిలో పాల్గొనాలి.

ఆట పాటలలో సంఘీభావముండాలి. జట్టు సహకారము, సామరస్యముండాలి. అంతేగాని పోటీలలో అసూయ, ఉక్రోషము, అవతలవానిని దుర్మార్గంచేసి అయినా సరే బోల్తాకొట్టించాలి, కాలో చేయో విరుగగొట్టితేగాని వాని పొగ రణగదు అను దురహంకారం, దుష్టత్వ ముండకూడదు. జట్టునందరిని కూడ గట్టుకొని ప్రత్యర్థి జట్టుతో సరసంగా, సామరస్యంగా పోటీపడాలి.

ఇక పరీక్షల విషయంలో కష్టపడి చదివి, తనకు తెలిసినంతవరకు మిక్కిలి శ్రద్ధతో ప్రశ్నలకు సమాధానం వ్రాయాలి కాని దొంగతనంగా ఇంటినుండి తెచ్చిన సమాచారంతోను, ప్రక్క విద్యార్థులనుండి లేక పుస్తకాలనుండి దొంగచాటుగా కాపీ కొట్టగూడదు. ఆత్మగౌరవం గల విద్యార్థి యెప్పుడు తప్పుడు పనిని దొంగచాటుగా చేయడు. ఈరోజుల్లో దొంగచాటుగా కాపీచేస్తున్న విద్యార్థిని పర్యవేక్షకుడు పట్టుకొంటే, ఆయనను భయపెట్టుటయేగాక, చావగొట్టుతున్నారట. ఇట్టి నడవడిగల విద్యార్థి ముందు దేశద్రోహం, భ్రాతృద్రోహం, మానవద్రోహం చేయడని నమ్మకమేది?

విద్యార్థి క్రమశిక్షణకు లోబడాలి. కారక్టర్ అనగా విశిష్ట శీలం లేక ప్రవృత్తిని కలిగి ఉండాలి. ఇవి ఉన్నప్పుడే సిసలైన విద్యార్థిగా రూపొందుతాడు. తనకుగాని, తన కుటుంబానికిగాని, వంశానికిగాని, దేశానికిగాని ఉపయోగపడతాడు. తన జన్మను సాఫల్యం చేసుకొంటాడు.

ఇక విద్యార్థులను భావిపౌరులనుగా రూపొందించే అధ్యాపకులను గురించి. వీరు పూర్వకాలం గురుకులాల్లోని ఆచార్యుల వలె విద్యార్థులను తమ ఇంటివద్దనే పెట్టుకొని భోజనాదుల నిచ్చి పోషించకపోయినా, తమ అర్హతలకు తగినట్లు జీతం పుచ్చుకొను చుండకపోయినా, విద్యాబోధనవిషయంలో తమ శక్తుల నన్నిటిని పూర్తిగా ఉపయోగించి శ్రద్ధతో, ఆదరణతో, ఆప్యాయతతో చదువుచెప్పు బాధ్యతలో పూర్వకాలంనాటి గురువులుగానే వ్యవహరించవలసియున్నది. ధనవంతుల బిడ్డలనిగాని, కొందరియందు పక్షపాతబుద్ధి, బీదవాడనో, నిమ్నజాతివాడనో, తమకు బంధుత్వమో, స్నేహమో ఉన్నవారి బిడ్డలనిగాని, కొందరియందు నిరసనభావం చూపించక అందరు విద్యార్థులను కన్నబిడ్డలనువలె ఆదరించవలసి యున్నది. ఏ విద్యార్థి అయినా దురుసుగా వ్యవహరిస్తూ, చెడు అలవాట్లు కలవాడైన వానిని దగ్గరకుతీసి ఆప్యాయతతో వానికి హితబోధచేసి దారికి తీసుకొని రావాలి. ఈ రోజుల్లో జీతం చాలదనో, ప్రమోషన్ రాలేదనో, నెల నెల జీతం వస్తుందికదా ఎంత చెప్పినా అంతే జీతంకదా అనే భావంతోనో స్కూలులో చదువు చెప్పీ చెప్పనట్లు చెప్పుచున్నారు. విద్యార్థులకు చదువు రావాలనికాదు, తాము చదువు చెప్పే పీరియడ్‌లను పూర్తిచేశామని. పైగా అధ్యాపకులు ప్రైవేటు ట్యూషన్లని మొదలుపెట్టి 20, 30 మంది విద్యార్థులకు తమ నివాసంవద్ద బడులు నడుపుచున్నారు. కాబట్టి స్కూలు చదువు చెప్పకపోయినా ఫరవాలేదని వీరి అభిప్రాయం. ఇంకొకటి, ఈ ప్రైవేటు ట్యూషను పద్ధతివల్ల విద్యార్థులు ఏవిధంగానైనా ప్యాసైనట్లు చూపాలని పరీక్షల్లో కాపీ కొట్టుచుండగా చూచి చూడనట్లుంటున్నారు. ఒక హెడ్‌మాస్టరు పనికట్టుకొని

పరీక్షాపత్రాలు దిద్దేవారియొద్దకు వెళ్ళి మార్కులు వేయించుకొని వస్తూ వుండేవాడట. మార్కులు వేయిస్తానని డబ్బుకూడా కాజేస్తూ వుండేవాడట. ఇట్టి అవినీతిపద్ధతులను అవలంబించటం వల్లనే పంతుళ్ళయందు పిల్లలకు గౌరవం లేకుండా పోయింది. చదువుచెప్పే గురువులను కొట్టటానికి, చంపటానికి సిద్ధమౌతున్నారు.

అధ్యాపకులబాధ్యత స్కూలులో చదువుచెప్పటంలో పూర్తి అయినట్లే. తలిదండ్రులబాధ్యత ఇంతకంటె పెద్దది. తమ పిల్లలు ఇంటివద్ద చదువుకొనునట్లు, పోకిరి పనులకు పోకుండునట్లు, మంచి అలవాట్లను అలవరచుకొనునట్లు జాగ్రత్తతీసుకొన వలసియున్నది. ఈరోజుల్లో స్కూలుచదువు 5, 6 గంటలకు మించియుండదు. పిల్లలు ఇంటివద్ద తతిమ్మా కాలమంతా గడుపుతారు. కాబట్టి అధ్యాపకులకంటె పిల్లలను అదుపులో బెట్టి, వాళ్ళ మంచిపద్ధతులను నేర్చుకొనునట్లు చేయుటకు తలిదండ్రుల కెక్కువ అవకాశం కలదు. బిడ్డలను దిద్ది సక్రమ మార్గంలో పెట్టుటకు తండ్రికంటె తల్లి కెక్కువ అవకాశముండును. సహజంగా పిల్లలు తండ్రిమాటకు భయపడినా తల్లిమాటయందు ఎక్కువ గురికల్గి యుంటారు. కన్నతల్లిప్రేమ వాళ్ళను ముగ్ధులను చేస్తుంది. ఆమె చెప్పుచేతలకు వాళ్ళు పుట్టినప్పటినుండి అలవాటు పడి యుంటారు. కాబట్టి ఆమె ప్రేమను చూపిస్తున్నా మంచి పద్ధతులను నేర్పటంలో గట్టితనం చూపాలి. లాలించినా ఇది చెయ్యవచ్చు, ఇది చెయ్యకూడదని ఆజ్ఞాపించాలి. నే నెరుగుదును. ఒక తల్లి తన కొడుకును తెల్లవారుఝామున 4 గంటలకే లేపి దీపంముందు పుస్తకంతో కూర్చోపెట్టుచుండేదట. ఆ అలవాటునే ఇప్పుడు మంచి ఉద్యోగహోదాలోనున్నా అతడు అమలు పరుస్తున్నాడు. రాత్రి ఒంటిగంట వరకు ఏ పనిమీదో మేల్కొని వున్నా తిరిగి 4 గంటలకు అలవాటుచొప్పున లేస్తాడు. నిజానికి ఆ తల్లి జాగ్రత్త తీసుకొని, దిటవుగా 4 గంటలకు చదువును మొదలుపెట్టించినందువలననే ఆ కొడు కీరోజున ఉన్నతస్థాయికి వచ్చాడు.

కొందరు తలిదండ్రులు తమ బిడ్డలే దురంతం చేసినా మా వాడంతవాడయ్యాడని సంతోషిస్తారుగాని మందలించరు. తమ మనస్సులో తప్పని తోచినా తమ బిడ్డ అని అభిమానం చేతనో, తా మితరులయెదుట అలుసై పోతామనో, పిల్లవాడు ఎదురుతిరిగి తమమాట వినడనో నిర్లక్ష్యంచేస్తారు. ఒకఊళ్లో ఇద్దరు ముగురు విద్యార్థులు వేసవిసెలవుల్లో స్కూలుపాకలో ఆడుకొనుచు పోటీకి బీడీలు ఎగరవేసి పాకను అగ్నిహోత్రునిపాలుజేశారు. ఆదారిని పోవుచున్న మోటరుకారువీరంద రాళ్ళు రువ్వారు. తలిదండ్రులకు చెప్పితే నవ్వి ఊరకున్నారట. ఆ స్కూలు హెడ్ మాస్టరు చందాలు ప్రోగుచేసి కాలిపోయిన పాకను తిరిగి వేయించవలసివచ్చింది. అదుపులో లేనిబిడ్డలు ఇతరులమా టటుంచి, చివరకు తమ గొంతులే కోస్తారని తలిదండ్రులు గ్రహించవలసియున్నది.

పై చెప్పిన విధంగా దేశభక్తిగల పౌరులు, సంఘక్షేమాన్ని కోరే పౌరులు, తమ తోటిమానవుల సౌభాగ్యాన్ని కోరే పౌరులు కావాలంటే విద్యార్థులు, విద్యార్థినిలు పై సూచనలను అవగాహన చేసుకోవాలి, ఆచరణలో పెట్టాలి.

పరాన్నభుక్కులు

తా మేమీ ఒళ్ళు కదపక ఇతరుల శ్రమఫలితంమీద లేక దాని ఆధారంగా బ్రతికేవారు పరాన్నభుక్కులు. ఆర్జనకు ప్రయత్నించక కదలించక ఇంకొకడు కాయకష్టమో, బుద్ధినుపయోగించియో, మేధను శ్రమపెట్టియో ధనార్జనచేసి, సంపదను సమకూర్చిన దాని ననుభవించేవాడు పరాన్నభుక్కు. పరాన్నభుక్కులలో అనేక రకాలు. మతం పేరనో, కులం పేరనో, ప్రజాసేవ పేరనో, సంఘాన్ని మరమ్మతు చేస్తున్నామనో, ధర్మకార్యాలు చేస్తున్నామనో, సాంస్కృతిక వ్యవహారాలు నడుపుచున్నామనో, దేశాభివృద్ధికి పాటుపడుచున్నామనో, బలవంతపెట్టియో, మొగమాట పెట్టియో, యాచించియో, ప్రార్థించియో డబ్బు గుంజుకొనే వారందరు పరాన్నభుక్కులే. వీరిలో తలిదండ్రులవద్ద అస్తి యున్నది, ముసలులైనా ఇంకా కష్టపడి సంపదను వృద్ధిచేస్తు

న్నారు, మనము కష్టపడవలసిన అవసరంలేదు, సుష్ఠుగా తిని, హాయిగా కూర్చుంటే సరిపోతుందనుకొనే బిడ్డలుకూడా పరాన్న భుక్కులలోనే చేరుతారు.

పరాన్నభుక్కుల మతంపేర బ్రతికేవారు ఇప్పుడు పూర్వమంత ప్రముఖులుకారుగాని మేము పీఠాధిపతులం మీరు మాకు పూజలు సల్పాలి; మేము మీకు గురువులం మాకు దక్షిణలు సమర్పించుకోవాలి; మేము మీకు పురోహితులం మీ పెద్దలు పుణ్యలోకాలకు వెళ్ళుటకు మీరు మాకు దానాలివ్వాలి; మేము క్రతువులను చేస్తున్నాం వానివల్ల పాపాలునశించి ప్రజాభ్యుదయం అనగా మీ అందరిశ్రేయస్సు వెల్లివిరుస్తుంది; మేము వేదాలు శాస్త్రాలు క్షుణ్ణంగా చదివాం, మతధర్మాలను ప్రచారం చేస్తున్నాం—ఈ విధమైన సాకులుచెప్పి ప్రజలనుండి డబ్బును గుంజుకొని శ్రమపడకుండా సుఖజీవనంచేసేవారు పరాన్నభుక్కులుకారా? పీఠాధిపతులలో వేదశాస్త్ర నిష్ణాతులు, జ్ఞానమూర్తులు, మతప్రచారం, ధర్మప్రచారం చేసేవారున్నారు. కాని వారిలో కొంతమందైనా భోగలాలసత్వంతో, దర్పంతో తమ మహోన్నతస్థానాన్ని దుర్వినియోగం చేసేవారున్నారని మనమెప్పుకోక తప్పదు. గురువులు అనగా జ్ఞానోపదేశం చేసేవారు. తమ శిష్యబృందాన్ని ధర్మమార్గంలో నడిపించేవారు కొందరైనా ఉండవచ్చును. అధికభాగం దక్షిణలకు, పూజలకు మాత్రమే ప్రధానమిచ్చేవారు. నా చిన్నతనంలో ఈ గురువులు అప్పుడప్పుడు తమ శిష్యకోటినితరింపజేయటానికని అట్టహాసంగా పదిమంది శిష్యులు భేరీకాహళాలతో కొలుస్తూవుండగా పల్లకిలోనో, మేనాలోనో పగటి కాగడాలతో జయ జయ ధ్వానాలతో గ్రామాలకు వేంచేసేవారు. ఇప్పుడంతగా గిట్టుబాటుకానందున కాబోలు రావటం మానివేశారు. పురోహితులుకూడా డాంబికాన్ని, దర్పాన్ని కొనసాగించుకొనలేక పోవుచున్నారు. గృహస్థులు తెలివిమీరిపోయారు. భూదానం, హిరణ్యదానం మానివేశారు. గోదానం, దూడతోవున్న ఆవునివ్వాలి. ఇప్పుడిచ్చేవారు ఏ చిన్న పెయ్యనో ఇస్తున్నారు. సంభావనలుకూడా బాగా తగ్గిపోయాయి. అందువల్ల పురోహితులు దిగజారుడుస్థితిలో కిప్పుడు వచ్చారు.

కాని చదువు సంధ్యలు లేకపోయినా, మంత్ర తంత్రాలు రాక పోయినా, మీ పురోహితుణ్ణని చెప్పుకుంటూ పెండ్లి పేరంటా లకు, శ్రాద్ధకర్మలకేగాక పండుగ పబ్బాలంటూ కొద్దో గొప్పో పట్టుకుపోవుచున్నారు. పూర్వం యజ్ఞయాగాదులు చేసినవారమని, చేస్తున్నామని గొప్పలు చెప్పేవారు. వా రెందుకు చేశారో అన్న ప్రశ్నలేక వాళ్ళేదో ఘనకార్యం చేసినట్లు గారవింపబడే వారు. విరాళాలు, కానుకలు తీసుకొనిపోయేవారు. ఈరోజుల్లో కూడా యజ్ఞయాగాదులు జరుగుచున్నవి. ప్రజలధనం లక్షలాది అగ్నిగుండంలో బూడి దగుచున్నది. ఇప్పుడు ప్రజలశ్రేయస్సు కొరకు, అనగా వర్షాభావాన్ని పోగొట్టి కరువుకాటకాలను పారద్రోలుతామని, దేశాన్ని సుభిక్షంచేసి ప్రజాభ్యుదయం కల్గిస్తామని బుకాయింపులతో ప్రజాసామాన్యంనుండి సంచుల కొలది ధనాన్ని ఆకర్షిస్తున్నారు.

కులంపేరు చెప్పుకొని తమ కులవృత్తి "భిక్షాందేహి" అని, తమకు ధర్మంచేయటం అవతలవాళ్ళ విధ్యుక్త ధర్మమని తలంచే వా ళ్ళున్నారు. వీరినే కవిరాజుగారు "జాతి మాత్రప జీవులు" అని నిరసించారు. కులంపేరు చెప్పుకొని బ్రతికే వా రొక్క కులానికి మాత్రమే పరిమితమై యుండటంలేదు. పూర్వంవలె విరివిగా తమకు హక్కున్నట్లు డబాయించే కులం ఇప్పటికిని కులంపేరు చెప్పుకొని భిక్షాపాత్రకాకపోయినా బజారులో దొరికే ఏ గుడ్డ, కిత్తనార చేతిసంచో లేక అంగ వస్త్రానో్న పట్టుకొని సరాసరి ఇంట్లోకి రావటమో లేక వరండాలో కుర్చీలో అధివేష్టించటమో జరిపి దర్జాగా హుందాగా అడుక్కోవటం కద్దు. ఇతర కులాలవాళ్ళుకూడా, మేము మీకులం వాళ్ళమని చెప్పుకొని చేయిజాచటం మొదలుపెట్టారు. కులాభిమానం త్రోసుకొనివచ్చి తమ చేతిని తడుపుతుందని వీరి యాశ. ఇదివరలో ఇట్టిది నే నెరుగను. ఇప్పుడిది మొదలుపెట్టి పెరుగుచున్నది. విద్యార్థులమని చెప్పుకొనే వాళ్ళేగాక కూతురు పెళ్ళిచేయాలనో, పొలం సండలేదనో, ఇల్లు తగలబడిపోయిందనో కారణం చెప్తారు. ఒళ్ళువంచక సుఖజీవనంచేయవచ్చని పూర్వం వలె ఒక్కకులమేగాక అన్ని కులాలు నేర్చుకొన్నవి.

ధర్మసత్రాలు కట్టిస్తున్నామని, దేవునిగుళ్ళు నిర్మించుచున్నామని, చలివేంద్రాలు నడుపుచున్నామని మీరు చందాలివ్వండి, విరాళాలివ్వండి అని వెంటబడేవారున్నారు. పై కార్యాలెట్లున్నా వాళ్ళ కడుపులు నింపుకొంటున్నారు. అసలు పై పనులు జరిపినా అవి నామమాత్రమే.

సంఘ సంస్కారులం, హరిజన హాస్టల్ను నడుపుచున్నాం, రాత్రిపాఠశాలలు పెట్టి నిరక్షరాస్యులకు చదువు చెప్పించుచున్నాం, ఈ విధంగా సంఘంలోని లోటులను సరిదిద్ది సంఘాన్ని మరమ్మతు చేస్తున్నాం అని ఊపి రాడనివ్వనివారున్నారు. పై సత్కార్యాలనెపంతో శ్రమించకుండా తమ కుటుంబాలను పోషించుకొనుచున్నారు.

ఇక హరిదాసులమని, తిరుపతి వెంకటేశ్వరుని భక్తులం కొండకు వెళ్ళుచున్నామని చెప్పుకొని గోవిందలు కొట్టేవారు, మేము కట్టికి బీదలం మాకు తిండి లేదు ఇంత అన్నమో, బియ్యమో, వడ్లో పెట్టండే మా కీపూట పస్తే అని దీనాలాపాలు చేసేవారు సామాన్య భిక్షుకులున్నారు. వీరిలో చాలామంది దేహదార్ఢ్యమున్నవారు. ఇవి పనిరోజులు, కూలి బాగా ముట్టుతుంది, మాకు కూలీ లవసరం పనిలోకి రండని పిలిస్తే కాలుగాలిన పిల్లివలె చప్పున తప్పుకొంటారు.

పైవారుగాక ఇంకొక ఘరానా బిచ్చగాళ్ళున్నారు. వీరు సాంస్కృతిక కలాపాలపేర, సాహిత్యాభివృద్ధి నెపాన, ఎరగని వారిని, ఎరుగున్నవారిని పీడించేవారు. వీరు పొట్టకూటికి గాక పోయినా తమ పేరు ప్రతిష్ఠలకు తాము సంస్కృతి కలవారు, సాహిత్యాభివృద్ధిపరులు అనిపించుకొనటానికి ఇతరుల డబ్బుకు ఎగబడేవారు. వీరి పరాన్నభుక్తత్వం కడుపు నింపుకోవటానికి కాకపోయినా మనస్సు నింపుకోవటానికి, యశస్సును సంపాదించుకోవటానికి.

అందరికంటే మహా ఘనులు, రాజకీయతంత్రజ్ఞులు రాజకీయాలలో బ్రతికేవారు. వీరు సామాన్య యాచకులుకారు. అసలు అడుక్కొనేవారిలాగా ప్రవర్తించరు. తమ పార్టీ దేశాన్నుద్ధరిస్తుంది, దాని అభివృద్ధికి డబ్బవసరం, తాము లేనిదే పార్టీ

రాణించదు కాబట్టి తాము గొప్పగా ఉండాలి. అంతేకాదు తాము పదవులను సంపాదించాలి. ఎలెక్షనులో తాము అభ్యర్థిగా నిలబడాలి. దానికి బోలెడంత ఖర్చు. తాను గెలిచాడా మంత్రిపదవి కొట్టేస్తాడు. ఆ అదృష్టం తనను వరిస్తే ఇక చూచుకో తన తడాఖా. భక్తులకు, అనుచరులకు తా నెన్ని సదుపాయాలు ఏర్పరచగలడో! ఎన్ని దేశోద్ధారకపనులు చేయగలడో! నిజానికి సత్కార్యాలు, ఉద్ధారకపనులు చేయటానికి కాదు తాను మంత్రి అయ్యేది. తాను దర్జాగా, అధికారదర్పంతో మోటారుకార్లలో ఊరేగటానికీ, ఎయిర్‌కండిషన్డ్ రైల్వే కోచీలలోను, విమానాలలోను విహారం చేయటానికీ, సకల వసతులతోకూడిన భవంతులలో నివసించటానికీ, జోహుకుం వాళ్ళతో పరివేష్టించబడటానికీ, తన భార్యా బిడ్డల బంధువుల సుఖజీవనానికీ దేవులాట. వాళ్ళు వీళ్లు డబ్బిచ్చి ఇంకొక విధంగా ఖర్చుపెట్టి అడుగుననున్న తనను ఆకాశాని కెక్కించాలి. తాను ఓట్లకోసం తిరిగే శ్రమతప్ప, కల్లబొల్లిమాటలు నాలుగు సభలలో వెళ్లగ్రక్కే సాహసం తప్ప, సమంజసమో, అసమంజసమో పదికబుర్లు తనను సాయమర్థించేవారికి లాలనపూర్వకంగా, ఆశాజనితంగా చెప్పే ఓపికతప్ప ఈ రాజకీయనాయకుడు వేరే శ్రమపడనక్కరలేదు. చేతిడబ్బు తగులబెట్టుకొన నవసరంలేదు. ఈ రోజుల్లో జూదంవంటి ఎలెక్షనులో తన చేతిడబ్బు ఖర్చయినా దానికి పదిరెట్లు పూరించ లేనని అధైర్యమెందుకు?

ఇక సంతానం సంగతి. తిని కూర్చుంటే అంత బాధలేదు. ఈ సోమరిపోతులకు జల్సా లెక్కవ. భోగలాలసత్వ ఎక్కువ. మంచి తిండితోబాటు మంచి పోకుబట్టలు, వానితోబాటు సౌఖ్యానికి దర్జాకు మోటారుకారు. కారుంటే ఏమిలాభం. షికార్లకు తోడు ఆడ మగ స్నేహితులులేనిది? వీళ్ళందరుంటే ఆనందం కావాలి. త్రాగుడు, సినిమా, డ్రామా, వినోదాలు, పగటి రాత్రి క్లబ్బులు, రంగు రంగుల దృశ్యాలు, నగ్నదృశ్యాలు కావాలి.

పై విధముగా పరాన్నభుక్కులజీవితం స్వర్గతుల్యంగా జరుగుతుంది. అంతకంటే మనిషిపుట్టినతర్వాత కావలసిన దేముంటుంది?

చిత్రం, విచిత్రం

"విన్నావా ఈచిత్రం సోమమ్మా" అని ముగ్గులు వేస్తున్న పుల్లమ్మ అవతలి గుమ్మానున్నానుకొని నిలుచుండిన సోమమ్మతో అన్నది. "ఏం చిత్రమే పుల్లమ్మా"అని కుతూహలంతో అడిగింది సోమమ్మ. చిత్రం అంటే చిత్రమా! నిన్నగాక మొన్న అవతలింటి క్రొత్తకోడలు కాపురానికి వచ్చిందికదా! రాత్రి మొగుడు పక్కలోనే ఉన్నాడట, తెల్లవారిచూస్తే మెడలో గొలుసు కన్పడలేదట. మొగుణ్ణి అడిగితే నే నింతకు ముందేకదా లేచి దొడ్లోకి వెళ్ళింది? ఎక్కడకు పోతుంది పక్కలోనో, మంచం క్రిందో పడివుంటుంది అన్నాడట. అత్త మామలు, బావ మరదులు వచ్చి గదంతా వెదికారట. ఊహూ, కన్పడితేకదా! "ఎంతసేపయిందిరా అబ్బాయి ఇక్కడనుండి దొడ్లోకి వెళ్ళి" అని తల్లి కుమారుణ్ణి అడిగితే, "ఎంతోసేపు కాలేదు. లేచి పశువులకు మేతవేసి చెరువుగట్టుకు వెళ్ళివచ్చాను అంతే" అన్నాడట. రాత్రి కోడలు మెళ్ళోనే వున్నది. అర్ధరాత్రివేళ మెలకువవచ్చి తడుము కొంటే మెళ్ళోనే వున్నది. ఇంతలో ఏమైపోయిందని ఆందోళన పడుతున్నదట. ఒసే సోమమ్మా, ఏమైపోయిందంటావ్ అన్నది. చాలా చిత్రంగావుందే పుల్లమ్మా. మన కెందుకుగాని అసలా కోడలంటే అత్త కిష్టం లేదట. మొదటనే ఆ సంబంధం వద్దో అని గల్లంతు చేసిందట. తండ్రి కొడుకు ఆమెమాట సాగనిచ్చారు కాదట. అందుకని కాపురానికివచ్చిన కోడల్ని సరిగా

పలకరించలేదట. అప్పటినుంచి అత్తకు కోడలుకు ఎడమొగం పెడమొగం అని మొన్న ఆ దరి చుక్కమ్మ చెప్పింది. ఇదంతా అత్త రంగమ్మ మాయేమో అని సోమమ్మ బుగ్గ నొక్కుకుంది.

యువకుడు రాజారావు బైట వాకిట్లో నుంచున్నాడు. సాయంత్రం చల్లగాలి వీస్తున్నది. అటునుంచి స్నేహితుడు వెంకట్రావు వస్తున్నాడు. కెర్లిన్ లాగు, బుష్‌షర్టు. "ఎక్కడ నుంచిరా? రా, లోపలికి" అని ఇంటిముందు వరండాలోకి దారి తీశాడు రాజారావు. "సినిమా మాటినీకి వెళ్ళి వస్తున్నారా" అని వెంకట్రావు అనుసరించాడు. "ఏమి పిక్చరా?" అడిగాడు రాజారావు. "భలే తమాషా అయిన పిక్చర్. విచిత్రంగావుంది" అన్నాడు వెంకట్రావు. "సరిగా చెప్పి ఏడవరా" అన్నాడు రాజారావు. "పిక్చర్ కేమిగాని అందులో స్వర్గలోకం చూపించారురా! నందనోద్యానమట, అప్సరసలట, తపస్సుచేసిన తాపసులట, యజ్ఞాలుచేసిన సోమయాజులట, యుద్ధంలో మరణించిన వీరులట—భలే తమాషాగావుంది. పూలచెట్లు, పొదలు, సగం మొండిమొలలతో పడుచు అందగత్తెలు, వీళ్ళను వేటాడే రక రకాల పురుషులు, తాపసులని చెప్పానే వాళ్ళ గడ్డాలు, అట్టలు కట్టిన జుట్లు, లంగోటీలు—ఇక్కడ సన్యాసులను జూచినట్లేవున్నది. వాళ్లు పట్టుకోబోతే ఆ పడుచు లంజలు కిలకిల నవ్వుతూ పొదలలో దోబూచులాడటం భలే విచిత్రంగా వున్నది. నాలుగు వెనుక పరకలతో బోడిగుండ్లు, రుద్రాక్షమాలికలు, చెవుల కుండలాలు అయ్యవార్లు చప్పరించుకుంటూ వెంటబడితే ఇహిహి అని హేళన చేస్తూ, అవయవాలను వయ్యారంగా కదలించుకొంటూ లగూడీసే అప్సరసలు, కండ్లు మిటకరించి, ఎదురు బొమ్మ విరిచి, మీసాలు మెలివేస్తూ, రా పిల్లా రా అంటు దుమికేటట్లు పోజుపెట్టి తొందర పెట్టే యుద్ధ మృతులను ఆశపెట్టి, కను సంజ్ఞచేసి, చిరునవ్వు లొలికించి, తప్పించుకుతిరిగే సుందరాంగులు ఏమాశ్చర్యం! అటు ప్రక్కచూస్తివా దేవతా నాట్యమట, విచిత్ర భంగిమలతో చేతులు

తిప్పుతూ, కళ్ళు ఎగరవేస్తూ, నడుము ఊపుతూ, పిర్ర లాడించుతూ, కళ్లు తళతళ లాడించుతూ గంతులువేసే భామినులు —భలే బాగుందంటే నమ్మ్. సినిమామాట దేవుడెరుగు కాని ఆ బోగంసానుల నక్క-జిత్తులు, వాళ్ళ గంతులు చిందులు, వాళ్ళ నవ్వులు పొంగులు, అంతకంటె వారి చిద్విలాసాలు చూస్తే చాలురా, విచిత్రంగా వున్నాయిరా" అంటూ వెంకట్రావు చెప్పుకు పోతుంటే ఆశ్చర్యంగా నోరప్పళించి విన్నాడు రాజారావు.

సోమరాజు అన్నాడు వీర్రాజుతో ఒకేవీర్రాజూ, సాయంత్రం చిత్రప్రదర్శనమట ఆ కళామందిరంలో. వెళ్దాం వస్తా వట్రా అన్నాడు. 'సరేలేరా వెళ్దాం, కాలక్షేపమైనా అవుతుం'దన్నాడు వీర్రాజు. స్నేహితులిద్దరు రిక్షా ఎక్కి ఆ ప్రదర్శనం చేరుకొన్నారు. కార్లు, వచ్చేజనం పోయేజనం కోలాహలంగా వున్నది. మెల్లికిక్కి హాలులోకి చేరుకొన్నారు. ముఖద్వారంలో కేటలాగులు తీసుకొన్నారుగాని వానిని చదవకముందే రంగు రంగుల బొమ్మలు చిన్నవి, పెద్దవి తళుక్కు తళుక్కుమంటు ఎదురయ్యాయి. ఈ ప్రక్కనుంచి వెళ్దామురా అనుకొని చూడటం ఆరంభించారు. ఒక పెద్ద చిత్రపటం ముందు ముగ్గురు నల్గురు గుమిగూడి తర్కించుకొంటున్నారు. వీళ్ళక్కడాగి కేటలాగులు తెరచారు. 'పల్లె పడుచులు' అని వ్రాసివుంది. తలమీద ఏవోనిండిన తట్టలున్నాయి. పల్లెస్త్రీలని ఉన్నది కాబట్టి ఆ తట్టలలోనివి చేపలేమో అనుకొన్నారు. అయితే అవి చేపలా లేక కూరగాయలా అని సందేహం కలిగింది. నిగాపెట్టి చూచారు. బుట్టలలోనివి చేపలైనా, కూరగాయలైనా అసలు వీళ్ళు స్త్రీలా! కన్నుల్లో ఒకటి చెవిలోకి పోయినట్లు, ఇంకొకటి ఊడిపడేటట్లు అస్వాభావికంగా ఉన్నవి. ఎదురొమ్ములు చూస్తే ఒకటి మెడపైకి, రెండోది బొడ్డుమీదకు వెళ్ళుచున్నవా అన్నట్లున్నవి. బట్టలు చూస్తే మామూలు బట్టలుగా కన్పడటంలేదు. మొత్తంమీద అదో మయంగావున్నది. కొంతదూరంపోగా ఇంకొక పెద్ద పటం. ఏదో అల్లిబిల్లిగా అలికినట్లున్నది. ఇదేమిటని కేటలాగులు తిరుగవేస్తే 'ఓడ' అని వ్రాసివుంది. ఇది నిజంగా ఓడేనా! ఓడ సముద్రంలో

ఉండాలికదా! లేకపోతే రేవున ఉండాలికదా! ఇక్కడ రేవెక్కడ, నీళ్ళెక్కడ? ఊదా నల్లరంగులపూత, మధ్య మధ్య ఏవో చారలు తప్ప ఓడ ఆకారమే కన్పడదే అనుకొంటూ ముందుకు సాగిపోగా, ఇంకొకప్రక్క ఒక బండరాయివలె గుండ్రముగావున్న ఆకారంమీద పిలకల్లాగా మచ్చలున్నాయి. ఇదేమిటో అని కేటలాగులు తిరుగవేస్తే 'ఉద్యానవనం' అని ఉన్నది. ఇదేమి ఉద్యానవనంరా బాబు! నరకంలోనైనా ఇటువంటి తోట లుంటవా? అసలు చెట్లెక్కడ? ఈ బండరాయి మీదచెట్లు మొలుస్తాయా! అని విస్తుపోయి, ఇక చాల్లే అని అటు నిటు చూచి స్నేహితులిద్దరూ బైటబడ్డారు. ఒరే, ఇవి చిత్రాలు కావురా విచిత్రాలనుకొంటూ ప్రక్కనున్న కాఫీహోటల్లో దూరారు, కలిగిన ఏహ్యాన్ని కాఫీనీళ్ళతోనైనా కడిగి వేసుకొందామని.

వింత - విడ్డూరం

"విన్నావటే రాజమ్మా ఈ వింత! మా ప్రక్కింటి కోడలుకు ఒకేసారి నల్గురు పిల్లలు పుట్టారు రాత్రి. ఒక బిడ్డతోనే సతమత మౌతుంటే ఆ తల్లి నల్గురు బిడ్డలను ఎట్లా సాకుతుందో" అని ఆశ్చర్యపోతూ దారిని పోతున్న రాజమ్మతో తన వాకిట్లో ముగ్గులు వేస్తున్న వెంకమ్మ చెప్పింది. "అలాగా ఆశ్చర్యమే! మన మెరుగంగాని అక్కడక్కడ ఓ తల్లి నల్గు రైదుగురను కంటుందట. ఈమధ్య మావారు పేపరు చదువుతు తెల్లవాళ్ళ దేశాల్లో తరుచు ఇటువంటి కాన్పులు జరుగుతుంటాయని, పుట్టిన పిల్లలను తలిదండ్రులేగాక ఇరుగు పొరుగువాళ్లు శ్రద్ధతీసుకొని పుట్టిన పిల్లలందరు బ్రతికేటట్లు విశ్వప్రయత్నాలు చేస్తారని చెప్పారు. ఏమో, మనుష్యుల్లోకూడ కుక్క, పంది వంటి స్వభావము కలవాళ్లుంటారు కాబోలు. దానికేమిగాని అంతకంటె

వింత ఈమధ్య మా ప్రక్కవీధిలో జరిగింది. ఎల్లమ్మ అనే ఆమెకు తోకవున్న బిడ్డ పుట్టాడు. బ్రతక లేదటలే. బ్రతికి పెద్ద వాడై తే ఎన్ని కోతిచేష్టలు చేసేవాడో. ఈమధ్య మా ఆవు ఎనిమిది కాళ్లు, రెండు తలలున్న దూడను పా రేసింది. బ్రతికివుం టే ఎంత కీడు మూడేదో. ప్రపంచంలో ఇట్టి వింతలు జరుగుతునే వుంటవి వెంకమ్మా" అంటూ సాగిపోయింది రాజమ్మ.

"ఒసే సుబ్బులూ, అవ్వ, ఏమి చెప్పమంటావ్! ఎంత విడ్డూరం, ఎంత కులభ్రష్టం!" అంట్లు తోమటానికి వచ్చిన పని మనిషితో బుచ్చమ్మ వాపోయింది. "ఏమి టమ్మగోరూ?" అని సుబ్బులు అడిగింది. "ఇం కేమిటే, మా పిన్నికూతురు రాత్రి వా ళ్ళింట్లో మిషన్‌కుట్టే సాయెబ్ కుర్రాడితో లేచి పోయిందట. ఆ ఇంటిలో అందరూ మామూలుగానే పడుకున్నారట. ఏదో తలుపు తీసినట్లు చప్పుడై తే నిద్రపట్టక మంచంలో మసలుతున్న ముసలాయన లేచి చూస్తే తలుపులు దగ్గరకు వేసివున్నవట. దొంగలు పడ్డారేమో అని కొడుకును లేపితే పిల్ల కన్పడలేదట. ఇక్కడ అక్కడ వెదకి ఆచూకీతీస్తే ప్రక్కింటి సాయెబ్ కుర్రాడు కూడా మాయమైనాడని తెలిసిందట. వాళ్ళిద్దరి దొంగచూపులు, ముసి ముసి నవ్వులు తల్లి గమనించి చివాట్లు పెట్టిందట. ఇం కేం, ఇక లాభం లేదనుకొని వా ళ్ళిద్దరు అర్ధరాత్రి ఉడాయించారు. ఏం పిదపకాలమో. మాది సంప్రదాయంగల కుటుంబం. మావంటి వాళ్ళు తలెత్తి తిరగకుండా ఇటువంటి విడ్డూరాలు జరుగు తున్నాయి" అని కళ్ళనీళ్ళు చీర చెఱగుతో ఒత్తుకుంది పాపం బుచ్చమ్మ.

మిత్రుడు - స్నేహితుడు

మిత్రుడు, స్నేహితుడు అను మాటలను పర్యాయ పదాలుగా ఉపయోగిస్తున్నాము. కాని నిజానికి ఈ రెంటికి చాలా వ్యత్యాసమున్నది. ఎక్కడనో ఒకటి రెండుసార్లు చూస్తే ముఖ

పరిచయ మవుతుంది. అప్పుడప్పుడు చూస్తూ ఏవో రెండు మూడు మాటలు మాట్లాడుకోవటం జరిగితే పరిచయ మవుతుంది. ఊళ్ళో వాళ్ళైనా, ప్రక్కింటివాళ్ళైనా బంధుత్వమో ఇంకా ఏదైనా సంబంధమో లేకపోతే పరిచయాలక్రిందకే వస్తారు. పదిసార్లు కలసికొన్నా వందసార్లు కలసికొన్నా ఆదరణ, ఆప్యాయత లేకపోతే మిత్రులు కారు.

చనువుగా రాకపోకలు జరుపుకోవటం, స్వేచ్ఛగా మాటలు కలుపుకోవటం, ఉభయులకు ఇష్టమైన లేక అభిమానమైన కార్యాల్లో కలసి పాల్గొనటం, మాట మంతీ, సంప్రదింపులు సలహాలు నెరపుకోవటం, ఇచ్చిపుచ్చుకోవటాలు కొనసాగించుకోవటం, ఈవిధంగా ఒకరియందు మరొకరికి కొంత అభిమానంతో మెలగటం, సామాన్యవిషయాల్లో ఒకరి కొకరు తోడుపడటం, మైత్రిచిహ్నాలు, లక్షణాలు. స్నేహమనేది మైత్రికంటె మిక్కిలి బలమైనది, సన్నిహితమైనది. దానికి నిఘంటువు చెలిమి, ప్రేమ అని అర్థము చెప్పుచున్నది. చమురు, నేయి అని కూడా తెలుపు చున్నది. చమురులేనిదే ప్రేమ వెలుగదు. నేయిలేనిదే వారి మధ్య జీవితం రుచించదు. స్నేహితుడనగా నెచ్చెలి. నెచ్చెలి అనగా ప్రియ సఖుడు. అంతేకాదు ఆప్తుడు, ప్రాణమిత్రుడు, స్నేహితుడు, చెలికాడు. ఆటపాటల్లో, వినోద వేడుకల్లో సగపాలు పంచుకొనేవాడు. కష్ట నిష్టూరాల్లో విచారంలో, ఆపదలో సమ భాగస్తుడు. నిజానికి చెలికాడు లేక నేస్తుడు శరీరంలో అర్ధభాగం. సిసలైన నేస్తులు ఏకశరీరులో అన్నట్లు వ్యవహరిస్తారు. వారు హావ భావాల్లో, చేష్టల్లో, ఆలోచనల్లో, కార్యాచరణల్లో ఏకత్వం పొందినవారు. శరీరాలు రెండైనా వ్యక్తిత్వం ఏక రూపమైనవారు.

మిత్రుని అభిమానం, ఆదరణ, తోడు, సహాయం పరిస్థితు లనుబట్టి, కాలాన్నిబట్టి హెచ్చుతగ్గులు కలిగిఉంటుంది. వీలుంటే తనకు లాభిస్తే లేక ఇబ్బంది లేకపోతే మిత్రుడు ఒకప్పుడు వట్టి మిత్రుడు, మరొకప్పుడు ప్రియమిత్రుడు, ఇంకొకప్పుడు శ్రద్ధేయ మిత్రుడు, మేము మిత్రులమని చంకలు కొట్టుకొనేవారు ఏదో

అభిప్రాయభేదంవచ్చి, ఏదో తగాదావచ్చి బద్ధ శత్రువులైన వారున్నారు. లాభనష్టాల విషయంలో కీచులాడుకొని చావులు కోరుకొనేవారున్నారు. స్నేహితుడట్లుకాదు. అతడు ప్రాణ మిత్రుడు, ఆప్తమిత్రుడు, జీవితకాలం నిలిచేవాడు, స్వార్థమెరుగని వాడు. తనమేలు, అతనిమేలు అనే భేదమెరుగనివాడు. ఉదాహరణకు, శ్రీరామ సుగ్రీవులది మైత్రి. కృష్ణార్జునులది స్నేహం. తన అవసరాన్నిబట్టి రాముడు, తన కార్యసాఫల్యంకోసం సుగ్రీవుడు మిత్రులయ్యారు. ఆత్మలు కలసికాదు. కార్యార్థం సుక్షత్రియుడు కాని, ధర్మానికి కట్టుబడినవాడుకాని చేయగూడని పనిచేసి చాటునుండి వాలిని శ్రీరాముడు సంహరించినా, ఆ విశ్వాసంగూడా లేక సుగ్రీవుడు సీతాన్వేషణలో అశ్రద్ధచేశాడు, ఆలస్యంచేశాడు. శ్రీరాముడు ఒక గుహలోచేరి ఆకు లలములు తినుచు ఎప్పుడు వర్షాకాలము గడచిపోతుందా అని దీనునివలె వేచియుండగా, సుగ్రీవుడు మహాసౌధాంతంలో మహారాజ భోగా లనుభవించుచు, రుమతోనేగాక తారతోకూడా కులకటంలో మైమరచిపోయాడు. అతనికి కాలగతి తట్టలేదు. రాముని పంపున లక్ష్మణుడు వెళ్ళి నా శస్త్రాస్త్రాలతో మిమ్ముల నందరిని నాశనం చేస్తానని బెదరించే వరకు సుగ్రీవుడు కదలలేదు, మెదలలేదు. సుగ్రీవుని ప్రవర్తన స్వార్థంతో కూడిన మైత్రి. అది సామాన్యంగా మిత్రత్వం అనే దానికి సరిపోతుంది. ఇక కృష్ణార్జునుల మైత్రి, స్నేహం. ఖాండవ దహనమందు, సైంధవవధ విషయంలో కర్ణుని సంహరించు కాలమున కృష్ణుడు తాను, అర్జునుడు ఏకత్వంకలవార మనుకొనక పోతే అర్జునుడు బైటపడేవాడు కాదు. అంతెందుకు సారథిని చంపటం సంకులసమరంలో జరుగుతూంటుంది. ఆయుధాన్ని ధరించని సారథిబ్రతుకు పగవారి గుప్పెట్లో వుంటుంది. శ్రీకృష్ణుడు పార్థసారథి అవటమే అర్జునునియందు తనకు గల గాఢప్రేమ సూచిస్తుంది. తా నమితంగా గౌరవించే తన అన్న బలరామునికి వ్యతిరేకంగా సుభద్రను అర్జునునకు కట్టబెట్టటం సామాన్య మైత్రికి చేరినదికాదు. కృష్ణార్జునులు నిజమైన చెలికాండ్రు, స్నేహితులు. అందుకనే వారిని నరనారాయణులన్నారు భిన్నత్వంలో ఏకత్వం కలవారని చెప్పటకు.

పురుష స్త్రీ సంబంధం తీసుకుంటే భార్యా భర్తల అనుబంధం సాంగత్య మటుంచి, పతివ్రతాధర్మం అని చెప్పబడే దాన్నటుంచి శ్రీకృష్ణ రుక్మిణుల సంబంధం మైత్రి. ఆయన సత్యభామ అనుబంధం స్నేహం. శమంతకమణి అన్వేషణ సందర్భంలో, (కె. యమ్. మున్షిగారి కృష్ణావతారం, సత్యభామా పుస్తకం చూడండి) నరకాసురవధలో సత్యభామ వర్తన ఆమెను నెచ్చెలి (నేస్తి) నిగా తప్పక తోపిస్తుంది. ద్రౌపదిని అర్జునుడు గెల్చుకొన్నా, ధర్మజుడు జ్యేష్ఠుని నెపమున ఆమె నించుమించుగా తన స్వంతం చేసుకొన్నా పైజెప్పినట్లు భార్యాభర్త ధర్మ మటుంచి ధర్మజుడు, అర్జునుడు (నకులుడు, సహదేవుడు విషయం వేరే చెప్పనక్కరలేదు) ద్రౌపదికి మిత్రులవంటివారు. ఆమెకు స్నేహితుడని చెప్పబడినవాడు భీము డొక్కడే. ఆమె ప్రతిజ్ఞలను నెరవేర్చినవాడు, ఆమె కోర్కెలను (సౌగంధిక పుష్ప సేకరణ) తీర్చినవాడు, ఆమెకొరకు తన ప్రాణాన్నైనా బలిపెట్టటకు సంసిద్ధుడుగా నుండినవాడు భీముడు మాత్రమే. తన కష్ట కాలములో కీచకుని విషయంలో, సైంధవుని విషయంలో ఆమె మొర పెట్టుకున్నది భీమునికే.

కాబట్టి మిత్రుడనేవాడు వేళావిశేషం, స్నేహితుడు। యావజ్జీవం.

దాయాది - బంధువు

దాయాది అనగా జ్ఞాతి, సగోత్రుడు. దాయాదుల్లో ముఖ్యుడు పుత్రుడు. తరువాత అన్నదమ్ముల కొడుకులు, ఇంక కొంచెం దూరం తాత సహోదరుల కొడుకులు ఇత్యాది. దాయము ననుభవించువాడు దాయాదుడు. సామాన్యార్థమున దాయమనగా పిత్రార్జితం. మాతామహుడు, మాతామహి నుండి ప్రాప్తించిన ఆస్తిని కూడా దాయమే అంటారు. కాని మనము పిత్రార్జితమనే

దానినే దాయ మంటాము. ఈ దాయానికి భాగార్హులైన వారు మన జ్ఞాతులు, రక్తబంధువులు. బంధువు అనగా జ్ఞాతి కాని చుట్టము. తల్లి తరఫువారు కావచ్చును లేక భార్యతరఫువారు కావచ్చును. వివాహమూలంగా సోదరీ సోదరుల తరఫున కావచ్చును. తల్లి తరఫు బంధువులు చాలామంది యుండవచ్చును. మేనమామ, పెద్దతల్లి పినతల్లులు వారి సంతానం ఆ సంతాన సంబంధీకులు. అక్కచెల్లెండ్రవల్ల ఏర్పడిన చుట్టాలు, సోదరుల భార్యలనుండి చుట్టరికం కలసినవారు వీరుగాక పెదతండ్రి, పినతండ్రి భార్యలమూలంగా రాకపోకలను సాగించుకొనేవారు, ఇలా అనేకమంది బంధువులుగా రూపొందవచ్చును.

దాయ అనగా జ్ఞాతి, సగోత్రుడనేగాక శత్రువు అనే అర్థమున్నది. దాయము అనగా ఆపద, ఎత్తిపొడుపుమాట, ఖండనము, లయము అను అర్థములున్నవి. ఈ చెడు అర్థములను సామాన్యంగా దాయ భాగస్థులు రుజువుచేయుచున్నారు. అస్తి పంపకంలో మా కన్యాయం జరిగిందని, మమ్ములను మోసగించారని ఒకరితో నొకరు తగాదాలాడుకొనుట జరుగుచుండును. భూములను పంచుకొనినప్పుడు సరిహద్దులు ఉమ్మడిగానుండును కదా. గట్లు నరకినాడనో, తన చేనుకు నీరు సక్రమంగా రానివ్వటంలేదనో విరోధాలు పెంచుకొంటారు. నీ ఇంటి చూరునీళ్ళు నా ఆవరణలో పడుచున్నవనో, నీ పశువులు మా వాములు మేసిపోవుచున్నవనో, మీ కోళ్ళు మా పాదులు పాడుచేయుచున్నవనో, మీ రూడ్చిన కసవు మా ఇంటి వైపుకు వేస్తున్నారనో తగవులు పెంచుకొనటం, ఇంటి స్త్రీలు దుమ్మెత్తిపోసుకోవటం జరుగుచుంటవి. నాన్నా, వాళ్లు తాటిచేను తీసుకుంటే ఎందుకు ఒప్పుకొన్నావ్? దానికి బదులు మనకు చవిటిచే నిచ్చారు కదా అని కొడుకుల క్రోధావేశాలు, పెత్తనం చేసి డబ్బు దాచేసుకొని మనచేతికి చిప్పనిచ్చారని భార్య సాధింపులూ, ఇదుగో చూడండి, మీ మరదలు నన్నెట్లా సాధిస్తున్నదో చూస్తూ వూరుకుంటారేమి టని ఎదురింటావిడ పోరు, ఈ విధంగా దాయాదుల తగవులు సాగిపోతవి. అస్తి పాపిష్టిదికదా, నిజమైనా, అబద్ధమైనా అవతలాయన ఎక్కువ

కాజేశాడన్న అనుమానం ఇవతలివానిని బాధిస్తూనే వుంటుంది. అందులో తెలివితేటలవల్ల నైతేనేమి, తండ్రి కొడుకులు తగు శ్రద్ధతోకష్టపడటంవల్లనైతేనేమి, అదృష్టంకలసిరావటంవల్లనైతేనేమి అవతలి దాయభాగస్థుడు తనకంటె ఎక్కువ ఆస్తిపరుడుగా రూపొందినా, లేక అతని కొడుకులు చదువుకొని వృద్ధిలోకి వచ్చి ఉద్యోగాలుచేస్తున్నా ఇవతలి అన్నదమ్ములు సహించలేరు. ఇది దాయల ప్రవృత్తి.

బంధువులు పై జెప్పినట్లు దగ్గరబంధువులు, దూరపు బంధువులు ఏదో చుట్టరికంగా వచ్చి ఒక పూటో అరపూటో విందారగించి మంచి మనస్సుకలవాడు, మనవాడు సిరిసంపదలతో తులతూగుచున్నాడని సంతోషిస్తారు. ఈర్ష్యావంతుడు వీరికెంత సిరికలిగిందని అసూయతో వెళ్ళిపోతాడు. వాళ్ళ హర్ష, ఈర్ష్యాలు పట్టించుకోవలసిన అవసరంలేదు. ఇక దగ్గర చుట్టాలమని వచ్చే వాళ్ళతోనే చిక్కు. అందరు మంచివారుండరుకదా. కొంత మంది అయినా కీడుబుద్ధి గలవాళ్ళు, దురాశపరులు ఉంటారు. ఈ రెండోరకం ఎక్కడ, ఏది దొరుకుతుందా పట్టుకుపోదాం అని కాచుకొని వుంటారు. "బాబాయి, మా గేదె ఎండిపోయిందే. మా పిల్లలు ఇంత మజ్జిగచుక్కకు వాచిపోతున్నారు. మీ కోడలు మీ బాబాయి నడిగి వాళ్ళకు చాలా గేదెలున్నాయి కదా, ఏదైనా తరిపిగేదెను తోలుకురండని పంపించింది" అంటాడు. మాట తీసివేయలేక తీరా ఒకగేదెను చూచి ఇస్తే, వీడి సొమ్మంతా పోయినట్లు ఈ ఒక్కగేదె నిచ్చాడని లోలోపల సణుగుకొంటాడు. ఇంకొక దగ్గరబంధువు "మామా, మా కో సంవత్సరం జనపకాడ పర్కైనా కాలేదు. ఇందాక దొడ్లోకి వెళ్ళితినికదా మీ పెద్ద వాములనుచూచి అడగబుద్ధైంది. రెండు బండ్ల కాడ తోలిపెట్టిస్తే మేము గట్టుక్కుతా" అంటాడు. ఇంకొకాయన "బావా, ఇబ్బంది వచ్చింది. నాలుగు వేలుంటే సర్దు. నిక్షేపంలాగా నోటు వ్రాసిస్తాను. వచ్చేపంటల్లో చిల్లిగవ్వతోసహా తీర్చివేస్తాను" అనిబెట్టుగా అడిగినట్లే అడుగుతాడు. అంత తాహతు

లేనివాడు కూతురు పెండ్లి అనో, ఏ సత్కార్యమన్నా చేస్తున్నానో నాలుగుడబ్బులు గుంజుకొంటానికి యత్నిస్తాడు. ఈ రకం బంధువులందరు జలగలవంటి వారే. వాళ్ళ అవసరా లెట్లున్నా, అవతలివాడు బాగున్నాడే ఏమైనా గుంజుకొందాం, అంత మాత్రాన చస్తాడా అని మనస్సులో అనుకొంటారు. అత నంత ధనికులం మనం కామే అని క్రోధం. నాలుగు డబ్బులు చేజిక్కించుకొనే అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకోవాలనే దురాశతో మంచి చెడులను విచారించరు.

కుటుంబాభిమానంలేని జ్ఞాతులు శత్రువులు. మంచి చెడులు తెలియని బంధువులు పరమ శత్రువులు.

హాసం - పరిహాసం

హాసం అనగా స్మితం, చిరునవ్వు. హాసంలో డిగ్రీలవారిగా హసితం, ప్రహసితం, అపహసితం లున్నవి. అపహసిత మనగా అపహాస్యమని శబ్దరత్నాకరం, వర్ధనమని శబ్దార్థదీపిక తెల్పుచున్నవి. కాని సామాన్యార్థంలో హాసం చిరునవ్వే. పరిహాసం విషయంలో పై రెండు నిఘంటువులు పరియాచకం అని అర్థం చెప్పుచున్నవి. అయితే శబ్దార్థదీపిక ఒకడుగు ముందుకువేసి గేలి, ఎగతాళి అర్థములు కూడా చెప్పుచున్నది. మామూలుగా మనం పరిహాసాన్ని గేలి, ఎగతాళి అనే అనుకుంటాం. కాబట్టి పరిహాసాన్ని గేలి, ఎగతాళిగానే ఎంచుకుందాం.

హాసం హృదయాహ్లాద జనితం, మనోరంజకకరం. నూత్న వధూవరుల, కలసికొన్న మిత్రుల ఆర్ద్రహృదయాల్లోనుండి వికసించే సుగంధ పరిమళం, వరుని చిరునవ్వు, మందస్మితంకంటె హెచ్చుగానుండినా వధువు మందస్మితం ముసిముసినవ్వు మాత్రమే. మిత్రుడు చిరునవ్వుతో పలుకరిస్తే రెండో మిత్రుడు

చిరునవ్వుతో ప్రత్యుత్తర మిస్తాడు. ద్రౌపది సంభ్రమ సంతోషాలతో మత్స్యయంత్రాన్ని పడగొట్టిన అర్జునుని సమీపించి మందహాసంతో అతని మెడలో పూలదండను వేయగా, మారు వేషంలోనుండిన విజయుడు గంభీరముద్ర ధరించి హాసం చేశాడు. రహస్యమెరిగిన కృష్ణుడు, తన హృదయంలో నుద్భవించిన సంతోషాతిశయాన్ని బైటబడనీయక వచ్చీ రానట్లుండిన చిరునవ్వుతో సరిపెట్టుకొన్నా అర్జునుడు, ద్రౌపది వచ్చి తనకు నమస్కరించినప్పుడు చిరునవ్వే తెచ్చుకొన్నాడు. అలిగినప్పుడు, ప్రణయ కోపం ధరించినప్పుడు ప్రియుడు మందస్మితముతోనే ప్రియురాలిని అనునయిస్తాడు. బ్రతిమాలుకొంటాడు. ప్రియ పుత్రిక లేక ప్రియ పుత్రుడు కోరిన కోర్కె అసమంజసం కానప్పుడు, అలాగే అని పిత చిరునవ్వుతో తన అంగీకారాన్ని తెలియజేస్తాడు. ప్రియమిత్రులు ప్రీతినిచ్చే విషయాలను మాట్లాడుకొనునప్పుడు చిరునవ్వుతో సంభాషిస్తారు. ఒకరి నొకరు వీడ్కోలు సమయాన కౌగలించు కొన్నప్పుడు వారి ముఖములలో చిరునవ్వు తాండవించు తూంటుంది.

అయితే హాస మన్ని సందర్భాలలో హృదయరంజ కత్వాన్ని సూచిస్తుందని చెప్పలేము. లోపల రగిలే క్రోధాన్ని బైటబడనీయని చిరునవ్వు, వీడు డాబుతున్నాడు వీనిని తృటిలో బోల్తా గొట్టించగలనను చిరునవ్వు, మోసం జేసి లోబరచుకొనుటకు చిరునవ్వువంటి వుంటవి. రాజసూయంలో తనను నిందించు చున్న శిశుపాలుని తిట్లను లెక్కబెట్టుకొనుచు, వీనికి కాల మాసన్న మైనదని శ్రీకృష్ణుడు ధరించిన చిరునవ్వు, జూదంలో యుధిష్ఠిరుని చిటికలో బోల్తాగొట్ట గలనని శకుని చిరునవ్వు ఇట్టివే. మోసంచేసేవారి చిరునవ్వు ఈ రకానికే చెందుతుంది.

హాసం కొన్ని దురుద్దేశాలకు, దుర్మార్గాలకు ఉపయోగ పడినా దాని నిజస్వరూపం సంతోషాన్ని, ఆప్యాయతను తెలియ బరచునదియే.

ఇక పరిహాసం. లోపల రగులుచున్న ద్వేషాన్ని, క్రోధాన్ని వ్యక్తబరచేది పరిహాసం, ఎగతాళి. రాజసూయయాగానికి

అతిథిగావచ్చి, మయనిర్మిత సౌధాంతంలో భ్రమపడి కట్టుబట్టలను తడుపుకొన్న దుర్యోధనుని జూచి ద్రౌపది నవ్వింది. ఇది తప్పక ద్వేషంతో గూడిన ఎగతాళి. జూదంలో ఓడిపోయి భార్య నవమానించుచుండగా అనదలవలె చూచుచు ఊరకుండిన పాండవులను రాధేయుడు చేసిన పరిహాసం క్రోధంతోగూడిన ఎగతాళి. ఆ సందర్భంలో ద్రౌపదికి ఆసనంగా తన తొడను దుర్యోధనుడు చూపించటం భీమాదులను గేలిచేయుటకొరకే.

పరిహాసం అంటే పరియాచకమని అర్థమున్నదికదా! బావ మరదుల, వదిన మరదళ్ళ చతుర సంభాషణ, సూటిపోటి మాటలు, దెప్పులు పరిహాసంక్రిందజమకట్టాము. ప్రీతి, అభిమానం, చనువు ఉన్న చలోక్తి, పరియాచకమవుతుంది. ఈసో, అసంతృప్తో, కోపమో ఉండి బహిరంగపరచుట కిష్టం లేనప్పుడు సాధనంగా ఉపయోగించుకొన్న పరిహాసం ఎగతాళి లేక హేళన అవుతుంది. సందర్భాన్నిబట్టి ఎగతాళిని పరియాచకమనుకొనినా పరిహాసం నిజముగా గేలి లేక హేళనే అవుతుంది.

కాబట్టి ఏ రూపానవున్నా పరిహాసం విసర్జనీయం.

సరసం - విరసం


సరసమనగా విలాసం, శృంగారచేష్ట, రసముతోగూడినది, మనోహర మను అర్థములున్నవి. కాని ఇక్కడ నా ఉద్దేశం శృంగారవిషయం, కావ్యరస విషయం కాదు. మనోహరమను అర్థమే నాకు కావలసింది. ఈ అర్థంలో మృదువైన సంభాషణ, ప్రసన్నమైన నడవడి, ఆకర్షణీయమైన ఆలోకనం, పూల మెత్తదనం, తెనె మాధుర్యం, పాయసం రుచి, హంస నడక, నెమిలి నృత్యం, గులాబి పరిమళం వీని సమ్మిళితసారం. హృదయ మిచ్చి పుచ్చుకొన్న మిత్రుల చెప్పుకోవటాలు, సహృదయంతో స్నేహ పూర్వకంగా మాట్లాడుకొను స్త్రీ పురుషుల సంభాషణ, కార్యార్థ

లైన దూతల విన్నపము, యువతీ యువకుల సమాగమాన్ని సాధించదలచుకొన్న దూతిక మృదు మధుర భాషణ సరసముగా నుంటవి. కృష్ణార్జునుల మధ్య నడచుమాటలు, ద్రౌపది యధిష్ఠిరుల ప్రశ్నోత్తరాలు, సత్యభామ ద్రౌపదిల సంప్రదింపులు, కర్ణ దుర్యోధనుల మంతనాలు సరసముగా నుంటవి. ఇపి మనస్సును నొప్పించవు. సౌహార్దమును, ఆప్యాయతను వెలిబుచ్చుతవి. ఇట్టివి తప్పక మనోహరములు.

విరసమనగా విరుద్ధ రసముగలది, స్నేహముయొక్క భంగ పాటు, కలహం అని శబ్దార్థదీపిక. నా అభిప్రాయం స్నేహానికి భంగం కల్గించునదియే విరసమని. మరిన్ని మోటు సరసం కూడా విరసం క్రిందకే వస్తుంది. ఈ విరసం గడ్డిలో దాగిన ప్రాచుపాము వంటిది. పొరపాటున ఆ ప్రక్క నడిస్తే, పాదమటువేస్తే చప్పున కాటువేస్తుంది. కాబట్టి మనం స్నేహంచేసేవారితో, కలసి మెలసి తిరిగేవారితో, బంధువులనుకొనేవారితో సందర్భాన్నిబట్టి చనువుతీసుకొనినా, విశేషాన్నిబట్టి హాస్యమాడినా, అవసరాన్నో, వీలునోబట్టి పరిహసించినా, వానిని సమయోచితంగా అవతలి వాని స్వభావాన్నిబట్టి, ఉద్దేశాన్ని, కాలాన్నిబట్టి వర్తించాలి. అవతలివా డెంతస్నేహితుడైనా, సహృదయుడైనా, ఓరిమి కలవాడైనా మోటు సరసం అవహేళన, పెడర్థాలకు, అనుమానాలకు వ్యతిరేకాలకు దారితీస్తవి. "సరసము విరసము కొరకే" అని సుమతీశతక కర్త అన్నది పూర్తి యథార్థం కాకపోయినా అతిగానైతే తప్పక సరసం విరసంగా మారుతుంది. తస్మాత్ జాగ్రత్త, జాగ్రత్త.

నా తలిదండ్రులు

నా తల్లి కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, అంగలూరు గ్రామ వాస్తవ్యులు త్రిపురనేని వెంకటాద్రిగారి ప్రథమ పుత్రిక. ఆమెకు ఐదుగురు సోదరీలు, ఒక సోదరుడు. ఆమె తల్లి లక్ష్మమ్మ గారు అక్కినేనివారి ఆడపడుచు. అంగలూరు గ్రామమే. ఆమెకు సొబ్బయ్య, పుల్లయ్య, నారయ్య అను ముగ్గురు అన్న దమ్ములు. అక్క చెల్లెళ్ళన్నట్లు లేరు. మా తల్లికి యుక్తవయస్సు రాగా వరాన్వేషణలో అవివాహితులుగానుండిన మా తండ్రి లింగం వెంకటరత్నంగారి కిస్తామని కబురు పంపారట. ఆ కబురును మన్నింపక గుడివాడ తాలూకా, పెయ్యేరు గ్రామం దుక్కిపాటి జగన్నాథంగారి కుమార్తె వెంకట శేషమ్మగారిని మా నాన్న గారు వివాహమాడారు. వెంకటశేషమ్మగారు పచ్చని శరీర ఛాయతో మోకాళ్ళకంటే తలవెండ్రుకలతో మిక్కిలి అందంగా ఉండేవారట. ఆ కారణమువలన కాబోలు ఆ సంబంధానికి వెళ్ళటం జరిగింది. నిజానికి అంగలూరు మా గ్రామమగు బొమ్ములూరుకు బొటాబొటి రెండుమైళ్ళ దూరమే. పైగా మా మూడో పెదతండ్రి ఆదినారాయణగారు వెంకటాద్రిగారి అన్న రామస్వామిగారి ప్రథమ కుమార్తె శ్రీమతి కాంతమ్మగారిని వివాహమాడి యుండినారు. ఎరిగిన సంబంధమైనా, మా తండ్రికి ద్వితీయ యోగముండినది కాబోలు వివాహమైన సంవత్సరానికే



కీ. శే. శ్రీ లింగం వెంకటరత్నంగారు

(గ్రంథకర్త తండ్రి)

DAMAGE

శేషమ్మగారు ఆడ శిశువును కని పురిటిలోనే మృతి చెందినారు. తరువాత మూడు మాసాలకే అప్పటికిని అవివాహితగానున్న మా తల్లి పున్నమ్మగారిని మా తండ్రి వెంకటరత్నంగారు వివాహ మాడారు. నావంటి సామాన్యుని మా తండ్రివలన కనుటకే కాబోలు మా తల్లి మొదటవద్దన్న పురుషునే ఒక సంవత్సరం దాటిన తరువాత వివాహమాడటం తటస్థించింది. మా తండ్రి పున్నమ్మగారిని వివాహమాడకపోయిన నాకంటె తక్కువ తెలివి తేటలు గలవాని పుత్రునిగా బడసేవారేమో, లేక మా అమ్మ మా తండ్రికంటె ఎక్కువ విద్యాగంధము గల కుటుంబమునుండి వచ్చిన పురుషుని పరిణయమ్మైయుండిన నన్ను అన్నివిధముల మించిన సుపుత్రుని పొందే వారేమో. ఏది ఎట్లైనా నేనుమట్టుకు నా తండ్రికిగాని, తల్లికిగాని పుట్టేవాడను కాను.

నా తల్లి పున్నమ్మగారు లేత గోధుమ వర్ణములో కొంచెము పసిమిరంగు కలిసిన ట్లుండిన దేహచ్ఛాయతో బొద్దుగా ఉండే వారు. మధ్యరకం ఎత్తు. బహుశా 5 అ. 6 అం. ఉండేవారను కొందును. పెద్ద అందగత్తె అని చెప్పుటకు వీలులేదు గాని నిండుగా పొన్న చెట్టువలె చూచుటకు ఆకర్షణీయముగా ఉండేవారు. కొంచెం బుంగముఖమని గుర్తు. నాసలు, ముక్కు సరిపడినవిధం. చేతులు, కాళ్ళు గుండ్రంగా మలచినట్లుండేవి. మాట స్ఫుటము. ఓపిక హెచ్చు. ఇంటిపనులు దక్షతగా చేసుకొనేవారు.

మా తల్లి వివాహమునాటికి అన్నదమ్ములు విడిపోయి ఎవరి సంసారము వారు చేసుకొనుచుండినారు. అందరికంటె పెద్ద సోదరుడు ప్రాతఇంటిలోను, రెండవవారు దాని ప్రక్కఇంటిలోను ఉంటూండగా తతిమ్మా ఐదుగురికి ఐదు క్రొత్త ఇళ్ళు ఒకే పంక్తిలో కట్టించారు. మా ఇల్లు ఆ పంక్తిలో చివరిది. ఇది మండువా పెంకుటిల్లు. కలప, రంగూను పైగోటీకు. చిన్నదైనను బందోబస్తుగా కట్టబడినది. మండువా హాలు పైకప్పుకు బల్లకూర్పు. ముందు వరండా. గచ్చుటరుగులు. వెనుక నూయి, ముందు వెనుక స్థలం. ప్రహరీగోడ వగైరా. ఇంటి ఆవరణను వేరుచేస్తూ వెనుక ప్రక్క ఆనుకొని పశువుల పెంకుటి చావిళ్ళు వగైరా. వెళ్ళి

అయినవెంటనే మా తల్లి కాపురానికి వచ్చింది. ఇప్పటివలెగాక అప్పట్లో చిన్నపిల్లలకే పెళ్ళిళ్ళు. రజస్వల అయితే యుక్తవయస్సు వచ్చినట్లేలెక్క. సాధారణముగా 13 ఏండ్లు నిండిన పిల్లలు రజస్వల అయ్యేవారు. అందువల్ల మా తల్లికి పెండ్లిఅయి కాపురానికి వచ్చేటప్పటికి 14 లేక 15 ఏండ్లు ఉండేవి. మా పితామహుడు మా నాన్నగారి చిన్నతనములోనే చనిపోయినారు. మా నాయనమ్మ నా చిన్నతనములో బ్రతికియుండినను ఆమె మా పెదతండ్రి శేషయ్యగారింట్లో ఉండేది. మా తండ్రి ఒంటరి వాడు. తన వాటాకువచ్చిన ఏ వంద ఎకరాలో స్వయముగా చూసుకోవలసివచ్చింది. అందువల్ల మా తల్లి బిక్కు బిక్కు మంటూ ఆ పెద్ద సంసారములో నెట్టుకోలేదని మా మాతామహుడు తన యుక్తవయస్సురాని 4-వ కూతురు శేషమ్మగారిని మా తల్లికి తోడుగా పంపిరట. మా తల్లిదండ్రులకు మొదటి సంతానము శేషారత్నం వెంటనే కలిగినదట. తరువాత కొలది కాలానికే ఒక మగ శిశువు కలిగి పురిటిలోనే చనిపోయినాడట. వెంటనే నేను కలిగానట. నాకు చిన్నప్పుడు నీళ్ళ విరేచనాలు తరుచు అవుచుండేవట. పినతల్లి శేషమ్మగారు నాకు వెట్టిచాకిరి చేసేవారట.

మా అమ్మకు వెంటవెంటనే కాన్పులు వచ్చేవట. నా తరువాత పుట్టిన నా తమ్ముడు సత్యనారాయణ నాకంటె 1½ సం.లు మాత్రమే చిన్నవాడు. మొత్తం మా తల్లికి 9 గురు కొడుకులు పుట్టగా మే మిద్దరమే బ్రతికి ఇప్పటివరకును నిలచియున్నాము. మా ఇద్దరి తరువాత పుట్టి బ్రతికినది 4 సంవత్సరముల క్రితం వరకు జీవించియుండిన మా చెల్లెలు ద్రౌపదమ్మ. చివరి దఫా ఒక కొడుకును కని పురిటిలోనే మా అమ్మ పరలోకప్రాప్తురాలైనది. అప్పటి కామె వయస్సు 36 సంవత్సరాలు నిండలేదు. ఆ కొడుకు 4, 5 మాసాలకు చనిపోయినాడు. మొదటి సంతానం శేషారత్నం 20 ఏండ్లు పెరిగి పెళ్ళి పేరంటమయి సంతాన విహీనంగా మరణించింది. 32 ఏండ్ల వయస్సులోనే 12 మంది సంతానాన్ని కనిన మా తల్లి రక్తకణములు, జీవనశక్తి క్షీణించి యుండియుండును. మామూలు ఆహారములో లోటు లేక

పోయినను సమత్వమైన ఆహారం మనవారికి తెలిసియుండలేదు. పైగా ఆ రోజులలో తెలిసియు తెలియని మోటు మంత్రసానులే పురిటికి దిక్కు. చేతగాని నాటువైద్యులే శరణ్యం. ఆమెకు వాత జ్వరమని నాటువైద్యుని సలహామీద వెదురాకు పసరిచ్చిరట. మూడు నాలుగు గంటలకు ముంచుకొనివచ్చి ఆమె ప్రాణ వాయువులు గాలిలో కలసిపోయినవి. ఆ రాత్రి ఆమెకు చెడు కల యేదో వచ్చినదట. ఆమె కలవరంచెంది చిన్నవాడు (నా తమ్ముడు సత్యం) వచ్చిపోయాడు, పెద్దవాడు (నేను) కనబడలేదు వాణ్ణి చూడాలి అని అనగా నన్ను లోపలికి తీసుకొని వెళ్ళారు. నన్ను చూచి ఏదో అని (నాకు గుర్తులేదు) బైటకు పంపివేసింది. తరువాత ఒకటి రెండు గంటలకే కన్నుమూసింది. అది 1911 డిసెంబరు. నా కప్పటికి $13\frac{1}{2}$ సంవత్సరములు మాత్రమే. మా చెల్లెలు ద్రౌపదమ్మకు 5-వ ఏడు. నాకు పెండ్లి 1911 ఏప్రిల్‌లో జరిగింది. నా భార్య నా కంటె 3 ఏండ్లు చిన్నది. పెళ్ళి తరువాత ఒకటి రెండుసార్లు తన కోడలును చూచియుండినది. తన కొడుకు కోడలు అచ్చట ముచ్చటలు జరుగకుండనే ఆమె కాలగర్భంలో కలసిపోయింది.

నా తల్లినిగురించి నాకు గుర్తున్న సంఘటనలు, అనుభవాలు అంతగాలేవు. ఒకటి బాగుగా గుర్తున్నది. నేను 6, 7 సంవత్సరాల వయస్సులో మా ఇంటి ఆవరణలో ఆడుకొనుచు ఎందుకో భయ పడి అమ్మా అని కేకలు వేయుచు పరుగిడివచ్చి ఎదురైన తల్లి కాళ్ళను కౌగలించుకొంటిని. నా తల్లి చప్పున నన్ను చంక కెత్తుకొని, ఓదార్చి సముదాయించింది. ఇంకొకటి జ్ఞాపకం. నేను చిన్నవాడనుగా నున్నప్పుడు ఒక సాయంత్రం మా అమ్మ ముందు వరండా మెట్లలో కూర్చొని తల దువ్వుకొనుచుండినది. నేనుచూచి "అమ్మా, ఎందుకే తల దువ్వుకొంటున్నావు, ఎక్కడికైనా వెళ్తావేమిటి? నేను కూడా వస్తా"నని మారాము చేశాను. ఆమె ముసిముసి నవ్వుతో చాలాసేపు మాట్లాడక చివరకు ఎక్కడికి వెళ్ళటంలేదురా అన్నది. వయస్సులోనున్నా లేక

పోయినా స్త్రీలకు శృంగారించుకొనుట సహజం. వయస్సులో నున్న గృహిణి భర్తకొరకు ఎదురుచూచుట ప్రకృతి లక్షణం కదా! మరొకటి. నా పెండ్లయి మేము మా ఇంటికి తరలివచ్చినప్పుడు చిన్న పిల్లయగు నా భార్య ఎందుకో ఏడ్పు లంకించుకొన్నది. అంతట మా అమ్మ ఆ బిడ్డను చంక నెత్తుకొని లాలించినది. ఆమె బ్రతికియుండి మేము భార్యా భర్తలం సుఖ సంసారము జరుపుకొనుచున్నప్పుడు చూచి ఎంత ఆనందించేదో, ఎంత ఆప్యాయతతో కోడలిని చూచుకొని మురిసేదో!

మా తల్లి 3-వ క్లాసువరకు చదువుకొన్నదట. గుడివాడ తాలూకా, అంగలూరు కమ్మరికానికి గుండెవంటిది. ఆ ఊరి కమ్మవారిలో పండితులు, కవులు, గాయకులు, గణితజ్ఞులు, వేదాంతులు వగైరా జన్మించారు. నాగరికత అని మన మనుకునే లక్షణం మొత్తం అంగలూరి కమ్మవారికి వర్తిస్తుంది. మా బొమ్మలూరి కమ్మవారిలో మా లింగం కుటుంబం ముఖ్యం. మా లింగంవారు అంగలూరి కమ్మవారివలె నాజూకు అయిన వాళ్ళుకారు. కొంత మోటు మనుష్యులు. అందువల్ల నా కేదైనా సంస్కారం, చదువు, సంధ్య అబ్బితే అది మా తల్లి తాలూకే అయి వుంటుంది. ఆ రోజుల్లో అనగా ఇప్పటికి 90 ఏండ్లనాడు కమ్మవారిలో చదువు చాలా తక్కువ. స్త్రీలకు ఇంచుమించుగా పూజ్యం అయినప్పుడు మా తల్లి మూడవక్లాసు చదివినదంటే విద్యాగంధంగల త్రిపురనేని కుటుంబజనిత అగుట వల్లనే.

మా తల్లి నెమ్మది మనిషి. పోట్లాటలు, తగాదాలు ఆమె కే మాత్రం గిట్టవికావు. నాకు గుర్తున్నవరకు ఆమె ఎవరితోను సంఘర్షణపడి ఎరుగదు. నౌకరులను చీదరించి, తిట్టి ఎరుగదు. బిడ్డలను కొట్టి ఎరుగదు. తన ఇల్లేమో తనేమో. పైగా ఎల్లప్పుడు గర్భిణిగా నుండటమో, లేక చంటిబిడ్డను సాకటమో, వంట వగైరా చేసుకొనటమో తీరుబడి ఎక్కడ? శ్రీమంతులైన వారైనా రైతుకుటుంబాల్లో వంటవాళ్ళుండేవారుకాదు. సామాన్యకుటుంబాల్లో బైట పాచి ఊడ్చి, అంట్లు తోమేవాళ్ళైనా ఇప్పటికిని ఉండరు. ఆ విధముగా తన అల్పకాలజీవితమును గడపి

పరలోకగతురాలైంది నా జనని. బిడ్డలు తమ చిన్నతనములో తల్లిమీద ఆధారపడియున్నను, ప్రకృతి సహజంగా తల్లిని ప్రేమించినను, యుక్తవయస్సువచ్చి మంచి చెడులను తెల్లిసి కొన్నప్పుడే తలిదండ్రులకు నిజమైన ప్రేమను, ఆప్యాయతను, భక్తిని ఇవ్వగలరు. ఆ స్థితి నాకు వచ్చీ రాకమునుపే నా కన్న తల్లి నన్ను విడచిపెట్టిపోయింది. మాతృప్రేమను ఎరుగని వానినిగా చేసి ఆమె తన ప్రోవను తాను చూచుకొన్నది. ఎంత దురదృష్ట వంతుడను!

మా తండ్రి వెంకటరత్నంగారు కృష్ణవర్ణుడు. ఒడ్డు పొడుగు మధ్యరకం కంటె కొంచెం హెచ్చు. 5-7½ లేక 8 అంగుళాల పొడవు. సరిపడిన లావు. నేను బాగుగా ఎరిగి నప్పటికి చిన్న బొజ్జ ఉండేది. కళగల ముఖం. ముక్కు తిన్నగా సమమైనదిగా తగినంతగా ఉండేది. కళ్ళు మధ్యరకం పరిమాణం కలవి గాని చురుకైనవి. బొద్దు మీసం, స్ఫటికాలవంటి పళ్ళు ప్రత్యేక విశేషం. ఆయన చిరునవ్వు వెన్నెలకురిసి నట్లుండేది. అల్పసంతోషి. నిష్కపటి. ఋజువర్తనుడు. నిరాడంబరుడు. బంధు ప్రీతి కలవాడు. ఎంత అల్ప సంతోషియో అంత ముక్కోపి. ఎంత ప్రీతికలవాడో అంత పరుషవాక్కు కలవాడు. అమృతహృదయుడు కాబట్టి ఆయన ముక్కోపము క్షణభంగురము. ఉదారహృదయుడు, జాలిగుండె గలవాడు కాబట్టి ఆయన పరుషవాక్కులు గాలిలో ఎగిరిపోయేవి. బంధువులు సంపన్నులైనా, బీదవారైనా మర్యాద ఒకే తరహా. బూతులుతిట్టినా నౌకర్లు ఆయనను అంటిపెట్టుకొని యుండేవారు. ఎంత ఎక్కువ తిట్టితే అంత ఎక్కువగా వాళ్ళకు లాభించేది. తిట్టకపోతేనే వాళ్ళకు నిస్పృహ. ఆయనను రెచ్చ గొట్టి, పది తిట్లుతిని రెండుబస్తాలు ఎక్కువ ధాన్యం పట్టుకొని పోయేవారు. బిడ్డలనుకూడా బూతులుతిట్టినా, వాళ్ళయందు కడుపునిండిన ప్రేమ. భార్యను భయపెట్టినా ఆమె యభిమానమును పోగొట్టుకునేవాడుకాదు. అబద్ధాలు ఆడటం, మోసంచేయటం ఆయనకు చేతగాని పనులు. అన్యాయానికి వెరిచేవాడు. అభిమానం పుష్కలంగా కలిగినవాడు.

ఆయన కష్టజీవి. మూర్తీభవించిన రైతు. వారి తండ్రి వీరభద్రుడుగారు చిన్నప్పుడే చనిపోయాడు. అన్నదమ్ము లేడుగురు. కడగొట్టువారైన మా నాన్నగారు జబ్బుచేస్తే తప్ప కాల మంతయు పొలంలోనే గడిపేవారు. ఆయన చిన్నతనంలో నౌకరులతోబాటు గొడ్లు చావిళ్ళు శుభ్రపరచి, పాలు పితుకుకొని, మంచినీళ్ళు తెచ్చుకొని, నౌకర్లకు తిండి కావిళ్ళతో పొలం పట్టించుకువెళ్ళేవారట. ఆ రోజుల్లో పొలాల్లో పనిచేసే నౌకర్లకు యజమాని ఇంటివద్దనుండియే అన్నాలు వెళ్ళేవి. ఈ పద్ధతి మొన్న మొన్నటివరకూ (ఇప్పటికికూడా అనుకొందును) చిత్తూరు జిల్లా, (నలగాంపల్లి) పాపుదేశు వెంకటస్వామినాయుడుగారింట్లో చూచాను. ఆ చిన్ననాటి కాయకష్టం అన్నలతో వేరుపడిన తర్వాతకూడా మా నాన్నగారు కొనసాగించారు. నాకు ఊహ వచ్చిన తరువాత ఆయన స్వయముగా దొడ్లు బాగుచేసుకోవటం గాని, నాగలి దున్నటంవంటి పొలంపనులుగాని చేయటం నేను చూడలేదుగాని కుప్పనూర్పుడు వంటి ముఖ్య పనులలో ఆయన రాత్రింబవళ్లు శ్రద్ధతీసుకొనుట నే నెరుగుదును. ఒక పంటకుప్ప నూర్పుడారంభించిన తరువాత ఆ కుప్ప నూర్పుడయేవరకు పొలం లోనే ఉండేవారు. రాత్రిళ్ళు అక్కడే పడుకునేవారు. అన్నం అక్కడికే వెళ్ళేది. నేను ఎరిగినప్పటికి నౌకర్లకు అన్నంపెట్టుట మానివేయబడింది. ఆ రోజుల్లో ఇప్పుడు చాలామంది రైతులు చేస్తున్నట్లు పంటగింజలు రాలగొట్టి ఏ రోజు కా రోజు ఇంటికి పట్టుకొని వెళ్ళేవారుకాదు. కుప్పచుట్టూ కల్లంచేసి, పన క్రిందకు వేసి పశువులతో పూర్తిగా త్రొక్కించి, కుప్ప సాంతము అయిన తర్వాత గింజనంతను పోత పోయించి ఇంటికి తోలుకొనివెళ్ళేవారు. గాలి సరిగా వీచకనో, పోత పూర్తిఅగుటకు కాలము చాలకనో మిగిలిపోతే పోసిన గింజలు ఒకరాశి, పోయని గింజలు ఒకరాశి చేసి యజమానిగాని, నమ్మిన నౌకరుగాని రాత్రి కాపలా పడుకునేవారు. భద్రంకొరకు అనగా రాశిలో గింజ వెలికి తీసినది లేనిదీ తెలియటానికి రాశిచుట్టూ పైభాగాన గరళం అనగా పేడనీళ్ళ ధారగా గీతలుగా పోసేవారు. యజమాని రాత్రి పడుకున్నా ఇప్పటికిని నూర్పుడు కల్లంలోని పొట్టుతో కలిసి

యుండిన గింజ విషయములో చాలామంది రైతులు ఆ విధముగానే గరళము పోయుదురుగాని అప్పుడు ప్రతి కుప్ప విషయంలోను జరిగేది. సాధారణంగా నూర్చిన గడ్డిని కల్లం నానుకొని వలయంగా కొద్దిపాటి వెడల్పుతో ఇంచుమించు కల్లం చుట్టూ పెట్టుతారు. దీనిని కడియం అంటారు. యజమానులు సాధారణంగా ఈ గడ్డి కడియంలో ప్రోగుచేసిన ధాన్యం నానుకొని పడుకొనేవారు. ఒకప్పు డెందుకో మా నాన్న రాత్రి ప్రొద్దుపోయేవరకు వచ్చుటకు వీలు పడనందున నన్ను కాపలాకు నియమించగా నేను మా నాన్న వచ్చేవరకు గడ్డి కడియంలో పడుకొంటిని. నాకు తోడుగా మా నౌకరు రాశివీద పడుకొన్నాడు. తిరిగి వచ్చిన తర్వాత నౌకరు నిచ్చి మా నాన్న నన్ను ఇంటికి పంపించారు.

ఆ రోజుల్లో పెద్దవాళ్లైనా రోజుకు 3 సార్లు తినేవారు. ఒక రోజు మధ్యాహ్నభోజనం పట్టుకొనివెళ్ళుటకు సమయానికి శూద్ర నౌకరు లేనందున (అంటరానితనం గట్టిగా ఉండేది) అన్నం నాతో పంపించమని కబురు రాగా మా తల్లి 8, 9 సంవత్సరముల బాలుడ నైన నాచేత పంపించింది. పొలం దూరం. నేను త్రోవ తప్పి సాయంత్రంవరకు ఆ ప్రక్క ఈ ప్రక్క తిరుగుచుండగా నన్ను వెదుకుటకు కల్లం నుండి మా నాన్న మనిషిని పంపించారు. తర్వాత ఆ పనికి నన్ను తిరిగి నియమించినట్లులేదు. నూర్పుడులో మా నాన్న ఏ ఇతరపనిని చేసినా చేయకపోయినా ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తటం, బస్తాలు బిగించటంవరకు చేస్తూ ఉండేవారు. బహుశా నూర్చిన ధాన్యాన్ని పోతపోస్తూ (తూర్పారపట్టటం) ఉండే వా రనుకొందును. ఒక్కటి మాత్రం బాగుగా జ్ఞప్తి యున్నది. నాకు 13, 14 ఏండ్లు కొంచెం ఎక్కువ వయస్సు ఉండవచ్చును. నేను రాత్రి అయ్యేవరకు పొలములో ఏ కారణము వల్లనో వుంటిని. బండ్లమీద ధాన్యంతోనింపిన నేతసంచులు వేయవలసి వచ్చినది. ప్రొద్దుపోవు చున్నదనికాబోలు మా నాన్న బస్తాలను ఎత్తుటకు తా నొకప్రక్క, నౌకర్లొకప్రక్క పట్టి నన్ను పట్టమనగా నే నొక మూల కాచి బస్తాలను తల కెత్తడంలో తోడ్పడితిని. అట్టిది ఏ రెండు మూడు దఫాలో జరిగియుండ వచ్చును. ఆ బాల్యానుభవాన్ని నేను 1953 లో ఉద్యోగ

విరమణానంతరం అప్పుడప్పుడు కొన్ని సంవత్సరాలు ఆచరణలోకి తెచ్చుకొంటిని.

ఆ రోజులలో వ్యవసాయం ఎక్కువ శ్రమతోకూడినదై యుండేది. నమ్మకమైన పాలేర్లు లేకపోతే కుంటుపడేది. మా తండ్రి, ఆయన అన్నలు పంచుకొన్నప్పుడు తన కభిమానము నకు పాత్రుడైన జక్కుల ముత్తడిని తన ప్రత్యేక పాలేరుగా తెచ్చుకొన్నాడు. తరువాత బండెల చింత డను పాలేరు వారి అభిమానమునకు పాత్రుడైనడు. ముత్తడు స్వగ్రామమగు బొమ్మలూరు సమీపగ్రామాల్లోని పొలాలపని ప్రత్యేకించి చూచుచుండగా బండెల చింతడు మా గ్రామానికి అడ్డి గ్రోవను 3 మైళ్ళకు తక్కువదూరంకాని బిళ్ళపాడు గ్రామంలో మా కుండిన 40 ఎకరాల పొలం అజమాయిషీ చూస్తుండేవాడు. ముత్తడు కంటె చింతడు ఎక్కువ నమ్మకమైనవాడు, మంచివాడు. వానియందు నాకుకూడా మిక్కిలి అభిమాన ముండేది. నేను బెజవాడలో 1940-1943 సం.ల మధ్య ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరుగా నున్నప్పుడు గుడివాడకు క్యాంపుమీద వెళ్ళుచుండేవాడను. 1941 లో అనుకొందును నేను క్యాంపుకు వెళ్ళినప్పుడు వానికి కబురు పంపాను. గుడివాడ నా స్వగ్రామమగు బొమ్మలూరుకు రెండు మైళ్ళు, బిళ్ళపాడుకు మూడు మైళ్ళ దూరం మాత్రమే. అంతకు కొన్ని సంవత్సరాలకు ముందే మా బిళ్ళపాడు 40 ఎకరాల పొలం పూర్తిగా మా చేతులనుండి పోయింది. చింతడు మా నౌకరుకాడు. వానికి పెద్దతనంవచ్చి ఇంటియొద్దనే ఉంటుండేవాడు. వాడు గుడివాడరాగానే ఒక రోజంతా ఉంచుకొని భోజనం సుష్టుగా పెట్టించి కొత్త బట్టలు, కొంత రొక్కం బహుమతి ఇచ్చి నా అభిమానానికి సమాధానం, నా మనస్సుకు తృప్తిని కలిగించు కొన్నాను. మామూలుగా పాలేరు వైతుకు బిడ్డవంటివాడు. చింతడు రెక్కలమీద బ్రతికే హరిజనుడైనా, నేను ఉద్యోగంలో నుండి ఆస్థిపరుడనై యున్నా, మామూలు ఆచారం ప్రకారం వానిని కౌగలించుకొని కుర్చీలో కూర్చోబెట్టి సహపంక్తిని భుజింప జేయకపోయినా పెద్దన్నయందు కలిగే భావమే అతనియందు నాకు కల్గియుండినది.

చింతడు చనిపోయి కొన్నిసంవత్సరాలైనా ఇప్పటికిని జ్ఞాపకానికి వస్తూవుంటాడు. అతడు జ్ఞాపకానికి వచ్చినప్పుడల్లా వాని అల్లుళ్ళు, వాని తోటివాళ్లు, వానిద్వారా వచ్చుచుండిన నౌకర్లు, మగకూలీలు జ్ఞాప్తికివస్తూఉంటారు. వానికి కొడుకులు లేరు. ఇద్దరో ముగ్గురో కూతుళ్లుండేవారు. వాని పెద్ద అల్లుడు బాగుగా గుర్తు. వాడు ఒకొకప్పుడు పెద్ద నిలువుబొట్టు పెట్టుకొని వచ్చేవాడు. ఇంకొకప్పుడు దిస నొసటితో వచ్చేవాడు. ఆ రోజుల్లో హిందువులు ఏ కులస్తులైనా బొట్టుపెట్టుకొనేవారు. బొట్టు లేనప్పుడు వాని నెవ్వైనా బొట్టులేదేమిటని అడిగితే మతం పుచ్చుకొన్నానుకదా అనేవాడు. కొన్నిరోజుల తర్వాత వాడు బొట్టుతోవస్తే బొట్టేమిటిరా అని అడిగితే మతం మానేశానుకదా అనేవాడు. ఇట్లా సంవత్సరానికి రెండు మూడుసార్లైనా జరిగేది. వీడేకాదు వీనితోబాటు వాని తోటివాళ్ళుకూడా. తిండిగింజలు అయిపోయో, ఏదైనా అవసరంవచ్చి చేతిలో దమ్మిడీ లేకపోయినప్పుడో వాళ్ళకు సమీపంలోనుండిన (ఫాదిరి) క్రైస్తవమత గురువు వద్దకు వెళ్ళి ఆశ్రయించేవాళ్ళు. ఆ ఫాదిరి ఏదో ముట్టజెప్పితే పది రోజులపాటు బొట్టు తీసేసి ఒకటి రెండుసార్లు చర్చికి వెళ్ళటమో, ఆయన బోధనకు చెవియొగ్గటమో చేసేవాళ్ళు. తిరిగి ఆయన లేదు పొమ్మంటే బొట్టు తయారు. మిషనరీల తాపత్రయం, బీద హరిజనుల కక్కుర్తి ఈ విధంగా మతాన్ని అసహ్యంపాలు చేసేవారు. చింతడు అప్పుడప్పుడు మా ఇంటికి వ్యవసాయ విషయాలు చెప్పటానికి వచ్చేవాడు. మా నాన్న వాని నాదరించి భోజనం పెట్టించి పంపేవారు. చింతడు, ముత్తడే గాక ఇతర నౌకరులుకూడా ఉండేవారు. కూలీలుగాక మాకు ఏ డెనిమిది మంది పాలేరు లుండేవారు. ఈ రోజుల్లోవలె మధ్యలో పని మానుకొనిపోయే మోసం ఉండేదికాదు. సంవత్సరం పొడుగూతా ఉండేవాళ్ళు, దానికి తగినట్లుగా యజమాని వాళ్ళ భృతికి లోటు రానిచ్చేవాడు కాదు.

పశువులు 6, 7 జతల ఎడ్లు గాక కోడెలు, ఆవులు, గేదెలుండేవి. వానికి జబ్బుచేసినప్పుడు మా నాయనే వైద్యము చేస్తూ ఉండేవారు. ఆయన 'సహదేవ పశుశాస్త్రం' అనే గ్రంథాన్ని

తరచు చదువుచుండేవారు. కొంత పశువైద్యంలో నిపుణతను సంపాదించారు. కాని దురదృష్టవశాత్తు ఆయనకు గొడ్లు కలసి రాలేదు.

ఆడినమాట తప్పి ఎరుగడు. చేస్తానన్న పని కష్ట నిష్ఠుర ములకోర్చి చేసేవాడు. ఋజు వర్తనుడు. ఒకసారి మా బంధువు ఒకడు అప్పిచ్చిన ప్రాంశరీనోటు వాయిదాగడచి పోయింది. ఆయన ఆందోళనను చూచి నవ్వి వెంటనే నోటు తిరుగ వ్రాశారు. ఇంకొక సారి గుడివాడపట్టణములో పచారికొట్టు ఆసామివద్ద పెండ్లికో, పబ్బానికో వాడుకొన్న మొత్తానికి సమయానికి డబ్బులేక ప్రాంశరీ నోటు వాయిదా పోయింది. ఆ వర్తకుడు ఆందోళనపడి ఇంటికి రాగా. నోటు గుర్తుకు మాత్రమే. ప్రోనోటు వాయిదాపోతే బాకీ రద్దు అవుతుందా? బాకీ బాకీయే. దానిని తీర్చేవరకు బాకీగానే యుంటుందని చెప్పారు. ఇది నిజాయితీ గలవారి పద్ధతి. ఇతరులను నమ్మటం, తనవలెనే నిష్కపటు లనుకొనటం మా తండ్రి స్వభావం. తన అన్నలుగాని, అన్న కొడుకులుగాని ఏదైనా చెప్పిన నెరవేర్చటం, ముక్కుకు సూటిగా వారియెడల వర్తించటం, అన్నల మాటలు శిరసావహించటం ఆయనగారికి పరిపాటి. కాని అన్నలుగాని, అన్న కొడుకులుగాని సమాన ధర్మబుద్ధితో వారియందు వర్తించేవారని చెప్పటకు వీలులేదు. వా రొకప్పుడు తమ కనుకూలపడే పొలాన్నో, స్థలాన్నో బేరం ఖండించుకొన్నారు. ఒక అన్నకొడుకుచేతికి డబ్బిచ్చి దానిసి విక్రయపత్రం వ్రాయించ మని చెప్పారట. ఆ అయోగ్యుడు ఆ భూమిని తనపేర వ్రాయించు కొన్నాడట. అట్టి అనుచిత ప్రవర్తనగలవాడని అన్న కొడుకును వదలుకొనలేదు. తాత్కాలికంగా కోప్పడి యుండవచ్చును గాని సహజ ఉదార సంపన్నుడైన మా తండ్రి తన ఉదారత్వమును పోషించుకొన్నాడు.

ఇతరుల సొత్తున కాశించలేదు. పైగా తన ప్రయత్నము లేకుండనే వచ్చిన సొత్తును అది దుర్ఘట స్థితులలో తటస్థించిన ఆహ్వానించే వారుకాదు. తన ఏకైక పుత్రుడు సంతాన విహీనంగా చనిపోగా ఆ దిగులుతో మా మామగారు కొలది మాసాలకే మరణిస్తూ తన ఆస్తిని నా భార్యకు, ఆమె అక్కకు సంక్రమింప

జేయ ప్రయత్నించారు. దానిని రక్తకూడుగా మా నాయనగారు భావించారు. మా మామ "నే నెక్కువకాలం బ్రతుకను, ఆస్తి విషయం మీతోకూడా మాట్లాడాలి ఒకసారి వచ్చివెళ్ళండి" అని కబురు పంపినా వెళ్ళలేదు. మీ ఇష్టమువచ్చినట్లు చేయండి అని సమాధానం పంపారు.

మా లింగం కుటుంబం మిక్కిలి అభిమానంగల కుటుంబం. ఇతరులచేత మాట అనిపించుకునేటట్లు వ్యవహరించేవారు కాదు. ఎవరైనా ఏమైనాఅంటే సహించేవారు కాదు. కర్రతో ఎదురొక్కనుటకు, అవసరం వస్తే తలలు పగులగొట్టుటకు, కొట్టించుకొనుటకు వెరచేవారు కాదు. అయినా అనవసర పోరాటాలకు దిగేవారు కాదు మా తాతగారి హయాములోను తర్వాతను. మాఊరుకు సమీపమున గుడివాడ నానుకొని మందపాటి అగ్రహార మున్నది. ఆ అగ్రహారములోని భూముల్లో చాలాభాగము మా లింగం కుటుంబం అనగా మా తాత, పినతాత కుటుంబాలకు చెందినవి. ఒకప్పుడు అగ్రహారీకుడు తమ్మిమ్మా భూములతోసహా అగ్రహారాన్ని అమ్మా లనుకొని ఎక్కువ భూములుగల మాకు కబురుపంపగా, మా పినతాత కుమారులు కలిసిరాకపోవుటవలన ఇంకొక రా అగ్రహారాన్ని కొన్నారు. అగ్రహారాన్ని స్వాధీనం చేసుకొనుటలో మాకు సంబంధించిన పాటిస్థలాలనుకూడ ఆక్రమించుకొనుటకు ప్రారంభించాడు. ఆ కబురు తెలుసుకొని మా లింగం కుటుంబంవారు కట్టగట్టుకొని దాడిచేసి ఆయన ప్రయత్నాన్ని అడ్డగించారు. క్రొత్త అగ్రహారీకుడు కిమ్మనకుండా ఆవంకకే రాలేదట. అందరితోబాటు మా నాయనగారుకూడా అప్పటికి బ్రతికియున్న ఆయన అన్నలు, అన్న కొడుకులు, మా పినతాతగారి కుటుంబంవారు దెబ్బలాటకు సిద్ధపడి కర్రలు వగైరా లతో వెళ్ళితే వెంట వెళ్ళారుగాని సామాన్యధోరణిలో మా నాన్నగారు దెబ్బలాటకు నడుముకట్టేవారు కాదు. ఆయనకు తన కుటుంబాభిమానం జాస్తియే. వ్యక్త్యభిమానం హెచ్చు. మాకు డబ్బు లావాదేవీలు బందరులో ఒక వైశ్య వడ్డీవ్యాపారస్తుల కుటుంబంతో ఉండేవి. ఒకప్పుడు వారింటికి వెళ్ళినప్పుడు దాహం

కాగా మంచినీళ్ళ అడిగారట. ఇంటిలోనివారు కాళ్లు కడుగుకొనే ఇత్తడి చెంబుతో మంచినీరు ఇచ్చారట. దానిని వారు ముట్టుకోక బైటకు వెళ్ళి సోడా తీసుకొన్నారట. నిజానికి మా పురోహితుడు, పూజారి, కరణం, సామాన్యగృహస్థులైన బ్రాహ్మణులు, మాకు లెక్క బ్రాసిపెట్టే బ్రాహ్మణులు, చిల్లర దుకాణాల వైశ్యులు వగైరా మా కుటుంబం వారిని మిక్కిలి గౌరవంగా సంబోధించటం, వరుసలు బెట్టి పిలవటం పరిపాటి. ఆర్య వర్ణాశ్రమాలు చెప్పేటప్పుడు మమ్ములను నాల్గవ జాతికి చెందినవారమనినా యథార్థంగా మేము రెండవ కులానికి చెందినవారముగనే వ్యవహరించేవారము. గ్రామములోని ఇతర కులాలవారు మా యెడల వర్తించేవారు. ఉద్యోగంచేసే బ్రాహ్మణులు, న్యాయవాద వృత్తిలో నుండిన విప్రులు వీలునుబట్టి, సందర్భాన్నిబట్టి శూద్రు లనే నిరసనభావం వెలిబుచ్చకపోయినా సూచించేవారుగాని కమ్మటూళ్ళల్లో కమ్మ వారిదే పైచేయి. భూవసతి, సంపద, దాన ధర్మాలు, పలుకుబడి, పెత్తనం కమ్మవారిదే కదా! మేము ఇచ్చేవారం, ఇతరులు పుచ్చుకొనేవారు. మాచేయి పైది, వారిది క్రిందది. అందువల్ల రాజసంగా, ధీమాగా బ్రతుకుచు చెలామణి అగుచుండిన మా లింగం కుటుంబం సభ్యులలో నొకరైన మా తండ్రిగారు అభిమానపూరితులుగా నుండుటలో ఆశ్చర్యం లేదు.

మా నాయన మిక్కిలి వడిగా నడిచేవారు. ఏ గుడివాడో వెళ్ళినప్పుడు తప్ప పొలాలకు చొక్కా లేకుండగనే కట్టుపంచెతో, భుజాన పైపంచెతో వెళ్ళేవారు. గంజిలో ముంచి ఉదికిన నీరు కావి బట్టలు వారివి. నలుపు మనిషి గనుక, చొక్కాయుండేది కాదు గనుక, మిక్కిలి వడిగా, విసురుగా నడిచేవారు కాబట్టి వారు వచ్చుచున్నట్లు దూరమునుండి గమనించిన నౌకర్లు రైలు ఇంజన్ వస్తున్నదని ఒకరి నొకరు హెచ్చరించుకొనేవారట. ఆ రోజులలో నౌకర్లు, కూలీలు భయభక్తులతో నుండేవారు. అందులోను వ్యవసాయ నిపుణులని, బలవంతు లని పేర్వడ్డ మా లింగం కుటుంబం నౌకరులు మిక్కిలి అణకువతో ఎదురాడక ఉండేవారు. మా తండ్రిగారు వ్యవసాయ దక్షులని పేరు. పని శుభముగా, కట్టుదిట్టముగా ఉండాలి. ఏమాత్రం కచ్చాగా

ఉండినా ఆయన విరుచుకు పడేవారు. చివాట్లు మొదలుపెట్టితే ఏకధారగా, దీర్ఘ సమాసాలతో వారి కోపోద్రిక్తమైన ముఖము నుండి అగ్నిజ్వాలలవలె వెలువడేవి. అందువలన ఆయన ఎక్కడ తప్పు పడ్తారో అని పనివాళ్ళు ప్రాణాలు బిగబట్టుకొని పనిలో పూర్తిగా నిమగ్నులైనట్లుండేవారు.

మా జనకుడు విద్యావంతుడు కాదు. వ్రాసేవాడు కాదు. మా లెక్కలు వారానికో, పక్షానికో గుడివాడనుండి వచ్చి మల్లాప్రగడ సూరయ్యగారనేవారు (మొదట మా యూరివారే) వ్రాస్తుండేవారు. కాని మా నాన్నగారు చదువు బొత్తుగా రానివారు కాదు. పైన సహదేవ పశుశాస్త్రాన్ని చదువుచుండే వారని చెప్పాను. అంతేకాదు అప్పుడప్పుడు భారతం, భాగవతం వంటి పురాణాలను చదువుచుండేవారు. నా చిన్నతనంలో పుస్తకంపెట్టుకొనే మడతచెక్క సాధనముండేది. దానిలో పుస్తకాన్ని పెట్టి, క్రింద చాపమీద కూర్చుని, గ్రుడ్డి కిర్సనాయిల్ దీపము కాంతిలో చదువుచుండేవారు. ఆయన చదువుటకన్న, పగటి కలలు ఎక్కువ కనేవారని, ఊహాప్రపంచంలో విచ్చల విడిగా వ్యవహరించేవారని నా నమ్మకం. పొలంనుండి వచ్చిన తరువాత వేడినీళ్ళ స్నానంచేసి, భోజనానికి ముందు హాలులో నుండిన బల్లమీద బోర్లపడుకొని, ఏవో కలలలో మునిగి పోయేవారు. ఆ పగటికలలుకనటం, ఊహాప్రపంచంలో తిరగటం నాకు కొంతకు కొంత సంక్రమించినవి.

బిడ్డలను దగ్గరకు తీసుకొని లాలించే స్వభావముకలవారు కాదు. కాని ప్రేమ తక్కువని చెప్పటకు వీలులేదు. నన్ను ఒక్క సారి మాత్రమే కొట్టినట్లు గుర్తు. నేను బొమ్మలూరులో చదువు చుండగనే ఎవరోనారపట్టు పైపంచెలు అమ్మకానికి మేము చదువుకొనుచున్న బడికి తీసికొని వచ్చారు. మా పంతులుగారు కూడా ఒకటి కొనుక్కొన్నారు. నా కొకటి కావాలని ఇంటికి వెళ్ళి డబ్బుకు వేధించగా ఏదో విసుగుదలతోనున్న మా నాన్న ఒక చెంపపెట్టుపెట్టారు కాని డబ్బు ఇచ్చాగు. భార్యయందు ఏ ఆప్యాయత చూపేవారోగాని ఆమెను తిట్టినట్లు, చేయి చేసు

కొన్నట్లు నాకు గుర్తులేదు. మా తల్లిగారు చనిపోయిన తరువాత ఇంకొకామెను వివాహం చేసుకొన్నారు. ఆమెను కూడ కస్సు బుస్సు మన్నట్లు నే నెరుగను. సామాన్య గృహస్థు ధోరణిలో ఆయన ముక్కోపము, పరుషవాక్యాలు ప్రత్యేకవిషయంగాకాక జీవితం గడచిపోయింది.

నా భార్య అత్తవారింటికాపురం ఏ స్వల్పకాలమోతప్ప ఎరుగదు. ఆమె అన్న, తండ్రి మేము యువక యువతీ జీవితం ప్రారంభించిన కొలదికాలానికే చనిపోవటంవల్ల ఆమె తల్లి దగ్గరనే పెడసనగల్లులో ఉండిపోయింది. నా భార్య చెప్పుతుండేది. ఆమె ఒకసారి మా ఇంట్లో గారెల కని మినుపపప్పు రుబ్బుచుండినదట. అటు వెళ్ళుచుండిన మా నాన్న కోడలు ఎడమచేత్తో రుబ్బటం చూశారట. వెంటనే కోడలు దగ్గరకువెళ్ళి పొడుచు నట్లుగా మూతిలో చేయిపెట్టి ఎడమచేత్తో రుబ్బకూడదు. ఆమాత్రం తెలియదా అని గర్జించారట. అదీ ఆయన ధోరణి. మనసులో దాచుకోలేని ఉద్రేకం, తప్పు అనుకొనినదాన్ని కుండ బ్రద్దలుకొట్టినట్లు బహిర్గతం చేయటం సున్నితంగా చెప్పలేని నిష్కల్మష హృదయం.

నేను ఇంగ్లండులో నుండగా వారికి జబ్బుచేసి ప్రాణం మీదకు రాగా, భగవంతుని స్మరించుచు ఒకే ధారగా "నా పెద్ద కొడుకు ఇంగ్లండులోనున్నాడు, వాడు వచ్చువరకైనా నన్ను బ్రతికని"మ్మని ప్రార్థనట. వారికి ఆయోగ్యం మొత్తంమీద తక్కువ. నేను అక్కరకురాగల పెద్ద కొడుకును. పైగా భూస్థితియున్నా డబ్బులేదు, ఋణాలే. అందువల్ల నా ఇంగ్లండు ప్రయాణానికి వా రొప్పుకోలేదు. కాని నేను మొండి పట్టు పట్టితే నన్ను సాగనంపుటలోగాని, డబ్బు పంపుటలోగాని ఎట్టిలోటు చేయలేదు. అప్పో, సప్పో చేసి నేను కోరినంతడబ్బు పంపేవారు. నేను ఇంగ్లండులో $6\frac{1}{2}$ సంవత్సరములు గడపి 45 వేల రూపాయలు ఖర్చుచేశాను. మూడు సంవత్సరముల తర్వాత దీర్ఘకాలపు వేసవి సెలవులకు 1923 జూన్‌లో ఇంటికి వచ్చాను. నేను మొదట చెప్పినట్లుగా విద్య పూర్తి చేయక తిరిగివెళ్ళి ఏ రెండు మూడు సంవత్సరాలో గడపవలసి యుండునట్లు తెలిసికొన్నప్పుడు నన్ను

నిందించలేదు, నిష్ఠురము లాడలేదు. ఇంతటితో పూర్తిచేసి వచ్చిన ట్లయిన బాగుండేది అనుకొన్నారు. నే నొక్కడనే గాక నా సోదరుడును గాక నా మారుటి తల్లి, ఆమె మగబిడ్డ ఉండినారు. ఆమె ఇంకా పిల్లలను కనుట కవకాశముండినది. అయినా తన రక్తము పిండి నాకు డబ్బు అందజేశారు. అంతటి ఉదార హృదయుడు, ప్రేమ పూరితుడు నా జనకుడు. పరదేశమునందున్న కొడుకును కాపాడాలని, తనరక్తమును పంచుకొన్న పుత్రుడు వృద్ధికి రావాలని గాఢముగా కాంక్షించిన ఉత్తమ జనకుడు నా తండ్రి.

ఆయన అదృష్టవంతుడు కాదు. తండ్రి చిన్నప్పుడే పోవటం, ఏడుగురు అన్నదమ్ములలో కడసారి వాడవటంవల్ల అన్ని వెట్టి చాకిరీలు ఆయనమీద పడేవి. కాయకష్టానికి వెరచేవారుకాదు. కాని ఆయన ఆరోగ్యం పిన్నవయస్సులోనే దెబ్బతిని రెండు మూడు సార్లు దీర్ఘవ్యాధికి కారణమైనదట. ఒక్కొక్కప్పుడు త్వరితగతిని అనతికాలములోనే దీర్ఘప్రయాణాలు చేసేవారట. బెజవాడకు ఉదయం బయలుదేరి వెళ్ళి సాయంత్రానికి తిరిగి వచ్చేవారట. దూరం 50 మైళ్ళు, రానూ పోనూ కాలినడక. ఈవిధంగా కొన్నిసార్లు తిరగటంవల్ల మంచానపడి రెండు మూడు నెలలకు గాని కోలుకోలేదట. చివరకు మధుమేహవ్యాధి ప్రవేశించి ఆయన ప్రాణాన్ని బలిగొన్నది. రైతుకు గొడ్డు, బిడ్డ ప్రధానం. ఈ రెండు అక్కరకు వచ్చిన రైతు బాగుపడతాడు. మా తండ్రిగారికి ఈ రెండూ అక్కరకురా లేదు. గొడ్లు నష్టమౌతున్నవని పశువైద్యం నేర్చుకొన్నారు. అయినా పశునష్టం జరుగుతునే ఉండేది. పెద్ద కొడుకును నేను చదువని, సంధ్యని ఆయనకు తోడుపడలేదు. ఇవి గాక ధర పెరుగుతుందని అమ్మని ధాన్యం, ధర తగ్గి, ఇంకా తగ్గుతుందేమో అని భయపడి తక్కువ ధరకు అమ్మిన పిమ్మట ధర పెరిగి శ్రమకు తగిన ఫలితం వారి కందేది కాదు. ఇవి గాక మొదటి భార్యయే గాక రెండవ భార్య కూడా అకాలమరణం పాలవటంవల్ల మూడోసారి వివాహమాడవలసి వచ్చింది. ఈ వివాహాల ఖర్చులు వగైరా కొంత భారాన్ని కలిగించాయి. ఆ రోజుల్లో ఎంత శ్రమపడ్డా భూములు సరిగా పండేవి కావు. మరిన్ని ధాన్యం ధరలు మిక్కిలి తక్కువ. హోదానుబట్టి ఖర్చులు

హెచ్చు. అప్పుల వడ్డీ అసలును మించేది. ఇంకొక విశేషం, మొదటి భార్యవల్ల కల్గిన కూతురును రెండో భార్య తమ్మున కిచ్చి వివాహం చేశారు. బావమరది, అల్లుడు నిలకడలేని దుబారా మనిషి. ఆర్థిక సాయం చేయక తప్పిందికాదు. పైగా వివాహాలను ఎక్కువ ఆడంబరంగాచేసి ఎక్కువ ధనం వ్రయంచేయటం మా లింగం కుటుంబానికి పరిపాటి. నా వివాహానికి బావమరది కుదిర్చినది ఒక బోగం మేళం, తన రెండోకూతురు భర్త కుదిర్చినది రెండో బోగం మేళం. ఈ రెండు మేళాలకు డబ్బు ఇవ్వక తప్పదు కదా! ఇతర వ్రా కలసివచ్చిన వారికిబ్బంది యుండదు కాని రుగ్మతవల్ల వ్యవసాయ అజమాయిషీ తగ్గటం, గొడ్డు బిడ్డ కలసిరాకపోవటం, పంట అమ్మకంలో నష్టం, పెళ్ళిళ్ళకని పేరంటాలకని ధన వ్యయం ఇవన్నీ కలసి కుటుంబానికి ఋణాలు కల్గజేసినవి. పైగా పుండుమీద కాకిపోటువలె నా విదేశ విద్యా సంబంధమైన అధిక వ్రయం మా తండ్రి జీవన శక్తిని తగ్గించివేసినది.

ఆయనకు అతిమూత్రవ్యాధి ప్రవేశించింది. దానిని లెక్క పెట్టకపోవటంవల్ల ముదిరింది. గ్రామ నాటువైద్యునకు, తర్వాత బందరు వైద్యులకు స్వాధీనంకాకపోవుటచేత మద్రాసుకు తీసుకొనివెళ్ళి జనరల్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ కూడా రహితముకాలేదు. చివరకు ఒక కాలు మోకాలువరకు తీసివేయవలసివచ్చినదట. అంతటితో పోలేదు, మృతికి దారి తీసింది. వారు మద్రాసులో 1924 వ సంవత్సరం మార్చి 12 వ తారీఖున తన యాభైఐదవ ఏట కన్నుమూశారు. నడివయస్సులోనే పరలోకప్రాప్తులైనారు.

నాకు ఆక్స్‌ఫర్డ్‌కు కేబుల్ పంపారు. దుఃఖించి, విచారమును తెల్పే నల్లగుడ్డను రెక్కకు తగిలించుకొన్నాను. అంతకంటె నే నక్కడ చేయగలిగిన దేముండును? అంతకుముందే అనగా 1923 సెప్టెంబరు ఆఖరుకు స్వదేశాన్నుండి తిరిగి ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్ళాను. విద్య పూర్తికాలేదు. విద్య పూర్తిచేసుకొని 1927 ఫిబ్రవరి 27-వ తారీఖునకు గాని ఇంటికి చేరలేదు. ఇంటికి వచ్చి ఇంత కన్నీరు విడిచాను.

850



కీ. శే. శ్రీమతి లింగం అన్నపూర్ణమ్మగారు

(గ్రంథకర్త భార్య)

అధ్యాయం ముగిసింది

అది 1911-వ సంవత్సరం ఏప్రిల్ నెల. నా కప్పటికి 13 సంవత్సరాలు నిండలేదు. చామన చాయగా, బొద్దుగా, బొజ్జతో, బుంగ చెంపలతో, సామాన్య బాలకుడనుగా ఉండేవాడను. మా వాళ్ళు నా పెండ్లి తలపెట్టారు. బేరసారాలైన తర్వాత దివితాలూకా, పెడసనగల్లుగ్రామం సూరపనేని సీతారామయ్యగారి రెండవ కుమార్తెతో వివాహం నిశ్చయమైంది. ఆ పిల్ల కప్పటికి 10 లేక $10\frac{1}{2}$ సంవత్సరాల వయస్సు ఉంటుంది. పిల్ల పసుపుపచ్చ, వెడలైన నుదురు. పెద్దకళ్ళు. పల్చని చెక్కిళ్ళు. చూడ ముచ్చటగా ఉండినది. వివాహమైన కమ్మవారి బాల బాలికల పద్ధతులే మాకున్నూ. దూర దూరంగావుండటం, ఎప్పుడైనా తొంగి చూడటం. 1914 ఆఖరులో ఆమె యుక్తవయస్సురాలైంది. పట్టు పట్టు మని పెద్దలు 1915 మే నెలలో దంపతులను కలిపారు. అప్పటికి నా కింకను 17 సంవత్సరాలు నిండలేదు. ఆమె వయస్సు 14 సంవత్సరాలు నిండి యుండవచ్చును. కాని నాది దొంద శరీరం. మీసాలు, గడ్డం వచ్చాయి. ఆమె అప్పటికే లావెక్కింది. కొంచెం మోటెక్కిందికూడా. కాబట్టి దాంపత్యానికి తగిన యవ్వనానికి వచ్చామని ఇతరులుకూడా అనుకొన్నారు.

నా భార్య అన్నపూర్ణమ్మ తలిదండ్రులచాటు పిల్ల. ఆ రోజుల్లో కమ్మవారిండ్లలో సామాన్యంగా తలుపుచాటునుండి చూచుకోవటంతప్ప పగలు కలసిమెలసి ఉండటం ఉండేదికాదు. పైగా నా భార్య సహజంగా మిక్కిలి సిగ్గరి. నేనూ అంతే. మరిన్ని సరసానికని ఆమె అక్క హేళనచేస్తూ ఉండేది. అందు వల్ల రాత్రి తప్ప పగలు కలసికోవటంగాని, అచ్చట్లు, ముచ్చట్లు చెప్పుకోవటంగాని మే మెరుగం. ఆమె తలిదండ్రులవద్ద, నేను బందరు నోబుల్ హైస్కూల్‌లో చదువుట. ఏ ఆదివారమో, ఏ సెలవుల్లోనో అత్తవారింటికి వస్తే పగలు పలకరింతలులేవు,

రాత్రి కలయిక తప్ప. ఇంతలో ముంచుకుపోయినట్లు ఆమె గర్భం ధరించింది. ఆ రోజుల్లో 5-వ మాసం దాటిన తర్వాత భార్యాభర్తలు సంగమించకూడదనే అభిప్రాయం గట్టిగా ఉండేది. 1916 అక్టోబరు 2-వ తారీఖున ఆడశిశువును ప్రసవించింది. ఈ ప్రథమకానుపు ఆమెకు ప్రాణంమీదకు తెచ్చింది. బ్రతికి బయట బడ్డా వెంట్రుకలన్నీ ఊడిపోయి అనాకారి అయింది. అసలే బోలెడంత సిగ్గు. ఇంచుమించు బోడితలతో అనాకారిగా నున్నా ననే భావం నా నుండి ఆమెను మరింత దూరం జేసింది. మొదటి నుండి చనువుతో స్నేహితుడిగా నన్ను పరిగణించియుండి నట్లయితే తన వ్యాధికి, వెంట్రుక లూడిపోయినందులకు నా దగ్గర గోడు చెప్పుకొనేది, నేను సానుభూతిని చూపి ఆదరంతో, అభిమానంతో, ప్రేమతో ఓదార్చేవాడను. అట్టిది లేకపోవటం వల్ల మేము కొంతకాలం పరాయివాళ్ళవలె ఉండిపోయాము.

నేను బందరు నోబుల్ కళాశాలలో ఇంటర్‌మీడియెట్ చదువుచుండగా 1919 జూలై 24-వ తారీఖున మా ప్రథమ పుత్రుడు పూర్ణచంద్రరావు జన్మించాడు. వాని జన్మకు కారకమైన మా దాంపత్య జీవితం కొంత ఆదరాభిమానాలతో ఒకరియందు ఒకరికి కొంత ప్రీతితో నడచింది. పుట్టిన కుర్రవాడు పూర్ణచంద్ర రావు తన 20-వ ఏటనే మరణించినందున మాకు దక్కలేదు కాని మా సౌఖ్యప్రద, సంతృప్తికర కలయికకు ప్రతిబింబమై మా ప్రేమను చూరగొన్నాడు.

నేను 1920 ఆగష్టులో బయలుదేరి ఇంగ్లండుకు వెళ్ళాను. మధ్య నొకసారి 1923 వేసవిసెలవుల్లో ఇంటికి వచ్చినా 1927 ఫిబ్రవరి ఆఖరుకుగాని విద్య పూర్తిచేసుకొని ఇంగ్లండునుండి వచ్చి వేయటం సంభవించలేదు. 1924 మార్చిలో మా నాన్న వెంకటరత్నంగారు పరలోకప్రాప్తి చెందినారు. మా కుటుంబం ఆర్థికస్థితులు క్లిష్టదశలో పడినవి. నే నింగ్లండులో నుండిన 6½ సంవత్సరాలు తల్లి, అక్కల అదుపు ఆజ్ఞల్లో మెలగుచు పెడసనగల్లులో నుండిన నా భార్యకు నా యందు, నా కుటుంబము నందు సానుభూతి చల్లారిపోయింది. నాతో తిరిగి కాపురానికి కొన్ని విషమ షరతులు పెట్టింది. అందువల్ల మా దాంపత్యానికి

అడ్డుగోడ వెలసింది. దాని ఫలితం మేము వేరుగా వుండటం, నేను వేరేదారి చూచుకొనుటకు ప్రయత్నించటం జరిగింది.

నేను 1929 జూన్‌లో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంటులో చేరాను. పెద్దల మధ్యవర్తిత్వంద్వారా ఆ సంవత్సరం డిశెంబరు ఆఖరుకు మేము తిరిగి సంసారం మొదలుపెట్టాము. ఆమె ప్రాత కాలం మనిషి, చదువుకోలేదు. పైగా ఆ రోజుల్లో పెడసనగల్లు కమ్మవారు మోటువారుగా, కుంచితస్వభావం కలవారుగా ఉండే వారు. నేను గుడివాడ తాలూకా, బొమ్ములూరు గ్రామవాసిని, సమీప గ్రామమగు అంగలూరు మా తల్లిగారి జన్మస్థలం. ముఖ్యముగా ఆ రోజుల్లో అంగలూరు కమ్మకులానికి గుండెకాయవంటిది. ఆ ఊరి కమ్మవారిలో సంస్కృత పండితులు, విద్వత్కవులు, గాయకులు, గణితశాస్త్రజ్ఞులు వగైరా ఉండేవారు. మిక్కిలి నాగరికత గల ఊరని పేరొందింది. ఆ గ్రామములోని ప్రఖ్యాత త్రిపురనేనివారు నా మేనమామలు. కవిరాజు రామస్వామి చౌదరిగారు నాకు ప్రేలు విడిచిన మేనమామ. ఆ నాగరికత ప్రభావం, ఆ విద్యాగంధం నాకు కొంత సోకింది. పైగా నేను ఇంగ్లండులో $6\frac{1}{2}$ సంవత్సరములు గడపి ఆక్స్‌ఫర్డ్ నుండి, లండన్ నుండి రెండు డిగ్రీలను గడించాను. ఆధునిక దృక్పథం అలవడింది. ఈ సహజ ప్రవృత్తుల భిన్నత్వంవల్ల దృక్పథ భేదాలవల్ల మా ఇద్దరి మధ్య అవగాహన, సామరస్యం, స్నేహ భావం, ప్రీతి తక్కువైనాయి.

అయినా నేను 1929 నుండి 1953 జూన్ ఆఖరు వరకు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగంచేసిన కాలంలోను, ఉద్యోగవిరమణానంతరం దాంపత్య జీవితం ఒడుదుడుకులు లేకుండగనే గడపినాము. మేము తిరిగి సంసారం ప్రారంభించిన తర్వాత ఇప్పటి పెద్ద కుమారుడు రాధాకృష్ణ 1936 మార్చి 15-వ తారీఖున, రెండవ కుమారుడు సుధాకర్ 1938 మార్చి 8-వ తారీఖున, రెండో కుమార్తె కమలకుమారి 1939 సెప్టెంబరు 24-వ

తారీఖున జన్మించారు. కమలకుమారి పెండ్లి 1958 మే నెల 28-వ తేదీన, రాధాకృష్ణ పెండ్లి 1960 ఏప్రిల్ 28-వ తేదీన, సుధాకర్ పెండ్లి 1961 ఏప్రిల్ 28-వ తేదీన మే మిద్దరం సామరస్య, సహకారాలతో స్వయంగా జరుపుకొన్నాము.

1959 జనవరి 13-వ తారీఖున ఆమెకు మూర్ఛవంటి వ్యాధి ప్రారంభమైంది. ఆ సంవత్సరం మార్చి ఆఖరున మద్రాసులో న్యూరో సర్జన్ డా. బి. రామమూర్తిగారు మెదడులో పుండున్న దని కపాల ఆపరేషన్ చేశారు. తర్వాత గుంటూరులో డా. సి. సాంబశివరావుగారు చికిత్స చేశారు. అటు పిమ్మట అనేకసార్లు మద్రాసులో మందులు పుచ్చుకొన్నది. డా. హెచ్. వీరారెడ్డి గారి నర్సింగ్ హోమ్‌లో రెండు మూడుసార్లు చికిత్స పొందింది. కాలం గడచినకొద్దీ ఇతర క్రొత్త వ్యాధులు, బాధలు పొడ చూపి క్రమేణ క్షీణించిపోవటం మొదలుపెట్టింది. కొంతకాలం జరిగిన తర్వాత నేనింక బ్రతుకనని అంటూ వచ్చింది. ఆమెకు మరణ మాసన్నమైనదని నేను నమ్మలేదు. ఆరంభించిన మూర్ఛ వ్యాధి అరుదైపోయింది. క్రొత్తగా వచ్చిన అతిమూత్రవ్యాధి మధుమేహ సంబంధమైనదిగాక ఒక ఉలవకాయ దెబ్బతినటంవల్ల సంబంధించినదని, రెండో ఉలవకాయ సక్రమంగా ఉన్నందువల్ల ఫరవాలేదని వైద్యులు ధైర్యం చెప్పారు. తరువాత నడుము వంగి పోవటం ఆరంభించి క్రమేపి పూర్తిగా వంగిపోయింది. అది నీరుడు వ్యాధివల్ల వచ్చింది ప్రాణాపాయంలేదని డాక్టర్లు అభిప్రాయ పడ్డారు. ఆమెకు మధుమేహావ్యాధియేగాక రక్తపోటు కూడా లేదు, గుండె వగైరా సరిగానే వున్నవి. అందువల్ల మద్రాసు డాక్టర్లు, గుంటూరు డాక్టర్లు ఆమెకు ప్రాణభయంలేదని చెప్పారు. ఆ కారణాన ఆమెకు శరీరబాధ, నడుము వంగిపోయిందనే మనో బాధ వ్యథ కలుగజేయుచున్నను మా కనుమానం కలుగలేదు. పెడసనగల్లులోనే బొత్తుగా నడుము వంగిపోయిన ఒక రిద్దరు స్త్రీలు అటు ఇటు తిరుగుచు మామూలు జీవితంగడపటం మాకు తెలుసు. కాబట్టి అన్నపూర్ణమ్మ జీవితం చరమ దశకు వచ్చిందని మాకు తోచలేదు. ఇంకా కొన్ని సంవత్సరాలు జీవిస్తుందనే తలచాము.

కాని ఈశ్వరేచ్ఛ ఇంకొక విధముగా నుండినది. తలవని తలంపుగా ఈ సంవత్సరం (1972) జనవరి 20-వ తారీఖున సుస్తీ ఎక్కువైంది. ఇంటి డాక్టరు డా. పేర్నీడుగారు మందు లిచ్చారు. 21-వ తారీఖున కొంచెం మెరుగు. 22-వ తారీఖున డాక్టరుగారు రక్తపోటు హెచ్చైనది, గుండె బలహీనంగా వున్నదని చెప్పారు గాని ఆమె 21-వ తారీఖుకంటె కూడ తెలివి తేటలతో కాల కృత్యాలు వగైరా తనే నెరవేర్చుకొన్నది. ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం పాలు తీసుకొన్నది. రాత్రి $7\frac{1}{4}$ గంటలకు రెండవ కోడలు సౌభాగ్యవతి భవాని దగ్గ రుండగా భోజనంచేసింది. భోజనం పరిమాణా బొత్తుగా తగ్గిపోయినా సుస్తీకి ముందు తినుచుండినంత భోజనం చేసింది. ఇక ఫరవాలేదనుకొన్నాం. తెల్లవారితే 23-వ తారీఖు అనగా తెల్లవారు ఝామున 4 గంటలకు సుధాకర్, భవాని పలుకరించగా పలికింది. తిరిగి $6\frac{1}{4}$ గంటలకు పిలువగా పలుకలేదు. చూడగా మృతిచెంది యుండినది. నిద్రలోనే ప్రాణవాయువులు లేచిపోయిన ట్లున్నవి. ఆమెకు తెలియకుండగనే ప్రశాంతంగా నిద్రలో దాటిపోయింది. ఉత్తరాయణపుణ్యకాలంలో భీష్మాష్టమి ఆదివారం అశ్వనీ నక్షత్ర మందు పుణ్యలోకానికి చేరుకొన్నది. ధన్యురాలు.

ఆమెది నిండైన విగ్రహం. ఇంచు మించుగా నా ఎత్తు, 5 అ. $7\frac{1}{2}$ అంగుళాలు. గోధుమ రంగు, పసుపు రంగు కలసిన శరీర ఛాయ. అవయవపుష్టి పొందికలు ఉత్తమం. వస్త్రధారణలో, దిద్దుకొనుటలో నేర్పులేనిది. అవి ఉన్నట్లయితే మంచి అంద కత్తెగా ఎంచబడేది. ఆమె వెనుకభాగం ముఖ్యంగా పృష్టభాగం మిక్కిలి ఆకర్షణీయం. బొమ్మకంటె బొడ్డు క్రింది భాగం కొంచెం పొడవు. ఏ శిల్పి అయినా ఆ విగ్రహాన్ని రాతిలో మలచటానికి సందేహించేవాడు కాదు.

ఆమెకు మూఢ నమ్మకా లెక్కువ. ఆచారాలు జాస్తి. పట్టింపులు హెచ్చు. ప్రతిదానికి వర్జం, రాహుకాలం అనేది. ఇదుగో ఇక్కడ పాచి, అక్కడ పెంట అనేది. ఇంటి ఆవరణే గాక వీధి కూడా ఊడిపించేది. మేము కాకినాడలో కపిలేశ్వ

పురం జమీందారుగారి మేడలో ఉండేవాళ్ళం. ఆ మేడ గాంధి పార్కుకు పోయే పెద్ద రోడ్డు సందు రోడ్డు మొదటలో ఉన్నది. రెండవప్రక్క ఖాళీస్థలం. పార్కురోడ్డు సగం, ఇంటిముందు రోడ్డు సగం, ఖాళీస్థలం సగం ప్రతిదినం ఊడ్పించేది. తెల్లవారకముందే కల్లాపి జల్లి ముగ్గులు వేయాలి. వర్షం పడుతున్నా సరే కల్లాపి తప్పదు. ముగ్గులు వేయాల్సిందే. ఆలస్యమైనా పని తొందరలో ఏ ప్రక్కనా విడచిపెట్టబడినా గందరగోళం చేసి మరీ చేయించేది. ఈ వర్షంలో కల్లాపి ఏమిటి, ముగ్గు లెందుకని నేను కోప్పడినా సహించేదికాని తన పద్ధతులను పట్టుదలను మానేది కాదు. ఆమె కోపతాపాలకు భయపడి నౌకర్లు చచ్చినట్లు ఆమె చెప్పినవన్నీ చేసేవారు. వ్యాధి ముదిరి ఆమె బలహీనమైన కొలదీ ఎక్కడేపని వున్నా, పశువులకు మేత వేయకపోయినా, పాడి పశువులను పాలు పిండకపోయినా, ఇంట్లో పనిజేసే నౌకరు గాక దొడ్లోవున్న ఇద్దరు కుర్రవాళ్ళకూడా పని విడచిపెట్టి పరుగెత్తుకొని రావలసినదే. కుర్రవాళ్ళు సమయానికి లేకపోతే పెద్ద నౌకరైనా చప్పున చీపురుపుచ్చుకొనవలసినదే. తాను ముగ్గు గొట్టంతో బైలుదేరవలసినదే. పండుగలకు, పబ్బాలకు ఇల్లు దులిపి కడుగవలసివస్తే దుమ్ములో కుర్చీలో కూర్చొని, మరీ మరీ ఊడ్పించేది. కడిగిందే కడిగించేది. రెండు మూడు రోజులలో కావలసినపనిని వారంరోజులు పట్టించేది. ఇట్టి ఆచారవ్యవహారాలలో పూర్వకాలపు వైదిక బ్రాహ్మలను మించింది.

అయితే ఆమె వట్టి అమాయకురాలు, అల్ప సంతోషి. వెట్టిచాకిరి చేయటానికి సందేహించేది కాదు. తన అక్క బిడ్డలను పెంచటానికిగాని, తన కూతుళ్ళ బిడ్డలను సాకటానికిగాని ముందంజవేసేది. నిజానికి ఆమె అక్క కొడుకుల్లో నల్గురన్నా వాళ్ళ చిన్నతనంలో ఆమెయే సాకింది. తన పెద్దకూతురు కొడుకును 20 ఏళ్ళు తన స్వంత కొడుకులకంటే మిన్నగా పెంచింది. ఆ మనుమడి భార్యను తన ఇంటిలో (మనుమనితోబాటు) పెట్టుకొని ఆమెకు (మనుమరాలికి) ప్రథమ సంతానం కలిగేవరకు తన రెండవ కూతురుకంటే హెచ్చుగా ఆదరించింది. స్వజన

ప్రీతియేగాక బంధుప్రీతి, అతిథి, అభ్యాగతులయందు శ్రద్ధ ఆమెకు చాలా హెచ్చు. ఇంటికివచ్చిన బంధువులను, స్నేహితులను నోరార పలకరించి భోజనాని కుండండని బలవంతపెట్టి భోజనం చేసేటప్పుడు దగ్గ రుండి, ఇంకా ఇంకా అంటూ వడ్డించి తల్లికంటె ఎక్కువ శ్రద్ధతో ఆప్యాయతతో తినిపించేది. ఫలహారాలని తొందర పెట్టేది. ఇంకొక రోజో, పూటో ఉండండని ప్రాధేయపడేది. ఆమెతో పరిచయం కల్గిన వా రందరు ఆమె నిష్కపట్యాన్ని, ఆదరణను ప్రశంసించేవారు. ఆచార్య రంగాగారు "ఆమెది ఉల్లాసకరం, హృదయపూర్వకమైన స్వాగతం. గ్రామీణ ఆతిథ్యం" అని ప్రశంసించారు. శ్రీమతి భారతీదేవి రంగాగారు "మీ నుండే కాదు, మా నుండి కూడా దూరమైనదని తెలుసుకొని దుఃఖించా "నన్నారు. సి. నరసింహం గారు తమ గాఢ సానుభూతిని తెల్పుచు "నేను నాకుటుంబంయావత్తు మా స్వంత నష్టంగా శోకించుచున్నాము. ఆమె న న్నెల్లప్పుడు సోదరునిగా చూచేది. నా కుటుంబ సభ్యులందరిని ఆప్యాయతతో చూచేది. ఆమె నుండి మే మనేక పర్యాయములు ఆతిథ్యం పొందాము. ఆమె మరణం మాకే గాక బంధువులు, స్నేహితుల కందరికి తీరరాని నష్టం" అని వ్రాశారు. నూతక్కి వెంకటేశ్వరరావుగారు (నార్వేలో ఇండియా ఎంబాసిడర్ గా పని చేసినవారు) "ఆమె విశాలహృదయం, ఘనమైన ఔదార్యం కలది. ఆమె నాయందు చూపిన ఆప్యాయతను నే నెన్నడు మరచిపోలేను"అని తన సంతాపాన్ని తెలియపర్చారు. జిల్లాజడ్జిగారిపైరైన కలగల సుబ్రహ్మణ్యంచౌదరిగారు వ్రాస్తూ "ఆమె నిరాడంబరత్వం, ఆతిథ్యం గుర్తుకు వస్తున్నా" యని విచారం తెలిపారు. అడ్వకేటు మరుపిళ్ల అప్పలస్వామిగారు ఆమె హుందాతనాన్ని శ్లాఘించారు. అట్లూరి వెంకట్రావుగారు "మేము మీ ఇంటికి వచ్చినప్పుడు, మా పెద్దమ్మగారు, అబ్బాయి నీ విక్కడేంసిగ్గు పడవద్దు, ఇది నీఇల్లే అనుకో అని ఆదరించినది. మరువలే"నని వ్రాశారు. మిత్రుడు గొల్లపాటి వెంకట సుబ్బయ్య గారు, తన నామె సోదరునివలె భావించేది, అరమరలేకుండా మాట్లాడేదని వాపోయారు. శ్రీ వెలమాటి పద్మనాభం బావగారు

ఆమెగారు నిష్కపటస్వభావంతో అరమరలేకుండా, మర్యాద మన్నలను, నిండు ప్రేమను, చూపేవారని చింతించారు. వియ్యంకుడు వెనిగళ్ళ బసవయ్య చౌదరిగారు, ఆమె దేవతా స్త్రీ వంటిదని వర్ణించారు. హనుమకొండనుండి శ్రీకాళోజి రామేశ్వర రావుగారు, ఇంటికి స్వయంగా వచ్చిన ప్రజాకవి శ్రీకాళోజీ ఆమె ఆతిథ్యాన్ని, ఆప్యాయతను ప్రశంసించి ఆమె మరణానికి గాఢ సంతాపాన్ని తెలిపారు. ఉత్తరాల ద్వారాగాక స్వయంగా సానుభూతిని తెల్పిన చాలామంది ఆమె "ఆదరణతో ఆహ్వానించి, చనువుగా నవ్వుతూ మాట్లాడి, ఉండండని, బలవంతం చేసి, ఆప్యాయతతో భోజనాదులను సమాకూర్చే"దని తమ విచారాన్ని తెలిపారు. ఆమె మరణం విని చప్పున రాని బంధు వర్గం గొప్పగావచ్చి, ముత్తైదువులకు జరిపే చాటల నోము వంటి లాంఛనాలు భక్తి శ్రద్ధలతో జరిపారు. నిజంగా ఆమె మరణం ఆమెయందుండిన ఆప్యాయతను బహిర్గతం చేసింది.

మా దాంపత్యజీవితం సంతాన రూపంలో ఫలవంతమైంది. 1916 అక్టోబరు 2-వ తారీఖున మా ప్రథమ సంతానం ఆడపిల్ల వజ్రాంబ జన్మించింది. మా రెండవ బిడ్డ మగపిల్లడు, 1919 జూలై 24-వ తారీఖున పుట్టాడు. తర్వాత నే నింగ్లండు వెళ్ళటం, నే నింగ్లండు నుండి తిరిగివచ్చిన తర్వాత కొన్ని గర్భస్రావాలు వగైరా సంభవించినా తర్వాత ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల కలగటంవల్ల మాకు నిండు సంతానంగానే పరిణమించింది. పెద్ద కుమార్తెకు సంతానం కొడుకు మలినేని వీరభద్రరావు ఒక్కడైనా, వాని కిద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. రెండవ కూతురు వెలమాటి కమలకుమారికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్ద కుమారుడు రాధాకృష్ణకు ప్రస్తుతం ఒక్క కూతురే అయినా, రెండవవాడు సుధాకర్‌కు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు. మా పెద్ద కుమారుడు పూర్ణచంద్రరావు అవివాహితుడుగా 20-వ ఏటనే చనిపోయాడనే చింత తప్ప సంతానానికి లోటులేదు.

ఆమెకు 71 సంవత్సరాలు నిండియుండును. (నాకు 74 సంవత్సరాలు జూన్ 25-వ తేదీనాటికి నిండినవి) మా వివాహం

జగిగి ఆమె మృతినాటికి ఇంచుమించు 61 సంవత్సరాలు. ఆమె మునిమనుమలను, మునిమనుమరాళ్ళను కళ్లారా చూచింది. ఆమె ఇంకా 4, 5 సంవత్సరాలు జీవించియుంటే వీరభద్రరావు కూతురు, మునిమనుమరాలు మంజూష బిడ్డను కూడా చూచి సంతోషించేది. ఆమె తల్లి రంగమ్మగారు 100 ఏండ్లు బ్రతికింది. ఈమె ఇంత వరకే నోచుకొన్నది. ఎక్కడికి తృప్తి? నా జీవితంకూడ ఎక్కువ కాలం నిల్వదని ఊహ. ఈ లోకంలో, మే మెక్కువగా ప్రేమించుకొని అభిమానంతో మెలగకపోయినా, నాకు పూర్తి సహకారం ఇవ్వలేదని నేను మధనపడినా, ఉత్తమలోకంలో విహరించుచున్న ఆమె సూక్ష్మరూపాన్ని నా సూక్ష్మరూపం కలసికొన్నప్పుడు ఏ భావంతో మెలగుతామో ఎవరు చెప్పగలరు? అసలు నాకు ఉత్తమ లోక ప్రాప్తి యుండునా? ఇదొక గడ్డు ప్రశ్న.

అతని చిన్ననాటి పల్లెటూరు

అతని దొక మధ్యరకం పల్లెటూరు. వాళ్ళది సన్నకారు రైతు కుటుంబం. అతని చిన్నతనంలో గ్రామ జీవితం ఏ ఒడు దుడుకులు లేక ప్రశాంతంగా జరిగిపోయేది. వాళ్లు చిన్న రైతులైనా గ్రామంలోని పెద్ద రైతులు, వాళ్లను మర్యాదగా పలకరిస్తూ, వావి వరుసలతో పిల్చేవారు. పెళ్లి, పేరంటాలు వస్తే సాయానికి పిల్చేవారు. వాళ్ల కేదైనా అవసరమొస్తే సాయపడే వారు. గ్రామంలో ఎవరిపనులు వారు చూచుకొంటూ, ఎవరి త్రోవను వారు పోతూ, కాయకష్టంతో కలిగిన కొండ్రలో నాల్గు గింజలు పండించుకొని సుఖజీవనం చేసేవారు. పెద్ద రైతులు నౌకర్లను, కూలీలను పెట్టుకొంటే, బక్కరైతు ఇరుగుపొరుగు సాయంతీసుకొనేవాడు. ప్రక్కింటి రైతుకు పని సమయంలో నాల్గురోజులు బదులు వెళ్లితే, అవసరం వచ్చినప్పుడతడు నాల్గు రోజులు బదులు వచ్చేవాడు. కుప్ప నూర్పుడువంటి మంచి ఒత్తిడిసమయంలో, ఒకరినో, ఇద్దరినో ఆ సమయానికి కూలికి పిల్చేవాడు. కూలికి వచ్చినవాళ్లు అభిమానంతో, మనమంతా ఒకటే అనే భావంతో, పని పూర్తిచేసేవాళ్లు. పెద్దరైతుకూడా, భేషజంలేక నౌకర్లతోబాటు నేనూ ఉన్నాననేవాడు. వాళ్లివలె రోజంతా పనిచేయకపోయినా, అవి ఇవి అందుకొంటూ, సామరస్యంగా పని నడుపుకొనేవాడు. పండుగ, పబ్బాల్లో గ్రామ

జాతర్లో అందరు ఏకీభవించినట్లు కలసి పనిచేసేవారు, పాల్గొనే వారు. మొత్తంమీద ఏ అలజడులు లేక జీవితం సాగిపోయేది.

అతని తలిదండ్రులకు ఇద్దరు కుమార్తెలు, అత నొక్కడే కుమారుడు. ముగ్గురిలో అతనే చిన్నవాడు. అక్కలకు పెండ్లిండ్లై ఎవరి సంసారానికి వాళ్లు భర్తల ఊళ్ళకు వెళ్లిపోయారు. అక్కలున్నప్పుడు తలిదండ్రులకు చేదోడువాదోడుగావుండేవారు. వాళ్లు వెళ్ళిపోయినతర్వాత సాయపడవలసింది తా నొక్కడే అయిపోయాడు. అందువల్ల, అతనికి 12 ఏండ్లు నిండీ నిండక ముందే బడి మాని గొడ్డు గోదా చూస్తూ, తండ్రికి సాయపడవలసి వచ్చింది. పని ఒత్తిడి సమయంలో తండ్రికి అన్నం పొలానికి పట్టుకొని వెళ్లటం, అక్కడ అవీ ఇవీ అందుకోవటం చేయవలసి వచ్చింది. చదువుమీద అంత శ్రద్ధలేనివాడు కాబట్టి ఈ క్రొత్త పని హుషారుగానే ఉండేది. కాలం సుఖంగానే గడిచింది. అతనికి 15 సంవత్సరాలు నిండి 16-వ సంవత్సరం ప్రవేశించింది. క్రొత్త క్రొత్త ఊహలు, యౌవనారంభోత్సాహం మొదలుపెట్టినాయి. క్రొత్తగా రెక్కలువచ్చినట్లు ఎక్కడికైనా ఎగిరిపోదామా అన్నట్లుండేది. ఇంతలో ఒకనాడు వాళ్ల నాన్న అతనిని నూర్పుడు వద్ద కాపలాపెట్టి ఏదో పనిమీద ఇంటికి వెళ్లాడు. ఆయన తిరిగి రాకముందే కడుపు నొప్పివచ్చి సమీపాన ఉన్న కాల్వగట్టుకు చేరాడు. ఆ పై గ్రామాన్నుండి కాల్వగట్టువెంట వెళ్లుచుండిన స్నేహితు డొకడు కనపడగా అతనితో ఊసుతో కొంతకాలం గడిచింది. తిరిగి నూర్పుడు కల్లం చేరుకొనేటప్పటికి ఇంటినుండి తిరిగి వచ్చిన తండ్రి ఉగ్రుడైయుండినాడు. కల్లంలోని గింజలు పరాకైనవో అన్న శంక ఆయనను కోపోద్రిక్తుణ్ణి చేసింది. "వెధవా, కల్లం విడిచి షికార్లకు పోయావా" అని చేతిలోవున్న కర్రతో నాల్గు ఉతికాడు. దెబ్బల బాధకన్నా కల్లంలోవున్నవాళ్ల ముందు కొట్టినాడనే అభిమానంతో బైటికి దౌడుతీశాడు. కాల్వ గట్టువెంట పోవుచున్న స్నేహితుణ్ణి కలుసుకుని వానితోగలసి

సమీపానఉన్న చిన్న పట్టణం చేరుకొన్నాడు. అక్కడ కొన్ని రోజులు వాళ్ళ కిళ్ళీ సోడా కొట్టులో పనిచేసి, తర్వాత ఒక పట్టణం హోటల్లో చిల్లర మల్లర పనులుచేసి, అక్కడ విసుగు పుట్టి ఇంకొక పెద్ద పట్టణంలో నౌకరుండి క్రమేపి మద్రాసు చేరుకొన్నాడు. వయస్సుమళ్ళిన ఒక తెలుగు రిక్షావానితో పరిచయమై అతనికి సాయపడుచు అత నింటిలో రెండు సంవత్సరాలు గడిపాడు. ఒక సైనికునితో రిక్షాలాగటంలో పరిచయంకాగా, అతనిద్వారా సైన్యంలో చేరిపోయాడు. పటాలంతో దేశం నాలుగుప్రక్కలకు తరలింపబడి రెండవ ప్రపంచయుద్ధంలో విదేశాలకుకూడా వెళ్లాడు. ధైర్యసాహసాలతో, శక్తి యుక్తులతో పోరాడి, మంచిపేరు తెచ్చుకొని ఒక గౌరవమైన ఆఫీసరు స్థాయికి చేరుకొన్నాడు. 30 సంవత్సరాలు గడిచాయి. కొలది సంవత్సరాలలో పింఛను పుచ్చుకొనే కాలంవస్తుంది. కొంత కాలమునుండి మనస్సులో మెదలుచున్న భావం బలమైన కోర్కెగా పరిణమించింది. తలిదండ్రులు ముసలివారై యుంటారు. అసలు వారింకనూ బ్రతికియున్నారో లేకో? ఎట్లున్నారో? భూమి, బుట్ర ఏమైందో? గ్రామం ఎట్లున్నదో? తా నెరిగి యుండిన కుర్రకారు పెద్దవాళ్లై యుంటారు. పెద్దవాళ్లు దాటిపోయి యుంటారు. వాళ్ల నొకసారైనా చూడాలని బుద్ధి తొందరబెట్టసాగింది. తండ్రికి తెగించి ఉత్తరం వ్రాశాడు. "వెంటనే వచ్చి ముసలి వాళ్లమై, చావలేక బ్రతికియుండిన మ మ్మొకసారివచ్చి చూచి పో" మ్మని ప్రాధేయ పూర్వకంగా జవాబు వచ్చింది. 6 నెలలు సెలవుపెట్టి ఇంటికి జేరుకొన్నాడు. శక్తు లుడిగి, దీనావస్థలో నున్న తలిదండ్రు లను చూచి కన్నీరు పెట్టుకొన్నాడు. ఎంత రక్తపాతంలో మునిగి తేలి యుండినా, సైనికవృత్తి శరీరంలో జీర్ణించి పోయినా, అనురాగం కృశించినా, తన జన్మకు కారకులై తనను ప్రేమా దరాలతో పెంచిన తలిదండ్రుల దీనస్థితి ఏ పుత్రుని గుండెను కాల్చివేయదు?

మొదటిరో జంతా ఇంట్లోనే గడిపాడు. మర్నాడు ఊరు చూచివద్దాం, ఎవ రెట్లున్నారో పలకరించి వద్దాం, అసలు ఎవ

రున్నారో లేదో తెలుసుకొని వద్దాం అని బైలుదేరాడు. ఇదేమిటి, ఊరంతా మారిపోయినట్లున్నది!

తన చిన్నతనంలో ఊరంతా నల్లరేవడి బంకమట్టితో నరక రూపంగా వుండేది. వర్షం పడ్డ దంటే వీధులన్నీ మోకాలివరకు దిగేవి. రెండు వైపుల ఇండ్లమధ్య వుండేది రోడ్డుగాక మట్టి మార్గం మాత్రమే. మనుష్యులు, పశువులు త్రొక్కి చిక్కని అడుసుగా మారి నానా చీదరగా వుండేది. ఆ రోజుల్లో మగ, ఆడ మల విసర్జనానికి ఊరుబైటకు పోవలసిందే. మఱుగుదొడ్లుండేవికావు. ఆడంగులు నానా అవస్థ పడేవారు. ఏ తెల్లవారు ఝామునో, ఏ చీకటి పడిన తర్వాతనో వెళ్ళవలసిందే. ఈ లోపల అవసరం వచ్చినా బాధపడుచు బిగబట్టుకోవలసిందే. పైగా సాఫీగా గొంతు కూర్చోవటాని కవకాశముండేదికాదు. కొంచెం మోకాళ్ళనువంచి వంగొని విసర్జించవలసిందే. ఇప్పుడో ప్రతి ఇంటిలోను మఱుగుదొడ్డి వున్నది. మగవాళ్ళుకూడా చెంబు పుచ్చుకొని బైటికి వెళ్ళవలసిన అవసరంలేదు. పైగా ఊరుబైట సిమెంటుతో కట్టబడి నేల గచ్చుచేసిన మఱుగుదొడ్లు కట్టినారు. వానిని నిజంగా ఉపయోగించనవసరం లేకుండా పోయింది.

ఇప్పుడు ఊరంతా కంకరరోడ్లు వేశారు. వర్షం వచ్చినా కాలికి అంటే అంటనట్లు బురదతప్ప బంకమట్టి బాధ లేదు. రాత్రి పూట చీకటిలో ఇబ్బంది పడవలసిన అవసరంలేదు. వీధి దీపాలు వేశారు. మంచినీళ్ళకు కావిళ్లు భుజాన వేసుకొని ఒక మైలువెళ్ళి మంచినీళ్ళు తెచ్చుకొనే భారం తప్పింది. మంచినీళ్ళ తొట్టి నమర్చి ఇళ్ళకు నీళ్ళకుళాయిలు పెట్టారు. సామాన్యుల కందు బాటుగా వీధికి పెద్ద కుళాయిల నమర్చారు.

తా నెరిగియుండినప్పుడు చాలావరకు చిన్న చిన్న ఇళ్లు. చిందరవందరగావుండేవి. 400 గజాల స్థలంలో నాలు గైదు ఇండ్లు ఉండటం కూడా తా నెరుగును. వీధులుకూడా దిసమొలగా తోస్తూండేవి. కొన్ని చోట్ల మధ్య మధ్య ఖాళీలతో బోసిగా వుండేవి. ఉండిన పెద్ద పెంకుటిళ్లుకూడా తల తొక లేనట్లుండేవి.

ఇప్పుడో మంచి మంచి భవంతులు, మేడలు వెలిసాయి. బజార్లు నిండుగా, కళగా ఉన్నవి. ఇళ్ళకు ప్రహరీలు, ఇంటి ఆవరణల్లో పూలచెట్లు, మొక్కలు శోభాయమానంగా ఉన్నవి. కంకర రోడ్లు ఈ ఇళ్ళకు అందం తెచ్చాయి. రోజ్లు అవకాశం చూచుకొని ఉన్నవాళ్ళు ఇద్దరో, ముగ్గురో మోటారుకార్లను పెట్టుకొని ఇంటి ఆవరణలో కార్ల షెడ్లను కట్టుకొన్నారు. ట్రాక్టర్లను కూడా సంపాదించుకొనేవారు బయలుదేరారు. పట్టణాలకు సరుకుల ఎగుమతులు దిగుమతులు సాగించే లారీలు రోడ్లు ధర్మమా అంటూ నాలుగు ప్రక్కలకు రాకపోకలు జరుపుచున్నవి.

పూర్వం చదువు వీధి బళ్ళలోనే. వీధి అరుగు కాకపోతే ఏ ముందు వసారో, చావడో గతి అయ్యేది. చదువంతా తెలుగే. అందువలన మూడవ లేక నాల్గవ తరగతివరకే చదువు. ఇప్పుడో హైస్కూళ్లు వచ్చింది. స్కూలే ఫైనల్ వరకు కడుపులో నిళ్లు కదలకుండా చదువుకోవచ్చును. పైగా లైబ్రరీ వచ్చింది. పుస్తకాలు తక్కువైనా చాలినన్ని దిన, వార, మాస పత్రికలు వస్తున్నవి. ఇష్టము వచ్చినట్లు చదువుకోవచ్చును.

తన బాల్యంలో మనుష్యులు మోటుగా వుండేవారు. పెద్ద బొజ్జలతో, మెలితిరిగిన కండలతో, బొడ్డు క్రిందకు కట్టి మోకాళ్ళ వరకు ఎగదోపిన కట్టు పంచెలతో, చొక్కాలేకుండా తలకు పై పంచె చుట్టి లావుపాటి చేతికర్రతో, పొడుగుపాటి పుగాకుచుట్ట కాలుస్తూ బయలుదేరి వెళ్లేవారు. నీరుకావి ధోవతులు. 8 గంటల కల్లా తిని పొలం పోయేవారు. ఇప్పు డామనుషులు లేరు. కొంత వయస్సుమళ్లినవా రున్నా వాళ్ల పద్ధతులు పూర్తిగా మారి పోయినవి. తెల్లబట్టలుతప్ప నీరుకావివి లేవు. చొక్కాలేకుండా ఉండను ఇంటిలోకూడా. తలగుడ్డచుట్టుకొనటం తక్కువై పై పంచలు వేసుకొనటం ఎక్కువైంది. ఆడంగులుకూడా పూర్వం ఏ 20 నంబరో, కొంచెమున్నవాళ్లు ఏ 40 నంబరో కోక కట్టుకొనేవారు. ఇప్పుడు 40, 60 నంబరు కోక ఏ రైతు ఇంటిలోను కన్పడదు. చివరకు కూలి నాలి చేసుకొనే స్త్రీ కూడా 60 నంబరుకు తక్కువ కట్టదు. ఇవి కొంత వయస్సు మళ్లినవారి

సంగతి. ఇక ఆధునికుల మనుకొనే మధ్యవయస్సువాళ్లు ముఖ్యంగా యువతులు రంగురంగు చీరెలు, వాయిల్సు, నైలానులు వంటి నాజూకు వానిని; బాలికలు, వయస్సువస్తున్న ఆడపిల్లలు సీతాకోకరంగుల లంగాలు, ఓణీలు లేనిదే ఒప్పుకోరు. యువకులు నైలాను షర్టులు, బుష్‌కోట్లు, వానికి సరిపడ్డ బిగింపు లాగూలు లేకపోతే పెద్దగళ్ల ముదురు రంగుల లుంగీలతో ఊరేగుచున్నారు. తదనుగుణంగా బొలురుకూడా. మనుష్యులు మారటమేగాక వేషాలు మారాయి. పైగా మర్యాద, మన్నన, మాటతీరు చాలా మారింది. తన చిన్నతనంలో వయస్సుకు పెద్దవారు ఎవరైనా గౌరవం ఉండేది. ఎవరైనా పలుకరిస్తే మర్యాదగా సమాధానం చెప్పేవారు. బంధువులుగాని, ఇతరులుగాని ఇంటికివస్తే మన్ననను చూపేవారు. ఇప్పుడు ఆధునికుల మనుకొనే యువకులు తా మేమో ఇంకొక ప్రపంచానికి చెందినట్లు, ఈ అల్పమానవులతో మనకు లెక్కేమి టను విధంగా ప్రవర్తిస్తున్నారు. చదువు తక్కువైనా డంబం హెచ్చైంది. ఆస్తిపాస్తులు తక్కువైనా ఖర్చులు పెరిగి పోయాయి. పూర్వం వయస్సువచ్చినవాళ్లు చుట్టకాలిస్తే వీళ్లు ఖరీదైన సిగరెట్లు ముట్టించాలి. ఇంటివద్ద కాఫీవగైరాకు వసతి ఉండినా, ప్రక్క ఊరు సెంటరు కాఫీహోటళ్లకు నిత్యం పోవాలి. ఇతర దురభ్యాసాలు కూడా నేర్చుకొనుచున్నారు.

తాను ఊరు విడిచి పారిపోకముందు కలిగిన రైతులకు పాలేళ్ల భార్యలు వడ్లు దంచగా, సామాన్య రైతుల స్త్రీలు తామే దంచుకొనేవారు. మిల్లు బియ్యం అనేది ఎరుగనే ఎరుగరు. కూలి నాలి జనం ఎల్లప్పుడూ దంచుకొనేవాళ్లు. ఇప్పుడు కూలిజనం కూడా మిల్లాడించుకొనవలసిందే. రోటిలో పోటు వేయరు. మరిస్నీ ఇంత ఉండిన ఆసామి భార్యఅయినా చీకటితోలేచి పాచి ఊడ్చుకొని మజ్జిగ తానంతట తనే చేసుకొనేది. ఇప్పుడు కవ్వం త్రిప్పే ఆడదేది? కల్లాపి చల్లుకొని ముగ్గులు వేసుకొనే స్థితిపరురాలైన ఇల్లాలేది? రైతులు వారి ననుసరించేవారు. సవర్ణులైన కూలిజనం వేషధారణలో, వర్తనలో, ఉనికిలో, కడుపునింపుకొనటంలో చాలా మారిపోయినట్లు హరిజనవాడలు కూడా మారిపోయాయి. కాలం మార్పు ఒక సంఘాన్ని మార్చి ఇంకొక సంఘాన్ని విడిచి

పెట్టుతుందా? తన చిన్నతనంలో ఆ ప్రదేశాలకు వెళ్లటానికే సరైన త్రోవ లుండేవి కావు. హరిజనవాడల్లో వీధులనేవి ఉండేవి కావు. ఎక్కడ చూచినా రొచ్చు, పెంట. ఇప్పు డంతా మారిపోయింది. మంచి కంకర రోడ్లు వేశాను. వీధి దీపాలు పెట్టారు. మంచినీళ్లు సమృద్ధిగా ఏర్పాటుచేశారు. గుడిసెలుపోయి, పాకలు, ఇండ్లు ఏర్పడ్డవి. చినిగిన మురికిబట్టలుపోయి శుభ్రమైన బట్టలు చొక్కాలతోసహా ప్రాప్తించినవి. అలుకులతో, ముగ్గులతో వాళ్ళ ఇళ్లు ముచ్చట కొల్పేటట్లుగా పరిణతి చెందాయి. చాలీ చాలని తిండితో అలమటించే స్థితి పోయి కడుపునిండా కూడు దొరుకుచున్నది. ఇంతవరకు మంచిదే. కాని వయస్సులో వున్న వాళ్లే సోమరిపోతులైనట్లున్నారేమి? గుంపులు గుంపులుగా అక్కడక్కడ చదికిలపడి కూర్చుని బీడీలు త్రాగుచు కబుర్లు చెప్పుకొనుచున్నారేమి? ఇవి పనిరోజులుకదా అని ఆశ్చర్యపడి దారినిబోవుచున్న ఆసామి నడుగగా, "వాళ్లంతే, కుర్రకారీరోజులలో సరిగా పని చేస్తున్నారా? పనికివెళ్లిన రోజున ఎక్కువకూలి కావాలంటారు. పోసి మిగుల్చుకొంటున్నారా అంటే అదీలేదు. ఎంత హెచ్చుకూలిదొరికితే అంత దుబారా పెరిగింది. చేతిలో నాల్గు డబ్బులు కనబడగానే మగవాడు ఏ త్రాగుడుకో, పంది మాంసానికో పోతాడు. ఆడది నాల్గు రోజుల నిల్వడబ్బు కన్పడితే ఏ ఉల్లిపొరవంటి చీరకో బయలుదేరుతుంది. దంపుకోవటం మానివేసి వచ్చిన వడ్లను కూలిచ్చి మరపట్టించుకోవాలి లేకపోతే ఏ కోమటింట్లోనో పోసి బియ్యం కొనుక్కోవాలి. డబ్బు నిల్వ బెట్టుకోవటం, పనిలోలేని రోజులు గడుపుకోవటం వాళ్ళంకా నేర్చుకోలేదు" అని సణిగాడు.

పై విధంగా ఊరంతా మారిపోయింది. మంచిదే అనుకొందాం. తాను మాత్రం మారలేదా? గొడ్డుకాడ బుడ్డాడు వంటివాడు తా నిప్పుడు పెద్ద మిలిటరీ ఆఫీస రవలేదా? మార్పు ప్రకృతి సహజం. దీనినే పరిణామ మంటాము. ఇది లేనిదే సృష్టే స్తంభించిపోతుంది. మానవాభ్యుదయమే ఆగిపోతుంది. ఈ విధంగా అత డనుకొని సమాధానపర్చుకొన్నాడు.

తండ్రి ముసలివాడైనా ఇంకా కొంత ఓపికతో, ఉండిన నాల్గెకరాల కొండ్రను నిలబెట్టుకొన్నాడు. తల్లికి ముసలితనము వచ్చినా ప్రాతకాలం మనిషి గనుక ఓపికతో సంసారం ఈడ్చుకొని వస్తున్నది. తా నెంత వారి కుపయోగపడకపోయినా పుత్రునియం దుండే మమకారం వాళ్ళకు పుష్కలంగానే వున్నది. తన సెలవు పూర్తిఅయి తిరిగి తన పటాలానికి వెళ్ళుచున్నప్పుడు తలిదండ్రులతో "ఇక్కడనుంచి ప్రతినెలా కొంత పంపిస్తూ వుంటాను. మీ రంతగా ఒళ్ళు హూనం చేసుకోవద్దు. సాధ్యమైనంత త్వరలో పించను పుచ్చుకొని ఇంటికి తిరిగి వచ్చేస్తా"నని వారి నూరడించాడు.

పల్లెటూరు పసందు

అదొక పల్లెటూరు. ఒక సంపన్న గృహస్థుని ఇంటిలో పెండ్లి. పెళ్లిపందిరిలో ఇద్దరు స్నేహితులు కలసికొన్నారు. ఒకరు విజయవాడనుండి, రెండవవారు గుడివాడనుండి వచ్చారు. ఎప్పుడు వచ్చారని ఒకరి నొకరు పలుకరించుకొన్నారు. "ఇప్పుడే వచ్చా"నని గుడివాడనుండి వచ్చినాయన అన్నాడు. "వచ్చి అప్పుడే గంట అయిం"దని విజయవాడనుండి వచ్చి నాతడు చెప్పాడు. ఊసులలోనికి దిగారు. " ఈ ఊరు రెంత మారిపోయింది! ఎప్పుడో, ఎన్నిసంవత్సరాలక్రితమో ఈ ఊరొకసారి వచ్చా" నన్నాడు విజయవాడాయన. "నేనుకూడా వచ్చి చాలాకాలమైంది నా చిన్నతనములో" అన్నాడు గుడివాడతడు. క్రొత్తఇళ్లు కట్టినారు. రోడ్లు వచ్చాయి, పూర్వం వలె రేగడిబంక మోకాళ్ల వరకు దిగటం తప్పిపోయింది అనుకొన్నారు. ఇంతలో ఆ ఊరివారొకరందుకొని " ఇప్పుడు మా ఊరు మునుపటివలె కాదండి. మాకిప్పుడు రోడ్లేకాదు, వీధి కరెంటు దీపాలు కూడా వచ్చాయి. మంచినీటికుళాయిలు వచ్చా"యన్నాడు. " ఇంకేవైన విశేషాలు వచ్చాయా?" అని స్నేహితు లడిగారు. "ఆ, లైబ్రరీవచ్చింది.

హైస్కూళ్లు వచ్చింది. పైగా గవర్నమెంటువారు పాలుకొనే డిపో పెట్టారు. పశువుల ఆస్పత్రి పెట్టించారు" అని గొప్ప చెప్పాడు. "అబ్బో ఇంకేం! మీ ఊరిప్పుడు ఆధునిక గ్రామం అయిందన్న మాట" అన్నారు స్నేహితులిద్దరు. ఇంతలో కాఫీకి రండని పిలుపు వచ్చింది. పకోడీలు కాఫీ తీసుకొన్నతర్వాత, పెండ్లి రాత్రి 8-30 గంటలకు కదా. ఇప్పుడు సాయంత్రం నాలుగు, నాలుగున్నర మాత్రమే అయింది. షికారుపోయి ఊరు చూచివద్దామని స్నేహితులిద్దరు బైలుదేరారు. ఇంటినుండి రోడ్డువెంట పది గజాలు నడిచేటప్పటికి గుడివాడ స్నేహితుడు "ఇదేమిటి, ఈ ఇంటిప్రక్క పెద్ద మురుగునీళ్ళగొయ్యి వున్న" దన్నాడు. విజయవాడ స్నేహితుడు చూచి "రోడ్డుకూడా సగం తడిసిందే" అన్నాడు. సాగిపోగా అక్కడక్కడ ఇళ్ళ వెనుకనో, ప్రక్కనో మురుగునీళ్ళ గుంటలు, దుర్వాసన. రోడ్డు అంచేగాక కొంతభాగం తడిసి కొచ్చుగా వున్నది. నాలుగడుగులు వేసేటప్పటికి జోడెద్దుల కాడికి కట్టిన ముళ్ళతొడుగును లాగించుకొంటూ ఎదురుగా వచ్చే నైతు కనపడ్డాడు. రోడ్డుకు అంతకు ముందే మరమ్మతు పూర్తి చేసినట్లున్నారు. పైనపోసిన ఎర్ర రబ్బీసు ఆ ముళ్ళకంప రాపిడితో చాలవరకు కొట్టుకొనిపోయింది. ముందుకు నడువగా రోడ్డు పొడుగూతా సైకిళ్ళత్రొక్కిన లోతుజాడలు కనపడ్డాయి. దృష్టిసారించగా నీళ్ళుచల్లి రబ్బీసు వేస్తున్నారు. తాము చూచింది అంతకు ముందే కప్పింది కాబోలు; సైకిళ్ళ టైర్ల కీ రోడ్డు పై భాగం గునపముతో గట్టిగా చీల్చి నట్లయింది. ఈ పనితనం కంట్రాక్టర్ల మహిమ కాబోలు. ఈ కంట్రాక్టర్లు పల్లెటూళ్ళవాళ్ళే. పల్లెటూరువాళ్ళు నిజాయితీపరులని అంటాము గదా, ఈ మోస మేమిటి ఇంతవరకూ గ్రామమే. వంతెన తగిలింది. ప్రక్కకు తిరిగి కాల్వగట్టువెంట పది బారలు వెళ్ళారో లేదో ముక్కుపుటాలు బ్రద్దలుకొట్టే చెడ్డవాసన. ఎక్కడనుండి వాస నని ముందుకు చూస్తే పశు కళేబరాన్ని రాబందు లొకప్రక్క, కుక్క లొకప్రక్క పీక్కు తింటున్నాయి. ఎదురుగుండా మాదిగగూడెం. ప్రక్కగా మాలపల్లె. ఇక అటు

పోగూడదని రెండో ప్రక్కకు తిరిగితే డొంక తగిలింది. అక్కడ కూడా దుర్వాసనే మల విసర్జనము నుండి, చచ్చిన కుక్కలు, దూడల నుండి. ఇక పైకి పోగూడదని వెనక్కు తిరిగారు. పెండ్లింటి సమీపానికి వచ్చి ప్రక్కరోడ్డుకు తిరిగారు. సాగిపోగా ఒక ప్రక్క డాబా కనబడింది. ఇదేమిటని అడిగి లైబ్రరీ అని తెలుసుకొన్నారు. చూచి వద్దామని లోపలికి వెళ్ళారు. ఒకటో రెండో బీరువాలున్నవి కాని వానిలో చాలా భాగం సగం చెదలు తిన్న పుస్తకాలు, తుక్కు కాగితాలే. గోడలలో అమర్చిన అలమరలలో చిందరవందరగా పడవేసియున్న పాత పుస్తకాలున్నవి. మధ్య హాలులోని బల్లమీద ఏవో వార్తా పత్రికలున్నవి. లైబ్రేరియన్ కాబోలు చూస్తూ ఊరకొన్నాడు. చదివేవాడొక్కడైనా లేడు. బైట వరండాలో, రెండుముఠాలుగా కొందరు చీట్లపేక ఆడుచున్నారు. ఆవరణ చెత్త చెదారంతో అశుభ్రంగా వుంది. ప్రాకారం మొండి గోడలు. ఇక చాలులే అని రోడ్డు ఎక్క ఎదురుగావున్న హైస్కూలుకట్టడం గేటు దాటి లోపల కడుగిడగానే ఆ ప్రక్క ఈ ప్రక్క తాటియాకు పాకలు సాక్షాత్కరించాయి. ముందుకునడిస్తే బీటలువారిన గోడలతో గదుల వరుస. వెనుకభాగంలో ఆటస్థల మున్నది కాని దానికి తీరు తెన్నుఉన్నట్లు కనబడలేదు. ఇకలాభం లేదని బయటకు వచ్చి ఎదురుగా కనబడుచున్న చెరువువైపుకు వెళ్ళారు. ఈ చెరువింత వంకరటింకరగా వున్నదేమను కొన్నారు. ఈ వంకరటింకర్లను కావాలనే వుంచారట. ఒకప్పుడు పూడికత్రవ్విస్తూ సరిచేద్దామనుకొంటే ఊరిలో పెద్దమనిషి ఒకరు అభ్యంతరం చెప్పాడట. ఆడవాళ్లు, మగవాళ్లు బహిర్భూమికి వెళ్లినప్పుడొకరి కొకరు కనపడకుండావుండటానికి ఈ వంకరటింకర్లుండాలని ఉద్బోధించాడట. దానితో ఆ వంపులు, మలుపులు ఆ విధంగా వుండిపోయాయట. ఒక ప్రక్క మఱుగుదొడ్లు కట్టించారు. వానిని ఉపయోగిస్తున్నట్లులేదు. పాడుపడి వుండినవి. వీని అసహ్యమేగాక గట్టునిండా ముళ్ల తుప్పలు, పిచ్చి మొక్కలు, గుంటలు, గోతులు,

పైగా మలవిసర్జనాలు చాలా చీదరగావున్నది. ఇక నీరు చూద్దామా పశువులను కడగటం, దానిలో వాని మలమూత్ర విసర్జనం, పైగా చాకళ్లు బట్టలుదకటం. మలినమైన నీటిలో ఉదకట మటుంచి ఉదికిన బట్టలను ఈ చీదరగట్లమీదనే ఆరవేస్తున్నారు. పైగా ఆనుకొనివున్న రోడ్డుమీదకూడా ఆరవేస్తున్నారు. గట్లమీది మలమూత్ర విసర్జనశేషం, రోడ్డుమీది దుమ్ము, ధూళి నీటిద్వారా సంభవించిన పశువుల మలమూత్ర మలినంతో మిళితమై ఆ సారం ఇంకించుకొన్న బట్టలనే మలినం పోగొట్టి శుభ్రపరచినబట్ట లని మనం ధరించుచున్నాము. ఈ విధంగా తలపోస్తూ స్నేహితులిద్దరూ పెండ్లివారింటికి తిరుగుముఖం పట్టారు.

ఆకాశం మబ్బుగా వుంది. వర్షంవస్తుందేమో. అప్పుడే 7 గంటలు దాటింది. లగ్నానికి ముందే భోజనాలు పూర్తి చేయాలని పెండ్లివారితొందర. ఊరబంతి. ఊళ్ళోవారు వస్తున్నారు. వారు, బంధువులు, ఆహూతులు, భోజనాలు మొదలుపెట్టారు. ఇంతలో చినుకు లారంభించాయి. వర్షం మొదలుపెట్టింది. జోరు సాగింది. తాటాకుపందిరి. కారక ఎట్లుంటుంది? తల తడుస్తుండగా, విస్తళ్లలో నీటిచుక్కలు పడుచుండగా సుష్టుగా తినట మెట్లు? తినీ, తిననట్లు పూర్తిచేసి వాళ్లు లేచిపోయారు. వర్షం కొంత తగ్గిన తర్వాత, తర్వాత బంతి. నేల తడియుటేగాక విస్తళ్లు తీసినా, ఎక్కడి ఎంగిలి అక్కడే. నేల తడిసి, నీరక్కడక్కడ నిల్చినప్పుడు పొలికట్టలుగాని, చీపుళ్ళుగాని ఉపయోగపడవు. ఎంగిలి మెతుకులు బురదలో కలసిపోవును. సరే, ద్వైవికంగా భోజనశాల చికాకైంది. కాని అసలు పల్లెటూరు వైతుల పెండ్లి భోజనాలు ఈ రోజుల్లో ఎంతో ఎడ్డి మడ్డిగా వుంటున్నవి! బంతి చాపలు వేస్తుండగానే జనం త్రోసుకురావటం, మొదటిబంతి లేచీ లేవకుండానే ఎంగిలి విస్తళ్లు తీసేలోపలనే, పొలికట్టలతో నేలను శుభ్రపరచకముందే రెండవపంక్తికి త్రోసుకు రావటం, ఆ అశుభ్రతలోనే చతికిలపడటం పెద్దవారిండ్లు పెళ్ళిళ్ళలో మామూలై పోయింది. పూర్వం బంధువులనుమాత్రమే ఆహ్వానించేవారు. ఊరబంతి పెట్టినా తగిసట్లుగా వచ్చేవారు. ఎక్కడ భోజనం

దొరకదో అనే దిగు లుండేదికాదు. పైగా సావకాశంగా పెండ్లి పూర్తి అయ్యేవరకు, తరువాత కొంతసేపటివరకు వెళ్ళిపోవటానికి తొందరపడేవారు కాదు. ఇప్పుడో శుభలేఖలు వందలు వెళ్తవి. ఊళ్లోవాళ్లేగాక పిలవని పేరంటం ఉంటుంది. సందట్లో సై అని వాళ్ళు వీళ్ళు బంతిలో దూర్తారు. మరిన్నీ, వచ్చినవాళ్ళకు పెండ్లి చూడాలని నియమంలేదు. తలంబ్రాలవరకు ఉండాలని ఉద్దేశంలేదు. జీలకర్ర బెల్లంతంతు ముగిస్తే చాలు వెళ్లిపోవటానికి. అందుకని త్వరగా భోజనం ముగించుకొని ముఖం చూపించి తప్పించుకొందామని, వారి గోల.

భోజనాలమా టటుంచి పెళ్లి పందిరికి తూట్లు పడినట్లైంది. పెళ్లి మందిరం తడిసి ముద్దైంది. ఎట్లాగో డాబాహాలులో పెండ్లిని పూర్తిచేశారు. ఇతర గ్రామాలనుంచి వచ్చిన బంధువులు, స్నేహితులు వెళ్లిపోవటానికి బైలుదేరారు. పైన ఇంకా చినుకులు పడుచునేవున్నవి. ఇంటి ఆవరణంతా మడమలుదిగే బురద. బయటికివెళ్లేత్రోవ బురదమయం. పైగా కంకర రోడ్డయినా రెండు ప్రక్కల రోడ్డుమార్జిన్ నల్లరేగడి. దీనికితోడు ప్రక్క బోదులు త్రవ్వి నల్లమట్టిని అంచులకు పోశారు. వర్షం త్రొక్కుడుకు నల్లమట్టి రోడ్డునాక్రమించుకొన్నది. పల్లెటూరు కంకరరోడ్ల విషయం పైన చెప్పాను. పైపైన అతికీ అతకనట్లు పోసిన కంకర, నల్లమట్టి కలసిపోయి రేగడ బురద. కాలు జర్రున జారిస్తే కంకర చురుక్కుమనిపిస్తుంది. ఈ బాధల ననుభవించి పెండ్లివారి పుణ్యమాఅంటూ ఒక పెంకుటిల్లు చేరుకొన్నారు స్నేహితులు. మంచాలు వేసి వున్నవి. ఫరవాలేదు సుఖంగా నిద్రించి ఉదయం కాఫీ తీసుకొని వెళ్ళిపోదామనుకొన్నారు. మంచాలను చేరారు. నాలుగుముక్కలు మాట్లాడుకొని, కునుకు నారంభించారు. ఇంతలో వీధిలో కుక్కల అరపులు, దీర్ఘు ఆక్రోశాలు, కొట్లాటలు, ఎవరూ వినిపించుకొని అదిలించినట్లులేదు. ఇక నిద్ర ఎట్లుపట్టుతుంది? కొంత ప్రయత్నించిన తర్వాత మగత నిద్ర మొదలు పెట్టింది. ఎలుకల కిచ కిచలు. అటు ఇటు పరుగెత్తినట్లు, మంచంచుట్టూ తిరుగుచున్నట్లు అలికిడి. ఎక్కడమంచ మెక్కి ఒంటిమీద

ప్రాకుతవో, కాళ్లు ప్రేళ్లు కొరుకుతవో అనే భయం. ఇస్నా ఇస్నా అని అదలించి అటు తిరిగి పడుకొంటే, చురుక్కు- చురుక్కు మని దోమకాటులు. కాటేసేముందు, ఝంకారాలు. ఝంకారాలు నిద్రాభంగం చేయకపోతే కాటుచురుకు అంతగా తట్టక పోవచ్చును. ఈ సందర్భంలో ఒక సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఒక ప్రాగుబోతును "మీకు దోమకాటుబాధ లేదా" అని అడిగా గట. "ఎబ్బే లేదు. నేను మత్తుగా ప్రాగి మైమరచినప్పుడు కుట్టినట్లే తెలియదు. నా మత్తు దిగిపోయినప్పటికీ దోమలు మస్తుగా నా రక్తంపీల్చి నిషాలో పడిపోతవి. ఇక అవి కుట్టి" వన్నాడట. తమకు ప్రాగు డలవాటులేదు. ఎప్పుడైనా ఏ విస్కో పుచ్చు కొన్నా మితంగానే. పైగా పెండ్లికి పుచ్చుకురావటం తప్పుకదా. ఎప్పుడు తెల్లవారుతుందా అని దుప్పటి కప్పుకొని మిగిలిన కాలంలోనైనా ఒక కునుకు తీద్దా మని ప్రయత్నించారు.

ఇంకా 5 గంటలు కాలేదు. మెలకువవచ్చి అల్పాచ మానానికి బయటికి వెళ్లాలని ప్రక్కగావున్న విద్యుద్దీపం వేశారు. వెలగలేదు. ఇదేమిటి, లైటు వెలగటం లేదనుకొనుచుండగా ఇంటి యజమాని లేచి "దీపాలు పోయినవండీ. ఇంతేక రెంటుదీపాల సంగతి. ఎప్పుడు వస్తాయో, ఎప్పుడు పోతాయో చెప్పలేము. ఉన్నట్లుండి పోతాయి. వచ్చి పోతూ, పోతూ వచ్చి దోబూచు లాడుతవి. ఒక్కొక్క సాయంత్రం నిమిష నిమిషానికి గప్పున రావటం, చప్పునపోవటం జరుగుతుంది. ఇక తెల్లవారిన తర్వాతనే డిపార్టుమెంటువాళ్ళ జోక్యం కల్గించుకోవటం" అని చెప్పారు. సరే, తెల్లవారుతోందని కూడబలుక్కొని స్నేహితు లిద్దరు పక్కలనుండి లేచారు. ఇంటి ఆవరణలో నీటి కుళాయి ఉన్నది. దగ్గరున్న చెంబులతో నీరు పట్టుకోబోగా ఒక చుక్కా రాలేదు. ఇదేమి టని అనుకొను చుండగా నౌకరువచ్చి పంపులు రావటంలేదని చెప్పిలోపలనుండి ఆ చెంబులతో నీరు తెచ్చి ఇచ్చాడు. ఇంతలో ఇంటి యజమాని బయటకువచ్చి "ఇంతేనండి కొళాయిల పని. పది రోజులనుండి ఒక చుక్కకూడా రావటంలేదు. సరఫరా టాంకుకు బెజ్జాలు పడ్డాయట, పైగా పంపింగుసెట్టు చెడి

పోయిందట. మరమ్మతుకు పంపించారట. రేపో మాపో వచ్చి నీటి ట్యాంకును బాగుచేస్తారట. మా వెనుకదొడ్లో బావి వున్నది. లేకపోతే చాలా ఇబ్బంది పడిపోయేవాళ్ళం" అని చెప్పుకు పోయాడు. "సరే, ఈ రోడ్డువెంట కొంతదూరం వెళ్ళితే మీకు కాలవ తగులుతుంది. దానిప్రక్కకు వెళ్ళవచ్చు"నన్నాడు. మీకు మఱుగుదొడ్డి లేదా అని అడిగితే, " లేకేం, ఉన్నదండి. పాకీవాళ్ళు ఈ మధ్య రావటంలేదండి, లేచిపోయారట " అని వివరణ చెప్పారు. సరే అని బయటకువచ్చి గృహస్థుచెప్పిన ముఖంగా రోడ్డు ననుసరించారు. ఇటు చూడగా ఒక ఇంటిముందు రోడ్డు అంచుమీద పిల్లలు మలవిసర్జన చేయుచున్నారు. అటు చూడగా ఇంటి అరుగుమీద కూర్చొని గోడకు ముఖంత్రిప్పి అరుగుక్రిందకు మలాన్ని దిగజారుస్తున్నా డా ఇంటి కుర్రవాడు. ఇది పదిమంది వచ్చీ పోయే రోడ్డుకదా, రోడ్డుప్రక్క ఈ పనులేమిటని అనుకొన్నారు. "పల్లెటూరురాబాబు" అన్నాడు బెజవాడ మిత్రుడు. "మీ బెజవాడలోకూడా సందు గొందుల్లో ఈ విధంగానే చేస్తారు కదా" అన్నాడు గుడివాడ మిత్రుడు. "అయితే మాకు రెండు ప్రొద్దులా పారిశుధ్యంచేస్తారు కదయ్యా" అన్నాడు కొంచెం చిరాకుతో బెజవాడపట్టణంనుండి వచ్చినాతడు. "నిజమే, ఇక్కడి వలె మలంకుప్పలు పేరొక్కని వుండ"వని ఒప్పుకున్నాడు గుడివాడాయన.

పెండ్లింటికి తిరిగివచ్చి దంతధావనం చేసుకొని కాఫీ, టిఫిన్ తీసుకొని అప్పుడే వచ్చిన బస్సెక్కి బయలుదేరారు. ఈ నరక కూపంనుండి బయటపడ్డాం అనుకొంటూ బస్సులో సాగిపోయారు. ఇంకొకరోజు గడపినట్లయితే పై పసందులేగాక ఇంకొకటి, రెండు పల్లెటూరు పసందులు వారికి కన్పడేవి. ఇంటి చూరుల్లోను, కరెంటు విసనకర్రల డొప్పల్లోను ఎక్కడ సందు దొరికితే అక్కడ గూళ్ళు కట్టుకొని కిచ కిచ లాడుచు పిల్లలను పొదిగి, పిల్లల మేతకోసం నలుప్రక్కలకు పరుగులెత్తి దూసుకు లోనికి వచ్చే పిచ్చుకల ఆర్భాటాన్ని, గోడల నాక్రమించుకొని పురుగుల కోసం ఎగబడే బల్లులను చూచేవాళ్ళు. ఎక్కడ మీద పడుతవో

ఈ బల్లు లని ఆందోళన. పిచ్చుకలు లోపలకురాకుండా తలుపులు కిటికీలు మూసివేసివుంచితే స్వచ్ఛందమారుతానికి నోచుకోక, చెడుగాలిని పీల్చవలసి వస్తుందేమో అను భయం పసందులను ద్విగుణీకృతం చేస్తవని తెలుసుకొనేవారు. పల్లెటూరు పసందులు ఇట్టివికదా అని ఆశ్చర్యపడేవారు.

పల్లెటూరు బ్రదుకు

పల్లెటూరనగా సుఖజీవనానికి, శాంతి భద్రతలకు నిలయమని పట్టణవాసుల అపోహ. నా చిన్నతనంలో స్వల్పజీవనానికి అలవాటుపడ్డ వైతాంగానికి తృప్తికరమైన జీవనోపాధికి అవసరమైన పాలు, పెరుగు, నేయి, కూరగాయలు, కోళ్లు, వాసి గ్రుడ్లు, చేపలు వగైరా పుష్కలంగా వారికందుబాటు ధరల్లో దొరికేవి. నిజానికి ఏ కొద్దిమందికో తప్ప ఈ ఆహార వస్తువులను కొనవలసిన అవసరముండేదికాదు. ఒకటో రెండో బర్రెలు, మూడో నాల్గో కోళ్లు, పెరటిలోనో చేలగట్లమీదనో కాసే కూరగాయలు, ఊళ్లో చెరువుల్లోని పెద్ద చేపలు, కాల్వాలలోను బోదెలవెంట దొరికే చిన్న చేపలు వారి అవసరాలను తీర్చేవి. తలవని తలంపుగా బంధువులు వస్తే సమయానికి గ్రుడ్లు లేకపోతే ప్రక్కింటి బాపమ్మ బదులిచ్చేది, లేకపోతే అణాకు నాల్గు గ్రుడ్లు పంపేది. వేళకు ఘరానా లేక దగ్గర బంధువులు వస్తే అప్పుడు తమకున్న కోడిపెట్టలు పొదుగుచుంటే ఆ దరినున్న గొల్ల వెంకమ్మ ఎనిమి దణాలకో, పది అణాలకో క్రొవ్వెక్కిన పెట్టను పంపేది. ఈ రోజుల్లో గ్రుడ్డు 25 పైసలు, పెట్ట రూ. 7-00 లు అవటం అటుంచి సమయానికి దొరికిచస్తే కదా. బందరునుండో, గుడివాడనుండో, చివరకు పామర్రునుండో బేరగాళ్ళువచ్చి ఊళ్ళో వున్న కొలది పెట్టలను, గ్రుడ్లను ఎగనెత్తుకు పోతారు. చేపల విషయం చూద్దామా అంటే పూర్వం చెరువుల్లోని చేపలను అమ్మేవారు కారు. గ్రామస్థుల వాటాలప్రకారం పట్టినప్పుడల్లా ఒకటో

రెండో బొచ్చెలను పంచిపెట్టేవారు. ఇప్పుడో చెరువులు వేలం వేస్తారు. వేలంపాడినవాళ్ళు తెల్లవారుఝామున పట్టి లారీల్లో ఏ బెజవాడకో ఎగుమతిచేస్తారు. గ్రామస్థులకు కమ్మని చేప ఒక్కటైనా దొరకదు. ఇతరగ్రామాల్లో పట్టిన నాసిరకాన్ని వీసె 5 రూపాయల చొప్పున కావడివాళ్ళదగ్గర కొనవలసిందే. ఇదివరలో వీసె ముప్పావలా చొప్పున వీసె, వీసెన్నర, రెండు వీసెలు పెద్ద బొచ్చెలు దొరికేవి. ఇప్పుడు అరవీసె అంతకు తక్కువగా వున్నబొచ్చెలను 5 రూపాయల చొప్పున ఇస్తామంటారు. బొచ్చె వీసెలేనిదే గుచిగా ఉండదు. పైగా బొచ్చెకు బదులు మోసు అనే చేప ఎక్కువగా అమ్మకానికి వస్తున్నది. ఎంత పెద్ద మోసైనా బొచ్చె రుచి దానికి రాదు. పైగా ముళ్లెక్కువ. కాయగూరలను పెరడుల్లోను, చేలగట్లవెంట పెంచటం ఇంచుమించుగా తగ్గించివేశారు. కాసే బుతువుల్లో నైనా బెండకాయలు వీసె పదణాలు, వంకాయలు రూపాయి, చివరకు దోసకాయలు అర్ధరూపాయి. ఏకారణంచేతనైనా కాపు తక్కువగావున్నా, బుతువు కొంచెం తప్పినా ఈ ధరలు రెట్టింపు అవుతవి. ఈ మధ్య రాములక్కాయల ధర మండిపోయింది. ఇప్పుడు వంకాయలు, బెండకాయలు, దోసకాయలు వీసె 2 రూపాయలట. బీరకాయలు 2 రూపాయల 40 పైసలట. కొంత మంది పెద్ద ఆసామీలు తమకు విస్తీర్ణమైన పెరటిదొడ్లున్నా అశ్రద్ధచేత నిత్యం కొంటూనే వుంటారు.

ఇక పాలు, పెరుగు, నేయి సంగతి. ఇవికూడా ఇప్పుడు పల్లెటూళ్ళలో కరువైపోయినవి. పూర్వంకంటె సామాన్యజనం కూడా పాడిపశువులను పెంచాలని ప్రయత్నిస్తున్నారు. అయితే తమకు మిగుల్చుకోకుండాకూడా పాలకంపెనీకి అమ్మకొంటున్నారు. ఈమధ్య పాలపథకం అని మొదలుపెట్టి పల్లెటూళ్ళలో కొనుగోలు కేంద్రాలు మొదలుపెట్టారు. వేలంవెర్రిగా గ్రామస్థులు అమ్మక మంటూ ఎగబడుతున్నారు. తనకు పాడిపశువులేక వైద్యానికనో, ఏ అవసరానికనో ఒక అరలీటరు పాలు డబ్బు కివ్వమంటే పొగుగు వాళ్ళ లే వనుచున్నారు. పాలు కొనుగోలుకేంద్రం పోయ నంటున్నది. పాలకేంద్రం దూరమని పోయలేకనో, ధర సరిగా

పడటం లేదని పోయకపోతేనో కొంచెమో గొప్పో మిగిలిన పాల బాపతు పెరుగు, మజ్జిగ, పొరుగుపల్లెల ఏ వైశ్య బ్రాహ్మణ కుటుంబాలకో దక్కుతున్నవి. ఇదివరలో వీసెలు వీసెల కొలది పదిఅణాల చొప్పున దొరికే వెన్న రు. 5-0 లు పెట్టినా ఒక అరవీసెకూడ దొరకటంలేదు. నా చిన్నతనంలో పాడివున్న గృహిణులు మిగిలిన నేతిని కుండలలో నిల్వబెట్టి శుభకార్యాలలో వీసె 1కి ఒక రూపాయి చొప్పున మణుగులు అమ్మేవారు. తమ కవసరమున్నప్పుడు వాడుకొనేవారు. ఇప్పుడు నాలుక పీక్కున్నా సవాసేరు దొరకదు.

ఇదివరలో పాటకజనమేగాక సన్నకారు రైతులుకూడా ధాన్యం స్వయంగా దంచుకొని ముతకబియ్యాన్ని తినేవారు. ఉన్నరైతులు పాలేళ్ళచేత దంపించుకొనేవారు. అందువల్ల విటమినులుపోని బియ్యాన్ని గ్రామస్థు లందరు ఉపయోగించే వారు. పాటకజనులు తమ దంపుడునుండి వచ్చిన చిట్టును రైతుల కిచ్చి వారినుండి మజ్జిగను తీసుకొనేవారు. ముఖ్యంగా పాలేర్ల భార్యలు ఈ విధముగా చేసేవారు. ఇప్పుడు ప్రతి అరబస్తాకూడా మిల్లుకు పోవలసిందే. ఈ మిల్లు బియ్యంవల్ల (ఇతర దురలవాట్లటుంచి) జవసత్వాలు తగ్గిపోయి నౌకర్లు, కూలికివచ్చిన వాళ్ళు నిండు మనస్సుతో సరైన పని చేయలేకపోతున్నారు. మిల్లాడించటంవల్ల డబ్బుదండుగేగాక బద్ధకం, నాజూకు బలిసి ఉల్లిపొరచీరెలపైన, రంగుల జాకెట్లమీద, సినిమాలమీద స్త్రీలకు మనస్సు పోవుచున్నది. ఎంత కూలి తెచ్చుకొన్నా మర్నాటికి మిగులదు. ఇదివరకు కలిగినదానితో తృప్తిపడేవారు. ఇప్పుడు రుచులు, నంజుళ్ళు పెరిగాయి. కారాలు, పచ్చళ్ళు చేతికందిన కూరగాయలు చాలక మాంసాహారాలు కావాలి. రుచులు హెచ్చితే, కోర్కెలు స్వారీతీస్తవి. గత్యంతరం లేక పనికివెళ్ళినా ఒళ్ళువంచటం కష్ట మనిపించుతుంది. ఎంత తక్కువగా పనిచేస్తే అంతమంచిది. ఈ ధోరణిలో రైతుకు కూలి హెచ్చు, పని లొచ్చు. క్రొత్త విత్తనాల పుణ్యమా అంటూ దండిగా రసాయనఎరువుల వాడకంవల్ల ఏదో

విధంగా పంటలు పండుచున్నవి. కూలి నాలి జనానికి నాలుగు డబ్బులు కనపడుచున్నవి. అయినా ఇరువురకు తృప్తి లేదు.

గ్రామంలో కట్టుబాటు, పెద్దల సలహాలు పాటించటం, ఒకరి కొకరు తోడుపడటం ఉండేవి. ఇప్పుడు 'ఎవరికివారే యమునాతీరే'. అందువల్ల పొరుగింటివారితో కీచులాడటం, పొలాలవద్ద తగవులాడటం, ఏ పంచాయితి పేరుతోనో దెబ్బ లాడటం, పెత్తనం కొరకు పోరాడటం పెరిగినవి. సహకారం నశించటమేగాక ఈర్ష్య, ద్వేషం పెరిగాయి.

తండ్రులకు లేని సద్బుద్ధి, సహకారం, క్రమశిక్షణ పిల్లలకు ఎట్లు అబ్బుతుంది? అరాచకంగా ప్రబలుచున్న విషమ వాతావరణంలో పెరుగుచున్న పిల్లలు సవ్యంగా ఎందుకు నడుస్తారు? తలిదండ్రులు జోక్యం చేసుకొన్నా వారియందు భయభక్తులుగాని, పూజ్యభావ మటుంచి ఆప్యాయతగాని, అభిమానంగాని లేని పిల్లలు ఖాతరుచేయటం లేదు. తలిదండ్రులను త్రోసిపుచ్చేవారు ఇతరులను సంభావిస్తారా, సవ్యంగా నడుచుకొంటారా? వాళ్ళకు తోచిన ఏ పిచ్చి పనులైనా వారు చేయవచ్చును. అడ్డుకొనే వారెవరు? చివరకు ఈ పొగరుబోతుతనం గురువులను ధిక్కరించటం, మర్దించటం వరకు సాగుచున్నది. పట్టణాలలో విద్యార్థి సంఘాలప్పుడప్పుడు గొడవలు తీసుకువచ్చినా, అధ్యాపకుల నొకప్పుడు అడ్డగించినా వారిని చావగొట్టినట్లు నాకు తెలియదు. దారి పొడుగునా దుండగాలు చేస్తున్నట్లు, తలిదండ్రులను ధిక్కరించుచున్నట్లు నేను వినలేదు. పల్లెటూరు చిన్న సంఘాలుకదా. ఇక్కడ క్రమశిక్షణ రాహిత్యం, దుష్టవర్తనం తలిదండ్రులకే కాదు గ్రామస్థులకు కూడా తలనొప్పిగా, మనోవ్యథగా తయారైంది. ఇది గ్రామ జీవితాన్ని మరింత కలుషితం చేస్తున్నది.

గ్రామంలో కట్టడిలేక పెద్దలు, పిన్నలు క్రమాన్నితప్పి వ్యవహరిస్తే, పాటకజనం నిర్లక్ష్యంగా, సోమరిపోతులుగా నడుస్తున్నారని మనము నిందించట మెందుకు? శ్రీతులు అధర్మ పద్ధతులనవలంబించి పొరుగు శ్రీతుల నష్టానికి కారకులైనప్పుడు,

వ్యవసాయ కూలీలు రెట్టింపు కూలిని గుంజి సగంపని చేస్తున్నారని నిందించటం తెలివితక్కువే అవుతుంది. మిల్లు బియ్యంతిని, ట్రాగుడు, సినిమా చూడటంతో నిద్ర చెడగొట్టుకొని నిస్సారులై చేసిన సగం పని అపసవ్యంగా చేస్తున్నారని తప్పుపట్టటం, పనికి వస్తానని డబ్బు పట్టుకొనివెళ్ళి పత్తాలేడని బాధపడటం, అధిక జీతంతో సంవత్సరానికి నెాకరున్న పాలేరు మంచి పని సమయంలో ఊడ్పుల్లో, కోత, కట్టివేత, నూర్పుడుల్లో పనికి రావటంలేదని దిగులుచెందటం వ్యర్థం. గ్రామవాతావరణం నేర్పిందికాదా ఈ కూలీల నిర్లక్ష్యం, అలసత్వం, దుర్బుద్ధి.

అలుసు ఎంతకైనా దారితీస్తుంది. ఇదివరలో దొంగతనం చేస్తే కీడుమూడుతుందని భయముండేది. ఇప్పుడెందు కాభయం? చేలుపండగానే నిలుచున్నపైరును కోసుకు పోవటం, కోసిన పనను, కుప్పవేసిన పనను నలుపుకొనిపోవటం పరిపాటైంది. మరిన్ని, కుప్పనూరుస్తూ రైతు నూర్చిన ధాన్యరాసివద్ద కాపలా పడుకొంటే, పదిమంది జట్టుగావచ్చి మెదిలితే చంపుతా మని కర్రపైకెత్తి బెదరించి ధాన్యం దోచుకొని పోవుచున్నారు. ఒక్క ధాన్య మేమిటి, పీకిన పెసర, మినుము ఎండుచుండగా బండ్లు తోలు కొనివచ్చి పనను కట్టుకొనిపోయిన ఉదంతం పోయిన ఫిబ్రవరిలో బైటపడ్డది. ఆరాతీసి దొంగిలించిన కాయతోకూడిన కాడను పట్టుకొంటేమాత్రం భయమేమి, దొంగలకు సాయంవచ్చేవా రుండగా? అంతగా వీలులేకపోతే ఏ కొంచెమో అపరాధంపేర రాబట్టుకొంటారు. పోలీసులకు రిపోర్టుచేసినా వాళ్ళను సంబా ళించుకొనలేకపోతామా అనే ధైర్యం దొంగిలించినవాళ్ళకు లేక పోతేగా! ఫలానావాళ్ళు దొంగిలించారని తెలిసినా, బయటబడితే ఏ పంట కుప్పకో, గడ్డికడియానికో, వామికో నిప్పు పెడతారు అనే భయంతో సగంచచ్చే రైతుకు గుండె ధైర్య మెక్కడ దండించ టానికో, పోలీసులకు రిపోర్టు చేయటానికో!

పైవానికంటె గ్రామజీవితాన్ని అనిశ్చితంగా, భయాందోళ నలతోకూడినవిగా, బ్రదుకుమీద నిరాశను కలిగించేదిగా పరిణ మించిన స్థితి పొలం మీది పంటకుప్పలకు, గడ్డి కడియాలకు, ఇంటి వద్ద గడ్డి వాములకు, గొడ్లు చావిళ్ళకు నిప్పుపెట్టటం. ఏదో

స్వల్పనష్టమో కష్టమో కలిగించాడనో, ఈ విధంగా చేస్తేనే గాని రైతు లొంగిరాడనో ఈ దురంతం జరిపిస్తున్నారు. దొడ్లో వామికి నిప్పు పెట్టినవాడు ఫలానా అని తెలిసినా, ఏమైనా చర్య తీసుకొంటే అంతటితో ఆగక ఇంకా దేనికి పెడ్తాడో అనే భయంచేత ఈ మధ్య ఒక రైతు కిమ్మనకున్నాడట. ఈ దుష్టత్వానికి పూనుకొన్నవాళ్ళు కొలదిమందయినా గ్రామం యావత్తూ భయపడిపోయి కంటికి సరైన నిద్రలేక, కడుపునిండ తినటానికి మనస్సుపోక గిజగిజలాడిపోవుచున్నది. రైతులకేకాదు ఈబాధ. పాటకజనంకూడ తమ తాటియాకు కొంపలెక్కడ దగ్ధమౌతవో అన్న భయంతో, రాత్రిళ్ళు కాపలా కాచుకోవటం, ముఖ్యమైన సామానులను పూడ్చిపెట్టటం, ఇళ్ళల్లో పడుకొనక బైట పడుకోవటం ఈ వేసవిలో జరిగింది. ఏ తగాదాకోరో, ఏ చుప్పనాతివాడో పగసాధించుకోవాలని నిప్పు పెడ్తాడేమో. కూలి నాలి జనంలోమాత్రం భేదాభిప్రాయాలు, వ్యక్తిగత ద్వేషాలుండవా? అన్నిటికంటెను లులువైనసాధనం నిప్పుపెట్టటంగా తయారైంది. తగులబెట్టటం తప్పని తోచటంలేదు. ఏ చిన్న కక్ష సాధించుకోవాలన్నా ఒక్క అగ్గిపుల్లఉంచేచాలు. ఈ మధ్య ఎవడో అన్నాడట "వాని లక్షల ఆస్తి నా ఒక్క అగ్గిపుల్లకు చాల" దని. ఇది ఈనాటి గ్రామజీవితసౌభాగ్యం, సంరక్షణ.

పల్లెటూరు బుద్ధులు

"ఆకుమడి నిండా నీరుపెట్టాము. నారు రేపు ఉదయం లాగించాలి" అనుకొంటూ, రైతు ఇంటికి సాయంత్రం తిరిగి వచ్చాడు. ఉదయం చీక టుండగనే నౌకర్లను, నారులాగే కూలీలను తీసుకొని ఆకుమడికి వెళ్లాడు. మడిలో నీరు ఉండీలేనట్లున్నది. అంత నీరేమైపోయిందా అని ఆశ్చర్యపడుతూ అటు చూచాడు కదా, ప్రక్కరైతు చేను ఎండుగడ్డలు తడిసి నీరుతో ఉండినది. ఇదేమిటని దగ్గరకువెళ్ళి చూస్తే ప్రక్కాసామి తన ఆకుమడి

నీరును అతని చేలోకి త్రిప్పుకొన్నట్లు తెలిసింది. ఇక ఆ ఉదయం నారు లాగటానికి తగిన నీరులేదు. ఆ రోజు తన 'ఊడ్పు ఆగి పోయింది. ఏమి గుంజుకొన్నా ఏమి లాభం? నౌకర్లకు ఇంకొక పని అప్పగించి. కూలీలను పంపివేసి చరచరా ప్రక్కవైతు ఇంటికివెళ్ళి "ఇది నీకు తగునటయ్యా. నా ఆకుమడి నీరును నీవు ఊడ్పుకని ఎండుగడ్డలకు దొంగిలించుకొని పోతావా? నీవు వైతువు కావటయ్యా" అని కేకలు వేశాడు. ఆ వైతు "అయ్యో, నే నేమెరుగను. గట్టుతెగి మా చేను పల్లం గనుక మీ నీరు మా చేలోకి వచ్చిందేమో. లేకపోతే తెలియక మా నౌకరు మా గండి తీశా" డేమో అన్నాడు.

కాలం మించి పోతున్నది. రేపైనా ఊడ్వాలి అని నౌకర్లను పిలిచి, "ఈరాత్రి మన బోదెకు ఎవరూ అడ్డం వేయకుండా చూడండి. తెల్లవార్లూ నీరు వెళ్ళితేగాని ఊడ్చటానికి వీలుండదు" అని చెప్పి పంపాడు. నౌకర్లు వెళ్ళి ఎవరూ బోదెను కాని, చేలోకి నీరువెళ్లే గండినిగాని కట్టలేదని చూచి ఒక ప్రక్క నిద్రపోయారు. తెల్లవారుఝామున లేచి చూస్తే బోదె కట్టివున్నది. ఎవరు కట్టారని విచారిస్తే మే మెరుగమంటే మే మెరుగ మన్నారు. ఇంకొకసారి బోదెను కట్టలేదు గాని పల్లంగావున్న మురుగు జాలు అడ్డకట్ట తెగగొట్టబడివున్నది. మరొకసారి బోదెను కట్టకపోయినా చేలోకి నీరు పోయే గండి కట్టివున్నది. ఆకుమడికని, మానలకని బోదె కట్టటం, గండి కట్టటం వైతుధర్మంలో సహించవలసిందే. కాని తనకు అవసరం లేకపోయినా ప్రక్కవాని చేను తడిసిపోతున్నదే, అతడు రే పూడ్చుకొంటానని నిక్కచ్చి తున్నాడని మురుగు జాలుకు నీరు తెగ గొట్టటం, తన గండిగుండా నీరు ఎక్కువ పారటానికి క్రిందకుపారే బోదెని పైకి కనపడకుండా ఏదైనావేసి మెరక చేయటం వైతుబుద్ధికి తార్కాణం.

మేము ఆకుమడి పోసుకోవాలని నీరు తీసుకొనివెళ్తూ ఇతర చేల బోదెల గండ్లను కట్టక చుట్టుప్రక్క చేలను తడిపే ప్రబుద్ధులున్నారు. మేము నీరు బోదెవెంట తీసుకొని వెళ్తాం. మీరు

మీ చేల గండ్లు కట్టుకోండి, ఊలలుపడి చేలోకి నీరు ప్రవహించ కుండా ఊలలు త్రొక్కుకోండి అని అయినా ముందుగా చెప్పరు. తడిసినతర్వాత చూచి ప్రక్కరైతుల బోదె బో అనవలసిందే గాని నీరు పెట్టుకొన్న రైతు కిమ్మనడు. ఆకుమడికే కాదు, వేసవిలో దున్ని జనుము వేయాలని చేనుకు నీరు పెట్టుకొనే రైతు ప్రక్కచేల నన్నిటిని తడిపివేస్తాడు. మార్చి తర్వాత కాల్వలలో తగినంత నీరులేక బోదెలు నిండుగా ప్రవహించనందున సగం తడిసి, తడిసినది సగం ఎండి, మరల మరల నీరు పెట్టుకోవాలి. అందువల్ల ప్రక్కచేలు మాటి మాటికి తడిసి, ఎండి, నిస్సారమై పోతవి. అయితే నీరు పెట్టుకొనే రైతుకు ఏమి బాధ? చెడితే ప్రక్కరైతులే చెడతారుగాని తన కేమి నష్టం? ఆకుమళ్ళు వేసవి జను మటుంచి చెరుకు, పసుపు, ప్రత్తి కని పై విధంగా ప్రక్కచేలను తడిపి ఎండగొట్టటం పరిపాటైపోయింది. ఒకసారి ఒక రైతు వేసవిలో తన చేనుకు వెళ్ళగా ఒకప్రక్క పెద్ద బురద గుంట తయారై పందులు, గేదెలు పొర్లాడుచున్నవి. ఎక్కడ నుంచి నీరువచ్చి ఈ బురద గుంటైందని చూడగా ప్రక్కరైతు తన ప్రత్తిచేనుకనో, పిల్లిపెసరకనో బోదెను క్రిందికి త్రవ్వుకు పోతూ ముందు చెప్పకపోవటమేగాక గండ్లను కట్టలేదు, ఊలలను త్రొక్కలేదు. బోదె తనది కాకపోయినా క్రింది తన చేలకు నీరు కావాలని బోదెను క్రిందికి లోతుగా త్రవ్వుకుపోతాడు. బోదెను తన చేనుకు త్రవ్వుకుపోతూ వచ్చే మట్టిని ప్రక్క చేలలోకి దిగజార్చి పోతాడు. ప్రక్కరైతు సకాలంలో చూచుకొని బండ్లతో తోలుకొనకపోతే అంత మేరకు చేను మెరక కావలసిందే.

బోదెలు పూడిపోయాయి, త్రవ్వించనిదే కాల్వనుండి నీరు పారుదలకాదని త్రవ్వితే దామాపాప్రకారం ఇవ్వవలసిన రైతులు కొంద రివ్వరు. అందువల్ల త్రవ్వించినవానికి చేయి కాలుతుంది. భయపడి ఇక అతడు మరుసటి సంవత్సరం ఆ ఊసెత్తడు. ఇవ్వని వారిని అడిగితే ఇదుగో అదుగో అని కొందరు కాలహరణంచేసి ఎగగొట్టుతారు. ఒక సంవత్సరం త్రవ్వించి నతడు ఒక రైతును రెండు మూడు సార్లు అడిగితే "నే నివ్వనని అడుగుచున్నావా" అని ఎదురు తిరిగి పోట్లాడి చివరకు ఒక దమ్మిడీ

కూడా ఇవ్వలేదు. ఇక్కడొక సంఘటన గుర్తుకు వస్తున్నది. ఒక సంవత్సరం ఒక ఆసామి కొంత డబ్బు ఇంకొక రైతుకిచ్చి పనిమీద ఏ ఊరుకో వెళ్ళినాడు. రెండవ ఆయన వ్రత్యించు చుండగా తమ ఆకుమడికి నీరు కావాలని వ్రత్యే బోదెని రైతు లిద్దరు తడిపివేశారు. ఇక ఆసంవత్సరం బోదె మెరకవేసే వుండి పోయింది.

ఊడ్చేకాలంలో సరిహద్దు గట్టుమీద తనవైపు తొండంగి నాటి రెండవప్రక్కన నడుస్తాడు, ఆ ప్రక్కను దిగద్రొక్కుతాడు. తొండంగి కోసుకొన్న తర్వాత తన ప్రక్కగట్టును నరికి దిగజార ద్రొక్కిన వైపు వేస్తాడు. ఈ విధంగా తన ప్రక్కభూమిని పెంచుకొంటాడు. గట్టుమీద పుట్ట వెలిస్తే పుట్టను తీసివేసే టప్పుడు తనప్రక్క బాగా తెగగొట్టి రెండవవైపు సన్నం చేస్తాడు. అందువల్ల కొన్ని జాయింటుగట్టులు వంకరటింకరగా ఏర్పడతవి. పంచుకొనేటప్పుడు సరిహద్దుగట్టును ఏకబారుగా పెట్టుకొంటారుగాని మధ్య మధ్య ఈ ప్రక్కకు, ఆ ప్రక్కకు పొడుచుకొని వచ్చేటట్లు పెట్టుకోరుకదా. పై పద్ధతులవల్లనే వంకర టింకరులు ఏర్పడటం.

"మేము పైరుకు విత్తనాలు చల్లుకొన్నాం. మీ మురుగు నీటిని మా చేలోకి తెగగొట్టవద్దు. మా విత్తనాలు మురిగిపోతవి" అంటే ఏ అర్ధరాత్రికాడో తెగగొట్టుదలుచుకొంటే మురుగుకాల్వకు చేడికొడ్డాం మీ మనిషిని పంపమంటే "నా కవసరంలేదు, మీచేలోకి వచ్చిన మురుగు నీరును మీరే బైటకు వెళ్ళగొట్టుకోవా" లంటాడు.

ఒక సంవత్సరం ఒక చిన్నరైతు, "మన పంట కాల్వకు పైన అరమైలు దూరంలో పెద్దగండిపడి నీరంతా అట్రప్రక్కకు పోవుచున్నది. మీ మనుష్యుల నిద్దరిని రెండు గడ్డిమోపులు వగైరాతో పంపండి. నే నితర సాయంకూడా తెస్తా" నని వచ్చి చెప్పాడు. సరే అని చేసే పనిని మాన్పించి గడ్డిమోపులిచ్చి పలుగు పారలతో ఇద్దరు పెద్ద నౌకర్లను పంపినా డా రైతు. మధ్యాహ్నం దాటినగాని నౌకర్లు తిరిగిరాలేదు. వచ్చి "బందో

బస్తుగా కట్టినాం, ఆయనతప్ప ఇతరు లెవరూ రాలే''దని చెప్పారు. ''సరే, ఆ ప్రక్కనున్న మనచేను సగం తడిసివున్నదికదా. పూర్తిగా నీరుపెట్టండి, రేపు ఊడ్పుకదా అని ఎందుకైనా మంచిది, బోదె నెవరూ కట్టకుండా జాగ్రత్త పడం''డని చెప్పాను. తీరా తెల్లవారిన తర్వాత కబురు, ఆ చిన్నరైతు ఎగువనుండిన తన చేను తడుపు కొనటానికి బోదె కడ్డంవేసి, అడ్డాన్ని తొలగించకుండా ఎదురు తిరిగి దెబ్బలాటకు సిద్ధమైనాడట. గస్తీకి వెళ్ళిన నౌకరు ఒట్టి చేతులతో తిరిగి వచ్చాడు. అతని ఊడ్పు ఆగిపోయింది.

తన చేలో పచ్చగడ్డిగాని పిలకగాని కోసుకొంటూ, లేక ఆ నెపంతో ప్రక్కచేలోది కోసుకుంటాడు. ఎవరైనా చూచి అదేమిపని అంటే, ''ఎబ్బే, మా గట్టుప్రక్కనే కోసుకొంటున్నాను. నీవు పొరపాటు పడ్డా''వని డబాయిస్తాడు. ఇక కూలి నాలి సంగతి చెప్పనక్కరలేదు. జనుముకోత కాగానే మోళ్లు తమకు హక్కు ఉన్నట్లు పూర్తిగా పీక్కపోతారు. జనుము నేలకు బలం. మోళ్లలో కూడా నేల కుపయోగపడే పదార్థాలుంటవి. వాళ్ళకు కావలసినది పొయ్యిలోకి పుల్ల. రైతుకు నష్టమైతే తమకేమి? పొలాల్లో కట్టివేసిన పశువులను నీళ్ళకు కాల్వకు తోలునప్పుడు చేను దాటీ దాటకముందే వేసినపేడను పరుగులెత్తి నౌకర్లు తీయకముందే ఏరు కొంటారు. వీలుగాడుంటే చేలోని పేడను కూడా సంగ్రహిస్తారు. ఈ పేడను పిడకలుజేసి రైతు చేను సరిహద్దుదిబ్బ లేక పెద్ద గట్టు మీదనే చరిచి ఎండబెట్టుకొని గలీజు చేస్తారు. ఇంతకంటె విడ్డూరం, రైతు తన దొడ్డి ఆవరణ చుట్టూ వేసుకొన్న కంచెలోని పచ్చని మొక్కలను దొంగ చాటుగా కొడవలితో నరికి, నాలుగు రోజులు పోయినతర్వాత పెకలించి ఎత్తుకొని పోతారు. రైతు నౌకర్లతో వెల్తీలను క్రొత్త కంచెతో నాటించటం, ఆ నౌకర్ల భార్యలే చాటుగావచ్చి వాని నపహరించటం తరుచు జరుగుచుఉంటుంది. ఈ విధమైన దుర్బుద్ధు లతో పల్లెటూళ్ళ జనం, రైతు, కూలి వ్యవహరిస్తుంది.

అన్నిటికంటె ముఖ్యమైనది, మనస్సును బాధించేది గ్రామస్తులలో ప్రబలియుండిన, ఇంకను పెరుగుచున్న ఈర్ష్య.

ఒకరిబాగు మరొకరికి గిట్టదు. ప్రక్కింటివాడు సుఖంగావుంటే తనకేదో పోయినట్లు ఏడుస్తాడు. అతడు కష్టపడి నాల్గుడబ్బులు సంపాదించుకొంటే వీడు ఓర్వలేడు, దుష్ప్రచారానికి సిద్ధమౌతాడు. అతని నెలాక్రుంగదీద్దామా అనే దురాలోచనే. వాడు తానెక్కువనుకొంటున్నాడు ఏ సాకుతోనైనా సాధించాలనే. ఈ కుళ్ళు మనస్సులతో గ్రామాలు కంపెత్తి పోవుచున్నాయి. పంచాయితీల పేరుతో, సహకార సంఘాల నెపంతో కీచులాటలకు, తగాదాలకు, పార్టీలకు, ధనవ్రయానికి కారణా లవుతున్నాయి. గ్రామకట్టడికి, సంక్షేమానికి వేరుపురుగు లౌచున్నవి. ఈ మనస్తత్వం, ఈ కుంచితబుద్ధి, ఈ ఈర్ష్యా ద్వేషాలు నశించనిదే గ్రామాలు బాగుపడవు, గ్రామీణులు సుఖజీవనం చేయజాలరు.

పలేటూరు పదతులు

గ్రామీణులు కొన్ని అలవాట్లకు లోనైవుంటారు. పశువుల దొడ్డికో, వాముల దొడ్డికో కంచెవేసుకోవటానికి బయటనుండి ఏ తుమ్మకంపో తెచ్చుకొంటారు. దానిని తొడుగుగా కట్టి ఎడ్లచేత లాగించుకొంటూ తెచ్చుకొంటారు బండ్లమీద కాదు నేలమీద రాచుకుంటూ. క్రొత్తగా రబ్బీసువేసిన కంకరరోడ్డు అయితే రబ్బీసంతా చిందరవందర అవుతుంది. రబ్బీసు ఇదివరకే కొంతపోయిన రోడ్డుమీద రబ్బీసు పూర్తిగా కొట్టుకు పోతుంది. మట్టి రోడ్డయితే గతుకులు పడుతుంది. పైగా ముళ్ళచిదుగులు దారిపోడుగూతా పడతవి. వానిని తీసివేసే గతివుండదు. రోడ్డు పాడైపోతుందనిగాని, ముళ్ళుపడి దారిని పోయేవారికి గ్రుచ్చుకొంటాయనిగాని వారికి తోచదు. ఎవరైనా "తొడుగు లాగించి రోడ్డును నాశనంచేయటమెందుకు, మీకు బండ్లున్నవికదా లక్షణంగా బండిమీద కట్టి తెచ్చుకోకూడదా" అని ఎంత చెప్పినా లక్ష్యముండదు. చిన్నవైతేకాదు పెద్దవైతుకూడా ఈ మూర్ఖపు పని చేస్తాడు.

పల్లు తోముకొనే పుల్లల కని తమ దొడ్లోని చెట్టునేకాదు గ్రామంలో రోడ్డువెంట చెట్ల కొమ్మలు విరిచి, అందకపోతే చేతికర్రతో కొట్టి పాడుచేస్తారు. ఎవరైనా ఆసామి తన ఇంటి ముందు చెట్లు పెంచుకొంటే అవి కూడా ఈ చెడు అలవాటుకు లోనౌతవి.

ఊరి నానుకొని బైట ఊరికో, పొలాలకో పోయే రోడ్లె వెంట మలవిసర్జన చేస్తారు—రాత్రి, తెల్లవారుజాము మాట అటుంచి సందకాడ, ప్రొద్దెక్కిన తర్వాతకూడా ఇరుప్రక్కల, ఒక్కొక్కప్పుడు ఇంచుమించుగా నడిచే త్రోవలోనే అటుప్రక్కగా మదుగున్నా సరే ప్రక్కనున్న చేలు ఖాళీగావున్నా సరే, పిల్లలే కాదు, పెద్దవాళ్ళుకూడా మర్మాయవాలను బహిరంగపరచుచు, సిగ్గు బిడియం లేకుండా. గ్రామంలో ఇంటి ముందు పిల్లల మల విసర్జన సరే. బెజవాడవంటి పట్టణాల ఇరుకుసందుల్లో పిల్లలు ఇంటి బయట మార్జిన్‌లో ఇట్టిది చేసినా అక్కడ పారిశుద్ధ్య వసతు లున్నవి. ఏ ఏలూరు కాల్వవెంటో పెద్దవాళ్ళు ఈ చెడ్డపని చేసినా అది మనుష్యులు నడిచే దారికాదు. పల్లెటూళ్ళలో వాళ్ళు వీళ్ళు వచ్చి పోయే త్రోవ అని ఆలోచన లేకుండా నడుచు కొంటారు.

ఎంత మరమ్మతు చేసినా రోడ్లను గలీజు చేస్తారు. ఇంట్లోను, దొడ్లోను వాడుకొన్న మురుగునీటిని వీధిలోకి విడిచిపెట్టి రోడ్డంతా గాని, కొంతగాని తడుపుతారు. ప్రక్క మురుగు గుంటలు పెట్టి దుర్వాసన కలిగిస్తారు. ఇంకొకటి, మట్టిని తోలుకొనునప్పుడు జారిపడిన గడ్డలను తీసివేయరు. వర్షం వల్లగాని, ఇతర విధంగా గాని అవి రోడ్డుపైన కలసిపోయి రేగడమట్టి బాట లవుతాయి. తన ఇంటి ఆవరణను, దొడ్డిని ఉపయోగించుకొనటంలో ప్రక్క ఇంటివాని భద్రతను గాని, సౌకర్యాన్ని గాని లెక్కపెట్టరు. తమ కనుకూలాన్నో, తమ అభిప్రాయాన్నో సఫలం చేసుకోవాలని పట్టుబడతారుకాని అవతలివాడు తాను గోడలు కట్టుకొన్నది, చూరు వదులుకొన్నది వాని అవసరానికి, సౌలభ్యానికి. వనరుకని

ఆలోచన ఉండదు. గోడ అవతలివానిదైనా దానివలన తనకు మదుగు, భద్రత ఏర్పడినా గోడప్రక్కనే అనుచితాలు చేయటం, గోడ భద్రతను ఖాతరు చేయకపోవటం జరుగుతుంది.

ఇదివరలో చుట్టకాల్చుకుంటూ ఇంటి మధ్యాహాలులో కూర్చొని ఖాండ్రించి ఉమ్మివేయటం పరిపాటిగా ఉండేది. ఆ పెద్దకారు పరలోకానికి దారితీయటంవల్ల ఇప్పు డా అలవాటు కొనసాగటం లేదు.

ఊసులకని పొరుగింటికిపోయి వాళ్ళ పనులను, విశ్రాంతిని భంగం చేసేవారు. ఇప్పు డది అంతగా లే దనిపించుచున్నది.

ఊళ్లో వాదులు, అపవాదులు అన్నీ తమకే కావాలి. ఎవ రింటిలో ఏమి జరిగినా తమ చెవుల్లో పడాలి. తమ నోటిలో నానాలి. మంచైనా, చెడ్డైనా చిలవలు పలవలుగా మారాలి. ఎద్దేవకు, నిందకు, దుర్భాషకు, దుష్ప్రచారానికి గురి కావాలి.

ఎవరి నౌకరైనా బాకీవుంటే సరాసరి వాని యజమాని ఇంటికి వెళ్ళి గొడవ మొదలుపెడ్తారు. నౌకరు మంచిపనిలో మునిగియున్నా సరే, యజమాని దగ్గరఉండి పని చేయించుచున్నాసరే తగాదా పెడ్తారు. యజమానికి ముందుగా చెప్పి అతని సమాధానం తీసుకొనరు. ఆ బాకీని యజమాని తీరుస్తాడేమో అని జ్ఞానముండదు. తమ కా ఇంటిలోగాని, దొడ్లోగాని హక్కున్నట్లు సరాసరి వచ్చి పోట్లాటకు దిగుతారు. ఇంకొకటి, ఏ వడ్రంగితోనో తమకు పనుంటే అత నింటికి కబురు పంపో, తాము వెళ్లో పని విషయం ఏర్పాటు చేసుకోరు. ఆ వడ్రంగి ఇంకొక రింట్లో పనిచేస్తుంటే అవకాశమివ్వకుండా "వెంటనేవచ్చి మాపని చేస్తావా లేక చస్తావా" అని కేకలు వేస్తారు.

ఈవిధంగా పల్లెటూరు పద్ధతులు ఇంకను కొనసాగుచున్నవి. ఈ అపసవ్య పద్ధతులు కొంతకాలానికైనా మారుతవో మారవో వేచి చూడాలి.

ఇదేనా సంక్రాంతి పర్వదినం?

ఇదేనా సంక్రాంతి పండుగ? ఈరోజునేనా రైతులు గాదెలనిండా ధాన్యం నింపుకొని, ఆనందోత్సాహాలతో పొంగిపోయేది? ఈ ఉషఃకాలంలోనేనా పల్లెటూరు పడుచులు చిత్ర విచిత్రంగా ముగ్గులువేసుకొని హర్షించేది? బాలికలు బంతిపూలు, గుమ్మడిపూలతో నింపిన గొబ్బిళ్ళు పెట్టుకొని ఉల్లాసంతో పాటలుపాడుచు, ఆటలు ఆడేది, నృత్యం చేసేది? ఈ ఉదయమేనా గారెల, బూరెల ఘుమ ఘుమతో రైతు గృహాంగణాలు గుబాళించేవి? గృహిణి శ్రమను, పడుచుల ఉత్సాహాన్ని బాల బాలికల ఆనందాన్ని, రైతు పొంగును, అతిథి అభ్యాగతుల తృప్తిని, ఆ హరిదాసుల సంకీర్తనాన్ని కవులు పొగిడేది? ఈ ఆనందోత్సాహాలు, ఈ కేరింతలు, ఈ సరదాలు ఇంకా జరుగుచున్నవా? ధాన్యాగారం, సుఖప్రదం, శాంతి నిలయం, భద్రతాపూర్ణం అని చెప్పబడే పల్లెటూరి రిప్పుడున్నదా? తుమ్మలవారు చెప్పారని, కాటూరి పింగళి కీర్తించారని ఈ ఉదయం ఆంధ్ర జ్యోతిలోవ్రాసిన సంక్రాంతి గతస్మృతి కాదా? గ్రామాలలో రైతులు గుండెమీద చేయివేసుకొని హాయిగా నిద్రిస్తున్నారా? వాళ్ళ ధాన్యం కుప్పలుగాని, గడ్డి కడియాలుగాని వాళ్ళకు దక్కుతవని ధైర్యమున్నదా? ఇంటివద్ద గడ్డి వాములుగాని, పశువుల చావిళ్ళుగాని, చివరకు నివాస గృహాలుగాని పరశురామ ప్రీతి కావని నమ్మకమున్నదా? సాయంత్రం విడిచివచ్చిన నూరుస్తు వుండిన పంట కుప్పగాని, గడ్డి ప్రోగుగాని భోజనంచేసేలోపుగా అగ్నిదేవుని కాహుతికావని చెప్పగలరా?

ప్రక్క ఊరులో నాలుగు ధాన్యం కుప్పలకు నిప్పు పెట్టారు. ఎందుకు? ఒకాయనతమ్ముడు స్త్రీవిషయంలో తగాదా పడ్డాడట. ఇం కొకాయన తోడు వెళ్ళాడట, మరొకాయన తల బిరుసు మనిషట, నాల్గవ ఆయన కార్తీకమాసంలో పెట్టుబడి పెట్టమంటే పెట్ట నన్నాడట. ఈ విధంగా వాళ్ళ పంటను దగ్ధం చేయకపోతే రైతుల పొగ రణగదట, తాము కోరినట్లు కూలిచ్చి,

తాము చేసినంతపనికి ఒప్పుకోరట. పంటచేలో గొడ్లను తోలి మేపుతుంటే కాపరి కుర్రాణ్ణి వైతు కొడుకు ఒక దెబ్బ వేశాడట. అతని కుప్పకు నిప్పు. పని ఎగగొట్టుచున్నావే మని గట్టిగా మంద లిస్తే పంటకుప్పకో, గడ్డి కడియానికో నిప్పు. కూలి ముందుగా ఖండించుకోక న్యాయమని తోచింది వైతు ఇస్తే చాలదని అడగ టానికి బదులు నిప్పు. ఖండించుకొన్నా, ఎవరో ఎక్కు విచ్చారు నీ వెందు కివ్వవని నిప్పు. దొంగతనం పట్టుకొని దొంగిలించిన ధాన్యంక్రింద ఇవ్వవలసింది బిగబట్టుకొంటే నిప్పు. ఏ మాట, ఏ చేత, ఏ నిప్పునకు కారకమౌతుందో వైతు ఊహించలేడు. తీరా జరిగినతర్వాత మామూలు పద్ధతికి ధర్మానికి తా నేమి వ్యతిరేకం చేశానా, ఏవిధంగా కష్టపెట్టానా, ఎవరిని కష్టపెట్టానా అని వైతు ఆలోచనలో పడి తెలియక, తెమలక, దిగ్భ్రాంతి చెందాలి. ఇదీ ఈనాటి వైతు సంక్రాంతి సంతోషం, సంబరం. సంక్రాంతికి పంటలు సిద్ధ మవటం నిజమే. ధాన్యం ఇంటికి రావటానికి, గాదెల్లో పోసుకొనటానికి తయారే. అయితే ధాన్య మంతా చేతి కందుతుందా, గాదెలు నిండవలసినంత నిండుతవా? ఇదే దిగులు వైతుకు. ఉత్సాహంగాని, ఉప్పొంగుగాని ఎలా తటస్థ మౌతవి? భార్యయేమో అర్ధరాత్రికాడో, తెల్లవారు ఝామునో నిద్ర చెడగొట్టుకొని చలిలో, మంచులో ఒళ్ళు హూనం చేసుకొని పెద్ద పెద్ద ముగ్గులే వేయవచ్చు. ఆచారప్రకారం గారెలు, పూర్ణాలు వండవచ్చు. సుద్ద పప్పుతో, రెండు మూడు కూరలతో, క్షీరాన్నంతో వంట చేయవచ్చు. కక్కుర్తికి వైతు, బిడ్డలు కడుపు నింపుకోవచ్చు. అయితే భార్యా భర్తలకు, ఎదిగిన పిల్లలకు తృప్తి కలుగుతుందా, జీర్ణ మౌతుందా? కడుపు నింపుకొనే లోపున లేక ఆ వెంటనే ఏ కుప్పో, ఏ గడ్డివామో, తగలబడుచున్నదని వార్త రాదని నమ్మిక మేది?

గ్రామంలో పదిమందిమధ్య సామరస్యం ఉంటే అది సుఖ సంతోషాలకు కారణమౌతుంది. కట్టుబాటు లేక ఎవగి ఇష్టంవచ్చినట్లు వారు నడుచుకొని పోటీలుపడి పంతాలకు పోతే ఇతరులకు అలుసు అవటం అటుంచి కూలీలను రెచ్చగొట్టటం,

పనిని కుంటుచేయటం జరుగుతుంది. ఎవరో రైతు కూలి ఇంత అన్నాడట. వ్యవసాయకూలి కొంత ఎక్కువ అడిగాడట. సరే, అని ఒప్పుకొని రైతు కూలీలను పనికి తీసుకువెళ్ళాడు. ఆ రైతు సామాన్యస్థితి కలవాడు. ఆయనకంటె ఎక్కువ స్థితిపరుడైన రైతు, "ఆ కొద్ది ఆసామి అంత పెట్టటమేమిటి? అతను పెడ్తే నే నెక్కువ పెడ్తా" నన్నాడట. వ్యవసాయకార్మికు లడిగింది పోయిన సంవత్సరం కూలికంటె ఎక్కువ. ఆ ఎక్కువ కూలిని మించి ఇస్తానని సవాలుచేయటమేమి టని అడిగితే "వాడంత ఇచ్చే వాడును, నే నివ్వలేనివాడనా" అని వితండవాదం మొదలు పెట్టాడట. ఈ అదనుచూచుకొని ఇంకొక పెద్దరైతుకు ఆనవాయితీగా వచ్చే కూలీలు, "మీరు సవాలు రే" టివ్వాలని ఒత్తిడిచేశారట. ఈ సవాలురేటు క్రిందటి సంవత్సరం రేటు కంటె 50 శాతం హెచ్చు. ధాన్యం ధర నిరుటి స్థాయిలోనే వున్నది. కాని సవాలురేటు ఇస్తా నన్నది తన దగ్గర మిత్రుడగుట చేతనో, ఆనవాయితీగావస్తున్న కూలీల మెప్పుకొరకో, మనో దార్బల్యంచేతనో రెండవ రైతు సవాలురేటుకు ఒప్పుకొన్నాడు. ఆ రేటు ప్రాకిపోయింది. ఈ ప్రస్తావన లేకుండనే ఇంకొక రైతు "మొదట కూలీ లడిగిన రేటు, నిరుటికంటె 25 శాతం పెచ్చైన రేట్లు ఇస్తా" నని ఖండించాడు. దాని కిష్టపడి అతనికి పనిచేసే కూలీలు పనికి వచ్చారు. పదిరోజులు గడచిన తర్వాత ఒక దుష్టకూలీ "మాకు సవాలురేటు కావా" లన్నాడు. "నేను రేటు ఖండించి ఆ ప్రకారం లెక్కలలో నమోదు చేసుకొంటున్నాను కదా, మీరు ఒప్పుకొని పనిలోకి వస్తున్నారుకదా ఇంతలోకి ఏమి ముంచుకువచ్చిం?" దని రైతు నిగ్గదీసి అడిగినాడు. అయినా వాళ్ళు మొండిపట్టు పట్టారు. "మీకు సవాలురేటు కావాలంటే, ఇచ్చేవారివద్ద పనిచేయం" డని చెప్పి లెక్కలు చూచి ఎవరి కివ్వవలసింది వారికిచ్చివేసి పంపివేశాడు. ఆ జట్టులో ఇద్దరు "మేము మీ రిస్తామన్న కూలికి వస్తా"మని చెప్పి సనికి రాగా పని పూర్తి

—

అయిన తర్వాత పండుగ బహుమతికూడా ఇచ్చి పంపాడు. కాని పదిరోజుల తర్వాత, "మీకు సవాలురేటుచొప్పున రావలసివున్న"

దని మానుకొన్న కూలీలు తిరిగి వచ్చారు. రైతు మందలించి పంపాడు. ఇంతలో రైతు దగ్గర బంధువు ఒకడు, "నేను సవాలు చేటిచ్చియున్నాను, ఆయ నెందుకివ్వడు? నే నిప్పిస్తా" నని ఆశ పెట్టాడు. " నేను ముందుగానే ఖరారుచేసుకొన్నాను. ఆ ప్రకారం ఇచ్చాను. ఇష్టం లేనివాళ్ళు వెళ్ళిపోయారు. తిరిగి ఈతగాదాఏమి" టంటే, ఇప్పిస్తానన్న బంధువు తన తమ్మునిద్వారా "ఎవ రెన్ని రోజులు పనిచేశారో చెప్పితే అధికం నే నిచ్చుకొంటా" నని కబురంపాడు. "ఈ తెలివితక్కువేమటి? నాపనికత డివ్వటమేమి" టని రైతు మందలించవలసివచ్చింది. ఎక్కువ ఇప్పిస్తానన్న రైతు ముందరే ఖండించుకొన్న రైతుకంటె వయస్సులోను, అనుభవంలోను, విద్యలోను తక్కువ స్థాయిలోనివాడు. ఆస్థిలో కూడా అంతే.

ఈ విధంగా రైతులు పోటీలుపడి పరస్పర సహకారము లేక ఈర్ష్యాభావంతోనో, దురహంకారముచేతనో, చౌకబారు పేరు తెచ్చుకోటానికో ప్రవర్తిస్తే కూలీలు రెచ్చిపోరా? తాము కోరినంత ఇవ్వం డని తగాదాపెట్టి నూటి మాటికి రేట్లను ఆకాశాన్ని అంటునట్లు చేయరా? ముందుగా జాగ్రత్తపడి న్యాయమైన కూలిని నిర్ధారణ చేసుకొని ఆ ప్రకారం ఇచ్చే రైతు మీద దండెత్తరా? వాని కుప్పలుగాని, గడ్డివాములుగాని ఇతర పైరుగాని సలక్షణంగా ఉంటాయా? అట్టి రైతుకు సంక్రాంతి పండుగని, ధాన్యాదులు ఇంటికి వచ్చాయని సుఖ సంతోషా లెట్లు ఉంటవి? అతనికి సంక్రాంతి పర్వదినమా, పండుగ దినమా లేక ఆక్రోశ దినమా?

ఇది సాంఘిక న్యాయమా?

సాంఘిక న్యాయ మనే పేరుతో వ్యవసాయ భూములను పరిమితి చేయాలనే వారి ముఖ్యవాదం గాలి, నీరుతోబాటు భూమి కూడా యావత్తు ప్రజానీకానికి చెందిందని, పై రెంటిని స్వేచ్ఛగా అనుభవించునట్లే ప్రజలందరు భూమిని స్వేచ్ఛగా అనుభవించాలని.

ఈ వాదనలో పటుత్వంలేదని ఆలోచించేవారికి తెలుస్తుంది. తన ఆవరణలో గృహస్థు దుర్గంధాన్ని లేవదీస్తే ప్రక్కింటి గృహస్థు తగాదా పెడ్తాడు. ఎకాలజి అను పేరుతో బాంబులు మొదలైనవి ప్రేల్చటంవల్ల తమ దేశ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారని పొరుగు దేశంవారు గోలపెట్టుచున్నారు. నదీ జలాలు మాకే పరిమితమై యుండాలి, క్రింద ప్రాంతాలవారికి పోగూడదని వాదించుచున్నారు. తమ దేశ తీరప్రాంతానికి పండ్రెండు మైళ్ళవరకు సముద్రజలం తమదేనని వివిధదేశాలు హక్కు నిర్ణయించుకొన్నవి. అమెరికావారు, రష్యావారు హిందూమహాసముద్రాన్ని స్వేచ్ఛగా ఉపయోగించుకొనగూడ దని మన ప్రభుత్వమేగాక ఇతర ప్రభుత్వా లంటున్నవి. ఏ మూలనోవున్న ద్వీపం మాది అని, మేమే దాని నుపయో గించుకోవాలని దేశాలు ఘర్షణపడుచున్నవి. మా భూభాగాన్ని (గగన తలాన్నికూడా) అతిక్రమించారని తగవులాడుచున్నారు. ఇక ఎక్కడ గాలి, నీరు, భూమి ప్రజానీకానికి చెందినట్లు? మరిన్నీ పూర్వకాలంలో స్త్రీలు సమాజం సొత్తు. సమాజంలోని ఏ పురుషుడైనను ఏ స్త్రీ నైనను పొందవచ్చును. పైజెప్పిన బుద్ధిమంతులు స్త్రీల విషయ మేమంటారు? ప్రజలు తండాలుగా, గణాలుగా పశువులను మేపుకొనుచు వీలున్న చోట్ల సేద్యం చేసుకొంటూ బ్రతికే దినాలలో, అమలులోనుండిన సామాజిక పరిస్థితులను గుర్తు తెచ్చుకొని గాలి, నీరు, భూమి అందరికి చెందాలనటం ఏమి సబబు? శ్రీ రాజాజీ అన్నట్లు నదిలో నీరు అందరికీ హక్కే. కాని ఒకడు దూరంనుండి శ్రమపడి మోసు కొనివచ్చి తనింటికి జేర్చుకొంటే ఆ నీటిలో నాకు గూడా హక్కు ఉన్నదని పొరుగింటివాడు తగాదా పెట్టటం ఏమి న్యాయం? ఆ విధంగానే బంజరుగా నుండిన భూమిని రాత్రిం బవళ్లు శ్రమించి ఎరువులు వగైరావేసి ఫలసాయానికి తీసుకొనివస్తే, నాకుకూడా హక్కు ఉన్నదనటం దుష్టత్వంకాదా? అదిగాక రైతు భూమిని ఖరీదిచ్చి కొని యుంటాడు. దానిని ఉచితంగా లాక్కోవా లనటం ఏమి ధర్మం? పూర్వకాలంలోకూడా ఎవడు క్షేత్రాన్ని సేద్య యోగ్యంగా బాగుచేసుకొంటాడో వాని కా క్షేత్రం చెందు

తుందని భూమిపై వ్యక్తుల హక్కులను గుర్తిస్తూ మనువు తన ధర్మశాస్త్రంలో నిర్ణయించాడు. మిళిందపన్హా అన్న బౌద్ధ గ్రంథంలోకూడా ఈ ధర్మం చెప్పబడింది. (భారతి, అక్టోబరు 1972 సంచిక, శ్రీ విద్యాధరరావుగారి వ్యాసం చూడండి.)

వీరి రెండవవాదం, అందరు సమ స్థాయిలో ఉండాలని. ప్రకృతిలోని భేదాల నటుంచి జనులందరు సమస్థితిలో నున్నారా? ఒకే తలిదండ్రులకు జన్మించినవారు తెలివితేటలలోను, శక్తి సామర్థ్యాలలోను సమస్థాయిలో నున్నారా? ఒకరు ఉచ్చదశలో వుంటే, ఇంకొకరు నీచదశలోనున్న విషయం సరిక్రొత్తా? శాసనాలుచేసి అందరిని సమాన స్థితికి వీరు తేగలరా?

వెనుకబడినవారిని, బీద బిక్కిని లేవదీయవలసినదే. మన ముఖ్య ధర్మసూత్రాలలో నొకటి "సర్వే జనాః సుఖినో భవంతు." ఈ ధర్మాన్ని మనము తప్పక పాటించవలసిందే. అయితే కాకులనుకొట్టి గద్దలకువేయటం వలన ధర్మాచరణజరుగుతుందా? మన దేశం గ్రామాల సమూహం. గ్రామాలు భూమి సేద్యానికి, తిండిగింజలు పండించటానికి ఆధారం. ఒక గ్రామంలో పెద్ద రైతులని చెప్పబడే వారెంతమందున్నారు? పాతిక, ముప్పై ఎకరాలు అంతకు కొంచెం హెచ్చున్నవారిని చేతివేళ్లమీద లెక్కపెట్టవచ్చునుకదా! ఈ కొలదిమంది ఉండబట్టేకదా గ్రామం గ్రామంగా నిలిచివున్నది. పెండ్లి పేరంటాలకని, కార్తిక మాసం తిండిగింజలకని అర్థించే కూలి నాలికి ఆధారం ఈ కొద్ది మంది రైతులేకదా. ఈ పదిమందినికూడా క్రిందకు దించివేస్తే ఇక రైతు లెక్కడుంటారు, వ్యవసాయకూలీలు తప్ప? "మేము క్లబ్బులు పెట్టుకొంటున్నాం, మేము జల్సాలు చేసుకొంటున్నాం, మాకు చందాలు, విరాళా" లివ్వండని ప్రభుత్వోద్యోగులు ఇక ఎవరిని అడుగుతారు? గవర్నమెంటుకు ఆ లోను ఇవ్వండి. ఈ బాండులుకొనండి అని ఏ తహసిల్దారు ఏ గ్రామానికి రాగలడు? భూమిమీద సంపదపన్ను, దాని ఉత్పత్తిమీద ఆస్తి పన్ను ఏ రైతుమీద గవర్నమెంటు విధించగలదు? కూలి విపరీతంగా పెరిగిన ఈ రోజుల్లో 10 లేక 15 ఎకరాలలో పండే

గింజలు కూలికి, ఇతర వ్యవసాయఖర్చులకు చాలుతవా ? చాలినా, కుటుంబ పోషణకు మిగులుతవా ? మిగిలినా, బిడ్డల చదువు, పెండ్లిపేరంటాల సంగతేమిటి ? జీవనోపాధికి కావలసిన వస్తువుల ధరలు, బట్టల ధరలు, వైద్యఖర్చులు, చదువుల ఖర్చులు ఆకాశాన్నందుకొంటున్నవికదా. ఈ ఖర్చులకు రైతుఎక్కడనుండి తెస్తాడు ? 25 లేక 30 ఎకరాల మంచి మాగాణి భూమివుంటే కొంతవరకు సంబాళించుకొనవచ్చును. 10 లేక 15 ఎకరాల పరిమితి విధిస్తే సుఖజీవనంకాదు కదా, సగ మాకలితో బ్రతుకు గడుపుకోవటంకూడా కష్టం.

పల్లెటూరు జీవితాన్ని, రైతు కష్ట సుఖాలను ఎరుగని పట్టణవాసులు, వ్యవసాయభూమి ఎట్లుంటుందో తెలియనివారు బీదరికాన్ని పోగొట్టాలి అనుపేరుతో కొద్దో, గొప్పో ఉన్నవారి నుండి లాక్కొని తలా కాస్తా పంచిపెట్టాలంటున్నారు. పంచి పెడితే తలకెంత వస్తుంది ? కొన్ని సెంట్లే కదా. ఈ సెంట్లను ఏవిధంగా పండించుతారు ? రాజకీయబాధితు లను పేరుతో ఇది వరలో ప్రభుత్వం ఉండినవారికి, సవర్ణులమని చెప్పుకొనేవారికి 5 ఎకరాల చొప్పున పంచిపెట్టిందికదా. ఈ భూమిని వారు దున్నినారా, తిండి గింజలను పండించారా ? పాడుపెట్టినంతకాలం పాడుపెట్టి తర్వాత తెగనమ్ముకోలేదా ? చేతిలో మాడలేని హరిజనులా ఈ చెక్కలను పండించేది ? గ్రామంలోని నాలుగు మూలల్లో అక్కడొక చెక్క, ఇక్కడొక ముక్క విధించిన పరిమితి కెక్కువగా లభిస్తే వానినెట్లు సేద్యంచేసేది ? ఇప్పుడిప్పుడే క్రొత్తరకం విత్తనాలతో, ఎరువుల నింపుతో, ఆధునిక పద్ధతులతో మన వ్యవసాయోత్పత్తి అందుబాటులోకి వస్తున్నది. భూమిని ముక్కచెక్కలు చేయటంవలన పెట్టుబడి పెట్టలేని, కాని కళ్ళారాచూస్తే ఏ కల్లంగడిలోనోదూరే హరిజనుల, ఇతర వెనుకబడిన బీదజనుల చేతిలో పెట్టితే పంట నాశనమైపోదా ? దేశానికి వెన్నెముకవంటి రైతాంగాన్ని ఛిన్నాభిన్నం చేస్తే దేశ మెట్లు సుభిక్షమై సౌభాగ్యవంత మౌతుంది ? రైతులేనిదే రాజ్యం లేదనే నినాదం, ఇప్పుడెక్కడకు పోయింది ?

భూ పరిమితి కుటుంబానికి ఉండాలట. దేనికి? లేకపోతే భూమి పంచిపెట్టుటకు మిగులదట. సాంఘికన్యాయానికా లేక భూమి మిగలటానికా ఈ పరిమితి? శ్రీతులు, వారి బిడ్డలు ప్రజలుకారా? వారికి సాంఘికన్యాయం అక్కర్లేదా? ఏడాదికో, రెండేండ్లకో మేజరులయ్యే కొడుకులను కలిపి పరిమితి విధిస్తే వాళ్ళగతి ఏమికావాలి? స్త్రీగా ఆడపిల్లలకు పెండ్లిపేరంటాలు చేసి అరణం ఇవ్వాలికదా. వీని కెక్కడ అవకాశముంటుంది? మేజరు కొడుకులనేగాక, పెండ్లికాని మేజరు కూతుళ్ళను కూడ కుటుంబ యూనిట్ నిర్వచనంనుండి మినహాయిస్తే వాళ్ళగతి ఏమికావాలి? మేజరు కొడుకు పంచుకొని పోగా ముగ్గురు మైనరు పిల్లలు, ఇద్దరు పెండ్లికాని మేజరు కూతుళ్ళుంచే ఒక కుటుంబపరిమితి భూమియే కదా మిగిలేది? ముగ్గురు మైనరు పిల్లల్లో ఇద్దరు మగపిల్లలైతే వాళ్ళ కేమి మిగులుతుంది? అసలు మన రాజ్యాంగంలో వ్యక్తి ప్రస్తావనతప్ప కుటుంబ ప్రస్తావన లేదుకదా. ఓటుహక్కు వగైరా వ్యక్తిపరమే కదా.

ఇంకొక విడ్డూరం. తలిదండ్రులు ఆమె ఆర్థిక మనుగడకు ఇచ్చిన అరణం స్త్రీధనం. ఈ స్త్రీధనం అనాదినుండి ఆచరణలో వున్నది. ఇది స్త్రీ ప్రత్యేక హక్కుభుక్తంగా మన ఆచారం, సంప్రదాయం. ధర్మశాస్త్రం అంగీకరించుచున్నది. ఆమె భూమిని భర్త భూమిలో కలిపి పరిమితి విధించటము ఎట్టి న్యాయం? స్త్రీ పురుషునితో సమాన హక్కులు కలిగి ఉండాలని గగ్గోలుపెట్టే ఈ సాంఘిక న్యాయవాదులు ఏ మొగం పెట్టుకొని భార్యఆస్తిని కుటుంబ ఆస్తిలో కలపాలని చెప్పుతారు? స్త్రీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కావచ్చును. పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయవచ్చును. ఓటు హక్కుతో ప్రభుత్వాలను తారుమారు చేయవచ్చును. చివరకు న్యాయశాస్త్రాన్నే మార్చవచ్చును. కాని తన ఆస్తికి హక్కు కల్గియుండరాదు. తన సంపాదనను ఇంకొకరి చేతిలో పెట్టాలి. ఇది విడ్డూరం, అధర్మం కాదా?

మొన్న నెల్లూరు శ్రీతుసభలో శ్రీ బెజవాడ పాపిరెడ్డి "సాంఘిక న్యాయవాదులం దేశాన్ని, ప్రజలను మరమ్మతుచేసి, బీదతనాన్ని దేశంనుండి పారద్రోలుతాం" అని గప్పాలు చెప్పే

పెద్దమనుష్యులకు, ప్లానింగ్ కమీషన్ వంటి ఉన్నతస్థాయిలోవున్న వారికి భూమిలో ఎన్ని రకాలున్నవో, భూసారం ఎంత హెచ్చు తగ్గుల్లో ఉంటుందో, భూమి ఎంత పండగలదో తెలియ''దని తన అనుభవాన్ని చెప్పారు. ఒక పెద్దమనిషి ''గొట్టం బావిక్రింద సాగు ఖర్చు డెల్టాక్రింద సాగు ఖర్చు కంటె తక్కు''వని సెలవిచ్చాడట. అంతకంటె ఘరానామనిషి ఇంకొకరు, ''ఎకరానికి 11 పుట్లు ధాన్యం పండుతుంది. ఖర్చులకు 2 పుట్లు పోను నికరం 9 పుట్లు ధాన్యం మిగులుతుంది. అందువల్ల పది పదే నెకరాల పరిమితి భూమినుండి రైతు ఏటా 50 లేక 60 వేల నికరాదాయం పొంద గలుగుచున్నా''డని ఘంటాపథంగా చెప్పాడట. ఇట్టి అనుభవ హీనమైన దృష్టితో అయిదుగురు గల కుటుంబానికి ఏ 10, 15 ఎకరాలో సరిపోతుందని వాదించుచున్నారు. ఇది నిజముగా న్యాయబుద్ధితో చెప్పే మాటేనా? నోరులేని, సరైన నాయకత్వం లేని డూ డూ బసవన్నా అంటే బుర్రూపే రైతు నోట్లో మట్టి గొట్టే ప్రయత్నంకాదా?

మేఉపు తలపులు

''భార్యా రూపవతీ శత్రుః'' నిజమేనా? కురూపి శత్రువు కా గూడదా? గయ్యాళి, ఎదురించేది, నిర్లక్ష్యం చేసేది, అనురక్త, దుబారాచేసేది, సంసారాభివృద్ధిని పట్టించుకొనక పోవుటయే గాక అయుక్త పద్ధతులచే స్తంభింప జేసేది శత్రువు కాదా? అనుకూలవతి, సంసారి, కష్టసుఖాల్లో భాగస్వామిని, ఇంగితజ్ఞత గల భార్య రూపవతియైన అంతకంటె వేరే స్వర్గం ఉండునా?

కోడలు అత్తను ''అత్తా'' అని పిలవటం సామాన్య ధర్మం. గౌరవసూచకంగా పిలవాలనుకొనేవారు ''అత్తగారు'' అని పిలుస్తారు. చనువుగా ఆప్యాయతతో పిలవాలంటే ''అత్తమ్మా'' అని పిలవటం సమంజసం. ఈ రోజుల్లో కొందరు కోడళ్లు ''అత్తయ్యా'' అని పిలుస్తున్నారు. మరి మామను ''మామమ్మా'' అని పిలవాలి కదా.

దశగ్రీవుడనగా పది భాషలు మాట్లాడే వాడని, దశకంఠుడనగా పదివిధములుగా మాట్లాడేవాడని అర్థం చెప్పేవారున్నారు. రావణుడనగా ''భయంకరంగా అరచేవా''డని శ్రీ కవిరాజు రామస్వామి చౌదరి అర్థం చెప్పారు. పౌలస్త్యుడు యుద్ధమునందు శత్రువులకు భయం కలిగించుటకు భీకరాకారంగా పది తలల శిరస్త్రాణమును ధరించి యుండవలెను. అంతేగాని 10 తలల జీవి యుండునా ?

పండుగ వచ్చిందని ప్రకృతి చెప్పదు, చూపించదు. మానవుడే దానిని జ్ఞప్తికి తెచ్చుకొంటాడు.

యథార్థాలకంటే ఊహలు చాలా ఎక్కువ ఆనందాన్ని, సంతృప్తిని కలుగజేస్తవి.

భగవంతుడిచ్చిన సౌందర్యాన్ని కొందరు స్త్రీలు కాపాడుకొంటారు. కొందరు దానికి మెరుగులుదిద్దుకొంటారు. మరికొందరు క్షీణింపజేస్తారు. ''ఆధ్యాత్మిక సౌందర్యమే సిసలైన''దని ఎలుగెత్తి చాటే మన భారతీయులకు మూడవ తరగతి స్త్రీలే ఉత్తములా ?

అలవాటును మార్చుకోవటం అతి కష్టం. వాల్మీకి రాముడు అసలు జన్మించలేదని చెప్పేవారి మాటలో నిజమున్నదని నా నమ్మకం. అయినా ఉదయం పడకనుండి లేచినప్పుడు, ఏదైనా దెబ్బతగిలినప్పుడు, కష్టం వచ్చినప్పుడు ''రామా, రామా, రామచంద్ర ప్రభూ'' అంటూ ఆయనను తలుస్తాను.

ఒకరికి నచ్చింది ఇంకొకరికి నచ్చకపోవచ్చును. నేను ఇంగ్లండులో వాల్తమ్ యాబె అనుచోట మిసెస్ హెలెన్ వుడ్ బ్రిడ్జి అను ఆమె ఇంట్లో అతిథిగా ఉన్నప్పుడు ఒకనాడామె ''చౌదరీ, నీ నడక బాగుంటుం''దన్నది. తరువాత గంజాం జిల్లా, బరంపురంలో నేను ఇన్ కమ్‌టాక్సు ఆఫీసరుగా ఉద్యోగము చేయుచున్న రోజుల్లో, ఒకనాడు నా స్నేహితుడు డా. కోకా వేణుగోపాలరావుగారింటికి వెళ్ళగా వారి చిన్నకొడుకులు నా నడకను పరిహసించుట కన్నట్లు నేను నడచిన విధంగా నడచుచుండగా చూచిన నాకు, నా నడక నాకే నచ్చలేదు.

కాలికి రాని చెప్పు, పడకకు రాని భార్య వ్యర్థం.

సద్వంశజ, రాజ్యాధినేత అనుంగుసోదరి, రాజ్రపతినిధి శూర్పణఖ తనను వరించినందులకు ముక్కు చెవులు కోయించిన, తనే దేవునిగా పూజించి, తన కామావసరాలను తీర్చి, తనకు సహాచారిణిగా వర్తించిన ప్రియభార్యను సందేహించి అగ్నిలో దూకించి కారడవులలో విడచిపెట్టించిన రఘురాముడా ; లేక తన రాజ్యము జొచ్చి తన సోదరిని అన్యాయముగా కురూపినిజేసి తన సేనా నాయకులను, సైన్యాన్ని సంహరించినందులకు సవాలుగా సీతను తన రాజధానికి తీసుకొనిపోయి సకల మర్యాదలతో తన ఉద్యానవనాంతర సౌధమునందించి ఆమె స్త్రీత్వమును కాపాడిన రావణుడా, ఉత్తమ పురుషుడు ?

మతము వ్యక్తిగతమైనప్పుడు మతము మార్చుకొనినవాడు వేషమునుకూడ మార్చుకొను టెందులకు ? వస్త్రాదిధారణ చూచి నంతనే ఇతడు ఫలానా మతస్థుడని తెలియుట ఆ మతమున కాధిక్యత కలిగించునా ? ఆ వ్యక్తి సంకుచితత్వమును తెల్పదా ?

జన్మించినది మొదలు మరణించువరకు ఇతర వ్యాసంగములు ఏమాత్రంలేక ప్రొద్దుననుండి రాత్రి నిద్రపోయేవరకు భగవత్సేవ లోను, ధ్యానంలోను జీవితం అంతా గడిపేవాని జన్మ వ్యర్థం. అట్టివాడు జన్మించకుండుటయే మేలు. భగవంతుడు అంత స్వార్థపరుడు, కన్నబిడ్డలను తన బానిసలుగా జేసికొను దుష్టుడు కాదు ; జ్ఞాన హీనుడును కాదు. జీవులను సృష్టించి వానిని తన ఆటవస్తువులనుగా జేసికొని ఆడుకొనుటకు అతడు చిలిపి పిల్లవాడా!

దేవునిగాని, రాజునుగాని "ప్రభూ" అని సంబోధించటం భక్తి పూజ్యతలను, వినయ విధేయతలను సూచిస్తుంది. క్రైస్తవులు ఏసుక్రీస్తుని "ప్రభువా" అంటారు. దీనిలో పైదాని హుందా తనం లేదు. స్త్రీని "దేవీ" అని గౌరవ ప్రేమపూర్వకంగాను, "మాతా" అని ప్రార్థనాపూర్వకంగాను, "అమ్మా" అని దీనత తోను సంబోధించటం బాగుంటుంది.

అమెరికాలో విద్యార్థినులు కడుపురాకుండా మాత్రలు వాడుకొంటూ సహాధ్యాయులగు విద్యార్థులతో విచ్చలవిడిగా సంభోగం జరుపుకొంటున్నారట. ఈ స్థితి మన పురాణాలలో చెప్పబడు దేవతాస్త్రీల పద్ధతిని గుర్తుకు తెచ్చుచున్నది. స్వర్గ

కాంతలు పూర్తిస్వేచ్ఛతో వరస, వావి లేకుండా సంభోగ పరులట. మరిన్నీ వారికి పిల్లలు పుట్టరట. దేవతలవలె స్వేచ్ఛా విహారులైన శ్వేతవనితలు పిల్లలుపుట్టకుండా జాగ్రత్తపడు చున్నారు. మన పురాణాలు దేవతలు శ్వేతవర్ణులని చెప్పు చున్నవి. కాబట్టి శ్వేతవనితలు దేవతా స్త్రీలేమో! వారి స్వేచ్ఛారతి, విలాసాలు స్వర్గ భోగములేమో!

భగవంతుడు పురుషుని, స్త్రీని సృష్టించాడు. భార్యా భర్తలను సృష్టించలేదు. మానవుడు భార్య, భర్త అని పేరు పెట్టి వారిని కల్పించాడు. పదిమంది పురుషులు ఒక స్త్రీని, పదిమంది స్త్రీలు ఒక పురుషుని కామించి, వారిలో వారు తగాదా పడి కొట్లాడుకోకుండా సంఘముగా నేర్పడిన మానవుడు వివాహ మనే పేరుతో కట్టుబాట్లు ఏర్పరచాడు. రక్తబంధువులతో కూడిక సంతానానికి హానికరమని పురుషుడు తల్లి, సోదరి, కూతురుతోను; స్త్రీ తండ్రి, సోదరుడు, కొడుకుతోను సంభోగించ కూడదని నిషేధించాడు. ఈ నిషేధం ఆధునికశాస్త్రజ్ఞులు పశు పక్ష్యాదులకు కూడా వర్తింప జేస్తున్నారు.

శంకరుడు మహేశ్వరుడు. గౌరి పరాశక్తి. రఘురాముడు వీరాధి వీరుడైనను మానవమాత్రుడే. అట్టిచో అల్పజ్ఞు డొకడు అధ్యాత్మరామాయణ మను పేరుతో గౌరీశంకరులు రఘురాముని నిజ భక్తులవలె కీర్తించునట్లు చేసినాడు. ఎంత అనుచితము! వాల్మీకి రాముడు అసలే లేడని విజ్ఞుల నమ్మకము. శ్రీరాముడు ఒక భావన, ఆదర్శము మాత్రమే అని నా నమ్మకము. ఎంత ఆదర్శపురుషుడైనను ఆదిదంపతులచే కీర్తింపదగినవాడా?

తనను వలచిన యువతిని ముక్కు చెవులు కోయించిన రాముడు, ఇతరునితో యుద్ధమున నిమగ్నుడై యున్న వీరుని చెట్టు చాటున నుండి బాణము వదలి చంపిన రాముడు మనకు భగవంతుని అవతారము, పూజనీయుడు. శత్రుపక్షమున జేరి కులక్షయం జేయించిన విభీషణుడు, తండ్రిని జంపించిన ప్రహ్లాదుడు మనకు గౌరవనీయులు. ఏమి హిందువుల అన్యాయబుద్ధి, విచక్షణజ్ఞానము!

ఉత్తరభారతీయులు హిందువులుగాని, ముస్లింలుగాని, దీర్ఘ దృఢగాత్రులు, ధైర్యసాహసోపేతులు, యుద్ధ నిపుణులు,

గంభీర స్వరయుతులు నగు ఆర్యజాతుల సంతతులవారమని చెప్పు కొందురు. దక్షిణ భారతీయులను అల్పమైన, దుర్బల కాయులు, ధైర్య స్థైర్యములు మిక్కిలి తక్కువగా గలవారు, ఉత్తరాది వారికి అన్నివిషయములలోను చాలనివా రని తలంతురు. కాని ఉత్తరాదివారి హిందూస్థాన్ సంగీత స్వరూపము ధోరణి అస్పష్ట ముగాను, నిద్రమైకములో కూనిరాగములు తీసినట్లుగాను, ఒకొక్కప్పుడు కుళ్ళి కుళ్ళి ఏడ్చినట్లుగాను, నిస్పృహా పూరితము గాను ఉండును. దక్షిణాది కర్ణాటక సంగీతము ప్రస్ఫుట రాగాలాపనతోను, వర్షఋతువునందు తీవ్రవేగముతో ఉద్ధృత ముగా ప్రవహించు సెలయేరు రీతిని, పావురములు ఆకాశమార్గ మున పల్టీలు కొట్టినట్లు, దొమ్మరసాని గడపై కెక్కి సాము గరడీలు చేసిన ట్లుండును. ఆర్య, ద్రావిడజాతుల లక్షణాలని చెప్పబడు వానికి భిన్నముగా ఈ సంగీత ధోరణు లుండుటకు కారణమేమి? సంగీతవిద్వాంసులలో తలమానికమని జగత్ప్రసిద్ధినొందిన తాన్‌సేన్ సంగీతమని వాడిన సంగీతము నా కేమాత్రము నచ్చక పోవుట నా దురదృష్టమా?

మహమ్మదీయుల పవిత్ర మతగ్రంథమగు ఖురాన్ పఠన, రాగమాలికగా నుండునేమి? సామవేదము వంటిదా ఆ ప్రవచన సంపుటి? రామాయణ, భారతాదులు శ్లోక విరచితములుగాని గేయములు కాదుకదా. క్రైస్తవుల మతగ్రంథము బైబుల్ పద సమన్వితము. ఖురాన్ ప్రవచనాలను పట్టి పట్టి, నొక్కి నొక్కి పాడు టెందులకు?

ఈ సాయంత్రం రేడియోలో 'రామాయణమునుండి' అని ఒక పౌరాణికుడు రావణునకు మండోదరి చేసిన హితోపదేశం వినిపించాడు. "శ్రీరాముడు మంచివాడు. శరణుజొచ్చినవారిని కాపాడుతాడు. నీవు వెంటనే సీతను సమర్పించి నీ రాజ్యమును, కులమును కాపాడుకొనుము" అంటుంది. సుగ్రీవునకు మాట ఇచ్చాననే నెపమున చెట్టు చాటునుండి వాలిని జంపిన రాముడు, విభీషణునకు లంకారాజ్యం పట్టంగడ్తానని అభయహస్తమిచ్చానని రావణుని లొంగుపాటును ఖాతరుచేసి లంకాపుర రాజ్యాన్ని ఏలనిచ్చేవాడా? ఏ మొగంపెట్టుకొని వీరాధివీరుడు, అభిమాన

ధనుడగు ఆ పౌలస్త్యుడు రాజ్యమును తమ్మునకు వదలి అతని కొలువులో నుండగలడు ?

స్వర్గం, నరకం ఉన్నవందురు. నా బుద్ధికి సుఖశాంతి ప్రదమైన స్వగృహం స్వర్గం. పిల్లల ఏడ్పులతో గందరగోళంగా ఉన్న ఇల్లు నరకం. మృదుభాషిణి, సహచారిణి, అనుకూలవతి యగు భార్య స్వర్గం. అరిచేది, అడ్డువచ్చేది, వితండవాది యగు పెండ్లం నరకం.

శరీరమిచ్చు వెచ్చదనమును, స్పర్శసుఖమును కాంక్షించి రెండుశరీరములు ఒకదానితో మరొకటి ఒరసినప్పుడు లింగ భేదమును పాటించుట అవసరమా ? మర్మాంగములుగాక ఇతర అవయవములు స్త్రీ పురుషులకు ఒక్కమాదిరివే కదా !

బుద్ధిలేనిభార్య ముళ్ళపొదమీదవేసిన మస్లిను గుడ్డ. ఇంగితంలేని యువతిపొందు కొయ్యబొమ్మతో కూడిక. చదువు లేని భార్య చప్పని మెతుకులు. జ్ఞానహీనురాలు పాచికూర.

దశరథుని భార్య కైకేయి యుద్ధప్రియులును, శూరులు నగు కేకయతెగ నాయకుని కుమార్తె. శ్రీకృష్ణుని భార్య సత్యభామ శూరుడును, అభిమానధనుడు నగు సత్రాజిత్తు కుమార్తె. వీరిద్దరకు జాత్యహంకారంలోను, పౌరుషంలోను, అభిమానంలోను, యుద్ధ నైపుణ్యములోను చాలా సామ్యమున్నది. అయితే కైక యుద్ధ ములో భర్తకు సాయముచేసినందులకు భర్త కయిష్టమైన వరము లను కోరుకొన్నది. సత్య భర్త మెప్పుతోనే తృప్తిపొందినది.

పదిమందితోచావు పెండ్లివంటిదట. నిజమే అనిపిస్తున్నది. ఈ ఉదయం అకాలంగా, అకస్మాత్తుగా భారీవర్షంపడింది. పెసలు, మినుమేగాక ముఖ్యంగా జనుము దెబ్బతిన్నది. అసలే జనుము మూడవ లేక నాల్గవ వంతు మాత్రమే అంటింది. కోసిన జనుము సగంపైన చేలో ఉన్నది. అది నిస్సారమైంది. అయినా అందరికీ నష్టం వచ్చిందికదా అని ఒక తృప్తి.

దశరథుడు సూర్యవంశపురాజు, ఆర్యుడు. శ్వేతవర్ణుడు కాకపోయినా పీతవర్ణుడై యుంటాడు. కాని రాముడు నీలమేఘ శ్యామము. అనగా చామనచాయవాడు. భరతుడు కృష్ణవర్ణుడు అనగా నల్లనివాడు. లక్ష్మణ శత్రుఘ్నులు బంగారువర్ణం కలవారు.

కారణం ? కౌసల్య అనార్య రక్తం కలిగియుంటుంది. కై కేయి కొండ జాతులకు చెందిన అనార్య అయియుంటుంది. సుమిత్ర ఆర్యజాతిదై యుంటుంది. పుత్రకామేష్టియజ్ఞం కొన్ని నెలలుపాటు జరిగి యుంటుంది. అనగా కొన్ని నెలలపాటు దశరథుడు అతని భార్యలు నిష్ఠాగరిష్ఠులై శారీరక నియమములను, భోజనాది విషయములలోను అతి జాగ్రత్తను పాటించి యుందురు. మరియు శ్రేష్ఠమూలికలతో తయారుచేయబడిన పాయసమును (లేహ్యము) భర్త, భార్యలు కొంతకాలం సేవించియుందురు. అందువలన దశరథునకు వీర్యశక్తి పెరిగియుండును. అతని భార్యలకు గర్భ కోశములు బాగుపడియుండును. గడువు దాటిన తర్వాత దశరథుడు ప్రథమభార్య కౌసల్యతో మొట్టమొదట సంభోగించి యుండుటచేత ఉద్ధృత వీర్యము వలన మహాబలవంతుడు రాము డుద్భవించి యుండును. కొంత తగ్గిన వీర్యమును సుమిత్ర గ్రహించి రామునియంత బలవంతులు కాకపోయినను యుద్ధనిపుణులగు లక్ష్మణ శత్రుఘ్నులు అను కవలలను కనియుండును. మిగిలిన వీర్యము వలన కై కేయి సాత్వికుడును, యుద్ధనిపుణుడు కానివాడు నగు భరతుని ప్రసవించియుండును.

మానవుడు నూటికి నూరుపాళ్ళు మంచివాడుగను లేక చెడ్డవాడుగను ఉండడు. ప్రతి పురుషునిలోను, స్త్రీలోను కొంత మంచి, కొంత చెడు ఉండును. నూటికి 60 వంతులపైన మంచితనమున్న వ్యక్తి మంచివాడుగాను, చెడు గుణమున్న వ్యక్తి చెడ్డవాడుగాను తలంచబడును. దీనినే సహజ సన్మార్గుడు లేక దుర్మార్గుడు అందుము. ఏ కారణముచేతనైన సద్గుణశీలి చెడు మార్గాన్ని అవలంబించినట్లైన అతడు సహజ దుర్మార్గుని కంటె హెచ్చుగా దుష్కృతములను చేయును. అదే విధముగా దుష్టుడు మంచిత్రోవను బట్టిన మంచివా డనుకొనే వారికంటె మంచిపనులు చేయును.

వియత్నాం యుద్ధములో పాల్గొనుచున్న అమెరికన్ సైనికులు దేశభక్తి చేతగాని, నైతిక విలువలవలన గాని ప్రేరేపింపబడలేదు. అక్కడకు యుద్ధమునకు వెళ్లుట తమ ప్రభుత్వ

ఆదేశానుసారముగాని ఐచ్ఛికముగా కాదు. హిందువులవలెగాక పాశ్చాత్యులు పునర్జన్మ నంగీకరించరు. వారి కిప్పుడున్న జన్మయే అంత్యము. ఈ జన్మను సార్థకముజేసికొనుటయే వారి పరమావధి. సార్థకమనగా దానిని సౌఖ్యప్రదముగాను, తృప్తికరముగాను మలచుకొనుటయే, ఉపయోగించుకొనుటయే. ఎంత భోగ భాగ్యములతో, ఎంత సంతోష తృప్తులతో, ఎంత హెచ్చుస్థాయిని జీవితమును గడపనగునో అంత విస్తారముగా వస్తువులను, వసతులను, వనరులను కలిగించుకొనుటయే వారి పరమ లక్ష్యము. అందువలన క్షణ క్షణం ప్రాణాపాయానికి గురియగు యుద్ధమువలన ఎంతవరకు లాభమును, తృప్తిని పొందుట కవకాశముండునో అంత అవకాశమును నిస్సందేహంగా, ధర్మచింత లేకుండా ఉపయోగించుకొనుటకు ప్రయత్నింతురు. శత్రువుల నోడించి వారి ధన ధాన్యాదులను, వారి స్త్రీ సంపదను కొల్లగొట్టుటకు సంసిద్ధులవుదురు. కళింగయుద్ధ సందర్భమున రక్తపాతమును జూచి కరుణావేశపరుడై సైనికుల దోపిడిని, స్త్రీల మానభంగములను చూచి దుఃఖపూరితుడైన అశోకునివంటి ఉత్తమ మానవులరుదు. అసలు యుద్ధము సంభవించకుండ నుండవలెనుగాని సంభవించిన ఇట్టి అనర్థములు తప్పవు. అందువలననే మన పెద్దలు 'శాంతిః శాంతిః శాంతిః' అని శాంతిని పదే పదే కోరినారు.

మొదట రుచిగల పదార్థాన్ని భుజించి తరువాత వెంటనే జిహ్వాకు రుచించని వస్తువును తినిన, మొదటి దానివలన కలిగిన తృప్తి నశించిపోవుటయేగాక రెండవదాని వెగటు నిలిచిపోవును. మొదటనే వెగటును కలిగించు పదార్థాన్ని భుజించి తరువాత రుచికరపదార్థమును తినినను ఆ వెగటును పూర్తిగా చంపలేదు. తన సహజ తృప్తిని నిండుగా ఇవ్వలేదు. దీనినిబట్టి మంచికంటె చెడు ఎక్కువ ప్రభావము కలదిగా తోచును. అందువల్లనే "కంచు ప్రోగునట్లు కనకంబు ప్రోగునా" అని పెద్దల సూక్తి.

మానవులందరు సమానులనునది నిజముకాదు. సృష్టి భిన్న భిన్నములు. విశ్వములోని గోళములే, నక్షత్రములే సమానములుకావు. ఖగోళములోని దేశములన్నియు సమానములు కావు. భారతదేశములోని మానవజాతులు భిన్న భిన్న స్వరూప

ములు కలవి. ఒక తలిదండ్రులకు జన్మించినవారే రూపములోను, గుణములోను, మేధాసంపత్తిలోను సమానముగా నుండరు. కాబట్టి మానవులందరు సమానప్రతిపత్తికలవారుగా నుండవలెనని, వారందరు ఒకే రకమైన జీవితమును గడపవలెనని వాంఛించుట వెర్రితనము. పాత్రనుబట్టి ఉదకము. ఎవరి శక్తిసామర్థ్యాలనుబట్టి వారు హెచ్చు తగ్గులుగా నుందురు. సంఘము, సంఘ సభ్యులు తక్కువస్థాయివారికి చేయూతనిచ్చుట ధర్మమే. అయితే సంఘ క్షేమముపేర సంఘటితమైన ప్రభుత్వము సుఖజీవనము చేయు వారిని దౌర్భాగ్యులను చేయుట అవివేకము. మన పౌరాణిక ధ్యేయము సౌఖ్యప్రదజీవితము. కాని మన ప్రభుత్వము కొందరి నైనను సుఖజీవనము చేయనియ్యకున్నది. అందరిని నికృష్ట జీవులనుగా తయారుచేయ ప్రయత్నించుచున్నది. మనది పుణ్య భూమి, అనగా సుఖజీవనప్రదమగు దేశముకాదు, కర్మభూమి!

పిల్లలు ఏ తప్పుపని చేసినా, ఎంత గల్లంతు చేసినా ఒక్క చిన్న దెబ్బకూడా తలిదండ్రులు వేయకూడదని పాశ్చాత్య సిద్ధాంతం. అయితే మన పూర్వులు "దండం దశ గుణం భవేత్" అని సిద్ధాంతీకరించారు. ఇది ప్రస్తుతానికి మోటుగా కనిపించినా యథార్థం అనిపిస్తుంది. వారుకూడ అనుచితంగా, సందర్భశుద్ధి లేకుండా, పాత్ర విచక్షణలేకుండా దండించుడని చెప్పియుండరు. దుష్టుణ్ణి దండించకపోయినా, పిల్లలను అదుపులోపెట్టకపోయినా అనర్థాలు సంభవిస్తవి. "వినాశాయ చ దుష్కృతాం" భగవద్గీత. ఈ సూత్రం తప్పకుండ హంతకులకు మరణశిక్షను సూచించుచున్నది. ఇప్పటి మానవతావాదులు ఎంత ఘోషించినా పిల్లలకు తాము తప్పు చేశామని తెలియజెప్పేది దెబ్బ. లేకపోతే వాళ్ళకు అర్థంకాదు. అదుపు, ఆజ్ఞ తలిదండ్రులనుండి లేకపోవుటచేతనే ప్రస్తుత అరాచకం పిల్లలలో, యువకులలో.

బీజం ప్రధానమా, క్షేత్రం ప్రధానమా అన్నది గట్టి చిక్కుప్రశ్నే. విత్తన మెంత గట్టిదైనను భూమి నిస్సారమైనప్పుడు తగిన ఫలితము కలుగదు. అలాగే భూమి ఎంత సారవంతమైనదైనను విత్తనము నిర్వీర్యమైనదైతే భూమి ఫలించదు. కాని మన పూర్వులు బీజానికే ప్రాధాన్యం ఇచ్చారు.

అందువల్లనే బ్రాహ్మణుడు తక్కిన మూడు కులాల స్త్రీలయందు సంతానమును పొందవచ్చునని నిర్ణయించారు. క్షత్రియస్త్రీకి కల్గినవాడు క్షత్రియుడుగను, వైశ్యస్త్రీయందు జన్మించినవాడు వైశ్యుడుగను, శూద్రస్త్రీకి పుట్టినవాడు శూద్రుడుగను ఎంచ బడిరి. ఆ కాలములో పురుషులదే పైచేయి కాబట్టి బీజానికి ఎక్కువ ప్రతిష్ఠ ఇచ్చారని మనము తలంచకూడదు. అయితే ఈ రోజులలో స్థాయిలో మిక్కిలి వ్యత్యాసమున్న వర్ణాంతర వివాహాలను ప్రేరేపించుచున్నారు. ఇట్టివి అనర్థములకు దారితీయగలవు. వివిధ శాఖలకు చెందిన బ్రాహ్మణులు, సమ సంస్కృతి ఆచార వ్యవహారాలు గల వెలమ, రెడ్డి, కమ్మ, కాపు లేక బలిజ కులాలవారు ఇచ్చి పుచ్చుకొనుటలో కుండమార్పుడు చేసికొనవచ్చును. ఇది శ్రేష్ఠము. హెచ్చు తగ్గు కులాల విషయంలోకూడ ఎక్కువ వ్యత్యాసము లేకుండిన కొంతవరకు సరిపుచ్చుకొనవచ్చును. ఉదాహరణకు, బ్రాహ్మణుడు వైశ్య స్త్రీనో, కమ్మస్త్రీనో చేసికొనుట; కమ్మ పురుషుడు సాలె, కుమ్మరి లేక గొల్లవంటి కులాల స్త్రీని వివాహమాడుట అంత చీదరించు కొనవలసినది కాదు. మానవతా దృక్పథంలో 'లా' ప్రకారం అన్నికులాలు సమానమేకదా అందురు. అయితే శతాబ్దాలుగా కరడుగట్టిన జీవితవిధాన భేదము, సంస్కార భేదము పరిస్థితుల ప్రభావం వెనువెంటనే మాసిపోవునా? అణువులు, రశ్మి, స్పందన, శరీరగంధం వగైరాల భేదాలతో నిండియుండిన శరీర తత్వమును విద్యాసక్తి, ఉద్యోగప్రతిభ ఒకటి రెండు దశాబ్దాలలో నశింప జేయలేవు. మౌలిక భేదాలు అంత సులువుగా అంతమొందవు.

నిరాకార నిర్గుణ మతస్థులకు, సరూప సద్గుణ మతావలంబ కులకు పొత్తు కుదురునా? నిశ్శబ్దం ప్రధానముగా ఆరాధించే వారికి, మంగళవాయిద్యములతో పూజించేవారికి పొత్తుకుదురునా? రోజుకు ఐదుసార్లు ప్రార్థించువారికి, సంధ్యా సమయములు రెండింటనుమాత్రమే ధ్యానించు వారికి సఖ్యత కలుగునా? ఎడారిలో జనించిన మతానికి, జన సంకీర్ణములో ప్రబలిన మతానికి మధ్య సహనముండునా? వేల సంవత్సరాలనుండి కర్మకాండలతో, వర్ణ వ్యత్యాసములతో, ఆచార పరంపరలతో భారతమున

ప్రబలిన హిందూమతమునకు, ఎక్కడో అరేబియాలో పుట్టి ఈ దేశానికి వలస వచ్చి 11, 12 శతాబ్దాలలో ప్రబలిన మహమ్మదీయ మతానికి సామరస్యము కల్గునా? మేళ తాళములతో నృత్య గానములతో ఊరేగింపులు, ఉత్సవాలు జరుపుకొను హిందువులకు, నిశ్శబ్దముగా నారాధించు మహమ్మదీయులకు సహజీవన సిద్ధాంతం రుచించునా? ఈ ప్రశ్నలు రెండుమతాలలోని ఛాందసులకు, మూర్ఖులకు ఎదురవుచున్నవి. అయితే భారతదేశములో నివసించు వారందరు భారతీయులేకదా. మతాభిప్రాయాలు, ఆచారాలు వేరైనా వారందరు అన్నదమ్ములవంటి వారేకదా. అందువలన సహజీవన మెందులకు అసాధ్య మౌతుంది? ఎవరి ధర్మాలను వారు పాటించుకోవటంలో, ఎవరి పద్ధతులను వారు కొనసాగించు కోవటంలో ఒకరి కొక రడ్డమెందుకు రావాలి? హిందువులను వాద్యములతో, అరుపులతో తమ మౌనభ్యానాన్ని భంగం చేయుట కూడదని మహమ్మదీయులు కోరుటలో తప్పేమున్నది? ఆ విధముగనే తమ మతానుసారము మంగళ వాద్యములతో, నృత్య గానములతో తమ పూజాపురస్కారములను జరుపుకొన వలసియున్నదని హిందువులు చెప్పుకొనుట సమంజసమేకదా. అయితే ఇక సామరస్యమెట్లు కలుగునని సందేహం రావచ్చును. సామరస్యానికి పునాది ఒకరి నొకరు గౌరవించుకొని అర్థముచేసి కొనుటయే. తమ మతం తమ కెంతముఖ్యమో, అవతలివారి మతం వారి కంతముఖ్యమని గుర్తించుటయే. ఈ అవగాహన, గౌరవము తప్పకుండా వారి శాంతియుత సహజీవనానికి తోడ్పడు తుంది. ఎల్లప్పుడు మసీదులో ఎవరో ఒకరు ప్రార్థన చేయుచుంటారు. ఆ ప్రక్కకే ఎప్పుడుగాని మంగళవాద్యము లతో పోగూడదని శాసించుట మహమ్మదీయులు మానుకొని, నిర్ణీత కాలాలను నియమించుకోవాలి. ఆ నిర్ణీత కాలాలను హిందువులు గౌరవించాలి. ముహరంలోని మహమ్మదీయుల జాతరలు, పండుగలలోని హిందువుల ఊరేగింపులు ఎదురైనప్పుడు ఒకరి నొకరు తప్పించుకొని ఒదిగి పోవాలి. గణపతిపూజ మొదలైన ఉత్సవాలలో డాంబికము, అహం హిందువులు మహమ్మదీయులయందు చూపకూడదు. అలాగే పులివేషాలు

మొదలైనవి దౌర్జన్యపూరితముగా ఉండకూడదు. హిందువుల, ముస్లిముల పెద్దలు జాయింటు శాశ్వత కమిటీలుగా నేర్పడి ఈ రెండు సంఘాల మధ్య ఏ వైనా భేదాభిప్రాయా లుద్భవిస్తే వానిని సంప్రదింపులతో సర్దుబాటు చేసుకోవాలి. మన దేశంలో ముఖ్యమైన ఈ రెండు సంఘాలు ఒకరి నొకరు వ్యతిరేకిస్తూ ఉంటే దేశ సౌఖ్యానికి, సౌభాగ్యానికి తోడ్పడు టటుంచి, దాని పతనానికి కారణ మౌతాయి.

ఇతరస్త్రీ తోడు లేకుండా సినిమాగాని, నాటకంగాని చూస్తే కలిగే ఆనందంకంటె, స్త్రీకి పనివంకతో నలుగురు స్త్రీలతో కబుర్లు చెప్పుకొనుటయే ఎక్కువ తృప్తి నిస్తుంది.

సీతారాములు, రాధాకృష్ణులు లేని హిందూ సమాజము చైతన్యరహిత జనసమూహము మాత్రమే. జీవముండినను జీవ రహిత బొందియే. ఆ ఆదర్శపురుష పుంగవులు, స్త్రీ రత్నములు హిందూ ప్రజానీకానికి ప్రాణవాయువులు. వారు లేనప్పుడు తల్లి లేని బిడ్డలవలె, నేల విడిచిన సాములవలె, వేళ్లులేని చెట్టువలె నిస్సహాయులగుదురు. దిక్కు తెలియని వా రగుదురు. మొదటిజత ఆదర్శజీవితానికి, రెండవజత మనోహరజీవితానికి తారాకాణము.

శుభం, శోభనం. శుభం కార్యానుకూలా న్నిస్తుంది. శోభనం పారవశ్యా న్నిస్తుంది. మొదటిది లేకపోతే రెండవది సాధ్యంకాదు. రెండవది లేకుండా మొదటిది సంభవం. రెండూ ఉంటే వేరే స్వర్గం అక్కరలేదు.

పునర్జన్మ—దేహాన్నివిడిచి ఇంకొక జన్మను పొందటం నిజమో కాదో కాని లాటరీలో లక్షలు గెలిచిన నిరుపేద, బీదగా పుట్టి సినిమా రంగంలో ప్రసిద్ధుడైన వ్యక్తి, క్రొత్తగా రాజకీయ జూదంలో విధానసభ్యుడై నవాడు—వీళ్లు నిజంగా పునర్జన్మ ఎత్తిన వాళ్లు. వీళ్ళకోవకు చెందినవానినిగా తిండికి అల్లాడి, వ్యాపారంలో సంపన్నుడైన వానిని చేర్చవచ్చును. ఆ దేహంతోనే ఇంకొక రూపొందిన వ్యక్తులు వీళ్ళు.

నిండు గర్భవతిని త్యజించి, కారడవిలో విడిచిపెట్టి తిరిగి తనను అగ్నిపరీక్షకు గురికమ్మని దశరథరాము డాజ్ఞాపించినప్పుడు ఆ అవ

మానమును తట్టుకోలేక అగాధమైన గోతిలోపడి ఆత్మహత్య చేసి కొన్న సీత, భక్తుల తరఫున రామునకెట్లు సిఫారసుచేయగలదు ?

రెండు రోజులక్రితం వినోబాభావేగారు "తూర్పు పాకిస్థాన్‌లో పశ్చిమ పాకిస్థానీయులు లక్షలకొలది నిరాయుధులను, పిల్లలను, స్త్రీలను అమానుషంగా నష్టా బాంబులు వేసియు, మరతుపాకులు, ఫిరంగులు, టాంకుల నుపయోగించియు ఊచకోత కోస్తూవుంటే షేక్ అబ్దుల్లా, సరిహద్దు గాంధి ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ గార్లు పెదవైనా కదపరేమి ?" అని ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. షేక్ అబ్దుల్లా పరమ దుర్మార్గుడు. అతనికి స్వమతస్థు లనిన అభిమానం. కపట నటన. చివరకు మానవత్వంకూడా లేనివాడు. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ గారు సహజ సద్గుణవంతుడు, సజ్జనుడు, దైవచింతన కలవాడు. కాని ఆయన మంచితనం చాలా వరకు మహమ్మదీయుల పక్షమే. నౌకాళీ దురంతాల్లో తూర్పు పాకిస్థాన్ మహమ్మదీయులు హిందువులను నానావిధ హింసలకు, క్రూరత్వానికి, మత మార్పిడికి లోనుచేసి లక్షలాది మందిని కట్టు బట్టలతో ప్రాణాలు అరచేత బెట్టుకొని తరతరాలనుండి స్థిరపడిపోయిన తమ జన్మభూమిని విడిచి పారిపోవునట్లు చేశారు. దీనికి కొంత ప్రతీకారంగా బీహారు హిందువులు అక్కడి ముస్లింలను హింసించారు. గఫార్ ఖాన్ గారు బీహారు ముస్లింల దుస్థితిని పదే పదే ఉద్ఘోషించారుగాని బెంగాలీ హిందువుల కడగండ్లను తలపలేదు. దీనినిబట్టి ఎంత నిస్స్వార్థపరుడైనా, దిగంబర్ వంటి వాడైనా గఫార్ ఖాన్ గారి అభిమానం స్వమతస్థులైన మహమ్మదీయుల యందే అనుకోవాలి.

జర్మనీ దాస్ అనే వారు ఈ మధ్య ఇంగ్లీషులో "మహారాజా" అనే పుస్తకాన్ని వ్రాశారు. పాటియాలా, అల్వార్ మహారాజుల స్త్రీ లోలత్వాన్ని, తత్సంబంధమైన దుష్టకార్యాలను బైటబెట్టారు. మంచిదే. కాని ఈయన ఆ మహారాజులకు, వారి దుష్కృత్యాలకు తోడుపడలేదా? పుస్తకం కొన్ని యథార్థాలను బైటబెట్టినా అతిశయోక్తులతోను, ప్రగల్భాలతోను, పొరపాట్ల వంటి తప్పులతోను కూడియున్నదని తోస్తున్నది. 1911-వ

సంవత్సరంలో (నవంబరు లేక డిశెంబరనుకొందును) ఢిల్లీ చక్రవర్తిగా పట్టాభిషిక్తుడయినది. ఈయన చెప్పినట్లు 7-వ ఎడ్వర్డుగాక 6-వ జార్జి. మొత్తంమీద గ్రంథకర్త డాంబికుడు, బ్రతకనేర్చినవాడు, ఉచ్చనీచముల సంకోచంలేక జీవితం గడపినవాడని తోచుచున్నది.

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన "రామాయణ కల్పవృక్షము" గ్రంథానికి జ్ఞానపీఠంవారు లక్ష రూపాయలు బహుమతి నిచ్చారు. ఈ ప్రదానసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పాములపాటి వెంకట నరసింహారావుగారు "కవిగారు శ్రీరాముణ్ణి దేవునిగాగాక, ఉత్తమ పురుషుణ్ణిగా తీర్చిదిద్దినా"రని శ్లాఘించారు. రాజు తప్పుచేయడను బ్రిటిష్‌వారి సిద్ధాంతంలో, దేవుడు చేసేదంతా ఒప్పే యను సంప్రదాయంలో పెరిగిన మనకు, రాముడు దేవుడు కాకపోతే ఎంత ఉత్తమ మానవుడైనా క్షమింపరాని తప్పులను చేశాడని తోచకతప్పదు. పండిత కొత్త సత్యనారాయణ చౌదరిగారు తమ "రామాయణ రహస్యాలు" అను గ్రంథంలో బుజువు పూర్వకంగా చెప్పినట్లు 128 భార్యలుగల రాముడు, తనను వలచి వివాహం కోరిన యువతి, అన్న రావణబ్రహ్మచే దక్షిణాపథసామ్రాజ్యానికి రాజప్రతినిధిగా నియమింపబడిన శూర్పణఖ ముక్కు చెవులు కోయించాడు. సూర్యవంశ సుక్షత్రియుడను, వీరాధివీరుడను అని ప్రజ్ఞలు పలికిన రాముడు దొంగచాటున వాలిని హత్య జేశాడు. నిండుచూలాలు భార్య సీతను కారడవిలో విడచిపెట్టించాడు. రావణ వధానంతరం అగ్ని సాక్ష్యమిచ్చిన పతివ్రత సీతను, తిరిగి అగ్నిలో దూకుమని ఆజ్ఞాపించి ఆమె ఆత్మహత్యకు కారకుడైనాడు. ఘోరారణ్యములలో పదునాలుగు సంవత్సరాలు అహోరాత్రాలు సేవజేసిన తన ఆబాల్యసఖుడు, తమ్ముడు లక్ష్మణుణ్ణి వెడలగొట్టాడు. ఏడవలేక చివరకు సరయూనదిలోపడి ఆత్మహత్య చేసుకొన్నాడు. ఈ రాముణ్ణా, ఉత్తమపురుషలక్షణ సంపన్నుడనటం?

165

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి,

బి. ఎ. (ఆక్జన్) ఐ. ఆర్. ఎన్., బ్యారిస్టర్-ఎట్-లా

రిటైర్డ్ ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్

వీరు 1898 జూన్ 25-వ తారీఖున మాతామహస్థాన మగు కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, అంగలూరు గ్రామమున జన్మించారు. వీరి తండ్రి సమీప గ్రామ మగు బొమ్ములూరు వాస్తవ్యులు లింగం వెంకటరత్నంగారు. తల్లి త్రిపురనేని వెంకటాద్రిగారి కుమార్తె పున్నమ్మగారు. వీరు చిన్ననాట స్వగ్రామమగు బొమ్ములూరులోను, తరువాత బందరు, నోబుల్ హైస్కూల్, కాలేజీల లోను చదివి 1920 ఆగస్టులో ఇంగ్లండుకు ఉన్నత విద్యాభ్యాసంకొరకు వెళ్ళినారు. 1926 జూన్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమునుండి బి. ఎ. (ఆనర్సు) డిగ్రీని, 1927 జనవరిలో లండన్ లిన్‌కల్న్స్ ఇన్ నుండి బ్యారిస్టర్ పట్టాను పొందినారు. కొలదికాలం 1927-28 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగానుండి, 1929 ఏప్రిల్‌లో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటులో చేరారు. 1953 జూన్ మాసాంతమున ఉద్యోగ విరమణచేసి, అప్పటినుండి దివితాలూకా, పెడసనగల్లు గ్రామములో స్థిరనివాస మొనర్చుకొని, వ్యవసాయం చూచుకొనుచున్నారు.

వీరికి లలిత కళలయందు, సాహిత్యమునందు అభిమానము. 1961 సెప్టెంబరునుండి ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాదమి కార్యవర్గ సభ్యులు. 1963 నుండి 1968 వరకు 5 సంవత్సరముల పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో సభ్యులుగా నుండిరి.

వీరి యితర రచనలు — "తాంబూలం - నైవేద్యం", "మారిన కాలం", "Reflections on the West".